

ఈనాడు



కరీంనగర్ 27-1-2018 శనివారం సిటీ సంపుటి 44 సంచిక 167

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

• గణతంత్రం.. శౌర్యమంత్రం



తొలిసారి...

దేశ చరిత్రలోనే తొలిసారిగా.. గణతంత్ర వేడుకలకు పది దేశాల నాయకులు హాజరయ్యారు. భారత సైనిక పాటవాన్ని, వైభవాన్ని ఆసక్తిగా తిలకించారు.

సాహస నారి...

తొలిసారిగా పాల్గొన్న బీఎస్ఎఫ్ మహిళా సిబ్బందితో కూడిన 'సీమా భవాని' బృందం మోటారు సైకిళ్లపై చేసిన విన్యాసాలు వీక్షకులను అబ్బురపరిచాయి. -6లో



● 'రుద్రమ'ది వీరమరణమే?

కాకతీయ సామ్రాజ్ఞి రుద్రమదేవి మరణంపై చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆమె ఎలా మృతి చెందారన్నదానిపై తాజాగా కీలక ఆధారాలు లభించాయి. వీటి ఆధారంగా ఆమె వీరమరణం పొందారని అంటున్నారు. 2లో



ఈ ఘాట్లు ఉన్న గోదావరి లోపలి భాగమంతా తమదేనని కొంతమంది ప్రచారం చేసుకుంటున్నారు

అక్రమాల చెరలో చదువులమ్మ

బాసరలో అడుగడుగునా అవినీతి

బాసర.. అక్షరాలు దిద్దించే చదువులమ్మ నిలయం. జ్ఞాన సరస్వతి కొలువుదీరిన ఆలయం. ఇప్పుడు.. అక్రమాలకు ఆవాసం. గుడి చుట్టూ అవినీతి చీడ చేరింది. కొంత మంది ధర్మకర్తలు, సిబ్బంది, ప్రైవేట్ వ్యక్తులు ఆలయం సొమ్మును తినేస్తున్నారు. ఆలయ భూములను కబ్జా చేసి విక్రయిస్తూ, రూ.కోట్లు విలువ చేసే భూములను చెరబట్టి దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపట్టి అద్దెలకిచ్చుకుంటున్నారు. ఫలితంగా గుడి భూములు ఫలహారమవుతున్నాయి. గోదావరి నదీ తీరం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో బందీగా మారుతోంది. ఆలయ నిర్వహణకు ఇచ్చిన ఇనాం భూముల్నీ హారతిలా కరిగిస్తుండటం స్థానికులు, భక్తులను కలవరపాటుకు గురిచేస్తోంది.

మరోవైపు.. అక్షరాభ్యాసం టిక్కెట్లు, సిబ్బంది నియామకాలు, ప్రసాదాల తయారీ, నిర్వహణలోనూ అవకతవకలు రాజ్యమేలుతున్నాయి. ఆలయ ఆదాయం బాగానే ఉన్నా అభివృద్ధి మాత్రం అట్టడుగునే ఉంటోంది. కొందరు ధర్మకర్తలు కుట్రపూరితంగా పాలనను చెప్పుచేతుల్లో ఉంచుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఆలయం మరింతగా అభివృద్ధి చెందితే భక్తుల సంఖ్య పెరిగి తమ మనుగడకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందనే ఉద్దేశంతో ఓ వ్యూహం ప్రకారం పురోగతిని అడ్డుకుంటున్నట్లు అనుమానాలున్నాయి. తెలుగు రాష్ట్రాలు, మహారాష్ట్ర, కర్ణాటకలకు చెందిన లక్షల మంది భక్తుల కొంగుబంగారమైన అమ్మవారి ఆలయ ఆదాయాన్ని మింగుతూ అభివృద్ధికి గ్రహణంలా పట్టిన తీరు, అక్రమాలపై

'ఈనాడు' అందిస్తున్న పరిశోధనాత్మక కథనం... 13లో

అసమాన వేగం ప్రగతి అమోఘం



- నెరవేరుతున్న ప్రజల ఆశలు, ఆకాంక్షలు
- బంగారు తెలంగాణ దిశగా అడుగులు
- త్వరలో కొత్త పాసుపుస్తకాలు
- దేశానికే ఆదర్శంగా తెలంగాణ
- గణతంత్ర వేడుకల్లో గవర్నర్ నరసింహన్ -11లో

శుక్రవారం సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో జాతీయ పతాకావిష్కరణ అనంతరం ప్రసంగిస్తున్న గవర్నర్ నరసింహన్



● కృత్రిమ మేధతో శ్రామిక 'శక్తి'

కృత్రిమ మేధతో ఉద్యోగాలు పోతాయని భయపడాల్సిన పనిలేదట. ఆ యంత్రాలతో కలిసి పనిచేస్తే ఉద్యోగుల సామర్థ్యాలు మరింత పెరుగుతాయి. ఇది ఓ సర్వే తేల్చిన వాస్తవం. 2లో

ఫైబర్‌గ్రిడ్‌తో అద్భుతాలు

- డిజిటల్ సేవలతో సుపరిపాలన
- తెలంగాణలో సమర్థంగా అమలు
- దావోస్ సదస్సులో మంత్రి కేటీఆర్
- అంతర్జాతీయ వేదికపై అరుదైన గౌరవం
- ఉపప్రధానులు, కేంద్రమంత్రుల సరసన చోటు



దావోస్‌లో జరిగిన సమావేశంలో వివిధ దేశాల ప్రతినిధులతో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్

ఈనాడు – హైదరాబాద్

సుపరిపాలనకు డిజిటల్ సేవలు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలంగాణ పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇంటింటికీ ఇంటర్‌నెట్ ద్వారా ఆధునిక పరిజ్ఞానాన్ని ప్రజలందరికీ కల్పించవచ్చని అన్నారు. ఫైబర్‌గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణలో అద్భుతాలను సాధిస్తామన్నారు. శుక్రవారం స్విట్జర్లాండ్‌లోని దావోస్ నగరంలో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో 'సమాజానికి సమర్థ సేవల కోసం డిజిటల్ మార్గం' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. పలు దేశాల ఉప ప్రధానులు, కేంద్రమంత్రులు పాల్గొన్న ఈ సదస్సులో రాష్ట్రమంత్రిగా కేటీఆర్ ఒక్కరికే పాల్గొనే అవకాశం దక్కింది. ఇది తనకు అరుదైన గౌరవమని, ఈ సందర్భంగా కేటీఆర్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. "తెలంగాణ రాష్ట్ర మంతటికీ రక్షిత మంచినీటి సరఫరా కోసం మిషన్ భగీరథ కార్యక్రమాన్ని చేపట్టాం. దానిని ఆసరాగా చేసుకొని ఆప్టికల్ (మిగతా 2లో)

విద్యార్థులకు చేరువగా 'అడ్వాన్స్‌డ్' పరీక్ష కేంద్రాలు

- తెలంగాణలో 6, ఏపీలో 11..
- మే 2 నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభం
- జూన్ 10న ర్యాంకుల వెల్లడి -2లో

భళిభళీ.. పన్నుల రాబడి

- గతేడాదితో పోల్చితే రాష్ట్రంలో 15.7% వృద్ధి
- రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్ల ఆదాయం
- గ్రాంట్ ఇన్‌ఎయిడ్‌లో మాత్రం నిరాశ -16లో
- గతనెల నాటికి ఆర్థికస్థితిపై ఆర్థికశాఖ విశ్లేషణ

నీట్‌కు ఒకే రకమైన ప్రశ్న పత్రం -2లో

- ఈ ఏడాది నుంచే అమలుచేస్తాం
- సుప్రీంకోర్టుకు తెలిపిన సీబీఎస్‌ఈ

ఇదీ సంగతి!



మనం సినిమాకు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్నాం. నువ్వు సినిమా బావుందనీ, దీపిక బాగా చేసిందనీ, సెట్టింగ్స్ అద్భుతమనీ ఇక్కడే చెప్పాలా?

అమ్మా.. చూడాలి

- తక్కువ బరువుతో జన్మించిన శిశువుల వైద్యంపై తల్లిదండ్రుల్లో కొరవడిన అవగాహన
- ఆసుపత్రి నుంచి పంపించాక.. తిరిగి వైద్యుని సంప్రదింపులకు రాని వైఖరి
- రాష్ట్రంలో కనీసం ఒక్కసారైనా వచ్చేవారు 17.2 శాతమే
- ఫలితంగా రెండువారాల్లోపే మృతిచెందుతున్న 58.4 శాతం శిశువులు
- అవగాహన పెంపొందించడంలో వైద్యులు విఫలం
- యునిసెఫ్ తాజా నివేదికలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: నెలలు నిండకుండా పుట్టిన, బరువు తక్కువగా ఉన్న శిశువుల వైద్యం విషయంలో తల్లిదండ్రుల్లో అవగాహన కొరవడుతోంది. రాష్ట్రంలో ఈ పరిణామం శిశువులకు ప్రాణాంతకంగా మారుతోంది. తల్లిదండ్రులను అప్రమత్తం చేయాల్సిన ఆవశ్యకతను యునిసెఫ్ తాజా నివేదిక నొక్కిచెబుతోంది. నెలలు నిండకుండా, బరువు తక్కువగా పుట్టిన శిశువులకు ప్రత్యేకంగా నవజాత శిశు సంరక్షణ కేంద్రాల్లో (ఎస్ఎన్‌సీయూ) వైద్యసేవలందిస్తుంటారు. బరువు పెరిగి సాధారణ స్థితికి వచ్చాడని నిర్ధరించుకున్నాకే ఎస్ఎన్‌సీయూల నుంచి ఇంటికి పంపించేస్తారు. ఆ తర్వాత కూడా తిరిగి వైద్యుని సంప్రదింపులకు రావాల్సి ఉంటుంది. కానీ, ఈ శిశువుల్లో అత్యధికులను మళ్లీ ఆసుపత్రికి తీసుకురావడం లేదు. ఆసుపత్రి నుంచి ఇంటికెళ్లిన నవజాత శిశువుల్లో రెండువారాల్లోపే మృతిచెందిన శిశువులు 58.4 శాతం మంది (మిగతా 2లో)

రోబోలు, డ్రోన్లపై రూ. 6.54 లక్షల కోట్లు!

- 2018లో ప్రపంచవ్యాప్త వ్యయం

ఫ్రేమింఘామ్ (అమెరికా): ప్రపంచ వ్యాప్తంగా రోబోటిక్స్, డ్రోన్ల వినియోగం ఏడాదికేడాది గణనీయంగా పెరుగుతున్నట్లు అంతర్జాతీయ డేటా కార్పొరేషన్ (ఐడీసీ) వెల్లడించింది. అనేక రంగాల్లో వీటి కోసం పెట్టే ఖర్చు 2018 ఆఖరు నాటికి 103 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ. 6.54 లక్షల కోట్లు) చేరుతుందని తాజా నివేదికలో పేర్కొంది. ఇందులో ఏడాదికేడాది 22.1 శాతం వృద్ధిని అంచనా వేసింది. ఈమేరకు 2021 నాటికి పెట్టే మొత్తం వ్యయం 218.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 13.86 లక్షల కోట్లు) చేరనుంది.

రోబోటిక్స్:

- మొత్తం అంచనాల్లో 2017-21 మధ్య రోబోలకు వెచ్చించేదే 90 శాతం ఉంటుంది.
- 2018లో ఒక్క రోబోటిక్స్ కోసమే 94 బిలియన్ డాలర్లు (రూ. 5.94 లక్షల కోట్లు) వెచ్చిస్తారని అంచనా.
- రోబోల వినియోగం పారిశ్రామిక రంగంలో అత్యధికంగా (70 శాతం) ఉంటుంది. తర్వాతి స్థానాల్లో సేవలు, వినియోగదారుల రంగాలుంటాయి.
- తయారీ, ఆటోమేటివ్ రంగాల్లో వీటి వినియోగం మరింత విస్తరించనుంది. మౌలిక వసతులు, ఆరోగ్య పరిరక్షణ పరిశ్రమలు రోబోటిక్స్‌కు గణనీయంగా పెట్టుబడులు పెడతాయని అంచనా.

డ్రోన్లు:

- డ్రోన్ల కోసం పెట్టుబడులు ఈ ఏడాది 9 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 57 వేల కోట్ల)కు చేరుతుందని అంచనా.
- ...రంగాల్లో డ్రోన్లు కీలక పాత్ర పోషించను...ప్రత్యేకించి చమురు-గ్యాస్, వ్యవసాయం, ...కాం రంగాల్లో ఇవి కీలకం కానున్నాయి.

శభాష్ పోలీస్..!

కాప్రా, న్యూస్‌టుడే: హైదరాబాద్ కుషాయిగూడలో శుక్రవారం సాయంత్రం వారాంతపు సంతలో ఇద్దరు చిరువ్యాపారుల మధ్య స్థలం విషయంలో ఘర్షణ చినికిచినికి కాల్పులకు దారి తీసింది. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కానిస్టేబుల్ చక్రపాణిరెడ్డి సాహసం చేసి నిందితుడిని పట్టుకోవడంతో ప్రమాదం తప్పింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ...రాజ్ సింగ్ (52) కొన్నేళ్లుగా కాప్రాలో కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఈసీనగర్‌లోని పార్కు వద్ద సంతలో ...సింగ్ కొడుకులు ధర్మేంద్ర, బబ్లూల కూరగాయల దుకాణం పక్కనే దండు తులసిబాబు (26) అనే వ్యాపారి మరో దుకాణం పెట్టుకున్నాడు. తులసిబాబుకు అతని మిత్రులు శంకర్, ...శేఖర్, పవన్ తోడయ్యారు. వీరంతా కలిసి ...కొడుకులను కొడుతున్నారని తెలియడంతో ...రాజ్‌సింగ్ వెంటనే ఇంట్లో ఉన్న దేశవాళీ తుపాకి తీసుకుని సంతకు చేరుకున్నాడు. అప్పటికే గొడవ విషయం తెలిసి కానిస్టేబుల్ చక్రపాణిరెడ్డి, ...వేణుగోపాల్ అక్కడికి వచ్చారు. ...రాజ్‌సింగ్ తుపాకీతో ప్రత్యర్థులను కాల్చేందుకు ప్రయత్నిస్తుండగా చక్రపాణిరెడ్డి చాకచక్యంగా నిలువరించాడు. తుపాకీతోపాటు 5 బులెట్లను స్వాధీనం ...రాచకొండ పోలీసు కమిషనర్ మహేష్ భగవత్ ప్రాణాలకు తెగించి నిందితుణ్ని పట్టుకున్న కానిస్టేబుల్ చక్రపాణిరెడ్డికి రూ.10 వేలు, అతడికి సహకరించిన డ్రైవర్ వేణుగోపాల్‌కు రూ.5 వేల నగదు బహుమతులను అందజేశారు.

తెలంగాణలో ఎరిక్‌సన్ పరిశ్రమ

ఈనాడు, హైదరాబాద్: దావోస్ సదస్సులో భాగంగా శుక్రవారం మంత్రి కేటీఆర్ పలు సంస్థల ప్రతినిధులతో భేటీ అయ్యారు. ప్రముఖ ...మిక సంస్థ ఎరిక్‌సన్ ముఖ్య ...క అధికారి (సీటీవో) ఎరిక్ ...స్‌తో సమావేశమయ్యారు. ...లో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. ద ...సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈవో బెర్నార్డ్ చార్లెస్‌ను కలిసి ఐటీ, జీవశాస్త్రాల రంగంలో పెట్టుబడుల గురించి చర్చించారు. పెప్సీ కంపెనీ సీఈఓ ఇంద్రనూయిని కలిశారు. హైదరాబాద్‌లో ఆ సంస్థ విస్తరణ గురించి మాట్లాడారు. రాత్రి గ్లోబల్ టెక్నాలజీ, లోకల్ సొల్యూషన్స్ అంశంపై జరిగిన సదస్సులో ప్రసంగించారు.

రుద్రమది..వీర మరణమేనా!

- ఔనంటున్న పురావస్తు అధికారులు
- బయల్పడిన విగ్రహాల ఆధారంగా విశ్లేషణ

ఈనాడు – వరంగల్

కాకతీయ సామ్రాజ్యంలో గొప్ప పరాక్రమవంతురాలిగా పేరొందిన రుద్రమదేవి గురించి మరో ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఇటీవల లభ్యమైన రెండు విగ్రహాల రూపంలో ఆమె వీర మరణానికి సంబంధించిన కీలక ఆధారాలు వెలుగు చూసినట్టు పురావస్తుశాఖ అధికారులు వెల్లడించారు.

రుద్రమదేవికి..శత్రురాజైన కాయస్థ అంబదేవునికి మధ్య జరిగిన యుద్ధం తరువాత జరిగిన సంఘటనలు, ఆమె ఎలా మరణించిందనే విషయంపై సరైన ఆధారాలు లేకపోవడంతో దీనిపై చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలు ఉండేవి. ఆమె మరణం గురించి భిన్న వాదనలు, సిద్ధాంతాలూ ప్రచారంలో ఉన్నాయి. తాజాగా పురావస్తుశాఖ అధికారులు వరంగల్ కోట సమీపంలో ఉన్న బొల్లికుంట గ్రామంలోని పురాతన శివకేశవ ఆలయం పక్కనే రాతి బండల మధ్యలో రెండు శిల్పాలను గుర్తించారు. గ్రామ దేవతలుగా స్థానికులచే పూజలు అందుకుంటున్న ఇవి రుద్రమ దేవి విగ్రహాలని తేల్చారు. 'ఇవి రుద్రమ వీరమరణాన్ని సూచించే చిహ్నాలతో కూడిన శిల్పాలని తమ పరిశీలనలో గుర్తించాం. మొదటి శిల్పంలో రుద్రమదేవి పరాక్రమశాలిగా చేతిలో ఖడ్గం, శిరస్సుపై రక్షణ ఛత్రం వంటి రాజలాంఛనాలతో యుద్ధానికి గంభీరంగా వెళ్తున్నట్టు కన్పిస్తున్నారు. రెండో విగ్రహంలో అలసిపోయి..విషాదవదనంతో శిరస్సు మీద ఛత్రం లేకుండా ఉన్నారు. అశ్వం కూడా కదలేక ముఖం కిందకు దించినట్టు కన్పిస్తోంది. ఆ శిల్పంపై స్వర్గం, యముని వాహనమైన దున్నపోతు కూడా ఉండడాన్ని బట్టి వయోవృద్ధురాలైన వీరవనిత కదనరంగంలో శత్రురాజుతో పోరాడి మరణించి ఉండొచ్చన్న ప్రాథమిక అభిప్రాయానికి వచ్చాం.' అని దేవాలయ సర్వేక్షణ్ ప్రాజెక్టు పర్యవేక్షకులు డి.కన్నబాబు 'ఈనాడు'కు తెలిపారు.





బయల్పడిన రుద్రమదేవి విగ్రహాలు ఇవే

సమగ్ర సర్వేలో భాగంగానే

కాకతీయ రాజుల చరిత్రను సమగ్రంగా తెలుసుకునేందుకు భారతీయ పురావస్తుశాఖ గత కొన్నినెలలుగా సర్వే (సదరన్ రీజియన్, దేవాలయాల సర్వే ప్రాజెక్టు) చేపడుతోంది. కాకతీయుల కాలంలో నిర్మించిన దేవాలయాలు, శిల్పకళా సంపదను అధ్యయనం చేస్తోంది. ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లో పర్యటిస్తున్న పురావస్తు అధికారులు తాజాగా రుద్రమదేవి విగ్రహాలను కనుగొన్నారు.

నీట్‌కు ఒకే రకమైన ప్రశ్న పత్రం

దిల్లీ

వైద్య (ఎంబీబీఎస్, బీడీఎస్) కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న నీట్‌కు ఈ ఏడాది నుంచి ఒకే రకమైన ప్రశ్న పత్రాన్ని రూపొందిస్తామని సీబీఎస్ఈ తెలియజేసింది. ఆంగ్లం, హిందీ సహా మొత్తం 10 భాషల్లో నీట్ రాసేందుకు విద్యార్థులకు అవకాశం ఉంది. దీనికోసం 10 రకాల ప్రశ్న పత్రాలను తయారు చేయటంలోని ఔచిత్యాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ప్రశ్నలు వేర్వేరుగా ఇచ్చినప్పుడు విద్యార్థుల సామర్థ్యాలను నిర్ధరించటం కష్టమవుతుందని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది నుంచి ఒకే రకమైన ప్రశ్న పత్రం రూపొందించి దానినే ఇతర భాషల్లోకి అనువదించి పరీక్ష నిర్వహిస్తామని జస్టిస్ అరుణ్ మిశ్ర, జస్టిస్ ఎఫ్ నజీర్‌లతో కూడిన ధర్మాసనానికి సీబీఎస్ఈ వివరించింది. వైద్య కోర్సుల్లో ప్రవేశాలను కోరుకునే విద్యార్థులందరికీ ఒకే రకమైన ప్రశ్న పత్రం ఉండాలని ఆదేశించాలని కోరుతూ సంకల్ప్ ఛారిటబుల్ ట్రస్ట్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతోంది.

శ్రామికశక్తి సామర్థ్యాలు మెరుగవడం ఖాయం

- కృత్రిమ మేధస్సుతో భవిష్యత్తులో భారీ మార్పులు

ముంబయి

కృత్రిమ మేధస్సు(ఏఐ) గురించి ఒకవైపు లేనిపోని భయాలు పెరుగుతున్నప్పటికీ, మరోవైపు భవిష్యత్తులో యంత్రాలతో పనిచేసే వాతావరణం వల్ల సామర్థ్యాలు మెరుగవుతాయట. కాలం గడిచేకొద్దీ ప్రతి సంస్థలోనూ మనుషులతో పాటు యంత్రాలూ పెరుగుతాయని 69 శాతం మంది వెల్లడించినట్లు అమెరికాలోని పెగాసిస్టమ్స్ జరిపిన సర్వేలో తేటతెల్లమైంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్నిరంగాల్లోని 845 మంది సీనియర్ ఉద్యోగులతో జరిపిన సర్వేలో ఆశ్చర్యకరమైన ఫలితాలు వెల్లడయ్యాయి. ఉద్యోగుల సామర్థ్యాలు పెరుగుతాయని 73 శాతం మంది, వినియోగదారులకు మెరుగైన సేవలందుతాయని 62 శాతం, మెరుగైన విధాన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని 78 శాతం తెలిపారు.

యంత్రాలతో పనిచేయడానికి 88 శాతం మంది సుముఖత వ్యక్తం చేసినా, యజమానిగా యంత్రాన్ని అంగీకరించబోమని 79 శాతం మంది చెప్పడం గమనార్హం. 2030నాటికి ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో శాశ్వత ఉద్యోగుల సంఖ్య సగానికి సగం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. మొత్తానికి కృత్రిమ మేధ కారణంగా భవిష్యత్తులో యోగ్యతకు పెద్దపీట వేయాల్సి వస్తుందని, ఉద్యోగుల పనితీరు మార్పునకు కారణమవుతుందని, నిర్వహణ, ప్రతిఫలం, పరిహారం అందజేయడంలో మార్పులు వస్తాయని సర్వేలో పాల్గొన్న అందరూ అంగీకరించారు.

వీసా లాటరీ రద్దు!

- ట్రంప్ ప్రతిపాదన
- కార్యరూపం దాలిస్తే వేల మంది భారతీయులకు లబ్ధి
- 18 లక్షల మంది డ్రీమర్లకు పౌరసత్వం!

వాషింగ్టన్: గ్రీన్‌కార్డు కోసం ఏళ్ల తరబడి వేచి చూస్తున్న అత్యంత నైపుణ్యవంతులకు అనుకూలంగా ట్రంప్ ఒక ప్రతిపాదన చేశారు. వీసా లాటరీ వ్యవస్థను రద్దు చేయడానికి ప్రతిపాదించారు. ఇది చట్ట రూపం దాలిస్తే వేల మంది భారతీయ ఐటీ వృత్తి నిపుణులకు లబ్ధి కలగవచ్చు.

ఏమిటీ వీసా లాటరీ?: డైవర్సిటీ వీసా లాటరీ అనే పేరుతో ఏటా 50వేల వీసాలు మంజూరు చేస్తున్నారు. గడచిన ఐదేళ్ల కాలంలో అమెరికాకు వలసల రేటు తక్కువగా ఉన్న దేశస్థులు డైవర్సిటీ వీసా లాటరీ కింద లబ్ధి పొందేందుకు అర్హులు. దేశాల వారీ కోటా కారణంగా భారతీయ ఐటీ నిపుణుల గ్రీన్‌కార్డు దరఖాస్తులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. డైవర్సిటీ వీసాలను మళ్లించడం వల్ల ఇలాంటి వారికి పెద్ద ఎత్తున లబ్ధి కలగవచ్చు. వలసల సంస్కరణలపై చట్టం తీసుకురావడానికి ట్రంప్ యంత్రాంగం గురువారం అధ్యక్షుడి ఆలోచనలను ప్రతిఫలిస్తూ నాలుగు ప్రతిపాదనలు చేసింది. డైవర్సిటీ వీసా లాటరీరద్దు ఇందులోఒకటి. మరో మూడు ప్రతిపాదనలు..

రక్షణ పొందే డ్రీమర్ల సంఖ్య పెంపు: డిఫర్డ్ యాక్షన్ ఫర్ చైల్డ్‌హుడ్ అరైవల్స్ (డీఏసీఏ)పేరుతో డ్రీమర్ల కోసం ఒక కార్యక్రమం ఉంది. ఈ కార్యక్రమం కింద లబ్ధికి దాదాపు 7లక్షల మంది దరఖాస్తు చేసి ఉన్నారు. శ్వేత సౌధం తాజా ప్రతిపాదన ప్రకారం లబ్ధి పొందే డ్రీమర్ల సంఖ్యను 18లక్షలకుపెంచారు. వీరంతా పౌరసత్వం పొందడానికి అవసరమైన అర్హతలను కాంగ్రెస్ నిర్ణయిస్తుంది.

సరిహద్దు భద్రత: మెక్సికోతో సరిహద్దులో గోడ నిర్మాణానికి చెల్లించేందుకు, కెనడా సరిహద్దుల్లో భద్రత చర్యల మెరుగుకు 25 బిలియన్ డాలర్లతో నిధి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి 25 బిలియన్ డాలర్ల నిధిని ఏర్పాటు చేస్తేనే డ్రీమర్ల సంగతిఆలోచిస్తామని ట్రంప్ యంత్రాంగం మెలిక పెట్టింది.

కుటుంబ స్పాన్సర్‌షిప్: వీసాదారుల జీవితభాగస్వాములకు, వారి మైనర్ పిల్లలకు మాత్రమే వలసలను పరిమితం చేయాలి. తల్లిదండ్రులకు, పెద్ద పిల్లలకు, తోబుట్టువులకు స్పాన్సర్‌షిప్‌ను నిలిపివేయాలి.

వచ్చే నెల 6లోగా బిల్లు: శ్వేతసౌధం తాజాగా రూపొందించిన ప్రతిపాదనను సెనేట్‌కు అందిస్తామని, సెనేట్ మెజార్టీ నేత మిచ్ మెక్ కన్నెల్ దాన్ని వచ్చే నెల 6లోగా ప్రవేశపెడతారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

హెచ్1 బి వీసాల వార్షిక పరిమితి పెంపు

- 65వేల నుంచి 85వేలకు
- డిమాండ్ ఉంటే మరో 1,10,000
- ఉన్నత విద్య అభ్యసించిన వారి హెచ్1బి వీసాల పరిమితి తొలగింపు
- గ్రీన్‌కార్డుల్లో దేశాల వారీ కోటా ఎత్తివేత
- బిల్లును ప్రవేశపెట్టిన రిపబ్లికన్ సెనేటర్లు

వాషింగ్టన్

హెచ్1 బీ వీసాలపై వార్షిక పరిమితిని పెంచడానికి ఉద్దేశించిన బిల్లును రిపబ్లికన్ సెనేటర్లు సెనేట్‌లో ప్రవేశపెట్టారు. ఇమ్మిగ్రేషన్ ఇన్నొవేషన్ (ఐ-స్క్వేర్డ్) పేరుతో రూపొందించిన బిల్లును ఒరిన్ హ్యాచ్, జెఫ్ ఫ్లేక్ ప్రవేశపెట్టారు.

ప్రస్తుతం హెచ్1-బి వీసాల పరిమితి ఏడాదికి 65వేలుగా ఉంది. మరో 20వేల వీసాలను అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించిన వారికి ఇస్తారు. తాజా బిల్లు ప్రకారం 65వేల పరిమితిని 85వేలకు పెంచారు. అమెరికాలో ఉన్నత విద్య పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగాలిచ్చిన సంస్థలు గ్రీన్‌కార్డులను స్పాన్సర్ చేయడానికి ముందుకొచ్చే పక్షంలో 20వేల పరిమితిని కూడా ఎత్తివేస్తారు.

హెచ్1-బి వీసాదారుల జీవిత భాగస్వాములు, వారి పిల్లలకు హెచ్-4 కార్యక్రమం కింద ఉద్యోగం చేసుకునే అవకాశాన్ని కూడా ఈ బిల్లు కల్పిస్తోంది. చట్టపరమైన హోదాను కోల్పోకుండానే హెచ్1-బి వీసాదారులు తమ ఉద్యోగాలు మారడానికి తగిన వ్యవధిని కల్పిస్తోంది. ఉద్యోగాల ఆధారంగా గ్రీన్‌కార్డులు పొందిన వారి జీవితభాగస్వాములు, పిల్లలకు సంబంధించి ఉద్యోగ అనుమతులపై ఉన్న సంఖ్యాపరిమితికి మినహాయింపును ఇస్తోంది.

కంపెనీలకు మరింత మంది ఉద్యోగులు అవసరమయ్యే పక్షంలో అందుకు తగ్గట్లుగా ఉద్యోగుల లభ్యత ఉండే విధంగా అదనంగా 1,10,000 వీసాల మంజూరుకూ ఈ బిల్లు అవకాశం కల్పిస్తోంది. అంటే మొత్తం హెచ్1బి వీసాలు ఒక ఆర్థిక సంవత్సరంలో 1,95,000కు చేరుకోవచ్చు. మాస్టర్ డిగ్రీలు, విదేశీ పీహెచ్‌డీలు, అమెరికాలో విజ్ఞానశాస్త్రం-సాంకేతిక పరిజ్ఞానం-ఇంజినీరింగ్-గణితం (స్టెమ్) పట్టభద్ర విద్యను పూర్తి చేసుకున్న వారికి ప్రాధాన్యం ఇస్తారు. హెచ్1బి వీసాదారుల వార్షిక వేతనాన్ని 60వేల డాలర్ల నుంచి లక్ష డాలర్లకు పెంచాలని కూడా బిల్లు ప్రతిపాదిస్తోంది.

ఉద్యోగాల ఆధారిత గ్రీన్‌కార్డులపై ఇప్పటి వరకు ఉన్న దేశాల వారీ వార్షిక పరిమితిని ఈ బిల్లు తొలగించింది. భారత్, చైనా దేశస్థులకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది.

విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించిన విదేశీ వృత్తి నిపుణులకు హెచ్1బి కాకుండా మరో కార్యక్రమం ద్వారా అమెరికా సంస్థలు స్పాన్సర్ చేయడానికి వీలుగా కొత్త గ్రీన్‌కార్డు కేటగిరీ ఏర్పాటుకు ప్రతిపాదించింది. ఎఫ్1 విద్యార్థి వీసాదారులు విద్యార్థిగా ఉన్నప్పుడు, ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)లో ఉన్నప్పుడు శాశ్వత నివాస హోదా కోరడానికి వీలు కల్పిస్తోంది.

'అడ్వాన్స్‌డ్' పరీక్ష కేంద్రాల పెంపుదల

- ఆన్‌లైన్ విధానంతో విద్యార్థులకు మరింత చేరువ

ఈనాడు – హైదరాబాద్

దేశవ్యాప్తంగా జేఈఈ అడ్వాన్స్‌డ్‌ను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తుండటంతో ఈ సారి పరీక్షలు జరిగే నగరాలు, పట్టణాల సంఖ్య పెరిగింది. దీంతో వందల కిలోమీటర్ల దూరం ప్రయాణించి పరీక్ష రాసే అవస్థలు తప్పనున్నాయి. ఐఐటీల్లో ప్రవేశానికి వచ్చే మే 20న జేఈఈ అడ్వాన్స్‌డ్ నిర్వహించనున్నారు. ఇప్పటివరకు జేఈఈ మెయిన్ మాత్రమే రెండు విధానాల్లో (ఆఫ్‌లైన్, ఆన్‌లైన్) జరుపుతుండగా.. తొలిసారిగా అడ్వాన్స్‌డ్ పరీక్షను కేవలం ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తామని ఇప్పటికే ఐఐటీ కౌన్సిల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షకు సంబంధించిన సవివర కరపత్రాన్ని(బ్రోచర్) ఐఐటీ కాన్పూర్ శుక్రవారం విడుదల చేసింది.

గతంలో మాదిరిగానే కామన్ మెరిట్ జాబితా (సీఎంఎల్.. జనరల్ కేటగిరీ విద్యార్థి) కింద ఉత్తీర్ణులు కావాలంటే 35 శాతం మార్కులు దక్కించుకోవాలి. మొత్తం 2.24 లక్షల మందిని అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయడానికి ఎంపిక చేస్తారు. పూర్తి వివరాలను జేఈఈ అడ్వాన్స్‌డ్ వెబ్‌సైట్ www.jeeadv.ac.in ద్వారా తెలుసుకోవచ్చు.

తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన పరీక్షా కేంద్రాలు

గతేడాది వరకు ఏపీలో విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, తిరుపతిలలో పరీక్షా కేంద్రాలు ఉండేవి. ఈ సారి వాటికి అదనంగా అనంతపురం, ఏలూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, రాజమండ్రి, ఒంగోలులలోనూ పరీక్షలు జరుగుతాయి. తెలంగాణలో ఇప్పటి వరకు హైదరాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్‌లలో పరీక్షా కేంద్రాలు ఉండగా.. ఈ సారి కొత్తగా కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ నగరాలనూ చేర్చారు.

ఇదీ అడ్వాన్స్‌డ్ కాలపట్టిక

ఏప్రిల్ 30: జేఈఈ మెయిన్ ర్యాంకుల వెల్లడి
మే 2-7వ తేదీ వరకు: అడ్వాన్స్‌డ్ పరీక్షకు రిజిస్ట్రేషన్
మే 14-20: హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
మే 20: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష (3 గంటల సమయం)
మే 22-25: విద్యార్థులు పూర్తిచేసిన ఓఎంఆర్ పత్రాన్ని మెయిల్‌కు పంపిస్తారు.
మే 29: ఆన్‌లైన్‌లో పరీక్ష కీ పెడతారు
మే 29-30: కీపై అభ్యంతరాల స్వీకరణ
జూన్ 10: అడ్వాన్స్‌డ్ ర్యాంకుల వెల్లడి
జూన్ 10-11: ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్టు రిజిస్ట్రేషన్
జూన్ 14: ఆర్కిటెక్చర్ పరీక్ష
జూన్ 18: ఆర్కిటెక్చర్ ర్యాంకుల వెల్లడి
జూన్ 19- జులై 15 వరకు: సీట్ల కేటాయింపు (కౌన్సెలింగ్ ద్వారా)

కేటగిరీల వారీగా అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఎంపికయ్యే విద్యార్థులు

కేటగిరీ	అభ్యర్థులు
ఓపెన్	1,13,120
ఓబీసీ	60,480
ఎస్సీ	33,600
ఎస్టీ	16,800
మొత్తం	2,24,000

(★ ప్రతి విభాగంలో దివ్యాంగుల కోటా 5 శాతం ఉంటుంది)



ఎనిమిది అడుగుల ఒక అంగుళం పొడవుతో ప్రపంచంలోనే పొడగరిగా గిన్నిస్‌కెక్కిన టర్కీకి చెందిన సుల్తాన్ కోసెన్, రెండు అడుగుల 6 అంగుళాల పొడవు ఉండి అతి తక్కువ ఎత్తు ఉన్న మహిళగా గిన్నిస్‌కెక్కిన భారత్‌కు చెందిన గీతా అమ్గే శుక్రవారం ఈజిప్టులోని గిజా పిరమిడ్ల వద్ద ఇలా ఫోజిచ్చారు. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఈజిప్టు పర్యాటక శాఖ వారిని ఆహ్వానించింది

ఫైబర్‌గ్రిడ్‌తో అద్భుతాలు

(మొదటి పేజీ తరువాయి)

ఫైబర్ లైన్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా ఇంటింటికీ కేబుల్ సౌకర్యం కల్పించడానికి 'ఫైబర్ గ్రిడ్' ప్రాజెక్టు చేపట్టాం. దీని ద్వారా ఇంటింటికీ ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం తెలంగాణలో ప్రభుత్వ సేవలన్నీ డిజిటల్ మాధ్యమాల ద్వారానే అందజేస్తున్నాం. డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. సంక్షేమ పథకాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల విధానం అమలు చేస్తున్నాం. అన్ని ధ్రువీకరణపత్రాలు డిజిటలీకరించాం. గ్రామీణ ప్రాంతాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేస్తాం' అని కేటీఆర్ చెప్పారు.

పరిశోధనలు మరింతగా విస్తరించాలి: భారత్‌లో పరిశోధనలకు మరింత ప్రాధాన్యం పెరగాలని, ఇందుకోసం దేశంలోని పరిశోధన సంస్థలు, ఉన్నత విద్యాసంస్థలు చొరవ చూపాలని కేటీఆర్ పేర్కొన్నారు. ఇన్వెస్ట్ ఇండియా ఆధ్వర్యంలో 'భారత్‌లో పరిశోధన, అభివృద్ధి విస్తరణ' అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. "పరిశోధన కార్యకలాపాలతో పాటు వాటి పరిశోధన అనంతర ఫలితాల ఆధారంగా ప్రభుత్వ ప్రోత్సాహకాలుండాలి. సిలికాన్ వ్యాలీలో గొప్ప విజయాలకు అక్కడి పరిశోధన సంస్థలే కారణం. హైదరాబాద్‌లోని 50 పరిశోధన సంస్థలను అనుసంధానం చేస్తూ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్)ను ఏర్పాటు చేశాం. ఇస్రో వంటి భారతీయ సంస్థలు తమ పరిశోధన పటిమను, సాంకేతిక సత్తాను ప్రపంచానికి చాటాయి. అతి తక్కువ ఖర్చుతో అత్యుత్తమ ఫలితాలను సాధించవచ్చని ఇస్రో విజయాలు నిరూపిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెద్దపెద్ద సంస్థల నుంచి కాకుండా అంకుర సంస్థల ద్వారానే వస్తాయి. అందుకే మేం అంకుర సంస్థలను ప్రోత్సహిస్తున్నాం. టీవర్క్స్ ద్వారా హార్డ్‌వేర్ రంగంలోనూ పరిశోధనలకు అవకాశం కలుగుతుంది. విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తి నెలకొల్పేలా ప్రదర్శనశాలలు ఏర్పాటు చేయాలి. పరిశోధన ఫలితాలు, పేటెంట్లు, మేధో సంపత్తిని కాపాడేందుకు తెలంగాణ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ క్రైమ్ యూనిట్‌ను ఏర్పాటు చేశాం" అని కేటీఆర్ వివరించారు.



దావోస్ సదస్సులో త్రివర్ణపతాకంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఐటీ శాఖ మంత్రులు నారా లోకేష్, కేటీఆర్

కేంద్రకార్యదర్శి అభినందనలు: తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక ఆలోచనలు అభినందనీయమని కేంద్ర పారిశ్రామిక విధాన, ప్రోత్సాహక శాఖ కార్యదర్శి రమేశ్ అభిషేక్ అన్నారు. తెలంగాణ మాదిరే అన్ని దేశాలు మేధో హక్కుల పరిరక్షణ సంస్థలు ఏర్పాటు చేయాలన్నారు.

కేంద్రమంత్రి సురేశ్ ప్రభుతో భేటీ: సదస్సుకు హాజరైన కేంద్ర పరిశ్రమల మంత్రి సురేశ్ ప్రభుతో కేటీఆర్ సమావేశమయ్యారు. వివిధ పథకాల కింద సాయం తదితర అంశాల గురించి చర్చించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణలోని ప్రాజెక్టులకు మరిన్ని నిధులు ఇవ్వాలని కోరారు. అనంతరం కేటీఆర్ ప్రముఖ పవన విద్యుత్ సంస్థ సుజ్లాన్ ఛైర్మన్ తులసి తంతితో సమావేశమయ్యారు. తెలంగాణలో పవన్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తామని తులసితంతి చెప్పారు. దావోస్‌లో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో కేటీఆర్ పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు పీయూష్‌గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, ఏపీ ఐటీ మంత్రి లోకేశ్‌లతో కలిసి జెండా వందనం చేశారు.

అమ్మా.. చూడాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నారంటే.. పరిస్థితి తీవ్రతను అర్థంచేసుకోవచ్చు. సర్కారు దవాఖానాల్లో చికిత్స పొందేవారిలో 95 శాతం మంది నిరుపేదలే. వీరిలో నిరక్షరాస్యులే ఎక్కువ. ఈ పరిస్థితుల్లో నవజాత శిశు వైద్య ప్రాధాన్యంపై తల్లిదండ్రులకు వివరించి చెప్పే బాధ్యత వైద్యులదేనని ఈ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. గతేడాది జనవరి 1 నుంచి అక్టోబరు 31 వరకూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోని ఎస్ఎన్‌సీయూల పనితీరుపై యునిసెఫ్ ఇటీవల ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్‌కు ఇచ్చిన నివేదికలో నవజాత శిశు మరణాలను ప్రత్యేకంగా ప్రస్తావించింది.

నివేదికలోని ముఖ్యాంశాలు..

- గతేడాది పది నెలల కాలంలో తెలంగాణలోని ఎస్ఎన్‌సీయూల్లో మొత్తం 28953 మంది నవజాత శిశువులు చికిత్స పొందగా.. వీరిలో 24084 మందిని ఇంటికి పంపించేశారు. అయితే ఇంటికి పంపించిన నవజాత శిశువుల్లో కనీసం ఒక్కసారైనా తిరిగి వైద్యుని సంప్రదింపులకు వచ్చినవారు కేవలం 17.2 శాతం మాత్రమే. కనీసం మూడుసార్లు ఆసుపత్రికి తిరిగి చికిత్స కోసం వచ్చినవారు 2.3 శాతమే కావడం గమనార్హం.
- ఆసుపత్రి నుంచి ఇంటికెళ్లిన శిశువుల్లో మొదటి 8 రోజుల్లోపు 13.9 శాతం మంది వైద్యుని సంప్రదింపులకు హాజరుకాగా, తొలినెలలో వైద్యుని సంప్రదింపులకు వచ్చినవారు కేవలం 7.9 శాతం మంది మాత్రమే.
- కనీసం ఒక్కసారైనా తిరిగి వైద్యుని సంప్రదింపులకు నవజాత శిశువులు హాజరైన ఆసుపత్రుల్లో కోఠి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో 49 శాతం కాగా, సీకేఎం వరంగల్‌లో 48 శాతం, గాంధీ(0), నిలోఫర్(2), ఖమ్మం(5), కరీంనగర్(4), తాండూర్(0), గోదావరిఖని(0), సిద్దిపేట ఒక శాతం.
- ఆసుపత్రి నుంచి వెళ్లిన నవజాత శిశువుల్లో తొలివారంలోనే 27.1 శాతం మంది మృతిచెందగా.. 7-15 రోజుల్లోపు 31.3 శాతం మంది చనిపోయారు.
- ఎస్ఎన్‌సీయూల్లో చికిత్స పొందిన మొత్తం నవజాత శిశువుల్లో 2325 మంది మృతిచెందగా.. వీరిలో అత్యధికులు(29.9శాతం) శ్వాస సంబంధిత ఇన్‌ఫెక్షన్లతో చనిపోగా.. 24.9 శాతం మంది పుట్టగానే శ్వాస తీసుకోకపోవడంతో ఇబ్బందులతో, 10.7 శాతం మంది 28 వారాల కంటే ముందే పుట్టడంతో చనిపోయారు.
- మొత్తంగా నెలలు నిండకుండానే పుట్టి మృతి చెందినవారు 18.8 శాతం మంది ఉన్నారు. వీరిని బతికించడంపై దృష్టిపెట్టాలని నివేదిక సూచించింది.
- ఎస్ఎన్‌సీయూల్లో వెంటిలేటర్ చికిత్స అవసరమైన 612 మందిలో 92.3 శాతం మంది మృతిచెందారు. ఇది నవజాత శిశు సంరక్షణలో పెద్దలోపంగా నివేదిక పేర్కొంది.
- ఎస్ఎన్‌సీయూల్లో వెంటిలేటర్ చికిత్స అందించడంలో మరింత నైపుణ్యం, నాణ్యత ప్రమాణాలను పెంపొందించుకోవాల్సిన అవసరముందని స్పష్టంచేసింది.
- వెయ్యి గ్రాముల కంటే తక్కువ బరువుతో పుట్టి మృతిచెందినవారు 73.6 శాతం కాగా, 1500 గ్రాముల కంటే తక్కువ బరువుతో పుట్టి చనిపోయిన శిశువులు 30 శాతం మంది.
- మొత్తంగా పరిశీలిస్తే.. ప్రతి ముగ్గురు ముందస్తు జననాల్లో ఒకరు మృత్యువాత పడుతుండగా.. ప్రతి ఇద్దరు అతి తక్కువ బరువు శిశువుల్లో ఒకరు మృతి చెందుతున్నారు.
- గాంధీ ఆసుపత్రిలో అత్యధికంగా 25 శాతం మంది నవజాత శిశువులు మృతిచెందగా.. ఆ తర్వాత వరంగల్ ఎంజీఎంలో 21 శాతం మంది మరణించారు.

గ్రహం అనుగ్రహం

27–1–2018 శనివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర ఋతువు; మాఘ మాసం; శుక్ల పక్షం
దశమి: ఉ. 7-13 తదుపరి ఏకాదశి తె. 5-02 తదుపరి ద్వాదశి
రోహిణి నక్షత్రం: రా. 1-03 తదుపరి మృగశిర
అమృత ఘడియలు: రా. 10-02 నుంచి 11-32 వరకు
వర్జ్యం: సా. 5-30 నుంచి 7-01 వరకు తిరిగి తె. 6-17 నుంచి
దుర్ముహూర్తం: ఉ. 6-35 నుంచి 8-05 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-48
భీష్మఏకాదశి, అంతర్వేది తీర్థం

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	4.5	30.1
మెదక్	9.9	32.1
రామగుండం	11.4	31.0
హైదరాబాద్	13.3	31.0
నిజామాబాద్	14.0	31.0
హన్మకొండ	15.0	32.0
కరీంనగర్	15.5	30.0
తిరుపతి	17.0	32.3
మహబూబ్‌నగర్	18.1	32.3
సూర్యాపేట	20.0	34.0

భారత్‌లో సదస్సుకు రండి

దావోస్‌లో వాణిజ్య, పరిశ్రమల మంత్రులకు సురేశ్ ప్రభు ఆహ్వానం

దావోస్: భారత్‌లో మార్చి నెలలో నిర్వహించనున్న మంత్రుల స్థాయి సదస్సుకు రావాల్సిందిగా వివిధ దేశాల వాణిజ్య, పరిశ్రమల మంత్రులను కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు ఆహ్వానించారు. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా గురువారం రాత్రి దావోస్‌లో నిర్వహించిన మంత్రుల విందుకు ఆయన హాజరయ్యారు. అక్కడకు విచ్చేసిన వివిధ దేశాల మంత్రులను భారత్‌లో నిర్వహించే సదస్సుకు స్వయంగా ఆహ్వానించినట్లు సురేశ్ ప్రభు తెలిపారు.

సుపరిపాలనతో భారత్‌లో అవినీతి నిర్మూలన

దావోస్: భారత ప్రభుత్వం సుపరిపాలన ద్వారా, విశ్వాసాన్ని ప్రోదిచేస్తూ అవినీతిని రూపుమాపుతోందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థికవేదిక సదస్సు సందర్భంగా అవినీతి నిర్మూలన అంశంపై దావోస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. గత మూడున్నరేళ్లుగా అవినీతి నిర్మూలనకు నరేంద్ర మోదీ ప్రభుత్వం వేగంగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. మార్కెటింగ్ వ్యవస్థ నమ్మకం పొందడం, ఆర్థిక వృద్ధి, రాజకీయ సుస్థిరతల ద్వారా అవినీతిని ఎలా నిర్మూలించాలన్న విషయమై హాజరైన వారంతా చర్చించారు. సామాజిక-రాజకీయ, ఆర్థిక అంశాల పాత్రపై కూడా చర్చలు జరిపారు. దావోస్ సదస్సులో భాగంగా నిర్వహించిన అనేక కార్యక్రమాలు; ద్వైపాక్షిక, రౌండ్‌టేబుల్ సమావేశాల్లో మంత్రి గోయల్ ప్రసంగించారు. అలాగే జపాన్ బ్యాంక్ (అంతర్జాతీయ సహకారం) సీఈఓ, కార్యనిర్వాహక ఎండీ తదషీ మయేదాతో కూడా ఆయన శుక్రవారం భేటీ అయ్యారు.

అమ్మల ఖ్యాతి చరిత్రలో నిలిచేలా..

- మేడారంలో అందుబాటులోకి వచ్చిన ఆదివాసీ మ్యూజియం, అంఫి థియేటర్
- గిరిజనుల ఆచార వ్యవహారాలు, ఆహార అలవాట్లు తెలిపేలా ఏర్పాటు

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి

మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర.. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధిగాంచింది. ఆదివాసీ గిరిజనుల ఆచారాల ప్రకారం నిర్వహించే ఈ జాతరకు కోటి మందికి పైగా భక్తులు తరలివస్తారని అంచనా. ఇంతటి గొప్ప పండుగను గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలరీతిలో నిర్వహిస్తారు. అమ్మల చరిత్ర, గిరిజనుల జీవనవిధానాలను విశ్వవ్యాప్తం చేయాలనే ఆలోచనతో అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే మేడారంలో గిరిజన మ్యూజియం, అంఫిథియేటర్‌ను అందుబాటులోకి తెచ్చారు.



మేడారంలో ఏర్పాటు చేసిన సమ్మక్క, సారలమ్మ ఆదివాసీ మ్యూజియం

మేడారం ఉత్సవ్ పేరుతో గిరిజన కళల ప్రదర్శన

గిరిజన కళలు, సమ్మక్క, సారలమ్మ విజయగాథను ప్రదర్శించేందుకు రూ.68 లక్షలతో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అంఫి థియేటర్‌ను నిర్మించారు. ఇందులో 'మేడారం ఉత్సవ్' పేరుతో కళాప్రదర్శనలు, జానపద కళలు, గిరిజన సంప్రదాయ నృత్యాలు, మేడారం చరిత్ర అన్నింటినీ ప్రదర్శించేందుకు అలంకరణ చేశారు. నాటక ప్రదర్శన స్టేడియం ఏర్పాటు చేసి చుట్టూర సందర్శకులు కూర్చునేందుకు వీలుగా నిర్మించారు.

- దేశవిదేశాల నుంచి అమ్మల దర్శనానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు వనదేవతల చరిత్ర, జాతర విశిష్టతను కళ్లకు కట్టినట్లు వివరించేందుకు ఈ గిరిజన మ్యూజియం, అంఫిథియేటర్, ఆహార ఉత్సవం ఉపయోగపడనున్నాయి. గతంలో ఇలాంటి సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు కేవలం జాతరకు వచ్చి అమ్మవార్ల దర్శనం చేసుకుని తిరుగుముఖం పట్టేవారు. ఈసారి ఇలాంటి కొత్తగా వినోదభరితమైన ప్రదర్శనలు చేపడుతుండడంతో వీటిని వీక్షించి మధుర అనుభూతిని పొందవచ్చు. జాతర సమయంలోనే కాకుండా ఎప్పటికీ వీటికి అందుబాటులోకి తెచ్చేందుకు పర్యాటకశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

గిరిజనుల జీవనశైలి ఉట్టిపడేలా..



ఆదివాసీలు వాడిన పురాతన వస్తుసామగ్రి

మేడారంలో రూ.2 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన గిరిజన మ్యూజియాన్ని ఈ జాతరకు అందుబాటులోకి తీసుకొచ్చారు. రెండంతస్తుల భవనాన్ని నిర్మించి ఇందులో గిరిజనులు వినియోగించే వస్తువులు, వారి జీవన విధానాన్ని తెలియజెప్పే శిల్పాలను పొందుపర్చారు. సమ్మక్క జీవిత చరిత్రను ప్రతిబింబించేలా ఆమె పుట్టుక, వివాహం, వనప్రవేశం తదితర శిల్పాలను తీర్చిదిద్దారు. జీవకళ ఉట్టిపడేలా శిల్పాలు, వస్తువులను మ్యూజియంలో పొందుపర్చారు.

ఆదివాసీల ఆహార అలవాట్ల ప్రదర్శనలు



ఆహార ఉత్సవం(ఫుడ్ ఫెస్టివెల్) పేరిట గిరిజనుల ఆహారపు అలవాట్లు, వారు పండించిన పంట ఉత్పత్తుల అంబలి, ఎల్లేరుగడ్డ, అల్లిగడ్డ తదితర దుంపలు, చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు, మొక్కజొన్నలు, నల్ల ఉలువలు, విప్పపువ్వుతో తయారు చేసిన కుడుములు, చిక్కుడుపప్పు, బొబ్బర పప్పు, ఆకుకూరలైన బొద్దికూర, తోటకూర, పొన్నగంటి కూర, చింతచిగురు, ఎండు, పచ్చి చేపలు, కోడికూర ఇలా పోషకాలున్న ఆహార ధాన్యాలు, కూరల్లాంటి వాటి రుచులను సిద్ధం చేస్తున్నారు. ఇటీవలే ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, చందూలాల్ ప్రారంభించారు. జాతర నాలుగు రోజుల పాటు గిరిజన ఆహార ఉత్పత్తులు, వంటలను ప్రదర్శన పెట్టడంతోపాటు ఆ వంటకాలను సందర్శకులకు రుచి చూపించనున్నారు.

కోర్టులో కుమారులపై తండ్రి విజయం

- తండ్రి పోషణ బాధ్యత అందరిదీ
- మనోవర్తి ఇవ్వాలన్న న్యాయస్థానం

ఆలమూరు, న్యూస్‌టుడే: పోషణ బాధ్యతలు విస్మరించిన కుమారులపై ఓ తండ్రి చేసిన పోరాటం ఫలించింది. న్యాయస్థానం తీర్పుతో తండ్రికి ఊరట లభించింది. తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరుకు చెందిన పుల్లేటికుర్తి నాగభూషణం అర్చకత్వం చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. ఆయనకున్న నలుగురు కుమారులను పెద్దచేసి వివాహాలు జరిపించారు. వృద్ధాప్యం మీదపడడంతో మూడో కుమారుడికి అర్చకత్వ బాధ్యతలు అప్పగించి విశ్రాంతి తీసుకుంటున్నారు. అప్పటి నుంచి అర్చకత్వం చేస్తున్న కుమారుడే తండ్రిని చూసుకుంటున్నారు. నలుగురూ చూడాల్సిన సమయంలో ఒక్కరిపై భారంగా ఉండడమేమిటని తలచిన తండ్రి.. మనోవర్తి కోరుతూ ఆలమూరు కోర్టులో మిగిలిన ముగ్గురు కుమారులపై 2016 జూన్ 30న కేసు వేశారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి ఎం.సుబ్బారావు గురువారం తీర్పునిచ్చారు. ముగ్గురు కుమారులూ తండ్రి బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. ముగ్గురిలో ఉపాధ్యాయుడైన కుమారుడు రూ.4వేలు, మిగిలిన వారు రూ.1,500 చొప్పున మొత్తం రూ.8,500 ప్రతి నెలా మనోవర్తిగా చెల్లించాలని పేర్కొన్నారు.

డోక్లాంలో కొత్త నిర్మాణాలు సరికాదు

బీజింగ్: భారత-చైనా సరిహద్దులోని సున్నిత ప్రాంతాల్లో యథాతథస్థితిలో ఎలాంటి మార్పులు చేయకూడదని చైనాలో భారత రాయబారి గౌతం బాంబ్వాలే సూచించారు. చైనా ప్రభుత్వ పత్రిక గ్లోబల్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సున్నితమైన డోక్లాంవంటి ప్రాంతాల్లో ఎలాంటి మార్పులు చేయకూడదని చెప్పారు.

మహారాష్ట్రలా కరెంటు ఛార్జి నిర్ణయించాలి

- అక్కడ మెట్రో, మోనో, సాధారణ రైల్వేకు ఒకటే ఛార్జి
- తెలంగాణలో మెట్రోరైలుకొకరకం, రైల్వేకు మరింత అధికం
- ఛార్జీలు తగ్గించాలని ఈఆర్‌సీకి రైల్వే శాఖ వినతి

ఈనాడు - హైదరాబాద్

ప్రజలకు సేవలందిస్తున్న రైల్వేల నుంచి తెలంగాణలో అధికంగా కరెంటు ఛార్జీలు వసూలు చేస్తున్నారని, ఇది తగదని రైల్వేశాఖ పేర్కొంది. మహారాష్ట్రలో మాదిరిగా మెట్రో, మోనో, సాధారణ రైల్వేట్రాక్‌లకు ఒకేలా కరెంటు ఛార్జి నిర్ణయించాలని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ)కి విన్నవించింది. వీటిని తగ్గించకపోతే ఓపెన్ యాక్సిస్‌లో కొనుకుంటామంది. హైదరాబాద్ మెట్రో రైలుకు కరెంటు ఛార్జిని యూనిట్‌కు సగటు రూ.3.95గా తెలంగాణ దక్షిణ డిస్కం నిర్ణయించింది. మెట్రో రైలు ట్రాక్‌తో పాటు స్టేషన్లు, ఎస్కలేటర్లు, ఇతర అవసరాలకు వాడే కరెంటునంతా ఒకే కేటగిరీలో పెట్టింది. మెట్రో మాదిరిగానే తామూ ప్రజారవాణా సేవలందిస్తున్నా సాధారణ రైల్వేలకు యూనిట్ ఛార్జీని సగటున రూ.5.60గా వసూలు చేస్తున్నారని ఇది పలు రాష్ట్రాలకన్నా అధికమని రైల్వే పేర్కొంది. తెలంగాణలో యూనిట్‌కు రూ.1.25 సర్‌ఛార్జి వేయడం తగదంది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో రైల్వేట్రాక్‌కు వాడే విద్యుత్‌కు ఛార్జీల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నారంది.

డిస్కంల తీరు సరిగా లేదు

తెలంగాణలో కరెంటు ఛార్జీలు భరించలేక ఓపెన్ యాక్సిస్‌లో బయటి మార్కెట్‌లో కొంటున్నవారి నుంచి అదనంగా సర్‌ఛార్జి వసూలు చేయడాన్ని 'భారత ఇంధన ఎక్స్ఛేంజి' (ఐఈఈ)తో పాటు పలు ఇతర సంస్థలు వ్యతిరేకిస్తూ ఈఆర్‌సీకి ఫిర్యాదుచేశాయి. తెలంగాణలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఓపెన్ యాక్సిస్‌కు వెళ్లే వారి వల్ల 246 మెగావాట్ల విద్యుదుత్పత్తి ఆపాల్సి వస్తుందని డిస్కంలు తెలిపాయి. ఈ నష్టాన్ని పూడ్చుకునేందుకు అదనపు సర్‌ఛార్జి రూపంలో ఓపెన్ యాక్సిస్‌కు వెళ్లేవారి నుంచి యూనిట్‌కు రూ.2.06 వసూలుకు అనుమతించాలని ఈఆర్‌సీని డిస్కంలు కోరాయి. ఇది సహేతుకం కాదని, డిస్కంల లెక్కల్లో వాస్తవికత లేనందున అదనపు సర్‌ఛార్జిని అనుమతించవద్దని ఐఈఈతో పాటు, భారత సౌర విద్యుత్కేంద్రాల సంఘం, పలు సంస్థలు కోరాయి. ఒకవేళ సర్‌ఛార్జి వేయాలనుకున్నా కచ్చితమైన అంచనాల ప్రకారం యూనిట్‌కు 32 పైసలకు మించి అదనంగా వేయవద్దని పలు గణాంకాలతో ఐఈఈ నివేదించింది. దీనివల్ల డిస్కంలు ప్రతిపాదించిన యూనిట్‌కు రూ.2.06 ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. వీటిపై ఈఆర్‌సీ త్వరలో విచారణ జరిపి ఆదేశాలు ఇవ్వనుంది.

అన్నకు తగిన తమ్ముడు

- 'మెన్సా ఐక్యూ పరీక్ష'లో 162 స్కోర్
- దశాబ్దంలోనే పిన్న వయస్కుడు
- రికార్డు సృష్టించిన భారతీయ బాలురు
- ఐన్‌స్టీన్, హాకింగ్‌లను మించిన అన్నాదమ్ములు

లండన్: తెలివితేటలకు కొలమానంగా భావించే 'మెన్సా ఐక్యూ పరీక్ష'లో తన అన్నయ్య 162 స్కోర్ సాధించడం అతడి తమ్ముడిలో స్ఫూర్తినింపింది. అన్నయ్యని అందరూ మేధావిగా గుర్తించారని, తనను కూడా అంతా మేధావిగా గుర్తించాలని ఉవ్విళ్లూరాడు. ఫలితంగా అన్నయ్యతో సమానంగా 162 స్కోర్ సాధించడంతో పాటు దశాబ్దంలోనే ఇంతటి స్కోర్ సాధించిన పిన్నవయస్కుడిగా రికార్డు సృష్టించాడు.



అన్న ధృవ్‌గార్గ్‌తో మెహుల్ గార్గ్

లండన్‌లో నివసిస్తున్న, భారతీయ మూలాలున్న మెహుల్ గార్గ్(10) ప్రఖ్యాత శాస్త్రవేత్తలు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్‌ల కంటే రెండు పాయింట్లు ఎక్కువ సాధించడం విశేషం. మెన్సా ఐక్యూ పరీక్షలో 140 స్కోర్ సాధిస్తే మేధావిగా పరిగణిస్తారు. మెహుల్‌ను అతని తల్లిదండ్రులు ముద్దుగా మహి అని పిలుస్తారు. మహి అన్నయ్య ధృవ్‌గార్గ్(13) కూడా గత ఏడాది 162 స్కోర్ సాధించాడు. 'అతడినే స్ఫూర్తిగా తీసుకున్న మహి.. అన్నయ్యకు ఏమాత్రం తీసిపోనని నిరూపిస్తానన్నాడు. నేనూ మేధావినేనని ఎంతో కష్టపడ్డాడు. సాధించి చూపాడు' అని అతని తల్లి దివ్యగార్గ్ ఆనందభాష్పాలు రాలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న జనాభాలో కేవలం ఒక్కశాతం మంది మాత్రమే 162 స్కోర్ సాధించగలిగారు. క్రికెట్ ఆడటం, ఐస్ స్కేటింగ్ చేయడం అంటే మహికి ఎంతో ఇష్టం. లెక్కలంటే అమితంగా ఇష్టపడే ఈ బాలుడు భవిష్యత్తులో గూగుల్‌వంటి పెద్ద కంపెనీని స్థాపిస్తానని చెబుతున్నాడు. అంకెలు, అక్షరాలు ఉండే క్యూబ్‌ను కేవలం వంద సెకన్లలో సెట్ చేసేస్తాడు. డ్రమ్స్ వాయించడంలో దిట్ట. ప్రస్తుతం అన్నాదమ్ములిద్దరూ సమాజానికి ఉపయోగపడే ఓ కార్యక్రమానికి విరాళాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే 1300 పౌండ్లు(రూ.లక్షా 17 వేలు) సేకరించారు. ఇరుగు పొరుగువారిని అనుసంధానం చేసి, వారి మధ్య ఒంటరితనం తగ్గించడానికి ఓ యాప్‌ను తయారు చేస్తున్నారు. మరోవైపు ఛానల్ 4లో ప్రసారమయ్యే 'చైల్డ్ జీనియస్ 2018' కార్యక్రమంలో పాల్గొనడానికి ఎంపికయ్యాడు. ఈ ఏడాది ఎంపికైన వందమందిలో మహి కూడా ఉన్నాడు.

అసలు కంటే వడ్డీయే ముద్దు!

- సంక్షేమ పథకాల సొమ్ము బ్యాంకుల్లో జమ
- వడ్డీ మిగుల్చుకోవడానికి అధికారుల ఎత్తులు
- శాఖలవారీగా లెక్కా పత్రం లేవు
- ప్రతి ఖాతా, సొమ్ము వివరాలడిగిన ప్రభుత్వం

ఈనాడు - హైదరాబాద్

అసలు కంటే వడ్డీ ముద్దు.. పలు ప్రభుత్వ శాఖల్లోని అధికారులు ఈ సూత్రాన్ని బాగా వంటబట్టించుకున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో విడుదల చేస్తున్న కోట్లాది రూపాయలను బ్యాంకు పొదుపు ఖాతాల్లో నిల్వ చేస్తున్నారు. సాంకేతిక కారణాలతో వాటిని నెలల తరబడి అలాగే ఉంచుతున్నారు. వీటిపై వచ్చే వడ్డీ మాత్రం ఖాతాల్లో జమ కావడం లేదని ప్రభుత్వం గుర్తించింది. పథకాల నిధులను ప్రజలకు పంచేలోగా ఎక్కడ నిల్వ చేస్తున్నారనే విషయంపై తాజాగా విచారణ చేపట్టింది. ఈ వివరాలన్నింటినీ శాఖలవారీగా పంపాలని ఆర్థిక శాఖ తాజాగా ఆదేశాలిచ్చింది.

ఉదాహరణకు ఏదైనా జిల్లాలో అభివృద్ధి పనులకు సంబంధించిన భూ సేకరణకు ఇచ్చే నిధులు నెలల తరబడి జిల్లా అధికారులు బ్యాంకుల్లో ఉంచుతున్నారు. భూ సేకరణకు అవరోధాలు ఎదురవుతున్నందున వీటిని ఖర్చు చేయలేకపోతున్నట్లు చెప్పడం వరకూ అంతా నిబంధనల ప్రకారమే ఉంటుంది. కానీ ఇలాంటి నిధుల డిపాజిట్ల వ్యవహారంలో గుట్టుచప్పుడు కాకుండా అవినీతి సాగుతోంది. బ్యాంకుల్లో జమ చేసిన నిధులపై వస్తున్న వడ్డీ సొమ్మును ఏం చేస్తున్నారనే లెక్కలు ప్రభుత్వం పెద్దగా తనిఖీలు చేయడం లేదు. వీటి వినియోగంలో అధికారులు ఆడిందే ఆటగా సాగుతోంది. ఈ వివరాలన్నింటినీ శాఖలవారీగా పంపాలని ఆర్థిక శాఖ తాజాగా ఆదేశాలిచ్చింది. కొత్త బడ్జెట్ తెచ్చేలోగా ప్రతి శాఖలో ఏ బ్యాంకు ఖాతాలో ఎన్ని నిధులున్నాయి, వాటిపై వస్తున్న వడ్డీ ఎంత, అదేం చేస్తున్నారు, ఎంతకాలం నుంచి నిధులు డిపాజిట్ రూపంలో ఉంచారనే వివరాలన్నీ సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

బ్యాంకర్లే ఉప్పందించారు

బ్యాంకుల్లో జమలు, వడ్డీల వినియోగంపై తాజాగా బ్యాంకర్ల ద్వారానే ప్రభుత్వానికి ఉప్పందింది. కొన్నిచోట్ల బ్యాంకు మేనేజర్లు, ప్రభుత్వ అధికారులతో కోట్లాది రూపాయలు జమ చేయిస్తున్నారని ప్రభుత్వానికి ఓ బ్యాంకు ఉన్నతాధికారి చెప్పారు. గతంలో ఉద్యానశాఖలో ఇలా కేంద్ర పథకాల నుంచి వచ్చిన నిధులను జమ చేసినప్పుడు వచ్చిన వడ్డీ సొమ్ము రూ.4 కోట్లు దాటడంతో ఆ శాఖ ముఖ్యకార్యదర్శి పట్టుబట్టి ప్రభుత్వ ఖజానాలో జమ చేయించారు. అన్ని శాఖల్లో ఇలా చేయిస్తే కోట్లాది రూపాయలు వెలుగులోకి వస్తాయని ఆర్థిక శాఖ అంచనా.



ఏప్రిల్ నుంచి కట్టడి

వచ్చే ఏప్రిల్ నుంచి ఇలా ప్రభుత్వ కార్యాలయాల అధికారులు ఇష్టారీతిగా తమకు నచ్చిన బ్యాంకులో పథకాల సొమ్మును డిపాజిట్ చేయకుండా అడ్డుకట్ట వేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయబోతున్నారు. శాఖల నుంచి వచ్చే బ్యాంకు ఖాతాల నుంచి కొన్నింటిని అధికారికంగా ఆర్థిక శాఖ ఎంపిక చేయనుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఇలా ఎంపిక చేసిన ఖాతాల్లో మాత్రమే సొమ్ము జమ చేయాలని ఉత్తర్వులు జారీ చేయనుంది. వీటిలో మినహా మరెక్కడ జమ చేసినా బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలుంటాయని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది.

తాత్కాలిక నియామకాల్లోనూ లొసుగులు

విశ్వవిద్యాలయాలు, స్వయం ప్రతిపత్తి గల ప్రభుత్వ సంస్థల్లో తాత్కాలిక ఉద్యోగుల నియామకాల్లోనూ లొసుగులున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఎంత మంది ఉద్యోగులు అవసరం, ఎంతమందిని నియమిస్తున్నారు, వారిని నియమించిన విభాగంలోనే పనిచేయిస్తున్నారా, ఇతర అవసరాలకు పంపి నిధులు మింగుతున్నారా అనే కోణంలో ఆర్థిక శాఖ వివరాలు సేకరిస్తోంది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రాంతీయ పరిశోధనా కేంద్రాల్లో సాంకేతిక సహాయకులు (టెక్నికల్ అసిస్టెంట్లు) పేరుతో తాత్కాలిక ఉద్యోగులను నియమించి కార్యాలయాల్లో వ్యక్తిగత సేవలకు, ఇంట్లో వంట పనులకు వినియోగించుకుంటున్నారు. ఇలాంటి పనులకు సైతం టీఏలకిచ్చే రూ.12 వేల వేతనం ఇస్తున్నారు. వీటన్నింటినీ బయటికి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది.

వ్యవసాయ బడ్జెట్ రూ. 14 వేల కోట్లు!

- 70% నిధులు పెట్టుబడి పథకానికే
- మిగతా కార్యక్రమాలకు అంతంత మాత్రమే
- వ్యవసాయశాఖ ప్రతిపాదనలు

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరంలో పంటలకు భారీగా నిధులు కావాలని వ్యవసాయ, ఉద్యానశాఖలు ప్రభుత్వానికి బడ్జెట్ ప్రతిపాదనలిచ్చాయి. కూరగాయలు, పండ్లు, పూలు, సుగంధ ద్రవ్యాలు వంటి ఉద్యాన పంటలకు రూ.1,200 కోట్లకు ఉద్యానశాఖ, ఇతర పంటలకు మరో రూ. 12,825 కోట్లు కావాలని వ్యవసాయశాఖ కోరాయి. వచ్చే జూన్ నుంచి ప్రారంభమయ్యే కొత్త ఖరీఫ్ సీజన్‌లో ఎకరానికి రూ. 4,000 చొప్పున పెట్టుబడి సాయం పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది. ఇలాగే రబీలోనూ ఇవ్వనున్నారు. ఈ పథకానికే రూ. 9,727 కోట్లు కావాలని అడిగారు. మొత్తం రెండు శాఖల బడ్జెట్లలో ఈ పథకానికే 70 శాతం నిధులు ఇవ్వాల్సి ఉంది. దీనిని సీఎం కూడా తగ్గించకపోవచ్చని భావిస్తున్నారు. ఏమైనా కోతలు పెడితే ఇతర పథకాలకు నిధులు తగ్గుతాయి. పంటరుణాలపై వడ్డీమాఫీకి రూ. 500 కోట్లు, ప్రధానమంత్రి పంటల బీమాకు రూ. 280 కోట్లు, వ్యవసాయ యంత్రాలకు మరో రూ. 560 కోట్లు, విత్తన రాయితీకి రూ. 404 కోట్లు అడిగారు.

భారీగా ఇవ్వక తప్పదా!

ప్రభుత్వ శాఖలకు బడ్జెట్ కేటాయింపులు ఏటా సాధారణంగా 10 నుంచి 20 శాతం వరకూ పెంచుతుంటారు. ఏదైనా ప్రత్యేక పథకం ఉన్నప్పుడు మాత్రమే కొన్నిశాఖలకు భారీగా పెంపు ఉంటుంది. వ్యవసాయశాఖకు గత బడ్జెట్‌లో రూ. 5,727 కోట్లు కేటాయించారు. ఇందులో 'రుణమాఫీ' పథకం కింద రూ. 4,000 కోట్లు కేటాయించగా మిగతావి ఇతర పథకాలకు దక్కాయి. కానీ ఈసారి ఏకంగా రూ. 12,800 కోట్లకు పెంచమని అడిగారు. ఇందులో పెట్టుబడి పథకం కిందనే రూ. 9,727 కోట్లు పోగా మిగతావి ఇతర పథకాలకు ఇవ్వమన్నారు. అడిగినంతగా ఇస్తే ఈ శాఖకు ఏకంగా 123 శాతం అదనంగా పెంచాలి. ఇలాగే ఉద్యానశాఖకు సైతం గత బడ్జెట్‌లో రూ. 1,200 కోట్లు కేటాయించారు. కానీ అందులో రూ. 1,000 కోట్ల వరకూ నాబార్డు నుంచి రుణంగా వస్తుందని చూపారు. వచ్చే బడ్జెట్‌లో ఈ రుణం ఉండదని, అయినా తిరిగి రూ. 1,200 కోట్లు కావాలని అడిగారు. పంటకాలనీల పథకానికి, సూక్ష్మసేద్యానికి అదనంగా కావాలని ప్రతిపాదించారు. కానీ ఇంత భారీగా ఆర్థికశాఖ ఇస్తుందా అన్నది అనుమానమే.

ఆత్మాహుతి బాంబుగా అనుమానిస్తున్న పుణె యువతి కశ్మీరులో అరెస్టు!

- చిన్నవయసులోనే ఐఎస్ భావజాలం వైపు మొగ్గు
- కుటుంబానికి ఆమెను అప్పగించే అవకాశం

శ్రీనగర్: ఆత్మాహుతి బాంబుగా అనుమానిస్తున్న 18ఏళ్ల సదియా అన్వర్ షేక్ అనే యువతిని జమ్ము-కశ్మీరు పోలీసులు గురువారం రాత్రి అరెస్టు చేశారు. ఆమెను కుటుంబానికి అప్పగించే అవకాశాలున్నాయి. పుణెకు సమీపంలోని ఎరవాడకు చెందిన ఈ అమ్మాయి 2015లో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదంవైపు ఆకర్షితురాలైంది. అప్పుడామె వయసు 16 సంవత్సరాలే. బుర్ఖాలను మాత్రమే ధరించడం మొదలుపెట్టింది. ఐఎస్‌కు చెందిన ఫేస్‌బుక్ గ్రూపుల్లో చురుకైన భాగస్వామిగా మారి తీవ్రవాదం గురించి తెలుసుకుంది. ఒకదశలో ఐఎస్ సంస్థ ఆమెను సిరియాలో యుద్ధబాధితులకు చికిత్స చేయడానికి పంపాలని కూడా యోచించింది. అందుకోసం చదువు చెప్పించడానికి కూడా యత్నించింది. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉన్న ఆమె ఆచూకీని మహారాష్ట్ర ఏటీఎస్ 2015 డిసెంబరులో కనుగొంది. తల్లిదండ్రులు, ముస్లిం మత పెద్దలు, మేధావులు, ఏటీఎస్ అధికారులంతా కలిసి తీవ్రవాద ప్రభావం, యోచనల నుంచి మళ్లించారు. అయితే, 2017లో తర్వాత మహారాష్ట్రలో ఎక్కడా కనిపించలేదు. చివరకు పోలీసులు ఇంటెలిజెన్స్ సమాచారంతో వెతికితే... కశ్మీరులోని బిజ్‌బెహరా అనే ప్రాంతంలో పేయింగ్‌గెస్ట్‌గా ఉన్నట్లు వెల్లడైంది. ఐఎస్ఐఎస్‌లో చేరేందుకు ఆమె యత్నిస్తున్నట్లూ తేలింది. ఆమె కశ్మీరులో జరిగే గణతంత్రవేడుకల్లో ఆత్మాహుతి దాడికి పాల్పడవచ్చన్న సమాచారమూ పోలీసులకు అందింది. దీంతో, ఆమెను అనుమానంతో అరెస్టు చేశారు. అయితే, ఆమెపై అటు మహారాష్ట్రలో కానీ...ఇటు కశ్మీరులో కానీ ఎలాంటి కేసులు లేని విషయం గమనార్హం. ఆమె పుణెలో సంపన్న వ్యాపారవేత్తకు ఏకైక సంతానం. తండ్రి వ్యాపారరీత్యా తరచూ పర్యటనల్లో ఉండటంతో తల్లే ఆమె ఆలనాపాలనా చూసేవారు.

చలి గుప్పిట్లో జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్

దిల్లీ: ఉత్తర భారతదేశంలో చలి పులి పంజా విసురుతోంది. జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో పలుచోట్ల ఉష్ణోగ్రతలు శుక్రవారం సున్నా డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువే నమోదయ్యాయి. జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత మైనస్ 4.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. దిల్లీలో గరిష్ఠ ఉష్ణోగ్రత 18.8 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రత 7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. పొగమంచు కూడా దేశ రాజధానిని కమ్మేసింది. గణతంత్ర దినోత్సవ కవాతును వీక్షించేందుకుగాను రాజ్‌పథ్‌కు ఉదయాన్నే బయలుదేరిన పలువురు ఇబ్బందిపడ్డారు. దట్టమైన పొగమంచు కారణంగా చెన్నై విమానాశ్రయంలో ఉదయం దాదాపు 3 గంటల పాటు విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

దక్షిణ కొరియా ఆస్పత్రిలో మృత్యుఘోష

- అగ్నిప్రమాదంలో 41 మంది దుర్మరణం

సియోల్: దక్షిణ కొరియాలోని ఓ ఆస్పత్రిలో శుక్రవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 41 మంది మృత్యువాతపడ్డారు. 80 మందికిపైగా గాయపడ్డారు. మిర్యాంగ్ నగరంలోని సెజాంగ్ ఆస్పత్రిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అత్యవసర చికిత్స అందించే గదుల్లో తొలుత చెలరేగిన మంటలు.. ఆపై క్షణాల్లో ఆస్పత్రి భవనం మొత్తం వ్యాపించాయి. ప్రమాద సమయంలో ఆస్పత్రిలో దాదాపు 200 మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భవనం లోపలి నుంచి రోగులందరినీ బయటకు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. రోగుల హాహాకారాలు-అగ్నిప్రమాద దృశ్యాలు, సహాయక చర్యల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం వైరల్‌గా మారాయి. దక్షిణ కొరియాలో గత దశాబ్దకాలంలో అత్యధిక ప్రాణనష్టాన్ని కలిగించిన అగ్నిప్రమాదం ఇదే కావడం గమనార్హం.



ఆస్పత్రిలో మంటలు చెలరేగి వెలువడుతున్న పొగ

రెండు పడక గదుల ఇళ్లపై 'ఉక్కు' భారం

- రూ.50వేలకు చేరిన టన్ను ధర
- తయారీ సంస్థలతో చర్చలకు సర్కారు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండు పడక గదుల ఇళ్ల పథకానికి ఉక్కు ధరల గండం ఎదురైంది. పునాదుల నుంచి, స్లాబు వరకు కీలకమైన ఉక్కు ధరలు ఒకేసారి 60 శాతానికి పైగా పెరగడంతో నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. గత 4 నెలల్లో ఒక్కసారిగా పెరిగిన భారంతో నిర్మాణాలు చేపట్టేందుకు గుత్తేదారులు వెనకడుగు వేస్తున్నారు. ధరలు దిగిరావడం, లేదంటే తక్కువ ధరకే ఉక్కు సరఫరా చేస్తే కానీ నిర్మాణాలు చేపట్టలేమంటూ చేతులు ఎత్తేస్తున్నారు. దీంతో తెలంగాణ వ్యాప్తంగా పునాదుల దశలోని దాదాపు 1.31 లక్షల నిర్మాణాలపై తీవ్రంగా ప్రభావం పడనుంది.

మార్కెట్‌లో టన్ను ధర రూ.50వేలు

రాష్ట్ర వ్యాప్తంగా 2.72 లక్షల గృహాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత 6 నెలల్లో దాదాపు లక్ష గృహాలు పునాదుల దశకు చేరుకున్నాయి. అదే సమయంలో ఉక్కు ధరలు పెరగడం మొదలైంది. ప్రస్తుతం రెండు పడక గదుల గృహాల నిర్మాణానికి టన్ను ఉక్కు ధర రూ.33 వేలుగా ప్రభుత్వం నిర్ణయించింది. కానీ మార్కెట్‌లో ధర రూ.50వేలు దాటింది. దీంతో నిర్మాణ భారం భారీగా పెరిగిందని గుత్తేదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇటుకల ధరలు 20 శాతం వరకు పెరిగాయి.

గతంలో చర్చలు జరిగినా...

ప్రభుత్వ ప్రాజెక్టులకు ఒకే ధరకు ఉక్కును సరఫరా చేసేలా ఉక్కు తయారీ కంపెనీలతో గతంలోనే పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్, గృహనిర్మాణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రెండుసార్లు చర్చలు జరిపారు. సిమెంటు కంపెనీల తరహాలోనే ఒప్పందం చేసుకోవాలని భావించారు. కానీ ఉక్కు ధరలపై స్పష్టత రాలేదు. దీంతో ఈ నెల 28న లేదా నెలాఖరులోగా కంపెనీలతో సమావేశం నిర్వహించి, రెండు పడక గదుల నిర్మాణానికి ఒకే ధరకు సరఫరా చేసేలా చర్చలు నిర్వహించే అవకాశాలున్నాయని ఉన్నతాధికారులు తెలిపారు.

ఎదురుకాల్పుల్లో ఇద్దరు గ్యాంగ్‌స్టర్ల హతం

చండీగఢ్: పంజాబ్‌కు చెందిన కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్లు వికీ గౌండర్, ప్రేమ లహోరియాలు శుక్రవారం జరిగిన ఎదురుకాల్పుల్లో హతమయ్యారు. వారు రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలోని పక్కి గ్రామంలో ఉన్నారన్న సమాచారం అందుకున్న పంజాబ్ పోలీసులు అక్కడికి వెళ్లగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి.

ముల్లర్ తొలగింపుపై వెనక్కితగ్గిన ట్రంప్

వాషింగ్టన్: అమెరికా ఎన్నికల్లో రష్యా జోక్యంపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక న్యాయవాది రాబర్ట్ ముల్లర్‌ను తొలగించాలని భావించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరువాత వెనక్కి తగ్గారు. ఇదే జరిగితే తాను రాజీనామా చేస్తానని శ్వేతసౌధం న్యాయవాది జాన్ మెక్‌గహన్ హెచ్చరించడంతో మనసు మార్చుకున్నారని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది.

ఈనాడు

పరిమళించిన పద్మాలు

దేశ ప్రగతిపథ పయనం నిరంతరాయంగా సాగేలా సకల పార్శ్వాల్లో వ్యక్తిగా, వ్యష్టిగా అత్యున్నత ప్రమాణాల సాధనకు ప్రతి పౌరుడూ పరిశ్రమించాలని భారత రాజ్యాంగంలోని 51 ఎ (జె) అధికరణ చాటుతోంది. ఆ సంగతి తెలియకపోయినా- చీకటిని తిడుతూ కూర్చునేకంటే చిరుదివ్వె వెలిగించడం మేలన్న స్ఫూర్తిని ఆకళించుకొని, పరోపకారమే పరమావధిగా తమ జీవితాల్నే సదాశయ స్ఫూర్తి దీపశిఖలుగా మార్చిన పుణ్యాత్ములు ఎందరని? వ్యక్తిగతంగా తాము కష్టాలకు ఎదురొడ్డి సాటి బాధాసర్పదష్టుల్ని ఆదుకోవడానికి, అజ్ఞాన తిమిరాన్ని ఛేదించడం ద్వారా రేపటి తరాన్ని ఉజ్జ్వల భవితలోకి చేదుకోవడానికి జీవితాల్నే ముడుపు కట్టిన భారతమ్మ ముద్దుబిడ్డల్ని పద్మ పురస్కారాలు కోరి వరించడం అమందానందం కలిగిస్తోంది. పద్మ అవార్డులు బంగారమైతే, వాటికి మానవీయ విలువల తావి అబ్బిన సందర్భమిది! 'ప్రజల వలన ప్రజల చేత ప్రజల కొరకు' అన్న ప్రజాస్వామ్య భావన- పురస్కారాల్లోనూ ప్రతిఫలిస్తున్న వేళ ఇది. గతానికి భిన్నంగా- ఆయా రంగాల్లో నిస్వార్థ గణనీయ సేవాతత్పరుల్ని ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు సామాన్య జనావళీ సూచించగలిగేలా మోదీ ప్రభుత్వం తెచ్చిన వెసులుబాటు- మట్టిలో మాణిక్యాలు నేడు జాతీయ స్థాయిలో వెలుగులీనడానికి మూలకారణమవుతోంది. పద్మ పురస్కారాలకు ఈ ఏడాది ఎకాయెకి 15,706 సూచనలందగా- వడబోతల దరిమిలా ముగ్గురికి పద్మవిభూషణ్, తొమ్మండుగురికి పద్మభూషణ్, 73మందికి పద్మశ్రీ లభించాయి. నిరుటి మాదిరిగానే ఈ ఏడాది విజేతల జాబితాలో కనిపిస్తున్నది- సరికొత్త స్ఫూర్తిదాయక ఒరవడి. దుర్రాజకీయాల బారిన భ్రష్టుపట్టిన పద్మ పురస్కారాల్ని రద్దు చేసెయ్యాల్సిందిగా 1969లోనే పార్లమెంటులో ఆచార్య కృపలానీ బిల్లు ప్రవేశపెట్టడం, అనర్హులకు అవార్డుల సంతర్పణలతో దేశానికెంతో హాని జరుగుతోందంటూ సుప్రీంకోర్టు 1995లోనే హెచ్చరించడం... వంటివి జరిగినా మోదీ ప్రభుత్వం వచ్చేదాకా సరైన దిద్దుబాటు చర్యలు మృగ్యమయ్యాయి. ఇటీవల ఎంపిక పద్ధతి మార్పుతో పురస్కారాలు జాతీయతా స్ఫూర్తి ప్రేరకాలుగా భాసిస్తున్నాయి!

జాతి పురోగతి తరగతి గదుల్లో పురుడు పోసుకుంటుంది. బడుల్లో వెనకబాటుకు మౌలిక సౌకర్యాలలేమిని సాకుగా చూపి బాధ్యతలు దులపరించేసుకుంటున్న ఉపాధ్యాయలోకానికి- పద్మశ్రీ పురస్కార గ్రహీత అరవింద్ గుప్తా ఆదర్శమే కనువిప్పు! గడచిన నాలుగు దశాబ్దాలుగా ఈ కాన్పూర్ అధ్యాపకుడు మూడు వేల పాఠశాలలు చుట్టి, 18 భాషల్లో ఆరువేలకు పైబడిన లఘు చిత్రాలు నిర్మించి శాస్త్రీయ స్పృహను దేశ పరివ్యాప్తం చేసిన తీరు గురువులందరికీ దిశానిర్దేశం చేసేదే! నాలుగు గోడల మధ్య బట్టీయం చదువులకు పరిమితమవుతున్న ఉపాధ్యాయులందరికీ- సంచార ప్రయోగశాలల ద్వారా లక్షా 20వేల మంది విద్యార్థులకు సైన్స్ విజ్ఞానం చేరువచేసి ఏడున్నర పదుల వయసులోనూ అహరహం శ్రమిస్తున్న మానస్ బిహారీ వర్మ చూపుతున్న దారీ మహోన్నతమైనదే. ముమ్మరిస్తున్న జనాభాకు సరిపడా వైద్య సౌకర్యాలు కొరవడి ఏటా లక్షలమంది అసువులు బాస్తున్న దుస్థితి దేశవ్యాప్తంగా నెలకొంది. కటిక పేదరికాన్ని ఎదిరించి పదిమందికీ సంస్కారిగా పశ్చిమ బెంగాల్‌లో మానవతా వైద్యశాలను నెలకొల్పిన సుభాషిణి మిస్త్రీ- మౌలిక ఆరోగ్య సంక్షోభాన్ని ఛేదించడానికి సంకల్పాన్ని మించిన ఖడ్గం మరేదీ లేదంటున్నారు. పొట్టకూటి కోసం వ్యవసాయ కూలీగా ప్రయాణం మొదలుపెట్టి ఏడు దశాబ్దాల్లో 15వేల మందికిపైగా సహజ కాన్పులు చేసిన 97ఏళ్ల సూలగిట్టి నరసమ్మ, యోగ జ్ఞానం ద్వారా జీవన ఆరోగ్యాన్ని ప్రపంచవ్యాప్తం చేసిన 98 ఏళ్ల యోగిని నానమ్మల్; గిరిజనుల బాగు కోసం జీవితాన్ని ధారపోస్తున్న రాణి, అభయ్ బంగ్ దంపతులు ఆరోగ్య రంగంలో నిశ్శబ్ద విప్లవాన్నే సృష్టించారు. దేవదాసీలు, దళిత మహిళల సాధికారతను లక్ష్యించి మూడు దశాబ్దాలుగా ప్రాణం పెట్టి పని చేస్తున్న సితావా జోడటి, జీవారణ్యమే జీవన వేదమై అరవయ్యేళ్లుగా వన్యప్రాణి సంరక్షణకు పాటుపడుతున్న రోములస్ విటేకర్ వంటి సామాజిక సేనాధిపతులు రేపటి తరానికి మార్గదర్శులు!

జాతి జీవన పథాన్ని భారతీయ విలువలతో జేగీయమానం చేస్తున్న మానవతా మూర్తులు వారు. ఎలాంటి గుర్తింపు, మన్నన, పురస్కారాలకోసం ఎదురుచూడకుండా సమాజంపట్ల మానవీయ బాధ్యతను నిర్వర్తిస్తున్న ఈ ఉద్యమశీలుర సేవానిరతి దేశానికి కొత్త చూపు ప్రసాదించాలి. రాజ్యాంగంలోని నాలుగో భాగం పొందుపరచిన ఆదేశిక సూత్రాలే దేశ సామాజిక, ఆర్థిక వికాస సాధనలో వ్యక్తి బాధ్యతను బలంగా ఉద్బోధిస్తోంది. ప్రభుత్వాల స్థాయిలో విస్తృతంగా సాగాల్సిన సంక్షేమ కార్యక్రమాలను ఎన్నో వ్యవస్థలు పరిధి దాటి చెంది ముందుకు నడిపిస్తున్న ఈ మహోన్నత క్రతువు స్ఫూర్తిదాయకం. మనిషితనానికి నిలువెత్తు రూపాలై వృద్ధార్తజీవులకు ఆపద్బాంధవులుగా సామాన్యులకు చేరువైన 'పద్మాసనుల' జీవన సరళి- ప్రజలకు దూరంగా పాలన సాగిస్తూ నేటికీ 'దొరతనం' చాటుతున్న అధికారగణాలకు కనువిప్పు కావాలి. చుట్టూ ఉన్న అవ్యవస్థపై అలుపెరగక సమరం సాగిస్తున్న ఈ సంస్కర్తల తెగువనుంచి ప్రభుత్వాలు తగిన జవసత్వాలు అందిపుచ్చుకోవాలి. జీవితపు క్షణక్షణాన్నీ సామాజిక వికాసం కోసమే ఖర్చుచేసిన ఈ మట్టిమనుషులు జాతి నలుచెరగులా మానవతా పద్మాన్ని వేయి రేకులతో వికసింపజేస్తున్నారనడంలో మరో మాట లేదు. ప్రజాజీవనంతో ముడివడిన అన్ని రంగాల్లోనూ అర్థవంతమైన ముద్రవేసి ముందుకు సాగుతున్న నిస్వార్థ కథానాయకులకు పురస్కారాల పూమాల వేయడమంటే- జాతి తనను తాను గౌరవించుకొన్నట్లు!

ముదిరే వ్యాధి... నిరోధకత ఏదీ?



డాక్టర్ కల్లూరు శివారెడ్డి

అమెరికాలో పదేళ్ల క్రితం పుట్టిన ఆర్థిక సంక్షోభం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని ప్రభావితం చేసింది. అప్పట్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కలిగిన నష్టం దాదాపు 15 లక్షల కోట్ల డాలర్లని (దాదాపు రూ.950 లక్షల కోట్లు) అంచనా! ప్రపంచ జీడీపీ వృద్ధిరేటు 2007-08, 2008-09 కాలంలో -3.6 శాతానికి పడిపోయింది. అభివృద్ధి చెందిన దేశాల్లో 3.0 శాతం, వర్ధమాన దేశాల్లో 0.25 శాతం మేర నిరుద్యోగం పెరిగింది. మొత్తం 21 కోట్లమంది నిరుద్యోగులుగా మిగిలారు. దాదాపు మూడు కోట్లమంది ఉద్యోగాలు కోల్పోయి రోడ్డుమీద పడ్డారు. ద్రవ్యోల్బణం పెచ్చరిల్లింది. దీనివల్ల చాలా దేశాల్లో ప్రభుత్వ ఆదాయాలు కోసుకుపోయాయి. ద్రవ్యలోటు అమాంతం అధికమైంది. ప్రపంచ విపణులు, ఆర్థిక వ్యవస్థలు ఆ ధాటికి తల్లడిల్లిపోయాయి. ఉన్న ఇల్లు, ఉద్యోగం పోయి ఎన్నో కుటుంబాలు మానసిక క్షోభకు గురయ్యాయి. ఈ ఆర్థిక సంక్షోభ ప్రభావం ప్రధానంగా 2008, 2009లోనే అధికంగా కనిపించింది. సంక్షోభ ప్రభావం రెండు మూడేళ్లకు పరిమితమైతేనే ప్రపంచం ఇన్ని విపత్కర పరిస్థితులు ఎదుర్కొంది. అలాంటిది మరింత తీవ్ర సంక్షోభం ఎదురైతే ప్రపంచ దేశాల స్థితిగతులు ఎలా మారిపోతాయో, దాని దుష్ప్రభావం ఎన్ని దశాబ్దాలపాటు ఉంటుందో తేలిగ్గానే ఊహించుకోవచ్చు! ఆ పెను సంక్షోభం పేరే- యాంటీమైక్రోబయాల్ రెసిస్టెన్స్! వైద్యరంగంలో ఇన్నేళ్లుగా మనుషులను అంటురోగాల బారి నుంచి కాపాడుతున్న యాంటిబయాటిక్ మందులు పని చేయకపోవడమే ముంచుకొస్తున్న ఈ ఉపద్రవం.

ప్రమాదఘంటికలు

ఒకప్పుడు అంటురోగాలు ప్రబలితే ఊళ్లకు ఊళ్లే ఖాళీ అయ్యేవని అనేవారు. 70 ఏళ్ల క్రితం యాంటీబయాటిక్ మందులు కనిపెట్టాక మరణాల సంఖ్య 80 శాతం మేర తగ్గింది. ఇప్పుడు ఆ మందులు తమ ప్రభావం కోల్పోతున్నాయి. దీంతో ఆరోగ్య రంగాన మళ్ళీ రోగానికి మందు లేని రోజులనాటి పరిస్థితులు పునరావృతమవుతాయన్న భయాందోళనలు ప్రబలుతున్నాయి. రోగిపై మందులు సరిగ్గా పనిచేయకపోతే మరణాలు పెరుగుతాయి. కార్మిక సరఫరా తగ్గుతుంది. స్థూల ఉత్పత్తి పతనమవుతుంది. దరిమిలా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు వాటిల్లే నష్టం 2008నాటి మాంద్యం కన్నా అధికంగా ఉంటుందన్న అంచనాలు వినవస్తున్నాయి. అదే నిజమైతే కొన్ని దశాబ్దాలపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు కుదేలైపోతాయి. ప్రపంచంలో పేదరికం తాండవిస్తుంది. ఆర్థిక అసమానతలు పెచ్చరిల్లుతాయి.

జీవరాశులకు సోకే వివిధ వ్యాధులకు పలు రకాల కారణాలుంటాయి. రకరకాల వైరస్‌లు, బ్యాక్టీరియా, సూక్ష్మజీవులు, పరాన్నజీవులు, శిలీంధ్రాలు వాటిలో ముఖ్యమైనవి. రోగాలకు కారణమయ్యే ఈ కారకాలను శరీరంలో నిర్మూలించడానికి మందులు వాడతాం. అందులో ప్రధానమైనవి యాంటీబయాటిక్స్. వాటిని తీసుకోవడంవల్ల జబ్బు నయమవుతుంది. వ్యాధులకు కారణమైన సూక్ష్మజీవులు పరిణామ క్రమంలో మార్పులకు లోనైనప్పుడు అవి పునరుత్తేజితమవుతాయి. మందును ఎదుర్కోగల శక్తిని సముపార్జించుకుంటాయి. చికిత్సకు లొంగని స్థాయికి చేరుకుంటాయి. అనేకమంది మాంసాహారాన్ని భుజిస్తారు. మాంసాహారం కోసం కోళ్ళు, మేకలు, చేపలను పెంచుతారు. అవి త్వరగా పెద్దవై సత్వరం అధిక లాభాలు రావడం కోసం పెంపక కేంద్రాల యజమానులు వాటికి అవసరానికి మించి యాంటీబయాటిక్స్ ఇస్తున్నారు. దానివల్ల ఆయా జీవాల్లోని వైరస్, బాక్టీరియాలకు యాంటీబయాటిక్స్ నిరోధక సామర్థ్యం పెరుగుతుంది. ఆ మాంసాలను తిన్నప్పుడు నిరోధకత పెరిగిన సూక్ష్మజీవులు మానవ శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఆపై మనిషి వ్యాధి బారినపడినప్పుడు మందులు వాడినా లాభం ఉండదు. మందులకు లొంగక సూక్ష్మజీవులు శరీరంలో జీవించి ఉండటం వల్ల రోగి మరణానికి చేరువ అవుతాడు. అప్పుడే పుట్టిన పిల్లల్లో సైతం యాంటీమైక్రోబయాల్ రెసిస్టెన్స్ లక్షణాలు ఉంటాయి!

యాంటీమైక్రోబయాల్ రెసిస్టెన్స్ ఒక సామాజిక విషాదం. మనుషులకైనా, జంతువులకైనా రోగం త్వరగా తగ్గడానికి వైద్యులు విరివిగా డ్రగ్స్ వాడకాన్ని సూచిస్తారు. సరైన మోతాదు విషయాన్ని విస్మరిస్తున్నారు. దానివల్ల దీర్ఘకాలంలో ఇరుగుపొరుగుకు, పరిసరాలకు వాటిల్లే చేటు గురించి పెద్దగా ఆలోచించడం లేదు. ఈ ధోరణే ఇప్పుడు మానవాళి పాలిట పెనుశాపమవుతోంది. యాంటీబయాటిక్స్ దుర్వినియోగం ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెడపోకడే. 50 శాతం మందులను మాత్రమే వైద్యులు సరిగ్గా ఉపయోగిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు స్పష్టీకరిస్తున్నాయి. ఒక్క అమెరికాలోనే ఏటా వైద్యులు పదిహేను కోట్ల యాంటీబయాటిక్స్ మందుచీటీలు రాస్తున్నారు. వాస్తవానికి వాటిలో అయిదు కోట్ల సిఫార్సులు అనవసరమైనవని 'సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్' అధ్యయనం కుండ బద్దలు కొట్టింది. యాంటీబయాటిక్స్ మందులను ఎక్కువగా వాడే దేశాల్లో ఇండియాది ప్రపంచంలో నాలుగో స్థానం. వీటి వాడకం 2,633 టన్నుల నుంచి 2030నాటికి 88 శాతం మేర పెరుగుతుందన్నది 'సైన్స్' పత్రిక అంచనా. చాలా దేశాల్లో డాక్టర్ల సిఫార్సులతో నిమిత్తం లేకుండా ఈ డ్రగ్స్ దొరుకుతున్నాయి. కొన్ని చోట్ల కిరాణా దుకాణాల్లో సైతం వీటిని అమ్ముతున్నారు. మందుల కల్తీ సమస్యను మరింత జటిలం చేస్తోంది.

యాంటీబయాటిక్ మందుల వైఫల్యానికి కారణాలు



ఆరోగ్య రంగంలో సంక్షోభం

రోగానికి మందులు పనిచేయని దుస్థితివల్ల వాటిల్లే నష్టాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై 2017-2050 మధ్యకాలంలో ఎలా ఉండబోతున్నాయన్న దానిపై ప్రపంచ బ్యాంక్ అధ్యయనం జరిపింది. ఈ అధ్యయన నివేదికలోని అంశాలు అన్ని ప్రపంచ దేశాల్నీ కలవరపరుస్తున్నాయి. దీని ప్రకారం యాంటీమైక్రోబయాల్ రెసిస్టెన్స్ ప్రభావం వల్ల 2050 నాటికి ప్రపంచం కనిష్ఠంగా 1.1 శాతం, గరిష్ఠంగా 3.8 శాతం మేర జీడీపీని నష్టపోతుంది. ఆ తగ్గుదల 2030 నుంచి కనబడుతుంది. వార్షిక జీడీపీలో తగ్గుదల కనిష్ఠంగా లక్ష డాలర్ల (రూ.63.38 లక్షల కోట్లు) నుంచి, గరిష్ఠంగా 34 లక్షల డాలర్లు (రూ.215.5 లక్షల కోట్లు) దాటుతుంది! దీని దుష్ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థలపై దశాబ్దాల తరబడి కొనసాగుతుంది. యాంటీమైక్రోబయాల్ రెసిస్టెన్స్ వ్యాప్తిని అదుపులో ఉంచకపోతే అంతర్జాతీయ వాణిజ్యం భారీగా దెబ్బతింటుంది. చికిత్సకు లొంగని వ్యాధుల వల్ల పశుగణ ఉత్పాదకత క్షీణిస్తుంది. వ్యాధుల వ్యాప్తికి సమాంతరంగా ఆరోగ్య సంరక్షణ వ్యయాలు పెరుగుతాయి. కార్మికులు వ్యాధుల బారినపడటంతో వారి పని దినాల సంఖ్య తగ్గుతుంది. ఉత్పాదకత పడిపోతుంది. దానివల్ల మొత్తం స్థూల ఉత్పత్తి కుంటువడుతుంది. పేద కార్మికులపై ఆధారపడిన దేశాలపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అది దేశాలమధ్య ఆర్థిక అసమానతల్ని పెచ్చరిల్లజేస్తుంది. 2050 నాటికి ప్రపంచ వార్షిక ఆరోగ్య సంరక్షణ వ్యయం ఎనిమిది శాతం అధికమవుతుంది. దీనివల్ల 2.80 కోట్ల ప్రజలు పేదరికంలోకి జారిపోనున్నారని అంచనా.



తక్షణ కర్తవ్యం

ప్రపంచ ఆర్థిక వృద్ధిరేటు 2000-2007 మధ్యకాలంలో ఏడాదికి సగటున 3.7 శాతంగా నమోదైంది. ఆర్థిక సంక్షోభ కాలంలో అది 0.1 శాతానికి పడిపోయింది. యాంటీమైక్రోబయాల్ రెసిస్టెన్స్ వల్ల నాటి ఆర్థిక దుస్థితిగతులు ప్రపంచంలో పునరావృతమయ్యే రోజులు పొంచిఉన్నాయి. ఈ ప్రమాదాన్ని గుర్తించిన కొన్ని దేశాలు పోరాటానికి ప్రణాళికలు రూపొందించాయి. వ్యూహరచనలో అన్ని దేశాలను ఒక్క తాటిమీదకు తీసుకురావడానికి ప్రపంచ బ్యాంకు ప్రయత్నిస్తోంది. ఈ సమస్యను ఎదుర్కోవడానికి ఉమ్మడి వ్యూహం అవసరం. ప్రతి దేశం అంతర్జాతీయ సమాజంతో కలిసి నడవాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. అందుకోసం విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి. ఆ వైపు భారత్ ఇప్పుడిప్పుడే అడుగులు వేస్తోంది. నిరుడు ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం 'యాంటీబయాటిక్స్‌ను జాగ్రత్తగా వాడండి' అంటూ 'దిల్లీ డిక్లరేషన్ ఆన్ యాంటీమైక్రోబయాల్ రెసిస్టెన్స్‌'ను ప్రకటించింది. ప్రకటన చేయడానికే పరిమితం కాకుండా అవసరమైన నిధులనూ ప్రభుత్వాలు ప్రత్యేకించాలి. ఈ యుద్ధంలో సానుకూల ఫలితాలు రాబట్టడానికి 'స్వచ్ఛ భారత్' కార్యక్రమం ఎంతో ఉపకరిస్తుంది. భవిష్యత్ తరాల బాగుకోసం మందుల వాడకంలో దుర్వినియోగానికి కళ్లెం వేయాలి. అందుకు కావలసిన యంత్రాంగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. ఈ కార్యక్రమంపై చేసే వ్యయం వల్ల కలిగే ప్రయోజనాలు ఎన్నో రెట్లు అధికంగా ఉంటాయి. యాంటీమైక్రోబయాల్ రెసిస్టెన్స్ మూలాలను పసిగట్టడంలో ప్రభుత్వాల చొరవతోపాటు పౌర సంఘాల చైతన్యమూ ఎంతో అవసరం. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడిని నిజం చేసే దిశగా ప్రతిఒక్కరూ తమవంతు పాత్ర పోషించాలి. అప్పుడే రాబోయే ఉపద్రవాన్ని సమర్థంగా ఎదుర్కోగలం!

(రచయిత- ఆర్థిక రంగ నిపుణులు)

జారుడుమెట్లపై ఉన్నత విద్య



ఆచార్య నందిపాటి సుబ్బారావు

ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం చైనా (దాదాపు 138 కోట్లు). రెండో దేశం భారత్ (132 కోట్లు). అమెరికా జనాభా 32 కోట్లు. కానీ, ఉన్నత విద్యావకాశాల కల్పనలో అమెరికాది మొదటి స్థానం. చైనా, భారత్ తరవాతి స్థానాల్లో ఉన్నాయి. స్థూల దేశీయోత్పత్తిలో ఉన్నతవిద్యకు అమెరికా 5.6 శాతం, చైనా నాలుగు శాతం మేర నిధులు కేటాయిస్తున్నాయి. భారత్ 3.3 శాతమే ప్రత్యేకిస్తోంది. అమెరికా 99 శాతం, చైనా 96 శాతం అక్షరాస్యతతో ముందుండగా, భారత్‌లో అది 73 శాతమే. భారత్‌లో విద్యారంగం సంక్షోభంలో పడి కొట్టుమిట్టాడుతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. దేశంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వాలు తగినన్ని నిధులు కేటాయించకపోవడమే దీనికి ప్రధాన కారణం. కేంద్ర ప్రభుత్వం 2010-11లో ఉన్నత విద్యాప్రణాళిక కేటాయింపుల కింద రూ.6,000 కోట్లు కేటాయించింది. అది 2015-16 నాటికి రూ.3,800 కోట్లకు తగ్గిపోయింది. కేంద్రం నుంచి రాష్ట్రాలకు ఉన్నత విద్య పద్దు కింద నిధుల కేటాయింపులూ పోనుపోను కోసుకుపోతున్నాయి. దాంతో ఉన్నత విద్యాసంస్థల ఉనికికే ప్రమాదం ఏర్పడుతోంది. ఉన్నత విద్యలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య అయిదేళ్ల క్రితంనాటికన్నా 2016-17లో పెరిగిందని అఖిల భారత ఉన్నత విద్య సర్వే (ఏఐఎస్‌హెచ్‌ఈ) తాజా నివేదిక నిగ్గుతేల్చింది. 2012-13లో 3.20 కోట్లమంది ఉన్నత విద్యలో ప్రవేశం పొందగా, ఇప్పుడు వారి సంఖ్య 3.57 కోట్లకు చేరుకుంది. విద్యార్థినుల చేరిక 22.15 శాతం మేర పెరగడం సానుకూల పరిణామం. మరోవైపు ఉన్నత విద్య ప్రైవేటీకరణ వైపు ప్రభుత్వాలు మొగ్గు చూపుతుండటం విద్యావేత్తలను కలవరపాటుకు గురిచేస్తోంది. ఉన్నత విద్య ప్రైవేటీకరణ వల్ల భవిష్యత్తులో పేదవారు పూర్తిగా పెద్ద చదువులకు దూరమైపోయే ముప్పుంది. మనదేశ విద్యావ్యవస్థ ఇతర దేశాలతో పోటీపడాలంటే ఈ రంగంలో తక్షణం తగిన దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

కొరగాని చదువులు

దేశంలోని విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అత్యధికం ప్రైవేటు రంగంలోనే ఉన్నాయి. దీంతో ఉన్నతవిద్య ప్రవేశాల్లో పల్లెలు, పట్టణాల విద్యార్థుల మధ్య చాలా అంతరం కనిపిస్తోంది. పట్టణ విద్యార్థులే ఎక్కువగా ప్రైవేటు విద్యాసంస్థల్లో చేరుతున్నారు. పూర్తిగా వ్యాపార ధోరణితోనే నడుస్తున్న పలు ప్రైవేటు విద్యాసంస్థలు పేదలకు అందుబాటులో లేవు. పట్టాలు ఇచ్చే సంస్థలుగానే అవి మిగిలిపోతున్నాయి. నాణ్యత, నైపుణ్యాలకు ప్రాధాన్యం లేకుండా పోతోంది. ఫలితంగా దేశంలో నిరుద్యోగ సమస్య నానాటికీ తీవ్రరూపం దాలుస్తోంది. తగిన నైపుణ్యాలు కొరవడటం వల్ల దేశంలోని ఉన్నత విద్యావంతులు, ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో అత్యధికులు ఎలాంటి ఉద్యోగానికీ పనికి రాకుండా పోతున్నారు. విద్యార్థులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న పరిణామమిది. కొందరు ఆత్మహత్యలకూ ఒడిగడుతున్నారు. ఈ దుస్థితి నుంచి దేశ విద్యారంగాన్ని బయటపడేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంది. ప్రైవేటు పాత్రను బాగా కుదించి, ప్రభుత్వపరంగా నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి పాలకులు కృషి చేయాలి. ప్రభుత్వ విద్యాసంస్థలను పూర్తిస్థాయిలో ఆధునికీకరించి, అభివృద్ధి పరచాలి. కాలానుగుణ మార్పులతో కూడిన విద్యావిధానాలను ఎప్పటికప్పుడు వేగంగా ప్రవేశపెట్టాలి. అప్పుడే పల్లెలు, పట్టణ విద్యార్థులు అన్నిరంగాల్లో సమానంగా రాణించగలుగుతారు. ఇంజినీరింగ్, ఇతర సాంకేతిక విద్య పాఠ్య ప్రణాళికలో ఏఐసీటీఈ తాజాగా మార్పులు తెచ్చింది. థియరీ కన్నా ప్రాక్టికల్స్‌కు ఇందులో అధిక ప్రాధాన్యం ఇవ్వడం మంచి పరిణామం.



దిద్దుబాట్లు తక్షణావసరం

దేశాభివృద్ధికి దోహదపడేలా విద్యార్థులకు విద్యాలయాలు విజ్ఞానాన్ని అందజేయాలి. పరిశ్రమల మాదిరిగా కాకుండా లాభాపేక్షరహితంగా అవి పనిచేయాలి. బాల్యం నుంచే సామాజిక విలువలను నేర్పాలి. సంస్కారాన్ని అలవరచాలి. దురదృష్టవశాత్తు నేటి విద్యాసంస్థల్లో ఇలాంటి స్పృహే లోపిస్తోంది. అనేక మౌలిక లోపాలతో అవి కునారిల్లుతున్నాయి. బోధన కట్టు తప్పింది. గ్రంథాలయాలు పెద్దగా ఉండవు. ఆధునిక ప్రయోగశాలలు కానరావు. పరిశోధనల ఊసే ఉండదు. హాస్టళ్ల కొరత వెక్కిరిస్తోంది. ఆటలకు చోటులేదు. ఈ లోపాలను అధిగమిస్తూ, నాణ్యమైన విద్య అందజేయడానికి ప్రభుత్వాలు అధికస్థాయిలో నిధులు వెచ్చించాలి.

ఏ దేశమైనా విద్యవల్లే వేగంగా అభివృద్ధి సాధించగలుగుతుంది. అలాంటి విద్యను విద్యార్థులకు అందించడంలో అధ్యాపకులు ముఖ్యపాత్ర పోషిస్తారు. అందువల్ల అధ్యాపకులను అన్ని విధాలా ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యత. పాశ్చాత్య దేశాల్లో అధ్యాపకులకు ఎంతో మన్నన దక్కుతుంది. వారికి ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా ప్రభుత్వాలు అనేక జాగ్రత్తలు తీసుకుంటాయి. మౌలిక సౌకర్యాల కల్పన విషయంలో వేగంగా స్పందిస్తాయి. అందుకే ఆ దేశాల్లో పరిశోధనలు ఊపందుకుంటున్నాయి. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంలో అవి వేగంగా ముందుకు దూసుకెళ్తున్నాయి. చిన్నతనం నుంచే విద్యార్థుల సహజ సామర్థ్యాలను పసిగట్టి ప్రోత్సహించగల పాఠ్యప్రణాళికలను, సమాజ అవసరాలను తీర్చడానికి అనుగుణమైన పాఠ్యాంశాలను అక్కడ తయారు చేస్తారు. ఆయా అంశాల్లో పరిశోధన ప్రధానంగా చదువులను తీర్చిదిద్దుతున్నారు. బోధన, పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తారు. ఈ విషయంలో మన విద్యారంగ ప్రణాళికలు దారితప్పాయి. అందువల్ల దేశ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఉన్నత విద్యలో మార్పులు తీసుకురావాలి. అధ్యాపక వృత్తికి కొత్త వన్నెలద్దాలి. వృత్తి నైపుణ్యాలు, పరిశోధనలపై అభినివేశం గల అర్హులైనవారినే అధ్యాపకులుగా ఎంపిక చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించకపోతే దేశం భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది. దేశంలో తగిన గుర్తింపు లభించని ప్రతిభావంతులైన విద్యావేత్తలు అనేకమంది విదేశాలకు తరలిపోయి, రాణిస్తున్నారు. ఆయా దేశాల అభివృద్ధిలో పాలుపంచుకొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నత విద్యలో సత్వరం సమగ్ర, సమూల సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉరుముతోంది.

వాసి ముఖ్యం

ఉన్నత విద్యలో ప్రధానంగా జాతీయ ప్రయోజనాలకే పెద్దపీట వేయాలి. అన్ని మౌలిక సదుపాయాలతో సమగ్ర విద్యావిధానాలతో పెద్ద విశ్వవిద్యాలయాల స్థాపనకు ప్రణాళికలు రూపొందించాలి. జిల్లాకొక విశ్వవిద్యాలయం స్థాపించడం వల్ల ఆశించిన ప్రయోజనాలు కలగవు. ఇలాంటి చర్యల వల్ల అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న విశ్వవిద్యాలయాలకు ఆర్థికపరంగా నిలదొక్కుకోవడంలో సమస్యలు ఎదురవుతాయి. చిన్న విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య వెయ్యి రెండు వేలకు మించదు. దీనివల్ల ఆయా విద్యార్థులకు విభిన్న ప్రాంతాలు, సంస్కృతులతో అనుబంధాలు సరిగ్గా ఏర్పడవు. కాబట్టి, విస్తృత విద్యాప్రయోజనాలు పూర్తిగా దెబ్బతింటాయి. పరస్పర అవగాహన లోపిస్తుంది. కొత్త కోణాల్లో ఆలోచించే శక్తి విద్యార్థుల్లో తగ్గుతుంది. పరిశోధనల్లో ప్రగతి ఉండదు. ఏ విధంగా చూసినా జాతీయ సమగ్రతకు, సామాజిక విలువల పెంపుదలకు చిన్న విశ్వవిద్యాలయాలు ఉపయోగపడవు. ఉన్నత విద్యాసంస్థలు సరైన, సక్రమ మార్గాల్లో పయనించాలన్నా, విద్యార్థుల్లో మానవ విలువలు నింపాలన్నా విశ్వవిద్యాలయ ఉపకులపతుల నియామకాలను కులం, మతం, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా చేపట్టాల్సి ఉంటుంది. ప్రతిభావంతులైన విద్యావేత్తలనే విశ్వవిద్యాలయాలకు ఉపకులపతులుగా నియమించడం కీలకావసరం. అప్పుడే ఉన్నత విద్యకు తగిన న్యాయం జరుగుతుంది. ఈ తరహా చర్యలే దేశ సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతాయి.

(రచయిత- భూ విజ్ఞానశాస్త్ర ఆచార్యులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం)

భీష్మ ఏకాదశి

భూత, భవిష్యత్తులను మనోనేత్రంతో దర్శించడాన్ని 'దివ్యదృష్టి'గా చెబుతారు. దైవాన్ని దర్శించడాన్నీ ఆ దృష్టిగానే భావించాలి. మనిషిగా దిగివచ్చిన దేవుణ్ని గుర్తించాలంటే, దివ్య చక్షువులు ఉండితీరాలి. మహాభారత కాలంలో మహావిష్ణువే కృష్ణుడిగా దిగివచ్చాడని చాలా కొద్దిమంది గుర్తించారు. వారిలో భీష్ముడు అగ్రగణ్యుడు. కృష్ణుణ్ని ఆయన నారాయణుడిగానే సంభావించాడు. అదొక యోగ ఫలం.

ఏ యోగ సాధన ఏ ఫలితమిస్తుందో పతంజలి మహర్షి 'యోగ సూత్రాలు' వివరించాయి. వాటి ప్రకారం, బ్రహ్మచర్యం వల్ల 'దివ్యత్వం' లభిస్తుంది. బ్రహ్మచర్య నిశిత వైభవానికి నికార్సయిన ఉదాహరణ భీష్మాచార్యుడు. మహాకవి జాషువా చెప్పినట్లు, ఆయన మూడు తరాలకు తాత! అవసానదశలోనూ భీష్ముడి నుంచి వ్యక్తమైన అవక్ర విక్రమ పరాక్రమానికి, విష్ణు సహస్రాన్ని వెల్లడించే స్థాయి మానసిక ధృతికి, దృఢత్వానికి- ఆయన త్రికరణ శుద్ధిగా పాటించిన బ్రహ్మచర్య వ్రతమే కారణమంటారు. భీష్ముడి వల్ల బ్రహ్మచర్యం ఒక అద్భుత నియమంగా లోకంలో గుర్తింపు పొందింది. మహాభారతంలోని భీష్మపర్వం నిజానికి వీరనాయక పర్వం! భీష్ముడు కర్మవీరుడు. ప్రతిజ్ఞ కారణంగా ఆయనను భీష్ముడన్నారు గాని- ప్రతాపం, శత్రుసంహార తీక్షణత, క్షత్రియ ధర్మనిర్వహణ పారీణత, ధర్మనిబద్ధత... అన్నీ భీష్మమే!

ఆయన తన జీవితకాలంలో ఇద్దరు అవతార పురుషులతో నేరుగా తలపడాల్సి వచ్చింది. అంబకు ఆశ్రయమిచ్చిన తన అస్త్రవిద్యా గురువు పరశురాముణ్ని భీష్ముడు యుద్ధంలో పరాజితుణ్ని చేశాడు. గురువు కాబట్టి 'ఓడించాడు' అనకుండా 'మెప్పించాడు' అనడం సమంజసం. అదీ భీష్మ హృదయం! శ్రీకృష్ణుడి విషయంలోనూ అదే జరిగింది. ఆయుధం పట్టనన్న ఆయనతో చక్రాయుధం పట్టించాడు భీష్ముడు. 'భక్తుడి చేతిలో ఓడిపోవడాన్ని భగవంతుడు ఇష్టపడతాడు' అని లోకానికి నిరూపించాడు. 'నాకోసం నీ శపథాన్ని సైతం విడిచిపెట్టావా మహానుభావా!' అని కన్నీటి పర్యంతమయ్యాడు. అదే మరొకరు అయితే 'ముందేం చెప్పావు, ఇప్పుడు ఏం చేస్తున్నావు' అని శ్రీకృష్ణుణ్ని నిలదీసేవాడు.



'కృష్ణుడు మాట తప్పాడు కనుక - నా చేతిలో ఓడిపోయినట్లే, ఆయన చేత ఆయుధం పట్టించాను' అని సంబరపడేవాడు.

భీష్ముడు మేరునగ ధీరోదాత్తుడు. అసమాన స్థిరచిత్తుడు. 'నీ చేతిలో మరణం కన్నా ఈ జీవితానికి ధన్యత ఏముంది' అని కృష్ణుడితో అన్నాడు. 'సందేహించవద్దు. చక్రం విడిచిపెట్టు' అని ప్రాధేయపడ్డాడు. అదీ స్థితప్రజ్ఞత అంటే! పరాక్రమంతో పరశురాముడిపై, భక్తితో కృష్ణుడిపై పైచేయి సాధించిన భీష్ముడు- దాన్ని ఎన్నడూ ప్రకటించకపోవడం గమనిస్తే, మానవుడు ఎక్కడ తగ్గాలో అర్థమవుతుంది. ఏది నిజమైన గెలుపో తెలుస్తుంది. భక్తి వల్ల భావోద్వేగాలు నెమ్మదించిన సన్నివేశమది. పరాక్రమం అనే మాటను తిరిగి నిర్వచించిన ఘట్టం అది.

'కృష్ణుడి అసలు రూపం మీకు తెలియదు. ఆయన తోడుగా ఉన్నంతకాలం పాండవుల్ని జయించడం అసాధ్యం' అని కౌరవులకు భీష్ముడు ఎంతగానో చెప్పిచూశాడు. ఆ హితబోధను పెడచెవిన పెట్టిన సుయోధనుడు, భీష్ముడి పట్ల పరుషంగా ప్రవర్తించాడు. ఆయన తన క్రోధాన్ని యుద్ధరంగంలో ప్రదర్శించాడు. ఒక దశలో కృష్ణుడే భీష్మసంహారానికి సిద్ధమైనా, నిగ్రహించుకొన్నాడు. ధర్మజుడికి దిక్కుతోచలేదు. సరాసరి వెళ్లి 'త్రిశూలాన్ని దాచి, మూడో కంటిని మూసి, యుద్ధానికి దిగిన రుద్రుడిలా ఉన్నావు. తాతా! నిన్నెలా జయించాలి' అని అడిగాడు. తనను పడగొట్టే మార్గాన్ని నిస్సంకోచంగా వివరించాడాయన.

ప్రపంచ సాహిత్యంలో భీష్ముడి వంటి కర్మయోధులు, త్యాగమూర్తులు అరుదుగా తటస్థపడతారు. భరతముని ప్రతిపాదించిన దానవీరం, దయావీరం, యుద్ధవీరంతోపాటు విద్యానాథుడు అనే లాక్షణికుడు చెప్పిన ధర్మవీరాన్నీ ఆ యోద్ధ జీవితంలో గ్రహించవచ్చు. ఆ వీరత్వాలతోనే భీష్ముడు తన గురువును, ఇష్టదైవాన్నీ మెప్పించగలిగాడు. భారత వీరులందరితోనూ పూజలందుకొన్న ఉదాత్త వ్యక్తిత్వం భీష్మ పితామహుడిది. భారతానికి, భరతావనికి ఆయన గర్వకారణం!

– వై.శ్రీలక్ష్మి

యాసంగిలో చివరి ఆయకట్టుకూ సాగునీరు

నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు

ఈనాడు, హైదరాబాద్: శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ), నాగార్జునసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల పరిధిలో రబీ పంటలకు సాగునీటి సరఫరాను క్రమబద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలని నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన సమీక్షలో మూడు ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. కాలువల వెంట సీఈలు, ఎస్ఈలు ఇతర సిబ్బంది నిరంతరం పర్యటించాలని, సాగునీటి తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని, కలెక్టర్ల సహకారం తీసుకోవాలని కోరారు. సాగునీటి క్రమబద్ధీకరణ వ్యవహారంలో లోటుపాట్లు జరిగితే ఈఈలదే బాధ్యతని, చర్యలు తప్పవని అన్నారు. ఎస్సారెస్పీ-ఎల్ఎండీ ఎగువ ప్రాంతంలో 4.07 లక్షల ఎకరాలు, దిగువ భాగాన 1.52 లక్షల ఎకరాలు, నాగార్జునసాగర్ కింద 5.25 లక్షల ఎకరాలు, నిజాంసాగర్ కింద 1.51 లక్షల ఎకరాలకు యాసంగిలో పూర్తి స్థాయిలో సాగునీరు అందించేందుకు దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ప్రధాన కాలువలకు వారబందీ పద్ధతిలో నీటిని విడుదల చేస్తున్నందున చివరి ఆయకట్టు రైతులకు నీరందించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. సమావేశంలో ఈఎన్‌సీ మురళీధరరావు, సీఈలు శంకర్, సునీల్, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వేకు 'సంక్రాంతి'

ప్రత్యేక రైళ్లు, బోగీలతో అదనపు ఆదాయం

ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతి పండగకు వెళ్లి వచ్చిన వారే కాదు. . దక్షిణ మధ్య రైల్వే కూడా అంతే వేడుక చేసుకుంది. ప్రత్యేక రైళ్లు వేసి, అదనపు బోగీలు జోడించి, సువిధ పేరిట విమాన టిక్కెట్ల మాదిరి(టిక్కెట్లు అయిపోతున్నకొద్దీ ఎక్కువధరకు అమ్ముకునే విధానం) టిక్కెట్లను విక్రయించి పండగల వేళ ఆదాయాన్ని సమకూర్చుకుంది. శబరిమలకి ప్రత్యేక రైళ్లలో అయ్యప్పస్వాములను తీసుకెళ్లి అదనపు ఆదాయాన్ని మూటకట్టుకుంది. సంక్రాంతి నేపథ్యంలో ప్రతి రోజూ వెళ్లే రైళ్లకు అదనంగా విశాఖ, కాకినాడ మార్గంలో 35 ప్రత్యేక రైళ్లను నడిపి 31 వేల మంది ప్రయాణికులను తీసుకెళ్లి రూ.2.9 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకుంది. జనవరి 9 నుంచి 18 వరకూ ఈ ప్రత్యేక రైళ్లను నడిపింది. శబరిమలకి డిసెంబరు, జనవరి నెలల్లో 69 అదనపు రైళ్ల ద్వారా 79,597 మంది ప్రయాణికులను తీసుకెళ్లి రూ.5.20 కోట్ల రూపాయల ఆదాయాన్ని సముపార్జించింది. జనవరి 9 నుంచి 18వ తేదీ వరకూ ప్రత్యేక రైళ్లతోపాటు ఉన్న రైళ్లకు 87 బోగీలను జోడించి 4,395 మంది ప్రయాణికులను తీసుకెళ్లింది. ఇలా రూ.24.50 లక్షలను ఆర్జించింది. ఇదే సమయంలో జనసాధారణ రైళ్ల ద్వారా 56 వేల మంది ప్రయాణించారు. ఇక ప్లాట్‌ఫారం టిక్కెట్ ధర రూ.10 నుంచి 20 చేయడంతో కూడా రైల్వేకు ఆదాయం లభించింది. అయితే ఇవి నగరంలోని సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్లకే పరిమితం కావడంతో ఈ ఆదాయం రూ.10 లక్షల వరకూ ఉండొచ్చని రైల్వే వర్గాల అంచనా.

ఆరెస్సెస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా దత్తాత్రేయ హోసబలే!

మార్చిలో ఎన్నికయ్యే అవకాశం



ఈనాడు, దిల్లీ: రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్(ఆరెస్సెస్) ద్వితీయ స్థాయి నాయకత్వంలో మార్పులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా గత మూడు దఫా లుగా ఎన్నికవుతూ వస్తున్న సురేష్ భయ్యాజీ జోషి పదవీ కాలం ఈ ఏడాది మార్చిలో ముగియనుంది. సంస్థ అధినేత మోహన్ భగవత్ తర్వాత జాతీయ ప్రధాన కార్యదర్శికే ఎక్కువ అధికారాలు ఉంటాయి. సంస్థ దైనందిన వ్యవహారాలన్నిటినీ పర్యవేక్షించేది జాతీయ ప్రధాన కార్యదర్శే. సంఘ్ అత్యున్నత నిర్ణయాక విభాగమైన అఖిలభారత ప్రతినిధి సభ (ఏబీపీఎస్) మార్చిలో సమావేశంకానుంది. మూడేళ్లకోసారి జరిగే ఈ భేటీలో తదుపరి జాతీయ ప్రధాన కార్యదర్శిని సభ నిర్ణయిస్తుంటుంది. ప్రస్తుతం సంయుక్త ప్రధాన కార్యదర్శులుగా ఉన్న ముగ్గురిలో దత్తాత్రేయ హోసబలే ఈ పదవికి ఎన్నికయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయని తెలుస్తోంది. మిగిలిన ఇద్దరు... సురేశ్ సోని, కిషన్ గోపాల్‌లతో పోల్చినప్పుడు హోసబలేకు ప్రధాని మోదీ, భాజపా అధ్యక్షుడు అమిత్ షాతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని సమాచారం. ఆరెస్సెస్‌కు, ప్రభుత్వానికి మధ్య సమన్వయాన్ని కొనసాగించటంలో దత్తాత్రేయ హోసబలే సరైన వ్యక్తి అని, ఆయనకే సంస్థలో ద్వితీయ అత్యున్నత స్థానం లభించవచ్చని సంఘ్ పరివార్ వర్గాలు భావిస్తున్నాయి.

రుతుక్రమాన్ని అస్తవ్యస్తం చేసే వాయు కాలుష్యం!

బోస్టన్ వర్సిటీ పరిశోధకుల వెల్లడి

బోస్టన్: వాయుకాలుష్యం స్త్రీలలో రుతుక్రమంపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని తాజా అధ్యయనం పేర్కొంది. యవ్వనప్రాయంలోని ఆడపిల్లల రుతుచక్రం అస్తవ్యస్తంగా మారడానికి కారణమౌతుంది. వాస్తవానికి వాయుకాలుష్యం స్త్రీలలో వంధ్యత్వానికి కారణమౌతుంది. పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్‌కు కూడా మూలకారణం వాయుకాలుష్యమేనని ఆ అధ్యయనం వెల్లడించింది. ఇప్పటిదాకా కూడా గుండె, ఊపిరితిత్తుల సంబంధ వ్యాధులకు వాయుకాలుష్యమే ప్రధాన కారణమౌతూ వచ్చింది. తాజా అధ్యయనం ప్రకారం ఆడపిల్లల సక్రమ రుతుక్రమానికి....సంతానసాఫల్యతకు కూడా వాయుకాలుష్యం శాపంగా తయారైనట్లు రుజువైంది. హార్మోన్ల సమతుల్యంపై రుతుక్రమం స్పందనలు ఆధారపడి ఉంటాయి. అయితే, ఇప్పటి దాకా కూడా వాయుకాలుష్యం అనేది కూడా రుతుక్రమం స్పందనలను తీవ్రంగా దెబ్బతీస్తుందనే విషయం వెలుగు చూడలేదని బోస్టన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన శృతి మహాలింగయ్య తెలిపారు. తమ అధ్యయనంలో ఈ కోణం వెలుగుచూసిందని చెప్పారు.

'ఇస్రో' బ్యాటరీ సాంకేతికతను ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తికి వాడాలి

కేంద్రానికి కార్యదర్శుల కమిటీ సూచన

దిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అభివృద్ధి చేసిన లిథియం-అయాన్ బ్యాటరీ సాంకేతికతను.. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి కోసం వినియోగంలోకి తేవాలని కేబినెట్ కార్యదర్శి పీకే సిన్హా నేతృత్వంలోని కార్యదర్శుల కమిటీ కేంద్రానికి సూచించింది. 'భారత్‌లో తయారీ' కింద వాణిజ్యపరంగా దీన్ని ఉపయోగించుకోవాలని పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలు సమాచారాన్ని వెల్లడించాయి. చమురు దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరాన్ని దేశానికి తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచే వ్యూహాలకు కమిటీ పదును పెట్టినట్లు పేర్కొన్నాయి. ఆసక్తి ఉన్న వర్గాలకు.. భారత్‌లోనే తయారీ చేపట్టాలన్న షరతు మీద ఇస్రో సాంకేతికతను బదిలీ చేయొచ్చని కమిటీ వెల్లడించినట్లు తెలిపాయి. ప్రస్తుతం భారత్‌లో వాణిజ్యపరంగా లిథియం-అయాన్ బ్యాటరీల ఉత్పత్తి జరగట్లేదు. జపాన్, చైనా నుంచే వీటిని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఇటు ముడిచమురు దిగుమతుల కోసం చేస్తున్న రూ.7లక్షల కోట్ల వార్షిక వ్యయం, కాలుష్యాన్ని తగ్గించేందుకు.. ప్రత్యామ్నాయ ఇంధనాలతో నడిచే వాహనాల అవసరంపై కేంద్రం దృష్టి సారించింది.



గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం కర్ణాటకలోని మంగళూరు సమీప ఆళ్వాస్ విద్యా సంస్థ మైదానంలో శుక్రవారం 30 వేల మందికిపైగా విద్యార్థులు ఆవిష్కరించిన ప్రదర్శన ఆకట్టుకుంది. త్రివర్ణ పతాకాలు చేతపట్టి చేసిన విన్యాసం చూపరులను అబ్బురపరిచింది.

- న్యూస్‌టుడే, మంగళూరు

సాగు బాగలేకే సంక్షోభాలు

- ప్రభుత్వాలు సబ్సిడీలు, సహకారం అందించాలి
- వైద్యం అందరికీ సమాన హక్కుగా ఉండాలి
- హైదరాబాద్ సాహితీ సంబరాల్లో ప్రముఖులు

ఈనాడు - హైదరాబాద్



హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ప్రారంభసభలో కన్నడ సాహితీవేత్తల వేషధారణలో వచ్చిన చిన్నారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ సింగ్, పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం తదితరులు

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సంక్షోభం, వ్యవసాయాన్ని గిట్టుబాటుగా మార్చడంలో ప్రభుత్వాల వైఫల్యాలతో ఉన్నత వర్గాలైన పటేళ్లు, జాట్‌లు, మరాఠాలు ప్రభుత్వ ఉద్యోగాలు, రిజర్వేషన్లు కోరుతున్నారని జేఎన్‌యూ ప్రొఫెసర్ హిమాన్షు అన్నారు. వ్యవసాయ వృద్ధితో వ్యవసాయేతర ఉద్యోగాలు సాధ్యమన్న కనీస విషయాన్ని మరిచిపోయి ఈ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని పేర్కొన్నారు. రుణమాఫీ, కనీస మద్దతు ధరలు కల్పించడంతో సమస్యలు తీర్చలేమని, విదేశాల్లో మాదిరి వ్యవసాయానికి ప్రభుత్వ సహాయం, సబ్సిడీలు పెంచాలన్నారు. హైదరాబాద్ సాహితీ సంబరాల్లో భాగంగా గ్రామీణ భారత పరిస్థితి అంశంపై జరిగిన సదస్సులో సీనియర్ జర్నలిస్టు, స్క్రోల్ ఎడిటర్ సి.రామ్‌మనోహర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయం ఎంతగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయో.. గుజరాత్ ఎన్నికల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య విభజనతో స్పష్టమైందన్నారు. ఒకప్పుడు భూమిని గొప్పగా ఉన్నతస్థితికి గౌరవంగా చూసుకున్న వారంతా ఇప్పుడు సర్కారీ ఉద్యోగాలు కోరడానికి కారణాలను గుర్తించాలని సూచించారు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ఇతర రంగాల వైపు వెళ్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2004లో స్వతహాగా, వాతావరణ పరిస్థితులు అనుకూలించక వ్యవసాయం నుంచి కొందరు రైతులు దూరమయ్యారని, పెట్టుబడులు వెనక్కు రాకపోవడంతో ఇప్పుడు వ్యవసాయమే వద్దంటున్న పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. వ్యవసాయం చేసేందుకు యువత ముందుకు వచ్చే పరిస్థితులు లేవన్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయి సబ్సిడీలు ఇచ్చి, సహాయ సహకారాలు అందిస్తే వ్యవసాయం గిట్టుబాటుతో పాటు గ్రామీణ ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందన్నారు.

ఎన్నికల నిర్వహణ వ్యవస్థ కీలకం

ఎన్నికల నిర్వహణ వ్యవస్థ పటిష్ఠంగా లేకుంటే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించలేమని ఆధునిక భారత చరిత్ర పరిశోధకురాలు ఓర్నిత్ షానీ తెలిపారు. ఎన్నికల్లో దేశ ప్రజలందరినీ భాగస్వామ్యం చేసేలా భారతదేశం అప్రమత్తంగా వ్యవహరించిందన్నారు. ఓటు హక్కు ఉంటేనే భారతీయుడిగా గుర్తింపు లభిస్తుందన్న ఆలోచన ప్రజల్లో బలంగా నాటుకుపోవడంతో అప్పట్లో అర్హులైన వారందరినీ ఓటర్లుగా గుర్తించేందుకు వీలైందని తెలిపారు. కొన్ని దేశాల్లో నాయకులు, అధికార వ్యవస్థ బలహీనంగా మారడంతో ఇబ్బందులు వస్తున్నాయని, దీనికి ప్రస్తుత పాకిస్థాన్ ఉదాహరణగా పేర్కొన్నారు. 'భారతదేశం గణతంత్రంగా మార్పు' అంశంపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ అపర్నా రాయప్రోలుతో కలిసి మాట్లాడారు. దేశవిభజన సందర్భంగా భారత్‌కు వలసవచ్చిన వారికి ఓటు హక్కు ఏవిధంగా కల్పించాలన్న విషయమై వారికి విధించిన షరతులు ఎలాంటి ప్రభావం చూపాయో వివరించారు.

కండోమ్ ప్రకటనలు ఆరోగ్యానికి సంబంధించినవి

కండోమ్‌లు హెచ్ఐవీ నుంచి ప్రాణాలను కాపాడే వస్తువులని, వాటి గురించి వివరించే ప్రకటనలను వైద్య కార్యక్రమాలుగా పరిగణించాలని వైద్యఆరోగ్య శాఖ విశ్రాంత కార్యదర్శి సుజాతారావు తెలిపారు. వైద్య రంగంలోకి ప్రైవేటు పెట్టుబడులను అనుమతించకూడదని, వైద్య రంగంలో ప్రైవేటు లాబీయింగ్ చాలా బలంగా ఉందని వ్యాఖ్యానించారు. ప్రజలకు వైద్యంపై చేసే ఖర్చును ప్రభుత్వాలు ఆర్థిక భారంగా పరిగణించకూడదన్నారు. 'భారతీయ ఆరోగ్య వ్యవస్థ'పై సదస్సులో ప్రొఫెసర్ అనిన్‌దిత మజుందార్, అమితా దండతో కలిసి మాట్లాడారు. వైద్య రంగంపై జీడీపీలో కనీసం ఒకశాతం కూడా ఖర్చుకావడం లేదని పేర్కొన్నారు. వైద్యసేవలు పొందేందుకు పేదరికం ఎవరికీ అడ్డు కాకూడదని, వైద్యం అందరికీ సమాన హక్కుగా ఉండాలన్నారు. సరోగసీ, ఐవీఎఫ్ వైద్యశాలలపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని ఐఐటీ హెచ్ ప్రొఫెసర్ అనిన్‌దిత మజుందార్ పేర్కొన్నారు. పిల్లలు పుట్టిన తరువాత ఎదురయ్యే నైతిక, ఆరోగ్య సమస్యలను పట్టించుకోవడం లేదని తెలిపారు.

సాహితీ ఉత్సవాలకు హైదరాబాద్ శాశ్వత వేదిక

ఈనాడు, హైదరాబాద్: భిన్న సంస్కృతులు, సంప్రదాయాల సమ్మేళనమైన హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయంగా ప్రత్యేక గుర్తింపు ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ అన్నారు. బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో మూడురోజుల పాటు జరిగే హైదరాబాద్ సాహితీ ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్.పి.సింగ్ మాట్లాడుతూ దేశ, విదేశాల నుంచి వచ్చిన సాహితీవేత్తలు తమ ఆలోచనలు పంచుకునేందుకు సాహిత్యంలో వస్తున్న మార్పులను చర్చించేందుకు ఇది గొప్ప వేదికగా అభివర్ణించారు. ఈ ఉత్సవానికి హైదరాబాద్ శాశ్వత వేదిక కావాలని ఆకాంక్షించారు. పర్యాటక శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి బి.వెంకటేశం స్పెయిన్, కన్నడ భాషల్లో ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. ప్రముఖ చిత్రకారిణి సోనల్‌మాన్‌సింగ్ మాట్లాడుతూ ప్రతీ కళ సమాజ ఉన్నతికి తోడ్పడాలని సూచించారు. భాషలను చేరువ చేసేందుకు మరింతగా అనువాదం జరగాలన్నారు. తాను అండమాన్, లక్షద్వీప్ సహా దేశమంతా 50-60 సార్లు చుట్టివచ్చానని, 90 దేశాలు పర్యటించానని చెప్పారు. స్పెయిన్ ఎంబసీ ప్రతినిధి ఇగ్నాసియో విటోరికా హమిల్టన్, డిప్యూటీ హెడ్ ఆఫ్ మిషన్ ఎడ్వర్డ్‌సాంచెజ్ మొరానో, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నడ సాహిత్యంలో విశేషసేవలందించి జ్ఞానపీఠ అవార్డు అందుకున్న సాహితీవేత్తల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

- తెలంగాణ సీఎస్ ఎస్.పి.సింగ్ అభిలాష

డాలరు శేషాద్రికి రమణదీక్షితులు లీగల్ నోటీసులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయ ఓఎస్డీ డాలరు శేషాద్రికి ఇదే మందిరం ప్రధాన అర్చకులు ఎ.వి.రమణ దీక్షితులు లీగల్ నోటీసు జారీ చేశారు. తనకు పరువు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ అభియోగాల్లో పేర్కొన్నారు. డాలర్ శేషాద్రి ఇటీవల ఓ ఛానల్‌తో ముఖాముఖిలో మాట్లాడిన సందర్భంగా తనపై వినియోగించిన పదజాలం పరువుకు భంగం కలిగించేలా ఉన్నట్లు నోటీసులో రమణ దీక్షితులు పేర్కొన్నారు. తాను రమణ దీక్షితుల పరువుకు భంగం కలిగేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, అడిగిన ప్రశ్నలకు సావధానంగా సమాధానం ఇచ్చానని డాలరు శేషాద్రి చెబుతున్నారు. ఆలయంలో రెండు వర్గాలుగా విడిపోయి ఆధిపత్యం కోసం తరచూ అంతర్గతంగా పోరు కొనసాగుతోంది. తాజాగా లీగల్ నోటీసు తిరుమలలో చర్చనీయాంశమైంది.

రెస్టారెంట్లలో అగ్ని ప్రమాదాల నివారణకు

భద్రతా నిబంధనలను గట్టిగా పాటించాలి

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: ప్రజా భద్రత విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడరాదని, ప్రజల భద్రతే అత్యున్నత చట్టమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఉపహార్ తరహా అగ్నిప్రమాదం, ఇటీవల ముంబయి పబ్‌లో జరిగిన అగ్నిప్రమాదం లాంటివి పునరావృతం కాకుండా హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అగ్ని ప్రమాద నివారణ నిబంధనలు గట్టిగా అమలయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించింది. సంగీత విభావరి, క్యాబరే నృత్యం, డిస్కోథెక్‌ల నిర్వహణకు రెస్టారెంట్ యాజమాన్యాలు ముందస్తు అనుమతి తీసుకోవడాన్ని తప్పనిసరి చేస్తూ కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. అగ్ని ప్రమాద నివారణకు నిర్దేశించిన జాగ్రత్తలు తీసుకుంటేనే రెస్టారెంట్ల యజమానులకు సంబంధిత అనుమతులు వస్తాయని చట్టం చెబుతోంది. అనైతిక, అసభ్య ప్రదర్శనలకు అనుమతి ఉండదని కూడా స్పష్టం చేస్తోంది. ప్రభుత్వం అసమంజస షరతులు విధిస్తోందని, ఇది తమ వ్యాపారంపై ప్రభావం చూపిస్తోందని రెస్టారెంట్లు అభ్యంతరం వ్యక్తం చేశాయి. న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.కె.అగర్వాల్, జస్టిస్ ఎ.ఎం.సప్రెతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ ప్రభుత్వం విధించిన షరతులు సహేతుకమేనని స్పష్టం చేసింది. సంబంధిత చట్టం రాజ్యాంగవిరుద్ధమని, కొట్టివేయాలని పిటిషనర్లు చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చింది.



మృతి చెందిన వాల్యానాయక్ ★ శ్రీశైలం

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతుల మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: పంటను కాపాడే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు రైతులు మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ విషాదకర సంఘటన శనివారం వికారాబాద్ జిల్లాలోని దౌల్తాబాద్ మండలం, ఇండాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇండాపూర్ అనుబంధ గ్రామమైన ఊరగుంట తండాకు చెందిన పత్యానాయక్‌కు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో రెండు ఎకరాల్లో వరి వేశారు. ప్రస్తుతం బోరుబావిలో నీటిమట్టం తక్కువ కావడంతో పంటను కాపాడుకునేందుకు శుక్రవారం ఉదయం కొత్తగా మరో బోరు బావిని వేయించారు. దీన్లో నీరు రావడంతో మోటారు దింపేందుకు పత్యానాయక్, అతడి ఇద్దరు కుమారులు శ్రీశైలం, శ్రీకాంత్, అల్లుడు వాల్యానాయక్ మధ్యాహ్నం బావి వద్దకు వెళ్లారు. బోరుబావిలోకి పైపులు దించే సమయంలో సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు పైపులకు తగలడంతో వారంతా విద్యుదాఘాతానికి గురయ్యారు. వాల్యానాయక్ (35), శ్రీశైలం (22) అక్కడికక్కడే మృతి చెందారు. పత్యానాయక్, శ్రీకాంత్‌లకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే 108 వాహనంలో మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

ఉద్యోగం ఆరోగ్యదాయకం

పక్షవాత బాధితుల్లో కనబడుతున్న ప్రభావం

వాషింగ్టన్: పక్షవాతం నుంచి కోలుకున్నవారి విషయంలో.. 'ఉద్యోగం ఆరోగ్యదాయకం' అని తాజా అధ్యయనం తేల్చింది. పక్షవాతం బారినపడక ముందు, కోలుకున్న తర్వాత ఉద్యోగాలు చేసినవారి మెదడు ఆరోగ్యం.. అలా చేయనివారి కన్నా మెరుగ్గా ఉంటుందని వెల్లడించింది. ఇజ్రాయెల్‌లోని సోరస్కీ మెడికల్ సెంటర్ శాస్త్రవేత్తలు ఈ అధ్యయనం జరిపారు. పక్షవాతం నుంచి కోలుకున్న తొలి రోజుల్లో, ఒకట్రెండు ఏళ్లు గడిచిన తర్వాత బాధితుల ఆరోగ్యం ఎలా ఉంటుందన్నదాన్ని విశ్లేషించారు. దీంతో నిరుద్యోగుల కన్నా ఉద్యోగుల్లో మెదడు ఆరోగ్యం మెరుగ్గా ఉంటున్నట్లు వెల్లడైంది. బాధితుల వృత్తిగత జీవితం, మెదడు ఆరోగ్యం, మేధోసామర్థ్యం.. ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు.

దళితులకు మూడెకరాలేవీ?

- ఈ ఏడాదీ పూర్తికాని 10వేల ఎకరాల లక్ష్యం
- పెరుగుతున్న భూముల ధరలు
- కొనుగోలుకు ఎదురవుతున్న అడ్డంకులు



ఇవీ గణాంకాలు...

ఏడాది	లబ్ధిదారులు	ఎకరాలు	ఖర్చు
2014–15	774	2043.32	రూ.74.92కోట్లు
2015–16	1950	5008.19	రూ.217.71కోట్లు
2016–17	954	2559.08	రూ.115.74కోట్లు
2017–18	967	2367.11	రూ.109.15కోట్లు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని నిరుపేద దళితులకు మూడెకరాల భూపంపిణీలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. గత నాలుగేళ్లలో 4600 మందికి మాత్రమే భూముల పంపిణీ సాధ్యమైంది. దళితులకు 2017-18లో 10వేల ఎకరాలు కొనుగోలు చేసి పంపిణీ చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు ఎస్సీ ఆర్థిక సహకార సంస్థ కార్యాచరణ సిద్ధం చేసింది. ఏయే జిల్లాలో ఎంత మేరకు భూములు కొనుగోలు చేయాలి? ఎంత మందికి పంపిణీ చేయాలన్న విషయమై ప్రణాళికలు వేసింది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికి 2367ఎకరాలను మాత్రమే గుర్తించింది. ఆయా భూముల కొనుగోలు కోసం రూ.109కోట్లు అవసరమని అంచనా వేసింది. కానీ ప్రభుత్వం రూ.89 కోట్లు మాత్రమే విడుదల చేసింది. దీంతో మరో 471 ఎకరాల భూమి కొనుగోలు అపరిష్కృతంగా ఉంది. మరోవైపు కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత భూముల ధరలు అమాంతం పెరిగాయి. ప్రభుత్వం ఒక ఎకరా కొనుగోలుకు గరిష్ఠంగా రూ.7 లక్షలు మాత్రమే చెల్లించనుంది. కొన్ని జిల్లాల్లో ఈ ధరల్లో భూములు అందుబాటులో లేవు. దీంతో ఖమ్మం, కరీంనగర్, కుమురం భీం, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, నాగర్‌కర్నూలు, నిజామాబాద్, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్ రూరల్ జిల్లాల పరిధిలో కనీసం 100 ఎకరాల మార్కు దాటలేదు. కొన్ని జిల్లాల్లో 50 ఎకరాలలోపు మాత్రమే కొనుగోలు చేశారు. భూముల ధరలు ఎక్కువగా ఉండటంతో జగిత్యాల, మహబూబ్‌నగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, వరంగల్ అర్బన్, యాదాద్రి జిల్లాల్లో బోణీ కాలేదు.

నిధుల కొరతతో నిలిచిన గుర్తింపు

జిల్లా స్థాయిలో సంయుక్త కలెక్టర్ల ఆధ్వర్యంలో భూమిలేని నిరుపేద దళితులకు అవసరమైన భూమిని గుర్తించాలి. ఈ మేరకు విక్రయించేందుకు ఆసక్తి కలిగిన రైతుల నుంచి వ్యవసాయ భూములను తీసుకుంటున్నారు. ఒకసారి రైతుతో మాట్లాడి ఒక ధరపై ఒప్పందం కుదిరిన తర్వాత గడువులోగా నగదు మొత్తాన్ని చెల్లించాలి. కానీ జిల్లాల్లో నిధులు అందుబాటులో లేనందున గడువులోగా చెల్లింపులు సాధ్యం కావడం లేదు. అప్పటికే సమీపంలో భూముల ధరలు పెరగడంతో రైతులు ఇచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. మరోవైపు భూముల ధరలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. దీంతో సమీకరణ కష్టమవుతోంది. నిధులు పుష్కలంగా అందుబాటులో ఉంటే సమస్యలు ఉండవని అధికారులు పేర్కొంటున్నారు.

ముంబయిలో పోటాపోటీగా భాజపా, ప్రతిపక్షాల ప్రదర్శనలు

ముంబయి: గణతంత్ర దినోత్సవాన.. అధికార భాజపా, ప్రతిపక్ష పార్టీలు ముంబయిలో పోటాపోటీగా ప్రదర్శనలు నిర్వహించాయి. 'రాజ్యాంగాన్ని కాపాడుకుందాం (సంవిధాన్ బచావో)' పేరిట ప్రతిపక్షాలు ప్రదర్శన చేపట్టగా.. 'రాజ్యాంగాన్ని గౌరవిద్దాం (సంవిధాన్ సమ్మాన్)' పేరుతో భాజపా తిరంగాయాత్ర నిర్వహించింది. ప్రతిపక్షాల ప్రదర్శనలో ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌తో పాటు సీతారాం ఏచూరి (సీపీఎం), శరద్ యాదవ్ (జేడీయూ తిరుగుబాటు నేత), డి.రాజా (సీపీఐ), హార్దిక్ పటేల్ (గుజరాత్ పాటీదార్ నేత), దినేష్ త్రివేదీ (టీఎంసీ), ఒమర్ అబ్దుల్లా (ఎన్సీ) సుశీల్ కుమార్ షిండే (కాంగ్రెస్) తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర సచివాలయం సమీపంలోని ఓవల్ మైదానం నుంచి గేట్‌వే ఆఫ్ ఇండియా వరకు 2 కి.మీ.ల మేర ప్రదర్శన నిర్వహించారు. అనంతరం శరద్ పవార్ మాట్లాడుతూ ఈనెల 29న దిల్లీలో భాజపాకు వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రతిపక్షాలు భేటీ కానున్నట్లు వెల్లడించారు.

భాజపా తిరంగాయాత్ర..: భాజపా నిర్వహించిన తిరంగాయాత్ర అంబేడ్కర్ స్మారక ప్రాంతమైన చైత్యభూమి నుంచి మధ్య ముంబయిలోని కామ్‌గర్ మైదానం వరకు దాదాపు 2.5 కి.మీ.ల మేర సాగింది. అనంతరం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవంద్ర ఫడణవిస్ మాట్లాడుతూ - రాజ్యాంగం పట్ల తాము నిజమైన గౌరవంతో వ్యవహరిస్తుండగా.. ప్రతిపక్షాలు తమ మనుగడ కోసం పోరాడుతున్నాయన్నారు. రాజ్యాంగం పేరిట ప్రతిపక్షాలు నాటకాలాడుతున్నాయని.. వారి వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కుటిలబుద్ధితో ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. ముంబయి భాజపా అధ్యక్షుడు ఆశిష్ షేలార్ తదితరులు పాల్గొన్నారు.



ముంబయిలో ర్యాలీలో పాల్గొన్న శరద్‌పవార్, శరద్‌యాదవ్, రాజా, హార్దిక్ పటేల్ తదితరులు

ఏటా 26 ప్రయోగాలు

- షార్‌లో ఏర్పాట్లు
- సంచాలకుడు కున్హికృష్ణన్ వెల్లడి

శ్రీహరికోట, న్యూస్‌టుడే: సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం-షార్‌లో ఏటా 26 రాకెట్ ప్రయోగాలు నిర్వహించేలా సౌకర్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర సంచాలకుడు పి.కున్హికృష్ణన్ తెలిపారు. 2020 నాటికి ఈ ఏర్పాట్లు పూర్తవుతాయన్నారు. దీంతో కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఏటా 15, రెండో ప్రయోగ వేదిక నుంచి 11 రాకెట్ ప్రయోగాలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆయన షార్‌లో పాత్రికేయులతో మాట్లాడారు. ఇక్కడ నిర్వహించే రాకెట్ ప్రయోగాలకు అవసరమైన ఘన ఇంధనాన్ని తయారు చేసేందుకు రూ.630 కోట్లతో చేపట్టిన సాలిడ్ ప్రొపెల్లెంట్ స్పేస్ బూస్టర్ ప్లాంట్ (స్ప్రాబ్), ఎస్‌పీపీని త్వరలోనే పూర్తి చేస్తామని వివరించారు. రూ.630 కోట్లతో నిర్మిస్తున్న రెండో వాహన అనుసంధాన భవనం (ఎస్‌వీఏబీ) పనులు 90 శాతం మేర పూర్తయ్యాయన్నారు. వచ్చే నెల చివర్లో జీశాట్-6ఏ, చంద్రయాన్-2 ఉపగ్రహాలను ప్రయోగిస్తామని తెలిపారు.

'ఏరియాన్' ప్రయోగం విజయవంతం

కౌరూ: ఐరోపాకు చెందిన ఏరియాన్-5 రాకెట్.. శుక్రవారం విజయవంతంగా రెండు వాణిజ్య ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. చివర్లో రాకెట్‌తో సంబంధాలు తెగిపోవడంతో ఆందోళన నెలకొంది. మొత్తం మీద ప్రయోగం విజయవంతం కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. రెండు ఉపగ్రహాలూ.. నిర్దేశిత కక్ష్యలో ఉన్నాయని ఏరియాన్ స్పేస్ సంస్థ తెలిపింది. ఫ్రెంచ్ గయానాలోని కౌరు అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగం జరిగింది. ఇందులో లక్సెంబర్గ్‌కు చెందిన ఎస్ఈఎస్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన యాహ్‌శాట్ ఉపగ్రహాలు ఉన్నాయి. రాకెట్ చివరి దశ ప్రజ్వలన తర్వాత దానితో సంబంధాలు తెగిపోయాయి. చివరివరకూ సంబంధాల పునరుద్ధరణ జరగలేదు. అయితే అందులోని రెండు ఉపగ్రహాలూ.. రాకెట్ నుంచి వేరయ్యాయని వెల్లడైంది.





శుక్రవారం దిల్లీలో గణతంత్ర దినోత్సవాలను వీక్షించేందుకు భారీగా వచ్చిన జనం ★ పెరేడ్‌లో పదాతి దళాల కవాతు ★ గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో ఆకట్టుకున్న వివిధ రాష్ట్రాల శకటాలు

గణతంత్రం.. శౌర్యమంత్రం

- కనువిందు చేసిన సైనిక కవాతు, విన్యాసాలు
- ముఖ్యఅతిథులుగా పది దేశాల నాయకులు

దిల్లీ

సైనిక పాటవాన్ని, విభిన్న సంస్కృతుల వైభవాన్ని చాటుతూ.. 69వ గణతంత్ర దినోత్సవాన్ని భారత్ కన్నుల పండువగా జరుపుకొంది. ఆసియాన్ దేశాల అగ్ర నాయకుల సమక్షంలో.. శుక్రవారం ఈ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా ఒకేసారి పది దేశాల నాయకులు విచ్చేసిన చారిత్రక ఘట్టం.. ప్రధాన శక్తిగా భారత్ అవతరిస్తున్న తరుణాన్ని ప్రతిబింబించింది. దిల్లీలోని రాజ్‌పథ్‌లో జరిగిన ఈ ఉత్సవాన్ని వీక్షించేందుకు.. ప్రముఖులతోపాటు వేలాది మంది ప్రజలు తరలివచ్చారు.

కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. కాషాయం, ఎరుపు, హరిత వర్ణాలతో ఉన్న తలపాగా ధరించి హాజరయ్యారు. వేడుక ఆరంభమయ్యే ముందు ఇండియా గేట్ వద్ద ఉన్న 'అమర్ జవాన్ జ్యోతి' వద్ద.. దేశరక్షణలో అసువులుబాసిన వీరసైనికులకు ఆయన అంజలి ఘటించారు. రక్షణమంత్రి నిర్మల సీతారామన్, త్రివిధ దళాల అధిపతులూ నివాళులు అర్పించారు.

చరిత్రలో తొలిసారి

దేశ చరిత్రలోనే తొలిసారిగా.. ఈసారి గణతంత్ర దినోత్సవ వేడుకలకు పది దేశాల నాయకులు హాజరయ్యారు. మయన్మార్ స్టేట్ కౌన్సిలర్ ఆంగ్‌సాన్ సూకీ, వియత్నాం ప్రధాని న్గ్యెన్ షువాన్ ఫుక్, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో డటెర్ట్, థాయ్‌లాండ్ ప్రధాని ప్రయుత్ చాన్‌ఓచా, సింగపూర్ ప్రధాని లీ హ్సీన్ లూంగ్, బ్రూనై సుల్తాన్ హాజి హస్సానల్ బొల్కియ్, ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడొడొ, మలేసియా ప్రధాని నజీబ్ రజాక్, లావోస్ ప్రధాని తాంగ్లోన్ సిసౌలిత్, కంబోడియా ప్రధాని హున్‌సెన్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. వీరికి మోదీ సాదర స్వాగతం పలికారు.



భద్రతా వలయం దాటుకుని వచ్చి ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్రపతి

ఆనవాయితీ ప్రకారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గణతంత్ర దినోత్సవ కవాతుకు లెఫ్టినెంట్ జనరల్ అసిత్ మిస్త్రీ నేతృత్వం వహించగా.. త్రివిధ దళాల అధిపతి హోదాలో కోవింద్ వందనం స్వీకరించారు.

కనువిందు చేసిన శకటాలు

ఆసియాన్, ఆసియాన్ సభ్యదేశాల పతాకాలను ప్రదర్శిస్తూ సైనికులు కవాతులో పాల్గొన్నారు. మొత్తం 23 శకటాలు.. చూపరులకు కనువిందు చేశాయి. బౌద్ధం, గాంధీయిజం బోధనలను.. దేశ చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పాయి. విదేశీవ్యవహారాల శాఖ రూపొందించిన రెండు శకటాలు.. ఆసియాన్ దేశాలతో భారత్‌కు ఉన్న మతపరమైన, చారిత్రకమైన సంబంధాలను ప్రతిబింబించాయి. రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతాలకు చెందిన 14 శకటాలు కూడా వీటిలో ఉన్నాయి.

మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమ నేపథ్యంతో ఆకాశవాణి శకటం, 'దేశ భద్రత కోసం యుద్ధ సన్నద్ధత' ఇతివృత్తంతో రూపొందించిన నావికాదళ శకటం ఆకట్టుకున్నాయి. ఆదాయ పన్ను విభాగం శకటం.. నోట్లరద్దు అనంతరం చేపట్టిన నల్లధన వ్యతిరేక చర్యలను ప్రదర్శించింది.

గిరిజన అతిథులు

వేడుకలను వీక్షించేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 61 మంది గిరిజన అతిథుల్ని భారత ప్రభుత్వం ఈసారి ఆహ్వానించింది. సాహస బాలల పురస్కారాలు పొందినవారిలో 15 మంది చిన్నారులు కవాతులో పాల్గొన్నారు. ఇటు బాలల విభాగంలో.. 800 మంది చిన్నారులు జానపద నృత్య ప్రదర్శనలతో అలరించారు. కేంద్ర మంత్రులు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు గులాం నబీ ఆజాద్, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తదితరులు వేడుకకు హాజరైనవారిలో ఉన్నారు.

భద్రత వలయాన్ని దాటుకొని మోదీ..

కవాతు ముగిసిన అనంతరం మోదీ భద్రతా వలయం దాటుకొని వెళ్లి.. ప్రజలకు అభివాదం చేశారు. రాజ్‌పథ్‌లో వీక్షకులకు చేరువగా వెళ్లి ఆయన చేతులు ఊపుతూ ఉండగా.. 'మోదీ మోదీ' అంటూ నినాదాలు హోరెత్తాయి.



సరిహద్దు భద్రతా దళానికి చెందిన మహిళా సిబ్బందితో 'సీమా భవాని' బృందం విన్యాసం

అబ్బురపరిచిన 'సీమా భవాని'

కవాతులో తొలిసారిగా పాల్గొన్న బీఎస్ఎఫ్ మహిళా సిబ్బందితో కూడిన 'సీమా భవాని' బృందం.. సంబరాలకే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మోటారు సైకిళ్లపై ఈ బృందం ప్రదర్శించిన వివిధ విన్యాసాలు.. వీక్షకులను అబ్బురపరిచాయి. భారత సైన్యానికి చెందిన టీ-90 ట్యాంక్ (భీష్మ), బాల్‌వే మెషీన్ పికెట్, బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థ, అస్త్రాల జాడను గుర్తించే రాడార్ (స్వాతి), వంతెన నిర్మాణ ట్యాంక్ టీ-72, మొబైల్ బేస్ ట్రాన్సీవర్ స్టేషన్, ఆకాశ్ క్షిపణి వ్యవస్థలను ప్రదర్శించారు. భుజం భుజం కదుపుతూ పదాతిదళాలు చేసిన కవాతు ఆకట్టుకుంది. బీఎస్ఎఫ్‌కు చెందిన ఒంటెల బృందాలు, ఇతర పారామిలిటరీ దళాలు, దిల్లీ పోలీసు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ బృందాలూ పాల్గొన్నాయి. వైమానిక దళం విమానాలు, ఎమ్ఐ-17, రుద్ర హెలికాప్టర్ల విన్యాసాలతో.. కవాతుకు అద్భుతమైన ముగింపు లభించింది. రుద్ర, హెర్క్యులెస్, గ్లోబ్ తదితర వైమానిక విన్యాసాలు చూపర్లను ఆకట్టుకున్నాయి.



జ్యోతి ప్రకాశ్ నిరాల కుటుంబ సభ్యులకు అశోక చక్ర పురస్కారాన్ని అందజేస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

వీర పత్ని, మాతలను చూసి ఉద్వేగానికి లోనయిన రాష్ట్రపతి



భావోద్వేగానికి గురై కళ్లు చమర్చిన రాష్ట్రపతి, ఆయన సతీమణి సవిత

దిల్లీ: అమర జవాను కుటుంబ సభ్యులకు పురస్కారం ప్రదానం చేసే సందర్భంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉద్వేగానికి లోనయ్యారు. ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చి, అనంతరం ప్రాణాలు కోల్పోయిన ఎయిర్‌ఫోర్సు గార్డ్ కమాండో కార్పొరల్ జ్యోతి ప్రకాశ్ నిరాలాకు అశోక్‌చక్ర ప్రకటించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిరాలా భార్య సుష్మానంద్, తల్లి మాలతీదేవికి దీనిని అందజేశారు. ఈ సందర్భంగా ఉద్వేగానికి గురయిన రాష్ట్రపతి రుమాలుతో కళ్లను తుడుచుకోవడం కనిపించింది. భారత వాయుసేనలోని గార్డ్ స్పెషల్ ఫోర్సు యూనిట్‌కు చెందిన నిరాలాను 'ఆపరేషన్ రక్షక్'లో భాగంగా రాష్ట్రీయ రైఫిల్స్ బెటాలియన్‌కు సహాయంగా నియమించారు. గత నవంబరు 18న జమ్ము-కశ్మీర్‌లోని బందీపోరా సెక్టారు చందేర్‌గెర్ గ్రామంలో ఓ ఇంట్లో నక్కిన ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడినప్పటికీ ఏమాత్రం వెనకడుగు వేయకుండా ఎదురుకాల్పులు జరిపారు.

ఆ న్యాయమూర్తుల నుంచి స్ఫూర్తి పొందుదాం

- న్యాయ వ్యవస్థ ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చిన వారిని అనుసరించే యత్నం చేద్దాం
- గణతంత్ర వేడుకల్లో హైకోర్టు ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్

ఈనాడు - హైదరాబాద్

స్వప్రయోజనాల కంటే న్యాయవ్యవస్థ ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చిన న్యాయమూర్తుల నుంచి స్ఫూర్తి పొందాలని, వాళ్లను అనుసరించడానికి యత్నిద్దామని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి(ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్ చెప్పారు. న్యాయవ్యవస్థ మొదటి పరీక్షను భారత్ గణతంత్రదేశమైన నాలుగో ఏటనే ఎదుర్కొందన్నారు.



పతాక ఆవిష్కరణ అనంతరం జెండా వందనం చేస్తున్న జస్టిస్ రమేశ్ రంగనాథన్

1954 జనవరి 3న భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ పతంజలిశాస్త్రి పదవీ విరమణ సందర్భంగా జస్టిస్ బి.కె.ముఖర్జీని సీజేఐగా బాధ్యతలు చేపట్టమని నెహ్రూ కోరారని, తనకంటే సీనియర్ జస్టిస్ మెహర్‌చంద్ మహాజన్ ఉన్నారనే కారణంతో మర్యాదపూర్వకంగా తిరస్కరించారన్నారు. నెహ్రూ ఒత్తిడి చేయగా..రాజీనామా చేస్తాను తప్పితే సీనియర్ ఉండగా అత్యున్నత స్థానాన్ని అధిష్ఠించలేనని జస్టిస్ ముఖర్జీ చెప్పారని గుర్తుచేశారు. జస్టిస్ మహాజన్ సీజేఐగా పదవీ విరమణ చేశాకే జస్టిస్ ముఖర్జీ నాలుగో సీజేఐగా బాధ్యతలు చేపట్టారన్నారు. అలాంటి వాళ్ల నుంచి స్ఫూర్తి పొందాలన్నారు. ఉమ్మడి హైకోర్టులో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఏసీజే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఏజీ డి.ప్రకాశ్‌రెడ్డి, ఏపీ ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యాజ్యాలు సత్వరం పరిష్కారమయ్యేలా కృషిచేయాలని కోరారు. తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జల్లి కనకయ్య కూడా ప్రసంగించారు.

ఏపీలో హైకోర్టు.. ప్రస్తావించిన న్యాయవాది సంఘం అధ్యక్షుడు: అమరావతిలో ఏపీ హైకోర్టు ఏర్పాటును తాము వ్యతిరేకించడంలేదని ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ధనంజయ మాట్లాడారు. తాత్కాలిక భవనంలో హైకోర్టు ఏర్పాటుకు అనుసరిస్తున్న విధానంపై ఆందోళన చెందుతున్నామన్నారు. ఒకసారి తాత్కాలిక.. మరోసారి శాశ్వత భవనంలోకి తరలిస్తే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. తన ముగింపు ప్రసంగంలో ఏసీజే మాట్లాడుతూ సమస్యల గురించి మాట్లాడే రోజు ఇది కాదన్నారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు, ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయవాదులు, తదితరులు హాజరయ్యారు.



గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఏషియాన్ దేశాల సాంస్కృతిక శకటం

సరిహద్దు సైనికుడైన పన్నుల అధికారి

దక్కిన శౌర్య చక్ర పురస్కారం

దిల్లీ: ఆదాయపు పన్ను శాఖలో అధికారి.. అయితేనేం దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ఆయుధం చేపట్టాడు! రెప్పపాటులో ఉగ్రవాదులను మట్టికరిపించాడు. అసమాన ధైర్యసాహసాలకు మెచ్చిన ప్రభుత్వం ఆయనను శౌర్య చక్ర పురస్కారంతో సత్కరించింది. అసాధారణ రీతిలో సైనిక సాహస అవార్డును అందుకున్న ఆ పౌర అధికారే 47 ఏళ్ల కెప్టెన్ ప్రదీప్ శౌర్య ఆర్య!! ఐఆర్ఎస్ 2007 బ్యాచ్‌కు చెందిన రెవెన్యూ అధికారి ప్రదీప్ శౌర్య ఆదాయపు పన్నుశాఖ అదనపు కమిషనర్‌గా ముంబయిలో పనిచేస్తున్నారు. అయినప్పటికీ ప్రాదేశిక సైన్యంలో పనిచేసేందుకు తన పేరును నమోదు చేసుకోవటంతో ఆయనకు 2009లో 106వ పదాతిదళంలో పనిచేసే అవకాశం లభించింది. ఈ దళాన్ని 4వ బెటాలియన్‌తో కలిపి జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వద్ద సరిహద్దు రక్షణ విధుల్లో నియమించారు. "గత ఏడాది మే 28వ తేదీ రాత్రి చొరబాటుదారులు దేశంలోకి ప్రవేశించే యత్నం చేస్తుండగా ప్రదీప్ శౌర్య నేతృత్వంలోని సైనిక బృందం వారిని విజయవంతంగా అడ్డుకుంది. ప్రదీప్ స్వయంగా ఎంతో సాహసంతో ఉగ్రవాదులపై విరుచుకుపడ్డారు. తన భద్రత గురించి ఏమాత్రం ఆలోచించకుండా శత్రువులను రెప్పపాటులో చావుదెబ్బ తీశార"ని ప్రశంసా పత్రంలో ప్రభుత్వం పేర్కొంది. పన్నుల శాఖలో తన అనుభవాన్ని ఉపయోగించి కశ్మీర్‌లో ఉగ్రవాదులకు ఏ విధంగా నిధులు అందుతున్నాయో, నగదు అక్రమ తరలింపు ఎలా జరుగుతుందో నివేదిక రూపొందించి సైన్యాధిపతి ప్రశంసలు పొందారు. నాగాలాండ్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొని అసమానమైన సేవలను అందివ్వగా ఆయనకు ఎన్నికల సంఘం జాతీయ అవార్డును ప్రదానం చేసింది.

యూపీలో ఘర్షణలు.. అసోంలో పేలుళ్లు

దిల్లీ: గణతంత్ర దినోత్సవ వేడుకల వేళ.. ఉత్తర్‌ప్రదేశ్ (యూపీ), అసోం రాష్ట్రాల్లో అలజడులు రేగాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో శుక్రవారం జరిగిన ఘర్షణల్లో 16 ఏళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. మథుర-బరేలీ మార్గంలో వీహెచ్‌పీ, ఏబీవీపీ కార్యకర్తలు మోటారు సైకిళ్ల ర్యాలీ చేపట్టగా.. వారిపై కొంతమంది రాళ్లు రువ్వడంతో ఈ ఘర్షణలు జరిగాయి. కాస్‌గంజ్‌లో కర్ఫ్యూ విధించారు. మరోవైపు అసోంలోని టిన్‌సుకియా జిల్లాలో స్వల్ప తీవ్రతతో 3 పేలుళ్లు సంభవించాయి. ఎవరూ గాయపడలేదు. ఈ పేలుళ్ల వెనుక యూఎల్ఎఫ్ఏ తీవ్రవాదముఠా హస్తం ఉండొచ్చని పోలీసులు తెలిపారు.

వ్యర్థానికీ అర్థం కల్పించే 'మార్గం'

- వాడేసిన ప్లాస్టిక్‌తో రహదారుల నిర్మాణం
- మన్నిక ఎక్కువ.. ఖర్చు తక్కువ..
- హైదరాబాద్, అమరావతి నగరాలకు ఎంతో ఉపయుక్తం
- 'ఈనాడు'తో పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన ప్రొఫెసర్ రాజగోపాలన్ వాసుదేవన్



ఈనాడు - హైదరాబాద్

వ్యర్థానికీ అర్థం కల్పించే మార్గాన్వేషణలో.. సమాజానికో సరికొత్త దారి చూపారు ప్లాస్టిక్ రహదారుల సృష్టికర్త (ప్లాస్టిక్ మ్యాన్ ఆఫ్ ఇండియా) ప్రొఫెసర్ రాజగోపాలన్ వాసుదేవన్. పర్యావరణానికి సవాలు విసురుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో రహదారులను నిర్మించే ప్రక్రియను ఆవిష్కరించి యావత్ ప్రపంచానికీ 'మార్గ'దర్శకంగా నిలిచారు. ప్లాస్టిక్ ముప్పు నుంచి గట్టెక్కేందుకు, పునర్వినియోగమే ప్రశ్నగా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యకు చక్కటి పరిష్కారాన్ని చూపినందుకు ఆయన పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. రాజగోపాలన్ వాసుదేవన్ ఈ రంగంలో ఒక టిన్నర దశాబ్దానికి పైగా కృషి చేశారు. ప్లాస్టిక్ రహదారుల అవసరం, ప్రాధాన్యాలపై శుక్రవారం ఆయన తమిళనాడులోని మధురై నుంచి 'ఈనాడు'కు ఇంటర్వ్యూ ఇచ్చారు.

అభినందనలు. 16 సంవత్సరాల శ్రమకు గుర్తింపు లభించిందనుకుంటున్నారా?

ధన్యవాదాలు. వ్యక్తిగత గుర్తింపునకు అంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఈ పురస్కారంతో నా ప్రయత్నం భారతావని మొత్తానికీ తెలిసిందని ఆనందంగా ఉంది. మా నాన్న గారు ఎప్పుడూ చెబుతుండేవారు 'డబ్బు సంపాదించటం చాలా సులువు. దేశాభివృద్ధికి దోహదం చేయడమే కష్టం' అని. దేశంలో 29 రాష్ట్రాలు, ఏడు కేంద్రపాలిత ప్రాంతాలుంటే ఈ 16 ఏళ్లల్లో 11 రాష్ట్రాల్లో కొద్ది మందిని మాత్రమే చైతన్యం చేయగలిగాను. ఇప్పుడు నా శ్రమకు తగిన ఫలితం లభించిందని, ఇకపై మరింత సులభంగా పని చేయవచ్చనీ భావిస్తున్నాను.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వాతావరణానికి ప్లాస్టిక్ వ్యర్థాలతో రహదారులు ఎలా ఉపకరిస్తాయి?

ఈ రహదారులు అన్ని ప్రాంతాలకూ ప్రయోజనకరమే. హైదరాబాద్ నగరంలో ఒక్కోసారి స్వల్ప వ్యవధిలో అధిక వర్షం కురుస్తుంది. తరచుగా రహదారులు దెబ్బతింటుంటాయి. వాహనాల సంఖ్య చాలా ఎక్కువ. రహదారిపై ఒత్తిడి అధికం. ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా మళ్లీ దెబ్బతింటాయి. అధికారులకు పాలకులకు ఇదో పెద్ద తలనొప్పి. ప్లాస్టిక్ వ్యర్థాలతో నిర్మితమయ్యే రహదారులు ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం చూపుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ మాటేమిటి?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఇదో గొప్ప అవకాశం. కొత్త రాజధాని అమరావతిలోని రహదారులన్నింటినీ పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిర్మించి దేశానికి ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుమారుడు, మంత్రి లోకేష్ నేనూ ఇటీవల దిల్లీలో ఓ సమావేశంలో కలిశాం. ప్లాస్టిక్ వ్యర్థాలతో రహదారుల నిర్మాణంపై ఆయన ఆసక్తి చూపారు. వారు కోరుకుంటే సహకారాన్ని అందించేందుకు నేను సిద్ధమే.

తారు, సిమెంటుతో పోలిస్తే ప్లాస్టిక్ వ్యర్థాల రహదారులతో అదనపు ప్రయోజనం ఏమిటి?

ఖర్చు తక్కువ. మన్నిక ఎక్కువ. నిర్వాహణ వ్యయమూ తక్కువే. ఎంత వర్షం కురిసినా రహదారిపై నిలవదు. గుంతలు (పాట్ హోల్స్) పడటం చాలా అరుదు. ప్లాస్టిక్ వ్యర్థాలను 165 డిగ్రీల వద్ద వేడి చేసిన తారు(బిటమిన్), కంకరను కలపటంతో వూహకందనంతగా అవి మిళితం(మిక్స్) అవుతాయి. ఇది పర్యావరణహితమైనది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, జాతీయ రహదారి కాంగ్రెస్ (ఐఆర్‌సీ)కూడా ఆమోదించాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగానే ఉత్పత్తవుతున్నాయని నా సమాచారం. ప్లాస్టిక్ వ్యర్థాలు ఎంత ఎక్కువగా అందుబాటులో ఉంటే.. వ్యయం అంత తక్కువ అవుతుంది.

ఈ ప్రయోగంలో ఎదురైన ఇబ్బందులు ఏమిటి?

కొన్ని తప్పవు. మా కళాశాలలో వేశాం. బాగుంది. ఇక్కడి వారిని చైతన్యవంతులను చేయలేకపోయాను. 2004లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత జయలలితను కలిసి ఈ అంశాన్ని వివరించాను. ఆమె అప్పటికప్పుడు స్పందించి వెయ్యికిలోమీటర్లు మంజూరు చేశారు.

మీ ఆశయం ఏమిటి?

ప్రస్తుతం 11 రాష్ట్రాల్లో 10-12 వేల కిలోమీటర్ల వరకు ఈ తరహా రహదారులు వేశారు. జాతీయ గ్రామీణాభివృద్ధి, ప్రధాన మంత్రి సడక్ యోజనతోపాటు మరో పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలతో రహదారుల నిర్మాణానికి కేంద్రం అనుమతించింది. 2020 నాటికి లక్ష కిలోమీటర్ల వరకు వేయాలన్నది ఆలోచన. జాతీయ రహదారులనిర్మాణంపై చర్చలు సాగుతున్నాయి.

ఇంకేమైనా ప్రత్యామ్నాయాలు తయారు చేస్తున్నారా?

రాళ్ల తయారీ ప్రయోగం కూడా ఫలవంతమైంది. వీటిని ఫుట్‌పాత్‌లపై వేయవచ్చు. లాన్స్, పార్కింగ్ ప్రాంతాలు, ఆరుబయట కూడా ఉపయోగించవచ్చు.

రాహుల్‌కు ముందు వరుసలో సీటు కేటాయించరా?

దిల్లీ: గణతంత్ర దిన వేడుకల్లో తమ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని అవమానించారంటూ ప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపడింది. రాజ్‌పథ్‌లో శుక్రవారం గణతంత్ర దినోత్సవ కవాతుకు హాజరైన రాహుల్.. ఆరో వరుసలో(ముందు నుంచి) తనకు కేటాయించిన సీట్లో కూర్చున్నారు. ఆయన పక్కనే రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ ఉన్నారు. అయితే, ప్రభుత్వం తమ పార్టీ అధ్యక్షుడికి ముందు వరుసలో సీటు కేటాయించకపోవడంపై కాంగ్రెస్ ప్రచార వ్యవహారాల బాధ్యుడు రణదీప్ సుర్జేవాలా ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో గణతంత్రదిన వేడుకల్లో కాంగ్రెస్ అధ్యక్షులకు ముందు వరుసలో సీటు కేటాయించేవారని గుర్తుచేశారు. ఆ సంప్రదాయాన్ని పక్కనపెట్టడంద్వారా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం చౌకబారు రాజకీయాలను ప్రదర్శించిందంటూ విమర్శలు గుప్పించారు. గతేడాది గణతంత్రదిన వేడుకల్లో సోనియా గాంధీ(అప్పటి కాంగ్రెస్ అధ్యక్షురాలు) ముందు వరుసలో కూర్చున్న సంగతి గమనార్హం.

పాక్ రేంజర్లకు మిఠాయిలు పంచలేదు

దిల్లీ: పాకిస్థాన్‌తో సరిహద్దుల్లో ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఆ దేశ బలగాలకు సరిహద్దు భద్రతాదళం(బీఎస్ఎఫ్) శుక్రవారం మిఠాయిలు పంచలేదు. సాధారణంగా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ ప్రాముఖ్యమున్న వేడుకల సమయాల్లో భారత్, పాక్ దళాలు సరిహద్దుల్లో మిఠాయిలు ఇచ్చిపుచ్చుకోవడం సంప్రదాయం. గతేడాది దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని కూడా పాక్ రేంజర్లకు బీఎస్ఎఫ్ మిఠాయిలు పంచింది. శుక్రవారం మాత్రం ఈ సంప్రదాయాన్ని పాటించలేదు. ఇరుదేశాల బలగాల మధ్య ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతలే ఇందుకు కారణమని బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ కె.కె.శర్మ వెల్లడించారు.

ఈనాడు
విజేత
కరీంనగర్ శనివారం జనవరి 27, 2018 ■ sports@eenadu.in





కాలాన్ని గిర్రున తిప్పుదాం. పదేళ్ల వెనక్కి వెళ్దాం. ఏదో ఇండియన్ ప్రీమియర్ లీగ్ అన్నారు.. ఆటగాళ్ల వేలం అన్నారు!

ఆ.. ఏముంటుందిలో ఈ వేలంలో అనుకున్నారంతా!

అయితే నాటి ఆ వేలం..

దేశాల మధ్య సరిహద్దుల్ని చెరిపేసింది. జట్ల మధ్య తేడా లేకుండా చేసింది. సహచరుల్ని ప్రత్యర్థులుగా.. ప్రత్యర్థుల్ని సహచరులుగా మార్చేసింది.

ఆటను మార్చింది. దాన్ని నేర్చుకునే, ఆడే తీరునూ మార్చింది. ఆటగాళ్ల జీవితాల్నీ మార్చింది.

కూటికి లేని వాళ్లను కోటీశ్వరుల్ని చేసింది. సామాన్యులనూ సచిన్, కోహ్లీలతో ఆడేలా చేసింది.

అభిమాని క్రికెట్‌ను చూసే కోణాన్నీ మార్చింది. సాయంత్రం వేళ మైదానాన్ని వ్యాహ్యాళిలా మార్చింది.

దశాబ్దం తర్వాత ఇప్పుడు మళ్లీ కొత్తగా ఐపీఎల్ వేలానికి రంగం సిద్ధమైంది. శని, ఆదివారాల్లో జరిగే ఈ వేలం తర్వాత రాబోయే రోజుల్లో ఇంకెన్ని మార్పులు చూస్తామో!

పదేళ్ల కిందట ఇదే సమయంలో జరిగిన ఐపీఎల్ వేలం తర్వాత క్రికెట్లో అసలేమైంది?

మెరుపుల్ మార్పుల్ @10

340000000000

అంకెల్లో చెప్పాలంటే 34 వేల కోట్లు..! ఇదీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ విలువ.. రూపాయల్లో..!

ఇంతకంటే ఏం చెప్పాలి ఐపీఎల్ గురించి..!

ఐతే ఐపీఎల్ అంటే కాసులేనా..? కాదు.. అంతకుమించి!

భారత క్రికెట్‌పై.. ఆ మాటకొస్తే ప్రపంచ క్రికెట్‌పైనా దీని ప్రభావం.. ఎంతో.. ఎంతెంతో!

క్రికెట్ ఆటను, క్రికెట్ వీక్షణాన్ని కొత్త పుంతలు తొక్కించి.. క్రికెటర్లను, క్రికెటాభిమానుల్ని మరో ప్రపంచంలోకి తీసుకెళ్లిన ఘనత ఐపీఎల్‌ది!

వచ్చే ఐదేళ్లకు ఐపీఎల్ హక్కుల్ని దాదాపు రూ.16,350 కోట్లకు స్టార్ స్పోర్ట్స్ కొనడాన్ని బట్టి లీగ్ బ్రాండ్ విలువ ఏంటో, బీసీసీఐకి దీని ద్వారా ఎంత ఆదాయం సమకూరుతోందో అర్థం చేసుకోవచ్చు. ఐపీఎల్ వల్లే ప్రపంచ క్రికెట్లో బీసీసీఐ మరింత శక్తిమంతంగా తయారైంది. మిగతా బోర్డులు కూడా వరుసబెట్టి లీగ్‌లు మొదలుపెట్టేశాయి. ఐతే వీటిలో ఐపీఎల్‌కు సాటి వచ్చేదేదీ లేదన్నది వాస్తవం.

సీరియల్ కాదు.. ఐపీఎల్

సాయంత్రం ఆఫీస్ అయిపోతుంది. ఇంటికొచ్చి స్నానం చేసి అలా కుర్చీలో కూర్చుని.. టీవీ పెడితే చాలు బ్లాక్‌బస్టర్ క్రికెట్ వినోదం మొదలైపోతుంది. ముచ్చట్లు చెబుతూ.. భోంచేస్తూ.. నిద్రకు సిద్ధమవుతూ.. అన్నీ చేస్తూనే ఐపీఎల్ మీదా ఓ కన్నేసి ఉంచడమే! క్రికెట్ ప్రియుల ఇళ్లలో సీరియళ్ల స్థానే ఐపీఎల్ మ్యాచ్‌లు వచ్చేశాయి. ఇందుకోసం చిన్నపాటి యుద్ధాలూ సహజమే! ఇక ఇల్లు దాటి బయటికి వస్తే.. షాపుల్లో.. ఆఫీసుల్లో.. హోటళ్లలో.. బార్లల్లో.. ఎక్కడ చూసినా ఆ రెండు నెలలు ఐపీఎల్లే. మన జట్టు.. పర జట్టు అని తేడా ఏమీ లేదు. ఎవరు బాదితే వాళ్లే ఆ రోజుకు ఫేవరెట్. లీగ్‌లో ఎన్నో వివాదాలుండనీ.. ఎన్నో ఆరోపణలు రానీ.. ఇంకా ఏమైనా కానీ.. క్రికెట్ ప్రియులు దీన్ని విస్మరించడం మాత్రం సాధ్యం కాదు.


డ్రెస్సింగ్ రూం.. కొత్త కొత్తగా!

సర్ఫరాజ్ ఖాన్ అనే కుర్రాడు 17 ఏళ్ల వయసులోనే కోహ్లి, డివిలియర్స్, గేల్ లాంటి దిగ్గజ ఆటగాళ్లతో కలిసి డ్రెస్సింగ్ రూంను పంచుకున్నాడు. ఇది ఐపీఎల్ కల్పించిన అద్భుత అవకాశం. ఒకప్పుడు జాతీయ జట్టులోకి వచ్చి కొన్నేళ్లు ఆడాక కానీ అంతర్జాతీయ క్రికెట్‌కు అలవాటు పడేవారు కాదు. ఐతే ఐపీఎల్ పుణ్యమా అని టీనేజీలోనే అంతర్జాతీయ క్రికెట్‌లో ఉండే ఒత్తిళ్లకు అలవాటు పడుతున్నారు. మోర్నీ మోర్కెల్‌ను రిషబ్ పంత్ ధాటిగా ఎదుర్కొంటున్నాడు. గేల్‌ను సందీప్ శర్మ ఇబ్బంది పెడుతున్నాడు. "నేను గావస్కర్‌తో కలిసి కొన్నేళ్ల పాటు క్రికెట్ ఆడాను. అయినా ఆయనతో చేయి కలపడానికి భయపడేవాడిని. కానీ ఐపీఎల్ కారణంగా కుర్రాళ్లు ప్రపంచ అత్యుత్తమ ఆటగాళ్లతో డ్రెస్సింగ్‌రూంను పంచుకుంటూ విలువైన అనుభవం గడిస్తున్నారు" అని మాజీ ఫాస్ట్‌బౌలర్ చేతన్ శర్మ అనడం ఐపీఎల్ తెచ్చిన గొప్ప మార్పునకు సూచిక.

సిక్సర్ ఎలా కొట్టాలి?

కొత్తగా క్రికెట్ నేర్చుకునే కుర్రాడికి ముందుగా డిఫెన్స్ ఆడటం నేర్పించేవాళ్లు. కానీ ఈ తరం కుర్రాళ్లకు సిక్సర్లు కొట్టడం నేర్పించమంటూ కోచ్‌లను అడిగే పరిస్థితి. టెక్నిక్ కంటే కూడా బాదుడే ఇప్పుడు ప్రధానం అయిపోయింది. కుర్రాళ్లందరూ దాని మీదే దృష్టిపెడుతున్నారు. సిక్సర్లు కొట్టడం వచ్చి.. దేశవాళీల్లో ఒక భారీ ఇన్నింగ్స్ ఆడితే చాలు.. ఐపీఎల్ ఫ్రాంఛైజీల దృష్టిని ఆకర్షించొచ్చు. ఆపై ఐపీఎల్‌లో ఒక మెరుపు ఇన్నింగ్స్ ఆడితే.. జీవితమే స్థిరపడిపోయినట్లే అన్న భావన కుర్రాళ్లలో వచ్చేస్తోంది. భారత కుర్రాళ్లలో టెస్టులకు అవసరమైన నైపుణ్యాలు కొరవడుతుండటానికి పరోక్షంగా ఐపీఎలే కారణమంటారు కొందరు మాజీలు. అయితే ఐపీఎల్ వల్ల వచ్చిన మంచి మార్పుల్నీ అందిపుచ్చుకుని, తప్పుల్ని దిద్దుకుంటూ ముందడుగు వేయాలి అన్నది ఐపీఎల్ మద్దతుదారుల మాట.

జాంటీ రోడ్స్ అంతర్జాతీయ కెరీర్ ముగిసి దశాబ్దంన్నర అవుతోంది. ఐతే అతను ఆటగాడిగా ఉన్నప్పటి కంటే ఆ తర్వాతే భారత్‌లో ఎక్కువసార్లు పర్యటించాడు. ఇక్కడే ఎక్కువ రోజులు గడిపాడు. తన కొడుక్కి ఇండియా అని పేరు కూడా పెట్టుకున్నాడు. దీనికి కారణం ఐపీఎల్ ద్వారా భారత్‌తో అతడికి ఏర్పడ్డ అనుబంధమే. పదేళ్లుగా అతను ఐపీఎల్‌లో కోచ్‌గా ఉంటున్నాడు. కోచ్‌లు మాత్రమే కాదు.. వ్యాఖ్యాతలు, విశ్లేషకులు, మ్యాచ్ ప్రెజెంటర్లు, యాంకర్లు, మీడియా మేనేజర్లు, ఫ్రాంచైజీల నిర్వహణ సిబ్బంది.. ఇలా వందల మందికి ఐపీఎల్ ఉద్యోగాలిచ్చింది.



అక్కడికి ఇదే మెట్టు..

ప్రస్తుతం దక్షిణాఫ్రికా పర్యటనలో చక్కటి ప్రదర్శన చేస్తున్న బుమ్రా ఎక్కడి నుంచి వచ్చాడు..? ఐపీఎల్ నుంచే. భారత జట్టులో చోటుకు ఐపీఎల్ ప్రదర్శన ప్రామాణికం కాదని అంటారు కానీ.. ఐపీఎల్ ద్వారా వెలుగులోకి వచ్చి భారత జట్టులో చోటు సంపాదించిన ఆటగాళ్లకు లెక్కే లేదు. ప్రపంచ క్రికెట్లో బలమైన జట్లలో భారత్ ఒకటిగా ఎదగడంలో ఐపీఎల్ పాత్ర కీలకం.

క్రికెటైన్మెంట్!

పదేళ్ల కిందట క్రికెట్ అంటే క్రికెట్. కానీ ఐపీఎల్ క్రికెట్‌కు సరికొత్త వినోదాన్ని జోడించి.. 'క్రికెటైన్మెంట్' అనే కొత్త మాటను అభిమానులకు పరిచయం చేసింది. అప్పటికే టీ20లు ఉన్నప్పటికీ.. ఈ ఫార్మాట్‌లోని అసలు మజాను భారత అభిమానులకు రుచి చూపించింది ఐపీఎలే. మ్యాచ్‌లో ఎప్పుడైనా ఒక సిక్సర్ బాదితే ఉద్వేగంతో చూసే క్రికెట్ ప్రియుల్ని.. సిక్సర్ల మోతలో ముంచెత్తింది ఈ లీగ్. 20 ఓవర్ల వ్యవధిలో భారీ శతకాలు.. ఒక్క ఓవర్లో 38 పరుగులు.. 4 ఓవర్లకే ఐదారు వికెట్లు.. హ్యాట్రిక్‌ల మీద హ్యాట్రిక్‌లు.. ఎన్నెన్నో కొత్త షాట్లు.. సూపర్ ఓవర్లు.. వ్యూహ విరామాలు.. క్వాలిఫయర్లు, ఎలిమినేటర్లు.. ఇలా ఆటలో ఎన్నెన్ని మెరుపులో! అందుకే ఐపీఎల్ అంటే.. కేవలం క్రికెట్ కాదు.. క్రికెటైన్మెంట్!

వాళ్లు వీళ్లు.. వీళ్లు వాళ్లు!

కోహ్లి, గంభీర్ దిల్లీకి చెందిన వాళ్లు. ఒకే రాష్ట్ర జట్టుకు ఆడారు. భారత జట్టుకు కలిసి ప్రాతినిధ్యం వహించారు. ఐతే వాళ్లిద్దరూ ఐపీఎల్‌కు వచ్చేసరికి బద్ధ శత్రువులు. మైదానంలో ఒకరి మీదికి ఒకరు దూసుకెళ్లి కొట్టుకునే స్థాయికి వాళ్ల వైరం వెళ్లింది. ఇక తన భారత జట్టు సహచరుడే అయినా శ్రీశాంత్ చెంప చెల్లుమనిపించాడు హర్భజన్. ఐతే అంతర్జాతీయ క్రికెట్లో శత్రువులైన డివిలియర్స్, గేల్‌తో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతాడు విరాట్. భజ్జీ అయినా అంతే. దేశాల మధ్య సరిహద్దుల్ని చెరిపేసిన ఐపీఎల్‌తో ప్రత్యర్థులు సహచరులయ్యారు, సహచరులు ప్రత్యర్థులయ్యారు. మొదట్లో అభిమానులకు ఇదంతా చిత్రంగా అనిపించింది. తర్వాత అలవాటు పడిపోయారు.

ఒకే ఒక్క ఛాన్స్!

మహ్మద్ సిరాజ్.. క్రికెట్ ఆడటం మొదలుపెట్టే నాలుగైదేళ్లయిందంతే. అతడి తండ్రి ఒక సాధారణ ఆటోవాలా. పూట గడవడానికే కష్టపడే కుటుంబం అతడిది. ఐదేళ్లు తిరిగేసరికి అతడి జీవితమే మారిపోయింది. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో కూడా ఇంకా కుదురుకోని అతడికి ఐపీఎల్ వేలంలో రెండు కోట్లకు పైగా ధర పలికింది. ఐపీఎల్‌లో సత్తా చాటి టీమ్‌ఇండియాకు ఆడే అవకాశం కూడా దక్కించుకున్నాడు సిరాజ్. ఇతనొక్కడేనా.. ఐపీఎల్ వల్ల జీవితాలు మారిపోయిన క్రికెటర్లకు లెక్కే లేదు. రైనా మొదలుకుని.. బుమ్రా వరకు ఎందరో ఐపీఎల్ ద్వారా తమ కెరీర్లను దిద్దుకున్నారు. భారత ఆటగాళ్లే కాదు.. వాట్సన్, పొలార్డ్ లాగా వేరే జట్ల ఆటగాళ్లు కూడా చాలామందే ఐపీఎల్‌తో వెలుగులోకి వచ్చినవాళ్లే. "ఐపీఎల్ మా జీవితంలో అంతర్భాగం.. లీగ్ వేలం జరుగుతుంటే మా ఏకాగ్రత చెదరకుండా పోదు" మొన్న భారత్‌తో మూడో టెస్టుకు ముందు దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్ చేసిన వ్యాఖ్యలివి. దీన్ని బట్టే ప్రపంచ క్రికెట్‌పై, క్రికెటర్లపై ఐపీఎల్ ప్రభావం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు.

అందం.. ఆనందం!

మైదానంలో ధావన్ ఒక మెరుపు సిక్సర్ బాదుతాడు. మైదానంలో వెంటనే "గబ్బర్ సింగ్.. గబ్బర్ సింగ్" అంటూ మాంచి మసాలా పాట వస్తుంది. మరోవైపు విదేశీ సుందరీమణులు ఆ పాటకు తగ్గట్లుగా నృత్యాలు చేస్తూ 'ఛీర్స్' చెబుతారు. షాట్ చూసిన ఆనందాన్ని రెట్టింపు చేస్తుంది మైదానంలోని ఈ సందడి. అందుకే అంతర్జాతీయ మ్యాచ్‌ల కంటే ఐపీఎల్ మ్యాచ్‌ల వీక్షణం ఆసక్తికరంగా మారింది. ఇక మైదానంలో సినీ తారల సందడి గురించి చెప్పేదేముంది? హైదరాబాద్‌లో మ్యాచ్ అంటే వెంకటేష్ సహా స్టార్లెందరో మైదానంలో దిగిపోతుంటారు. ముంబయిలో పోరంటే బాలీవుడ్ తళుకులు మైదానానికే కళ తెస్తాయి. షారుఖ్ ఖాన్, ప్రీతి జింతా, శిల్పా శెట్టి లాంటి వాళ్లు లీగ్‌లో భాగస్వాములైపోయాక గ్లామర్‌కు కొదవేముంది?

డబ్బులే డబ్బులోయ్..

2017 సీజన్ ముందు వరకు బెన్ స్టోక్స్ అనేవాడు ఐపీఎల్‌లో ఆడిందే లేదు. కానీ గత ఏడాది తొలిసారి ఐపీఎల్ ఆడాలని నిర్ణయించుకున్నాడు. వేలంలోకి వచ్చాడు. ఒకేసారి అతడి రేటు రూ.15 కోట్ల దాకా పలికింది. ఏడాదంతా ఇంగ్లాండ్ తరఫున క్రికెట్ ఆడినా అతడికి అంత ఆదాయం రాదు. అంతకుముందు భారత జట్టులో చోటు కోల్పోయిన యువరాజ్ సింగ్‌కు లీగ్‌లో రూ.15.5 కోట్ల దాకా పలికింది. ధోని అయితే ఐపీఎల్ ఆరంభ సీజన్‌కే రూ.9 కోట్ల దాకా అందుకున్నాడు. కోహ్లీకి ఈసారి రూ.17 కోట్ల రేటు పలికింది. కొంచెం తక్కువ స్థాయి ఆటగాళ్లు సైతం ఒక్కో సీజన్‌కు కొన్ని కోట్లు అందుకున్న వాళ్లే. ఇలా ఐపీఎల్ ద్వారా క్రికెటర్ల జీవితాలే మారిపోయాయి.



చంగ్‌న ఎగిరాడు

కొన్నేళ్ల కిందట టీవీలో టెన్నిస్ చూసి కేరింతలు కొట్టినవాడు.. చిన్న వయసులోనే కంటికి సంబంధించిన వ్యాధితో బాధపడినవాడు.. తన గమ్యమేమిటో తెలియక మదనపడినవాడు!

ఇప్పుడు..

ఆ దేశంలోనే పెద్ద స్టార్! టెన్నిస్‌కు బ్రాండ్ అంబాసిడర్!!



ఒకే ఒక్క టోర్నీ.. ఒకే ఒక్క మ్యాచ్! అతణ్ని హీరోని చేసేసింది. ఆ దేశ యువతకు ప్రేరణ ఇచ్చింది. 21 ఏళ్ల వయసులోనే అందరిలో ఇంతటి స్ఫూర్తి నింపి.. ఆస్ట్రేలియన్ ఓపెన్లో పెను సంచనాలు సృష్టించిన ఆ కుర్రాడే హుయాన్ చంగ్. తాను చిన్నప్పుడు ఆరాధించిన జకోవిచ్‌ను ఆస్ట్రేలియన్ ఓపెన్లో కంగుతినిపించి ప్రకంపనలు రేపాడు చంగ్. సెమీస్‌లో నిష్క్రమణ సంగతి పక్కన పెడితే చంగ్ ఆట.. అతను తెర మీదకు దూసుకొచ్చిన తీరు అనూహ్యం. టెన్నిస్ పండితులైతే అతణ్ని కొత్త తరానికి ప్రతినిధి అంటూ అప్పుడే ప్రకటించేస్తున్నారు.

దక్షిణ కొరియా లాంటి దేశం నుంచి ఒక అంతర్జాతీయ టెన్నిస్ ఆటగాడు తయారు కావడమే ఒక అద్భుతం. అలాంటిది ఏకంగా గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్‌కు దూసుకెళ్లడం మహాద్భుతం. ఈ దేశం నుంచి పురుషుల్లోనైనా, మహిళల్లోనైనా తొలిసారి ఒక గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీస్ చేరిన ఘనత ఈ కళ్లద్దాల కుర్రాడిదే! చంగ్ ఇలా ఎదగడం వెనుక పెద్ద కథే ఉంది. అతనెప్పుడూ అనుకోలేదు టెన్నిస్ ఆటగాడిని అవుతానని. తన అన్న యంగ్ లిమ్ ఆడుతుంటే సరదాగా చూడడం.. అతణ్ని ప్రోత్సహించడమే చంగ్‌కు ఇష్టం. కానీ ప్రొఫెషనల్ ఆటగాడిగా మారదామనే ఉద్దేశమే లేదతనికి. ఐతే ఒక ఆరోగ్య సమస్యే చంగ్‌ను ఈ ఆటలోకి వచ్చేలా చేసింది.

భారత్‌తో మ్యాచే మలుపు

చంగ్ టెన్నిస్‌లోకి రావడమే అనూహ్యం. అతని తండ్రి, అన్న టెన్నిస్ ఆటగాళ్లే కానీ అతనెప్పుడూ రాకెట్ జోలికి పోలేదు. అయితే అతనికి కళ్లకు సంబంధించిన వ్యాధి సోకింది. కళ్ల వెంట నీళ్లు కారడం, మసకగా అయిపోవడం లాంటి సమస్యలు ఎదుర్కొనేవాడు. అందుకే చిన్న వయసులోనే కంటికి అద్దాలొచ్చేశాయి. తోటి పిల్లలు ప్రొఫెసర్.. ప్రొఫెసర్ అని ఏడిపించేవాళ్లు. వైద్యుడు ఒకే మాట చెప్పాడు అతనికి సైన్యం వద్దు ఆట వైపు మళ్లించండని. ఆకుపచ్చ రంగు ఎక్కువగా చూస్తే కళ్లకు మంచిదని చెప్పాడు. దీంతో చంగ్ టెన్నిస్ ఆడడం మొదలుపెట్టాడు. కోర్టుతో పాటు చుట్టూ వాతావరణం కూడా ఆకుపచ్చగా ఉండేలా చూసుకున్నాడు. ఆరంభంలో అన్నే అతని కోచ్. ఇప్పుడు తాను టెన్నిస్ ఆటగాడిగా ఈ స్థాయిలో ఉన్నానంటే కారణం భారత్‌తో ఆ మ్యాచే అని గుర్తు చేసుకుంటాడు ఈ కొరియా కుర్రాడు. 2014 ఆసియా క్రీడల్లో టెన్నిస్ డబుల్స్‌లో యంగ్‌తో కలిసి స్వర్ణం గెలిచాడు చంగ్. ముఖ్యంగా సెమీస్‌లో యుకి బాంబ్రి-దివిజ్ శరణ్‌లను ఓడించడం వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. సెమీస్‌లో భారత జోడీపై గెలవకపోతే తాను మళ్లీ సైన్యంలోకి వెళ్లాల్సి వచ్చేది. ఎందుకంటే దక్షిణకొరియాలో టీనేజర్లు కనీసం 21 నెలలు సైన్యంలో సేవ చేయాల్సి ఉంటుంది. అంతర్జాతీయ స్థాయిలో పతకం గెలిచిన క్రీడాకారులకు సైన్యం నిర్బంధ శిక్షణ నుంచి మినహాయింపు ఉంటుంది. అందుకే ఆసియా క్రీడల స్వర్ణమే చంగ్ కెరీర్‌కు పెద్ద మలుపు.

స్టార్లకు దిమ్మదిరిగేలా..

ఆస్ట్రేలియా ఓపెన్ ప్రిక్వార్టర్స్‌లో సెర్బియా యోధుడు జకోవిచ్‌ను ఓడించిన క్షణాన నివ్వెరపోయింది క్రీడా ప్రపంచం ఏవరీ కుర్రాడా అని! కోర్టులో చిరుతలా కదలడం, బలమైన సర్వీసులు, ముచ్చటైన డ్రాప్ షాట్లతో అతను అందర్నీ కట్టిపడేశాడు. నొవాక్ కంటే ముందు నాలుగో సీడ్ జ్వెరెవ్‌ను ఓడించి సంచలనం సృష్టించాడు చంగ్. ఆట తీరులోనూ తన ఆరాధ్య ఆటగాడు జకోవిచ్‌నే కాపీ కొట్టేశాడు చంగ్. ప్రత్యర్థి అలసిపోయేలా చేసి.. అతని బలహీనతలపై దెబ్బకొట్టి గెలవడం అతని శైలి. ముఖ్యంగా అతను తన కదలికల్లో మార్పు చేసుకుంటూ అలవోకగా డ్రాప్ షాట్లు వేస్తున్న తీరు అభిమానుల్ని కట్టిపడేసింది. రోజర్ ఫెదరర్‌తో సెమీఫైనల్లో గాయం కారణంగా ఓడిపోయినా.. చంగ్ అభిమానుల మనసులు గెలుచుకున్నాడు.

ఈనాడు సినిమా




'భరత్ అనే నేను'లో మహేష్‌బాబు

ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు మహేష్‌బాబు. అది 'భరత్ అనే నేను' సినిమా కోసమే. కొరటాల శివ దర్శకత్వంలో మహేష్‌బాబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రమే 'భరత్ అనే నేను'. కైరా అడ్వాణీ కథానాయిక. డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో పతాక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రమాణ స్వీకారోత్సవానికి సంబంధించిన ఆడియోని శుక్రవారం ఉదయం 7 గంటలకి విడుదల చేశారు. 8 గంటలకి టైటిల్ లోగోని, 9 గంటలకి ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఇందులో మహేష్‌బాబు అవిభాజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కనిపించబోతున్నారు. తొలి ప్రమాణంలో ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగానే ప్రమాణం చేశారు. కల్పిత రాజకీయ కథతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నట్టు దర్శకుడు కొరటాల శివ స్పష్టం చేశారు. నిర్మాత మాట్లాడుతూ "విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌కి, తొలి ప్రమాణం వాయిస్‌కి మంచి స్పందన లభిస్తోంది. మహేష్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన విధానం, అందులో ఆయన గళం ఆకట్టుకొంటోంది. మహేష్ - కొరటాల శివ కలయికలో ఈ సినిమా చేయడం ఆనందంగా ఉంది. మా సంస్థలో ఇదొక ప్రతిష్ఠాత్మక చిత్రం" అన్నారు. ప్రకాష్‌రాజ్, శరత్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, పాటలు: రామజోగయ్య శాస్త్రి, ఛాయాగ్రహణం: రవి.కె చంద్రన్, ఎస్.తిరునావుక్కరసు, కూర్పు: శ్రీకర్‌ప్రసాద్, సమర్పణ: డి.పార్వతి.

ప్రేమ తగ్గదంతే



తమన్నా

అభినయం ప్రదర్శిస్తే వచ్చేంత పేరు, ఆడిపాడటానికి పరిమితమైతే వస్తుందా? నటనకి ప్రాధాన్యమున్న పాత్రలు తెచ్చేంత పేరు, వాణిజ్య ప్రధానమైన చిత్రాలతో సాధ్యమా? తమన్నా మాత్రం ముమ్మాటికీ సాధ్యమే అని బల్లగుద్ది చెబుతోంది. అందుకు తన కెరీర్‌నే రుజువుగా చూపుతోంది. "వాణిజ్య ప్రధానమైన చిత్రాలపై నాకున్న ప్రేమ ఎప్పటికీ తగ్గదు. ఎందుకంటే నా కెరీర్ వాటితోనే ముడిపడింది. నటించడానికి ఆస్కారం ఏం ఉంటుందని చాలామంది పెదవి విరుస్తారు కానీ... నా దృష్టిలో ఆ తరహా చిత్రాల్లో నటించి మెప్పించడం కూడా ఓ కళే. అందరూ అనుకొంటున్నట్టుగానే వాటిలో కథానాయిక పాత్ర పరిధి, ప్రాధాన్యం తక్కువే. కానీ ఆ కాసింత పరిధిలోనే ప్రతిభని చూపించాల్సిన సవాల్ ఎదురవుతుంటుంది. బలమైన పాత్రలకి ఎలాగో పేరొస్తుంది. కానీ చిన్న పాత్రలతో పేరు తెచ్చుకోవడమే గొప్ప విషయం కదా. అందుకే వాణిజ్య చిత్రాలే నాకు అసలు సిసలు పరీక్షలా ఉంటుంది. అవి విజయం సాధించిన ప్రతిసారీ నాకు పరీక్ష నెగ్గినట్టే అనిపిస్తుంద"ని సెలవిచ్చింది తమన్నా. అనుభవానికి కూడా ఆమె కొత్త అర్థం చెబుతోంది. ఒక మామూలు పాత్రని మరో స్థాయికి తీసుకెళ్లడంలోనే అసలు సిసలు అనుభవం దాగుందంటోంది. ప్రస్తుతం ఆమె 'నా నువ్వే'తో పాటు, 'క్వీన్' చిత్రంలో నటిస్తోంది.

నాగశౌర్యలో నన్ను నేను చూసుకున్నా! - చిరంజీవి



శంకర్‌ప్రసాద్ ముల్పూరి, నాగశౌర్య, చిరంజీవి, మహతి స్వరసాగర్, వెంకీ కుడుముల, ఉష, రష్మిక మండన్న, గౌతమ్

"కొత్తవాళ్లని అక్కున చేర్చుకొనే గొప్ప మనసు తెలుగు ప్రేక్షకులది" అన్నారు ప్రముఖ కథానాయకుడు చిరంజీవి. హైదరాబాద్‌లో జరిగిన 'ఛలో' ముందస్తు విడుదల వేడుకకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగశౌర్య, రష్మిక మండన్న జంటగా నటించిన చిత్రమిది. వెంకీ కుడుముల దర్శకత్వం వహించారు. ఉషా ముల్పూరి నిర్మాత. శంకర్‌ప్రసాద్ ముల్పూరి సమర్పిస్తున్నారు. మహతి స్వరసాగర్ సంగీతం అందించారు. వేడుకనుద్దేశించి చిరంజీవి మాట్లాడుతూ "ఒక నటుడిని ప్రోత్సాహం ఎంతగా ప్రభావితం చేస్తుందనేది నాకు బాగా తెలుసు. కెరీర్ ఆరంభంలో నా సినిమా ఒకటి వంద రోజులు ఆడిన తర్వాత నా అభిమాన కథానాయకుడిని శతదినోత్సవ వేడుకకి ఆహ్వానించా. ఆయన వేడుకకి హాజరు కాలేనని చెప్పారు. దాంతో నేను నిరుత్సాహానికి గురయ్యా. నాగశౌర్యకు ప్రతిభ ఉంది. తనలో నన్ను నేను చూసుకొన్నా. ఇలాంటి నటులు పరిశ్రమకి అవసరం. ఇప్పటి వరకు నాగశౌర్య కెరీర్‌లో 'ఛలో' ఉత్తమమైన చిత్రంగా నిలవాలని కోరుకొంటున్నా. ట్రైలర్ చూడగానే ఈ సినిమాని ఎప్పుడెప్పుడు చూడాలా అనే ఉత్సుకత రేకెత్తింది. నా అభిమాని అయిన వెంకీ కుడుముల ఈ చిత్రంతో దర్శకుడయ్యాడు" అన్నారు. నాగశౌర్య మాట్లాడుతూ "నేను చిన్నవాణ్ని. చిరంజీవి చెయ్యి నా మీద పడింది. అది చాలు నాకు. మళ్లీ జన్మంటూ ఉంటే చిరంజీవి అభిమానిగానే పుడతా. నన్ను ప్రోత్సహించేందుకు వచ్చిన ఆయనకి కృతజ్ఞతలు. వెంకీ మంచి దర్శకుడు. చిరంజీవితో సినిమా చేసే స్థాయికి చేరుకోవాలని కోరుకొంటున్నా" అన్నారు. "చిత్రబృందం నాకెంతగానో సహకరించింది. నిర్మాత ఉషా తెలుగు నేర్పించారు. వెంకీ అందంగా చిత్రాన్ని తీర్చిదిద్దారు. చిరంజీవి మమ్మల్ని దీవించారు. తప్పకుండా ఈ చిత్రం విజయవంతం అవుతుంద"న్నారు కథానాయిక. "చిరంజీవి నటించిన 'ఇంద్ర', 'ఠాగూర్' చిత్రాలకి కటౌట్‌లు కట్టా. ఆయన్ని నేరుగా మా సినిమా వేడుకలో కలుస్తానని ఊహించలేదు. సాయిశ్రీరామ్ కెమెరా పనితనం, సాగర్ సంగీతం చిత్రానికి ప్రధాన బలమ"న్నారు దర్శకుడు. కార్యక్రమంలో వంశీ పైడిపల్లి, సి.కల్యాణ్, నందినిరెడ్డి, కల్యాణి మాలిక్, ప్రగతి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

నిన్ను చూసి నవ్వినవాళ్లకు చెప్పు... ఏడ్చే రోజు త్వరలోనే వస్తుందని!

చిత్రం: ఖైదీ నంబర్ 150


\- పంపినవారు: జీవీ మురళీమోహన్, ముచ్చుమిల్లి, తూ.గో.జి.

మీకు నచ్చిన సినిమా పంచ్ డైలాగ్‌లు, పాటల్లోని సందేశాలను మాకు రాసి పంపించండి. వాటిని మీ పేరుతో ప్రచురిస్తాం!

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ హైదరాబాద్ - 501512

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

కూతురుతో కలిసి...



హాస్య నటుడు శ్రీనివాసరెడ్డి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'జంబలకిడి పంబ'. జె.బి.మురళీకృష్ణ దర్శకుడు. రవి, జోజో జోస్, శ్రీనివాసరెడ్డి.ఎన్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ పరిసరాల్లో కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో శ్రీనివాసరెడ్డితో పాటు, నెల వయసున్న ఆయన కూతురు కూడా నటిస్తోంది. హాస్యం ప్రధానంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం కోసం నా కూతురుని కెమెరా ముందుకు తీసుకురావడం, ఆమెతో కలిసి నటిస్తుండడం థ్రిల్లింగ్ ఉందని శ్రీనివాసరెడ్డి చెప్పారు.

పాత్రల ఎంపికలో వాళ్లే స్ఫూర్తి!



"పోలీసు అధికారి అయిన కథానాయకుడిని ఆటపట్టించే చలాకీ అమ్మాయి పాత్రలో నేను సందడి చేస్తా" అంటోంది సీరత్ కపూర్. రవితేజ కథానాయకుడిగా తెరకెక్కిన 'టచ్ చేసి చూడు'లో ఆమె ఓ కథానాయికగా నటించింది. విక్రమ్ సిరికొండ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ నిర్మాతలు. ఫిబ్రవరి తొలి వారంలో చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో సీరత్‌కపూర్ విలేకర్లతో మాట్లాడింది.

- "సినిమాల్లో ఎక్కువగా కథానాయకులే ఆటపట్టిస్తుంటారు. కానీ ఇందులో భిన్నం. కథ రీత్యా కథానాయకుడు రవితేజను నేనే సరదాగా ఆటపట్టిస్తుంటా. అంత పొగరున్న అమ్మాయిని. నా పాత్ర పేరేంటన్నది చెప్పను. నేనేం చేస్తుంటాను? పోలీసు అధికారికి ఎలా దగ్గరయ్యానన్నది తెరపైనే చూడాలి. పోలీసు కథలంటే ఎక్కువగా సీరియస్‌గానే సాగుతుంటాయి. కానీ ఇందులో వినోదానికీ ప్రాధాన్యం ఉంది. 'రాజుగారి గది2', 'ఒక్కక్షణం' తర్వాత ఈ చిత్రంతో మరో మంచి పాత్ర చేసే అవకాశం లభించింది".
- "అందంగా కనిపించడమే కాదు... అభినయం ప్రదర్శించడం కూడా కీలకమే. 'రాజుగారి గది 2' అందంగా కనిపించినప్పటికీ... 'ఒక్క క్షణం'లో డీగ్లామర్‌తో కూడిన స్వాతి పాత్రతో అభినయాన్ని ప్రదర్శించా. 'టచ్ చేసి చూడు'లోని పాత్ర అందం, అభినయం మేళవింపుగా ఉంటుంది. ప్రస్తుతం దగ్గుబాటి రానా, సిద్ధుతో కలిసి రెండు చిత్రాలు చేస్తున్నా. అవకాశం వస్తే అభినయ ప్రధానమైన పాత్రలు మరిన్ని చేయాలనుంది. అనుష్క, రకుల్, సమంతల నటనంటే ఇష్టం. పాత్రల ఎంపికలో వారిని స్ఫూరిగా తీసుకుంటా".
- "ఇప్పుడు అందరి దృష్టి తెలుగు సినిమా పరిశ్రమపైనే ఉంది. బాలీవుడ్ కూడా తెలుగు పరిశ్రమ పోకడలను పరిశీలిస్తోంది. ఈ దశలో నేను తెలుగులో కొనసాగుతుండడం ఆనందంగా ఉంది. హిందీలో నేను 'జిద్' తర్వాత మరో సినిమా చేయలేదు. బలమైన పాత్ర లభిస్తే అక్కడ సినిమా చేస్తా. దక్షిణాది బాషా చిత్రాలకే నా తొలి ప్రాధాన్యత. 'టచ్ చేసి చూడు'లో తొలిసారిగా మాస్ టచ్ ఉన్న పాటలో ఆడిపాడా. ప్రాధాన్యమున్న పాత్రతో పాటుగా, ప్రత్యేకగీతంలో ఆడిపాడే అవకాశం వస్తే చేయడానికి నేను సిద్ధమే".
- "కొరియోగ్రాఫర్‌గా ప్రయాణం మొదలుపెట్టిన నేను కథానాయికగా మారాను. మునుముందు ఎవరైనా నీ పాటకి నువ్వే నృత్యరీతులు సమకూర్చుకో అన్నా నేను సిద్ధమే. నృత్యం అంటే నాకు ఇష్టం. తెలుగు బాగా అర్థం అవుతుంది. కానీ మాట్లాడలేను. ఒక టీచర్ సహాయంతో తెలుగు నేర్చుకుంటున్నా. భవిష్యత్తులో నా సొంత గొంతుని వినిపించాలనే ఆశ వుంది. 'రాజుగారి గది2'లో వచ్చీరాని తెలుగు అమ్మాయిగా ఒక సన్నివేశంలో నేనే మాట్లాడా".

చేతిలో చెయ్యేసి...



అంజన, అరుణ్ రాహుల్

అరుణ్ రాహుల్, అంజన జంటగా కట్ల రాజేంద్రప్రసాద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న కొత్త చిత్రం 'చేతిలో చెయ్యేసి చెప్పు బావ'. కె.జె.రాజేశ్ నిర్మాత. సుమన్, భాను చందర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమలతో లాంఛనంగా చిత్రాన్ని ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి సాయివెంకట్ క్లాప్‌నిచ్చారు. పార్థసారధి కెమెరా స్విచ్చాన్ చేశారు. గోవిందరావు గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు మాట్లాడుతూ "రెండు జన్మల నేపథ్యంలో సాగే చిత్రమిది. తమ ప్రేమని గెలిపించుకొనేందుకు ఓ జంట జన్మజన్మలుగా ఎలా పోరాటం చేసిందనేది తెరపైనే చూడాల"న్నారు. ఫిబ్రవరి నుంచి రెగ్యులర్ చిత్రీకరణని ప్రారంభిస్తామని చెప్పారు నిర్మాత.

కరిష్మాకపూర్‌ను చూశాకా మారిపోయా!



శ్రద్ధాకపూర్

బబ్లీ గర్ల్ పాత్రలతో పాటు, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు పోషిస్తూ బాలీవుడ్‌లో తన ప్రత్యేకత తను చాటుకునే దిశగా అడుగులు వేస్తోంది శక్తి కపూర్ తనయ శ్రద్ధాకపూర్. సినిమా నేపథ్యం ఉంది కాబట్టి వెండితెరకు రావడం శ్రద్ధాకు కష్టమేమీ కాదు. ఇంతకీ ఆమెకు హీరోయిన్ కావాలనే ఆలోచన ఎప్పుడొచ్చింది? అంటే "చిన్నప్పటి నుంచీ హీరోయిన్ కావాలనే ఆలోచన ఉండేది కాదు కానీ, డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. అద్దం మందు నిల్చొని పాట పాడుతూ డ్యాన్స్ చేసేదాన్ని. వాటిని రికార్డు చేసేదాన్ని. రేడియో స్టేషన్‌లో చెప్పినట్టు 'నేను మీ శ్రద్ధ. తర్వాత మీరు 'స్పైసీ గర్ల్' పాట వినబోతున్నారు. దాని తర్వాత 'బ్యాక్ స్ట్రీట్ బాయ్స్' పాట రాబోతోంది' ఇలా సరదాగా చేసేదాన్ని. 'నువ్వు శక్తికపూర్ కుమార్తెవు. తప్పకుండా హీరోయిన్ కావాల్సిందే' అనేవారు దగ్గర వాళ్లంతా. నేను సైకాలజిస్ట్ అవుతా, డాక్టర్ చదువుతా అనేదాన్ని. తర్వాత నెమ్మదిగా డ్యాన్స్ క్లాసులకు వెళ్లడం, సినిమాలు చూడటం మొదలుపెట్టాను. 'దిల్‌తో పాగల్ హై'లో కరిష్మాకపూర్‌ను చూసి 'అబ్బా ఎంత అందంగా ఉందో... నేను అలాంటి ఓ సినిమా చేయాలి' అనుకున్నాను. 'మంచి అవకాశం వస్తే నటిద్దువు గానీ, చదువుకో' అన్నారు నాన్న. డిగ్రీలో చేరాను. ఇంతలో 'తీన్ పత్తి' రూపంలో అవకాశం వచ్చేసింది" అని చెప్పుకొచ్చింది శ్రద్ధ. ఈ భామకు ఇప్పుడు తెలుగులోనూ ఫాలోయింగ్ ఏర్పడింది. ఎందుకంటే 'బాహుబలి 2' తర్వాత ప్రభాస్ నటిస్తున్న 'సాహో'లో కథానాయిక శ్రద్ధానే.

పాచిపని చేసి... ఆసుపత్రి కట్టించి

సుభాషిణి మిస్త్రీ వయసు డెబ్బైఏళ్ల పైమాటే. ఆమెని నిశితంగా గమనిస్తే... కళ్లల్లో ఒకలాంటి మెరుపు కనిపిస్తుంది. అడిగితే అది నా ఆత్మసంతృప్తి అంటుందామె. దాన్నెలా సొంతం చేసుకుంది? ... పేదరికం భర్త ప్రాణాన్ని తీసేసుకున్నా... నలుగురు పిల్లల్ని పెంచలేని దైన్యం ఆమెను సవాల్ చేసింది. అయినా ఆమె కుంగిపోలేదు. తనకు ఎదురైన బాధలు మరెవరికీ రాకూడదనుకుంది. ఓ వైపు పాచిపని చేస్తూనే... తాహతుకు మించి పేదల కోసం ఆసుపత్రి కట్టించాలనుకుంది. కొడుకుని డాక్టర్‌ని చేయాలనుకుంది. అనుకున్నది సాధించింది. పశ్చిమబంగకు చెందిన సుభాషిణీ మిస్త్రీ గెలుపు ఇది. తాజాగా పద్మశ్రీ అవార్డుని అందుకున్న సందర్భంగా ఆమె గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తే...





పేద ప్రజలకోసం ఆసుపత్రి కట్టించాలనుకున్న ఆమె లక్ష్యం వెనుక పెద్దకథే ఉంది. బెంగాల్‌లో ప్రముఖ రైతు కూలీ ఉద్యమం జరుగుతున్న రోజుల్లో సుభాషిణి పుట్టింది. తండ్రి సన్నకారు రైతు. ఆయనకి పద్నాలుగు మంది పిల్లలు. వారిని పెంచలేక ఉన్న కొద్దిపాటి భూమినీ అమ్ముకున్నారు. అది కరిగిపోయినా వారి కష్టాలు తీరలేదు. దాంతో చర్చిలూ, గుళ్లూ, బస్టాండ్ల దగ్గర భిక్షాటన చేసేవారు. ఈ లోగా ఆ పద్నాలుగు మందిలో ఏడుగురు పిల్లలు ఆకలిబాధలు తట్టుకోలేక చనిపోయారు. అప్పటినుంచే పేదరికం సుభాషిణికి ఎన్నో అనుభవాలను రుచి చూపించింది. పదమూడేళ్లు వచ్చాయో లేదో వాళ్లూరికి పదికిలోమీటర్ల దూరంలో ఉన్న హన్‌స్పూకుర్ గ్రామానికి చెందిన రైతుకూలీ చంద్రతో పెళ్లయ్యింది. అత్తారింటికి వచ్చేసింది. వారికి నలుగురు పిల్లలు. సంపాదించిన కొద్దిమొత్తంతోనే సంతోషంగా గడిపేస్తున్నారా దంపతులు.

అనుకోని ప్రమాదం...

కుటుంబం కాస్త కుదుట పడింది అనుకునేలోగా పెద్ద దెబ్బ. అది 1971. ఓ రోజు కడుపులో నొప్పి అని విలవిల్లాడిపోతున్న భర్తను స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లింది. అది పేరుకి ప్రభుత్వ ఆసుపత్రే అయినా డబ్బు ముట్టచెప్పని కారణంగా చిన్నపాటి అనారోగ్యానికే భర్తను కోల్పోవాల్సి వచ్చింది. కుటుంబానికి ఆధారమైన అతడి మరణం ఆమెను కుంగదీసింది. చదువులేదు, చేతిలో పనీలేదు.

నలుగురి పిల్లల్ని ఎలా సాకాలో తెలియక నిద్రలేని రాత్రులెన్నో గడిపింది. అప్పుడే తనకు వచ్చిన సమస్య ఎవరికీ రాకూడదనుకుంది. తన పిల్లల్లో ఒకరిని డాక్టర్‌ని చేయాలనీ, పేదలకోసం ఆసుపత్రిని కట్టించాలని అనుకుంది. నిజంగా ఎవర్కైనా చెబితే ఆ సమయంలో నవ్వేవారేమో! ఎందుకంటే నలుగురిపిల్లలకి కడుపు నిండా తిండి కూడా పెట్టలేని పరిస్థితి. అప్పటికి పెద్దబ్బాయికి ఎనిమిదేళ్లు, చిన్నబ్బాయికి కనీసం రెండు కూడా నిండలేదు. భయం, బాధ కన్నీళ్ల రూపంలో ధారలా ప్రవహిస్తున్నా...ఆమె ఆలోచనల్లో స్పష్టత మాత్రం పోలేదు. పిల్లల్ని పెంచుకోవాలి, ఆసుపత్రి కట్టాలి... అని గట్టిగా అనుకుంది.

పిల్లల్ని అనాథాశ్రమానికి...

ఆమెకు తెలిసిందల్లా ఒకటే...ఇంటి పని. అందుకే దగ్గర్లోని ఐదు ఇళ్లల్లో పాచిపని చేయడానికి ఒప్పుకొంది. నెలకు సంపాదన వందరూపాయలు. బాగా చదివే చిన్న కొడుకుని డాక్టర్ చేయాలనుకుంది. మనసుకి కష్టమైనా కూతుర్ని దగ్గర్లోని అనాథాశ్రమానికి పంపించేసింది. మరో ఇద్దరు పిల్లల్ని సాయంగా ఉంచుకుంది. సంపాదించే వందరూపాయలతో లక్ష్యం చేరుకోలేననుకుంది. దాంతో దగ్గర్లోని మరో గ్రామానికి వెళ్లి కూరగాయలు పండించి అమ్మడం మొదలుపెట్టింది. ఆదాయం పెరిగింది. ఆ ఆదాయంలో కొంత పోస్టాఫీసులో పొదుపు చేయడం ప్రారంభించింది. ఆ మొత్తం పిల్లాడి చదువుకే కేటాయించింది. ఇలా ఇరవై ఏళ్లపాటు దాచుకుని రెండు లక్షల రూపాయలు పోగేసింది. ఆ మొత్తంతో తన అత్తగారి ఊరులో ఓ చిన్నపాటి స్థలాన్ని కొంది. గ్రామస్థులను పోగేసి తన లక్ష్యాన్ని చెప్పింది. వారంతా కలిసి తొమ్మిది వందల రూపాయలు ఇచ్చారు. వాటికి అదనం కొందరు కలప, మట్టి వంటివీ అందించారు. దాంతో ఓ పూరిగుడిసెను వేసి దాన్నే ఆసుపత్రిగా ప్రచారం చేసింది. కొందరు డాక్టర్లను కలిసి ఉచిత వైద్యం చేయమని కోరింది. ఆమె ఆశయాన్ని గుర్తించిన కొందరు డాక్టర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. అలా మొదటి రోజు సుమారు 225 మంది రోగులు అక్కడికి వచ్చారు. క్రమంగా దానికి గుర్తింపు వచ్చింది. రోగుల సంఖ్య కూడా బాగా పెరిగింది. దానికి ఆవిడ హ్యూమానిటీ ఆసుపత్రిగా పేరు పెట్టింది.

గవర్నర్ ప్రారంభించారు...

ఆసుపత్రి అయితే ప్రారంభించారు కానీ వసతుల లేమి కొత్త సమస్యలు తెచ్చిపెట్టింది. చిన్నపాటి వర్షానికే ఆ గుడిసె తడిసిపోయేది. మోకాళ్లలోతు నీళ్లతో ఆ ప్రాంతం చెరువుని తలపించేది. దాంతో డాక్టర్లు రోడ్డుమీదే పరీక్షలు చేయాల్సి వచ్చేది. దాంతో శాశ్వత భవనం అవసరం అనుకుంది. కానీ పెద్ద మొత్తంలో డబ్బు కావాలి. ఇరవై ఏళ్లు కష్టపడితేనే కానీ ఈ మాత్రం కూడా సాధ్యపడలేదు...అని బాధపడతున్నప్పుడు కొడుకు అజయ్ ఓ సలహా ఇచ్చాడు. అమ్మ తరపున స్థానిక ఎంపీకి వినతిపత్రం ఇచ్చాడు. కానీ ఆమెను కలవడానికి చాలాసార్లు తిరగాల్సి వచ్చేది. కలిసినా ఎటువంటి హామీ లభించలేదు. తన తల్లి ఆశయం గురించి పదే పదే చెబుతున్న ఆ తీరు ఎంపీకి నచ్చి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు. శిలాఫలకమూ వేశారు. కానీ ఈ విషయం స్థానిక పత్రికలకూ కూడా తెలియదు. భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రెండంతస్థుల భవనంలో నలభై ఐదు పడకలతో దీన్ని నిర్మించారు. గవర్నర్ దాన్ని ప్రారంభించడానికి వస్తున్నారన్నప్పుడు ఒక్కసారిగా ఆమె పట్టుదల ప్రపంచానికి తెలిసింది.

డాక్టర్ కొడుకు...కూతురు నర్స్

సుభాషిణి ఇరవైఏళ్ల కలనెరవేరింది. ఆమె కలల సామ్రాజ్యం పేద రోగులకు అందుబాటులోకి వచ్చింది. అదే సమయంలో మరోపక్క, ఆమె చిన్నకొడుకు అజయ్‌కు కోల్‌కతా మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. వైద్యవిద్య పూర్తిచేసిన కొడుకు అజయ్ అదే ఆసుపత్రిలో డాక్టర్‌గా చేరాడు. కూతురు నర్స్ శిక్షణ పూర్తి చేసుకుని అక్కడే పనిచేస్తోంది. పేదలకు పదిరూపాయలకే వైద్యాన్ని చేరువ చేసింది.. "వైద్యం వ్యాపారం కాదు...సేవమాత్రమే" అనే ఆమె తన నిరాడంబరతను ఇప్పటికీ కొనసాగిస్తోంది. మళ్లీ పాత ఇంటికే చేరుకుంది. కూరగాయల వ్యాపారం చేసే మరో కొడుకూ, కూతురు దగ్గరే తన కాలం వెళ్లదీస్తోంది. ఓ నిరుపేదకు ఇదంతా ఎలా సాధ్యమయ్యింది అని ఆమెనే అడిగితే "లక్ష్యంపై స్పష్టత ఉండటం ముఖ్యం" అనేస్తుంది. తన ఆశయం ఇంకా పూర్తికాలేదనీ, ఆ ఆసుపత్రి సేవలు 24 గంటలూ అందుబాటులోకి తేచ్చే ప్రయత్నంలో ఉందామె. వయసుపైబడినా ఇప్పటికీ దానికోసం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఆ పట్టుదలా, కృషే సుభాషిణికి ఈ సంవత్సరం పద్మశ్రీ అవార్డు తెచ్చి పెట్టింది.

అడవి బామ్మ పాఠాలు చెబుతోంది...!



అది కేరళలోని తిరువనంతపురం జిల్లా కల్లార్‌లోని దట్టమైన అటవీ ప్రాంతం. అక్కడే ఓ చిన్న పూరి గుడిసె. ఇప్పుడు మీడియా అంతా అక్కడే మొహరించింది. దేశవ్యాప్తంగా ఆ గుడిసె గురించీ ఓ పెద్ద చర్చ. ఇంత ప్రత్యేకత అక్కడ ఏముంది అంటారా? వనముత్తాసి(అడవికి బామ్మ)గా పిలిచే లక్ష్మీ కుట్టి నివాసం అది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించిన పద్మశ్రీ జాబితాలో ఆమె పేరూ ఉంది. ఇంతకీ ఆమె ఎవరు? ఏమిటి ఆవిడ ప్రత్యేకత? లక్ష్మీ కుట్టి వయసు డెబ్భై ఆరేళ్లు. ఇప్పటికీ ఆమె ఇంటి ముందు రోజూ వైద్యం కోసం రోగులు బారులుతీరి ఉంటారు. ఆమె ప్రముఖ వైద్యురాలు. కానీ వైద్యవిద్య చదివి ఆమె డాక్టరు కాలేదు. తల్లినుంచి వచ్చిన వారసత్వాన్ని అందిపుచ్చుకుని వనమూలికా వైద్యురాలయ్యింది. కేరళలో ఈ తరహా వైద్యానికి ప్రాధాన్యం ఎక్కువ. అయితే లక్ష్మీ కుట్టీ కానీ, ఆమె తల్లి కానీ తాము చేస్తున్న వైద్యం గురించి, మందుల మొక్కలూ, వాటి ఉపయోగాల గురించి ఎక్కడా గ్రంథస్థం చేసిన ఆనవాళ్లు లేవు. కేరళ ప్రభుత్వమే లక్ష్మీ కుట్టి చేసే మూలికా చికిత్సలను త్వరలో పుస్తకాల్లో భద్రపరచాలనుకుంటోంది. ఈ వైద్యం కోసం చుట్టుపక్కల గ్రామాల నుంచే కాదు కొన్ని వందల మైళ్ల దూరం నుంచీ ఆ ఇంటి ముందు పడికాపులు పడుతుంటారు. పామూ, తేలూ, కుక్కకాటుకి విరుగుడుగా ఆమె ఇచ్చే మందులకే ఎక్కువ ప్రాచుర్యం. వివిధ అనారోగ్య సమస్యలకు పరిష్కారంగా అయిదు వందలకు పైగా మూలికాఔషధాలను తయారు చేశారామె. ఈ వైద్యానికి అవసరమైన మూలికలను, నూనెలనీ మొక్కల నుంచే సేకరిస్తారు. అంతేనా కేరళ ఫోక్‌లోర్ అకాడమీతోపాటు దక్షిణభారతదేశానికి చెందిన అనేక ప్రముఖ విద్యాసంస్థల్లో వనమూలికా వైద్యం గురించి తరగతులూ చెబుతారు. 2016లో ఇండియన్ బయోడైవర్సిటీ కాంగ్రెస్ అవార్డు అందుకున్న ఆమెను తాజాగా భారత ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. మూలికా వైద్యురాలిగానే కాకుండా ఆమెలో కవయిత్రీ, రచయిత్రీ దాగి ఉన్నారు. గిరిజన సంప్రదాయాల గురించి ఆమె రాసిన పలు వ్యంగ్య కవితలూ, రచనలు పలు పత్రికల్లో అచ్చయ్యాయి.

ముఠాను పట్టించినందుకే...

అక్కడ ఎవరికి కష్టం వచ్చినా ఆమెను కలుస్తారు! పరిష్కారం చూపమని అడుగుతారు... తన వద్ద న్యాయం దొరుకుతుందని నమ్ముతారు! అలాగని తనేమీ కలెక్టర్ కాదు... రాజకీయ నాయకురాలు కాదు... లేడీ డాన్ అంతకన్నా కాదు... సాదాసీదా అమ్మాయి... వయసు 18... ఇంకా డిగ్రీ ఫస్టియర్ చదువుతోందంతే! అన్నింటికి మించి నిరుపేద కుటుంబం...! ప్రజలే కాదు... కేంద్ర ప్రభుత్వమూ ఆమెను గుర్తించింది! ఒకటీ.. రెండూ.. వరుసగా మూడేళ్లుగా రాష్ట్రపతి, ప్రధాని ఆమెను ఆహ్వానించి అవార్డులతో గౌరవించారు! తాజాగా... శుక్రవారం గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో పాల్గొని, గౌరవ వందనం అందుకుంది.... ఆమే నజియా. తన ప్రత్యేకత వసుంధరతో చెప్పుకొచ్చిందిలా...



మా ఇంట్లో నేనే చిన్నదాన్ని. దిల్లీలో రద్దీగా ఉండే మంటోలా ప్రాంతంలో ఉంటాం. నాన్న చెప్పులు కుడతారు. నిత్యం రద్దీగా ఉండే మా ప్రాంతం సంఘ విద్రోహక చర్యలకు నిలయం. అక్కడే పుట్టి, పెరిగిన నేను అమ్మాయిలకు తోచిన సాయం చేయడంలో ముందుంటా. ప్రమాదంలో ఉన్నారనిపిస్తే, వెంటనే సాయం చేయాలనుకుంటా. మూడేళ్ల కిందట... ఓ రోజు పాఠశాల నుంచి వస్తున్నా. అకస్మాత్తుగా నా పక్క నుంచి ద్విచక్రవాహనం వేగంగా వెళ్లింది. దానిపై ఓ ఆరేళ్ల చిన్నారి 'కాపాడండి' అంటూ ఏడుస్తోంది. ఆ ఇద్దరు యువకులు బలవంతంగా అమ్మాయిని ఎత్తుకెళుతున్నారని అర్థమైంది. ఎవరూ పట్టించుకోలేదు. అంతే పరుగు మొదలుపెట్టా. చివరికి ఆ పాప గౌను చేతికి అందితే అందిపుచ్చుకుని కిందకి లాగేశాను. ఇద్దరం కింద పడిపోయాం. ఆ యువకులూ అదుపుతప్పి కిందకు జారిపోయారు. తప్పించుకునే ప్రయత్నం చేస్తున్న వారిని చుట్టుపక్కలవాళ్లు పట్టుకున్నారు. అలా వాళ్లు జైలుపాలయ్యారు.

రాళ్లతో కొట్టారు... నేను పాఠశాలకు వెళ్లే మార్గంలో రౌడీలు ఎక్కువ. నాతోటి అమ్మాయిల్ని అసభ్యకరంగా మాట్లాడేవారు. బాధేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశా. అది తెలిసి వాళ్లు మా ఇంటికొచ్చి నాన్నా, అన్నయ్యలు లేనప్పుడు రాళ్లతో కొట్టి, హెచ్చరించి వెళ్లారు. మళ్లీ పోలీసులకు మళ్లీ ఫిర్యాదు చేశా. దాంతో కొంత భద్రత దొరికింది. ఆ రౌడీలు అరెస్టయ్యారు.

భద్రత కల్పించారు... మా ప్రాంతంలో బెట్టింగ్, గాంబ్లింగ్ ఎక్కువగా జరిగేది. చిన్నపిల్లలు కూడా ఆడేవారు. ఆ ముఠానూ పోలీసులకు పట్టించా. అలా నన్ను అందరూ గుర్తించి తమ సమస్యలు చెప్పుకొని సాయం చేయమనేవారు. ప్రస్తుతం బీఏ చదువుతున్నా. సాయం చేయడం ఒకెత్తయితే.. బెదిరింపులు మరొకెత్తు. అమ్మ మాత్రం నాకు ధైర్యం చెప్పేది. సమాజం బాగుంటేనే మనం బాగుంటామని చెప్పేది. అప్పటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్‌ను సాయమడిగితే భద్రత దొరికింది. మా ప్రాంతంలో సంఘవిద్రోహచర్యలు తగ్గుముఖం పట్టాయి. చిన్నారిని కాపాడినందుకు నాకు లక్ష్మీబాయ్ అవార్డుతోపాటూ లక్షరూపాయలు నగదు బహుమతిగా అందించింది. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులతో అవి అమ్మకు ఇచ్చేశా. గాంబ్లింగ్ ముఠాను పట్టించినందుకే ఈ ఏడాది బ్రేవరీ అవార్డు ఇచ్చారు. ప్రధాని ప్రశంసించారు. ప్రభుత్వం నా చదువుకు సాయం చేస్తుంది. నాన్న మాత్రం మొదట కోప్పడినా, ఇప్పుడు ఆయన్ని నజియా తండ్రి అని పిలుస్తున్నారట. అందుకే గర్వపడుతున్నారు. అమ్మ ఎప్పుడూ చెప్పేది ఒకటే. నేను కలెక్టరు కావాలని. ఏదో రోజు దాన్నీ సాధిస్తా.

- 2015 - 'యాక్ట్ ఆఫ్ సేవింగ్ లైఫ్ ' అవార్డును రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ అందించారు.
- 2016- ప్రధాని నుంచి 'రాణీ లక్ష్మీబాయి బ్రేవరీ అవార్డు' వచ్చింది.

– సిహెచ్.వసుంధరా దేవి

జిల్లుమనే రుచికి కారణమిదే!



చూయింగ్ గమ్‌లూ, కొన్ని టూత్‌పేస్ట్‌ల్లోనూ ఉండే జిల్లుమనే లాంటి రుచికి కారణం పిప్పర్‌మింట్ అని అందరికీ తెలుసు. కానీ, ఈ పిప్పర్‌మింట్ ఒక మొక్క నుంచి వస్తుందన్న విషయం చాలామందికి తెలియకపోవచ్చు. ఇది వాటర్‌మింట్, స్పియర్‌మింట్ అనే రెండు పుదీనా రకాలను సంకరణం చేసి రూపొందించిన హైబ్రిడ్ రకం. దీని శాస్త్రీయ నామం మెంథా పైపరేటా లేదా మెంథా బాల్సామియా. పిప్పర్‌మింట్ జన్మస్థలం యూరప్. అయితే ఇప్పుడు దీన్ని ప్రపంచమంతటా పెంచుతున్నారు.

పిప్పర్‌మింట్ బహువార్షికం. దాదాపు అడుగు నుంచి అడుగున్నర ఎత్తు వరకూ పెరుగుతుంది. దీనిలో రెండు రకాలున్నాయి. ఒక రకంలో కొమ్మలూ, ఆకు ఈనెలు ఎరుపు రంగులో ఉండి ఆకులు కొంచెం చిన్నగా ఉంటాయి. మరో రకంలో కొమ్మలూ, ఈనెలు ఆకుపచ్చ రంగులో ఉండటంతోపాటు ఆకులు కాస్త పెద్దవిగా ఉంటాయి. ఎర్ర కాడల రకాన్ని ఇంగ్లిష్ పిప్పర్‌మింట్ అంటారు. ఈ రకం త్వరగా పెరగడంతోపాటు ఎక్కువ వాడుకలో ఉంది కూడా. అయితే ఆకుపచ్చ రకం నుంచి తీసిన నూనెకు మార్కెట్‌లో అధిక ధర ఉంది.

వేలాడే కుండీల్లోనూ...



పిప్పర్‌మింట్ ఎండలో కంటే కొద్దిపాటి నీడలో బాగా పెరుగుతుంది. నీరు నిలవని, సారవంతమైన, తేమగా ఉండే మట్టి మిశ్రమం దీనికి బాగా అనుకూలం. ఇది చాలా త్వరగా పెరిగే మొక్క. ఒకసారి కుదురుకుంటే చాలు త్వరగా అల్లుకుపోతుంది. పిప్పర్‌మింట్‌ను కుండీల్లోనూ, వేలాడే కుండీల్లోనూ చక్కగా పెంచుకోవచ్చు. నేలలో నాటుకున్నప్పుడు వీలైనంత పరిమాణంలో ఉన్న సిమెంటు రింగును నేలలో రెండు అంగుళాలు దిగేలా అమర్చుకుంటే మొక్క అన్నివైపులకు పాకకుండా ఉంటుంది. పిప్పర్‌మింట్ మొక్కలో ఆ రుచీ, సువాసనకు కారణమైన మెంథాల్ దాని ఆకుల్లోనే కాకుండా, పూలలో కూడా ఉంటుంది. పిప్పర్‌మింట్‌కు సాధారణంగా చీడపీడలు ఆశించవు. దీనికే సహజంగానే చీడపీడలను నివారించే లక్షణం కూడా ఉంటుంది. అలానే దీని ఆకుల రసాన్ని సేంద్రియ వ్యవసాయంలో పురుగుల నివారణకు వాడొచ్చు. దోమలను కూడా అదుపులో ఉంచొచ్చు. దీని సువాసనతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయట.

పిప్పర్‌మింట్‌కు ఔషధగుణాలెక్కువ. దురదకు, కండరాల నొప్పులకు ఇది మంచి మందు. ఒత్తిడిని తగ్గించడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. అంతేకాదు ఆరోగ్యవంతమైన చర్మం, ఒత్తయిన జుట్టూ, అందమైన గోళ్లకు ఉపయోగపడే సౌందర్య సాధనంగానూ పిప్పర్‌మింట్ ఉపయోగిస్తారు. ఈ మొక్కను గ్రౌండ్ కవర్‌గా వాడుకోవచ్చు. ఇతర మొక్కలతో కలిపి పెద్ద కుండీల్లో నాటుకోవచ్చు. దీనికి పెద్దగా ఎరువుల అవసరం లేదు. 2-3 నెలలకొకసారి వర్మికంపోస్టు గానీ, వేరుశనగపిండి, కానుగ పిండి లాంటి ఎరువుల్ని గానీ మట్టి మిశ్రమంలో కలుపుతూ ఉంటే ఆకులు తాజాగా నవనవలాడుతూ ఉంటాయి. పిప్పర్‌మింట్ హైబ్రిడ్ కాబట్టి గింజలు సాధారణంగా మొలవవు. నేల అడుగున పాకే కాండంతో వచ్చిన పిలకలను విడదీసి గానీ, కొమ్మ కత్తిరింపులతో గానీ ప్రవర్ధనం చేయవచ్చు.

- బోడెంపూడి శ్రీదేవి, ల్యాండ్‌స్కేప్ కన్సల్టెంట్

నజరానా

జిగురూ, వాసనలతో ఉన్న కూరగాయాల కట్టర్‌ను శుభ్రపరచాలంటే... దానిపై కాసింత వంటసోడా వేసి అయిదునిమిషాలాగాలి. ఆ తరువాత కడిగేస్తే సరి.

బంగారం వెండి

26న ముగింపు-క్రీతం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	-------	31,500	-------	31,060
ఆర్నమెంట్	-------	29,500	-------	28,800
వెండి (కిలో)	-------	40,000	-------	40,700

	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	-------	30,750	31,250	30,950
ఆర్నమెంట్	-------	28,480	29,220	28,950
వెండి (కిలో)	-------	39,900	40,300	39,600

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,420	31,020	-------	-------
ఆర్నమెంట్	29,220	28,830	2,922	2,895 గ్రా
వెండి (కిలో)	41,500	40,500	43.11	42.20 గ్రా

ఆరోగ్యానికి ముల్లంగి!

ముల్లంగిని వాసన చూస్తేనే ముక్కు మూసుకుంటారు. కొందరు. చాలామంది తమ ఆహారంలో తీసుకోరు కూడా. అయితే దీన్ని తీసుకోవడం చాలా లాభాలున్నాయి.

- దీన్ని క్యారెట్ మాదిరిగానే పచ్చిగా కూడా తీసుకోవచ్చు. కూరలూ, పచ్చళ్ల తయారీలోనూ వాడుకోవచ్చు. ఈ మొక్కలోని ప్రతి భాగం ఉపయోగపడుతుంది. ఇందులో విటమిన్లూ, ఖనిజాలూ, పోషకాలు కూడా మెండుగానే ఉంటాయి.
- ముల్లంగిలో పీచూ, నీరు ఎక్కువ. దీన్ని తీసుకోవడం వల్ల శరీరం డీ హైడ్రేషన్‌కి లోనుకాకుండా ఉంటుంది. జీర్ణక్రియ వ్యవస్థ పనితీరు బాగుంటుంది. చర్మం కూడా తాజాదనంతో మెరుస్తుంది.
- రోజులో కొన్ని ముల్లంగి ముక్కలను సలాడ్ల రూపంలో తీసుకోవడం వల్ల మీకు కావల్సినంత విటమిన్ సి లభిస్తుంది.
- ముల్లంగి మూత్రపిండ సంబంధ వ్యాధులను తగ్గిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్థుల్లో చక్కెర స్థాయులను నియంత్రిస్తుంది.


నెలన్నరలో మూడుసార్లు రక్తస్రావం..

మా అమ్మాయి వయసు పందొమ్మిది సంవత్సరాలు. తనకు ఇంతకుముందు నెలసరి క్రమంగా వచ్చేది గత రెండు నెలల నుంచి ఇబ్బంది మొదలైంది. నెలన్నర సమయంలోనే రెండు, మూడుసార్లు రక్తస్రావం కనిపిస్తోంది. దానికి కారణం ఏంటీ.. ఏదయినా చికిత్స ఉందంటారా..

- ఓ సోదరి

వయసు పందొమ్మిది అంటున్నారు. చదువుల ఒత్తిడి వల్ల కూడా కొన్నిసార్లు ఇలాంటి సమస్య ఎదురుకావచ్చు. అలాగే రెణ్నెల్లుగా విపరీతమైన రక్తస్రావం అవుతోందంటే రక్తహీనత సమస్య ఎదురై ఉండొచ్చు. అలాగే రక్తకణాల సంఖ్య కూడా తగ్గి ఉండొచ్చు. మీరు మీ అమ్మాయిని ఒకసారి వైద్యుల దగ్గరకు తీసుకెళ్లడం మంచిది. కంప్లీట్ బ్లడ్‌పిక్చర్‌తో పాటూ, థైరాయిడ్, అల్ట్రాసౌండ్ పెల్విస్ స్కాన్ చేస్తారు. అలాగే అండాశయాల్లో కణతులు ఉన్నాయా అనేది తెలుసుకుంటారు. కణతులు ఉంటే గనుక వాటి పరిమాణాన్ని బట్టి అయితే హార్మోన్ల మందులు లేదా లాపరస్కోపీ ద్వారా నయం చేస్తారు. ఒకవేళ హార్మోన్ల అసమతూకం అయితే.. ఆ మందులు వాడటంతోపాటూ వ్యాయామం, ఆహారంలో మార్పులు చేసుకోవాలి. ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఉంటే గనుక తగ్గించేందుకు ప్రయత్నిస్తారు. పై కారణాలనేవి లేకపోతే.. ఒత్తిడి వల్లే ఇలా అవుతోందని అర్థం.

డియర్ వసుంధర



డా॥ అనగాని మంజుల
గైనకాలజిస్టు

పద్ధతులు పాటించండి!

ఉద్యోగంలో చేరిన తరువాత పాటించాల్సిన అంశాలు కొన్ని ఉంటాయి. వాటిని ఆచరించినప్పుడే ఉత్పాదకత పెరుగుతుంది. మరి ఓ ఉద్యోగినిగా మీరు పాటించాల్సినవేంటో చూద్దామా..

చెప్పిన పని అనుకున్న సమయంలో పూర్తి చేయలేకపోవడం, విధులకు/బృంద చర్చలకు ఆలస్యంగా హాజరుకావడం.. లాంటి విషయాలను యాజమాన్యం తీవ్రంగా పరిగణిస్తుంది. సహోద్యోగుల సమయానికి విలువ ఇవ్వడం లేదని సంస్థ భావిస్తుంది. మీ నివేదికల్ని కూడా సకాలంలో సమర్పించకపోతే ఆ ప్రభావం మొత్తం బృందంపై పడుతుంది. అలా జరగకుండా ఉండాలంటే కార్యాలయ విధులకైనా, బృంద చర్చలకైనా దాదాపు పది, పదిహేను నిమిషాల ముందు ఉండాలి. మీకు ఇచ్చిన పనిని సకాలంలో పూర్తి చేయడానికి ప్రయత్నించాలి.



- చాలామంది ఉద్యోగులు ఫేస్‌బుక్/వాట్సాప్/ట్విట్టర్ అంటూ సోషల్‌మీడియాలో ఉంటూ చాలా సమయం వృథా చేస్తారు. ఫోన్ల సంగతి చెప్పక్కర్లేదు. ఇతర సహోద్యోగులతో అదేపనిగా చర్చలు జరిపేవారు మరికొందరు. ఇలా కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల్లో కొందరి వల్ల పనిలో నాణ్యతా, ఉత్పత్తి తగ్గిపోతాయి. కాబట్టి మీరూ అలా చేయకండి. కార్యాలయానికి రాగానే ఆ రోజు చేయాల్సిన పనులను ఓసారి మననం చేసుకోండి లేదా ఒకపేజీలో అన్ని రాసుకుని ఒకదాని తరువాత ఒకటి పూర్తిచేయండి. అత్యవసరమైన, ముఖ్యమైన ఫోన్లు మాత్రమే మాట్లాడండి. ఆఫీస్‌కు సంబంధించిన మెయిళ్లను రాగానే చెక్ చేసుకోండి. సహోద్యోగులతో విధులకు సంబంధించిన విషయాలను మాత్రమే చర్చించాలి లేదా మీ లంచ్, టీ విరామ సమయంలో కాసేపు మాట్లాడొచ్చు తప్ప పని ఉన్నప్పుడు కాదు.
- సరిగ్గా ప్రణాళిక వేసుకోకపోవడం, పని చివరలో కంగారు పడటం లాంటివి యాజమాన్యం ఎదుట మనల్ని అసమర్థులుగా నిలబెడతాయి. ఉత్పత్తీ తగ్గిపోతుంది. దీన్ని అధిగమించాలంటే... ఆరోజు ఏం చేయాలనేది ఒక జాబితా తయారుచేసుకోవాలి. దానికి కట్టుబడి ఉండాలి కూడా.

మెట్టింట్లోకి రావాలంటే నెట్టిల్లొద్దు!

భార్యాభర్తలు చెరో మూలన కూర్చుని సెల్‌ఫోన్‌లతో సహవాసం చేస్తే.. సంసారం అంతే సంగతులు. అందుకేనేమో పశ్చిమబంగలోని ఓ ఇంటి తల్లిదండ్రులు ముందుచూపుతో ఓ పెళ్లి ప్రకటన ఇచ్చారు. సాధారణ పెళ్లి ప్రకటనల్లో అయితే 'వధువు అందంగా ఉండాలి. ఉద్యోగం చేస్తుండాలి' అనంటారు. అయితే పశ్చిమ బంగలో వచ్చిన ఆ పెళ్లి ప్రకటనలో మాత్రం 'మా అబ్బాయి ప్రభుత్వ ఉద్యోగి. తనకు కాబోయే భార్య వయసు 18 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఇంటర్ అయితే చాలు. అయితే.. ఆ అమ్మాయి ఫేస్‌బుక్, వాట్సాప్‌లకు అతుక్కుపోకూడదు సుమా' అని ఉంది. చూశారా భవిష్యత్తులో వధువు మెట్టింట్లోకి వెళ్లాలన్నా.. వరుడు అత్తారింట్లో అడుగుపెట్టాలన్నా.. సోషల్‌మీడియాతో బ్రేకప్ చేసుకోవాలేమో!



ఫిట్-మంత్ర

తిన్నాకే వ్యాయామం

ఖాళీ కడుపుతో వ్యాయామం చేస్తే మంచిదా?

– షఫి, కడప

'ఖాళీ కడుపుతో వ్యాయామం చేయాలి'... అనే నియమం అంత మంచిది కాదు. ఏమీ తినకుండా ఎక్స్‌ర్‌సైజ్ చేస్తే హార్మోన్లు, కండర కణజాలాలపై ప్రభావం ఉంటుంది. అంతేగాకుండా గ్లూకోజ్ స్థాయి తగ్గి శరీరం నీరసపడే ప్రమాదం లేకపోలేదు. వ్యాయామానికి అరగంట ముందే తక్కువ మోతాదులో పోషకాహారం తీసుకోవడం శ్రేయస్కరం. పాలు, అరటిపండు, డ్రైఫ్రూట్స్ తీసుకుంటే మంచిది. ఉడకబెట్టిన ఆలు ఒకటి, ఒక చిన్న కప్పులో లోఫ్యాట్



[illegible] తీసుకున్నా ఫలితం ఉంటుంది. ఒక కప్పు పండ్ల ముక్కలు, ఉడకబెట్టిన కూరగాయలు, గుడ్లు తిన్నా ప్రయోజనం. ఇవి మనకు తక్షణ శక్తినిస్తాయి. పైగా వాటిలోని పోషకాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. కండరాల వృద్ధికి దోహదపడతాయి. ఎక్కువ పిండి పదార్థాలున్న ఆహారం తీసుకోవద్దు. ఇవి అరగడానికి చాలా సమయం పడుతుంది. అప్పుడు వ్యాయామం చేయడం కష్టం. పైగా ఆ సమయంలో మెదడు చురుగ్గా పనిచేయదు. దీనివల్ల ఎక్స్‌ర్‌సైజు చేయాలన్నా ఆసక్తి తగ్గిపోతుంది.

-చిక్కా శ్రీనివాస్, ట్రైనర్, ఫిట్‌నెస్-9

ఉండ'లేఖ'..

నీ ఆనియన్ దోశకు... నా ముఖం నియాన్ బల్బ్

రోజూ నేను పనికి వెళ్లే ముందు నీ బండి దగ్గర టిఫిన్ తిని గానీ వెళ్లలేకపోతున్నా. నీ అందంతో పాటు నీ టిఫిన్లు నన్ను కట్టిపడేశాయ్. ఫస్ట్ టైమ్ తిన్నప్పుడే నీ దోశకు దాసోహం అయిపోయా. నీ ఆనియన్ దోశ తిన్నప్పుడల్లా నా మొహం నియాన్ బల్బులా వెలిగిపోతుంటుంది. నువ్వు చేసిన [illegible] చూసినప్పుడే అనుకున్నా, నీవి ఉత్తుత్త టిఫిను కావని, ఉప్పెనలా ప్రేమని ఉప్పొంగించేవని, ఉత్సాహాన్ని సృష్టించేవని, నువ్వు ఇడ్లీ చేస్తే గుడ్లప్పగించి తినడం తప్ప నోట మాట రాదు. నీ చెట్నీ తింటే ఇద్దరం కలిసి మాట్నీ చూసినంత ఆనందం కలుగుతుంది. నువ్వు పెసరట్టు చేస్తే పెసరంతైనా చేదుండదు. ఉప్మా ఎలా చేస్తావో చెప్పమ్మా అని ఎన్నో సార్లు అడిగా, అయినా చెప్పలేదు. నీ [illegible] తిన్నప్పుడల్లా నిన్ను ముంబాయిలో తిప్పాలనిపిస్తుంది. నువ్వు సరే అంటే కాకా హోటల్ నుంచి రెస్టారెంట్.. అటునుంచి స్టార్ హోటల్ వరకూ ఎదుగుదాం. స్విగ్గీ నే సిగ్గు పడేలా ఆన్‌లైనా బిజినెస్ స్టార్ట్ చేద్దాం. నువ్వు కాదంటే నా బతుకు వాడిపోయిన వడ, సాగిపోయిన నూడుల్స్, పులిసిన పుల్లట్టు కావడం కంటే వేరే మార్గం లేదు.



–అనుముల అశోక్‌కుమార్, హైదరాబాద్



నయా ట్రెండ్- మినిమలిజం

యువ(మి)త భాష్యం

సెల్‌ఫోన్లు.. ల్యాప్‌టాప్‌లు.. ట్యాబ్‌లెట్లు..
బ్రాండెడ్ దుస్తులు.. బూట్లు.. వాచీలు..
వాలెట్‌లో దండిగా డబ్బుంటే..
ఆ జోరే వేరప్పా.. కళ్లకు ఇంకేదీ కనిపించదు..
కనికట్టు చేసినట్టు కొనుడే కొనుడు..
ఆ వినియోగ మాయాజాలంలో..
ఏది అవసరం? ఏది అనవసరం? తేడా తెలీదు..
కాబట్టి ఆ హోరుకు ఓ బ్రేక్ పడాలి..
ఎక్కడ తగ్గాలో తెలియాలి..
అందుకే మీకిప్పుడు కావాలి.. మినిమలిజం..
అపరిమితాన్ని పరిమితం చేసుకునే సరికొత్త జీవనవిధానమే ఇది..

మీ విష్‌లిస్టులో జతపరిచిన బోలెడు వస్తువులు.. వార్డ్‌రోబ్‌లోని నలభై రకాల బట్టలు.. గుమ్మం బయట ఐదు జతల బూట్లు.. అల్మరా నిండా అలంకరణ వస్తువులు.. బీరువాలో అరడజను ఆభరణాలు.. రెండు బైకులు.. ల్యాప్‌టాప్, గాడ్జెట్లు.. ఏవైనా కావొచ్చు. ఇలా.. అవసరం లేని వాటినల్లా కొంటూపోతే.. అత్యవసరమైన వాటికి చేతులు ఎత్తేయాల్సి వస్తుంది. అందుకే ఇప్పుడు యువతకు మినిమలిజం కావాల్సి వచ్చింది. అమెరికాకు చెందిన జోషువామిల్‌బర్న్, రేయాన్ నికోడామస్ అనే మిత్రులు ఈ అంశానికి ప్రాచుర్యం కల్పిస్తున్నారు. మినిమలిజం పేరుతో బ్లాగ్ నడుపుతూ.. పుస్తకాలు, ఆడియోలు, వికాసపాఠాల ద్వారా యువతను ఆలోచింపజేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 156 దేశాల్లోని రెండు కోట్లమందిని ప్రభావితం చేశారీ మిత్రులు. అపరిమితాన్ని మితానికి పరిమితం చేయాలన్నదే వీళ్ల ఆలోచనల్లోని పరమార్థం. నిజమైన ఆనందం వస్తువుల్లో కాదు. జీవితంలో వెతుక్కోవాలన్నదే దీని సారాంశం.

ఆ ఆనందం కాసేపే!

ఒక ప్రముఖ ఆన్‌లైన్‌షాపింగ్ సైట్‌లో ఎన్ని వస్తువులు ఉంటాయో ఊహించండి..? సుమారు పదిహేనుకోట్లు ఉండొచ్చు. ఇవన్నీ ప్రతిక్షణం ఊరించేవే! చూసినదల్లా కొనాలని మనసు లాగేస్తుంటుంది. ఆఫర్లు, ఎక్స్ఛేంజిలు, డిస్కౌంట్లు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. క్రెడిట్‌కార్డులతో ఎన్ని ఆర్డర్ చేశామో.. ఎందుకు కొన్నామో కూడా తెలీదు. వస్తువులతో ఆనందం దక్కుతుందా? కచ్చితంగా దక్కదు. ఆ సంతోషం కాసేపే. ఒకటి పోతే మరొకటి. ఆఖరికి ఏ వస్తువు దగ్గరా సంతృప్తి నిలువదు. అలాకాకుండా.. మనమెందుకు జీవిస్తున్నాం? అర్థమేంటి? తెలుసుకున్నప్పుడు దొరికేదే నిజమైన సంతోషం అన్నది మినిమలిస్టుల అభిప్రాయం.

త్యాగం వద్దు గురూ..

మినిమలిజం అంటే సర్వం త్యాగం చేసి.. సన్యాసుల్లా జీవించమని కాదు. ఇల్లు, బైకు, కారు లేకుండా నెట్టుకురావడమూ కాదు. అవసరం లేని వాటిని తగ్గించుకుని హాయిగా బతకడం. నిజానికి మినిమలిజం పాటించినప్పుడే.. మనకు కావాల్సినవన్నీ దక్కుతాయి. అయితే దీని కోసం ఏం చేయాలి? అని అడగొచ్చు మీరు. "ప్రతి వస్తువును మూడు రకాలుగా చూడొచ్చు (నీడ్స్, కంఫర్ట్, లగ్జరీ). బేసిక్ ఫోన్ అనేది అవసరం అనుకుందాం. సాధారణ ఫోన్ సౌకర్యం.. ఇంకాస్త ఖరీదైన స్మార్ట్‌ఫోన్ సౌఖ్యం కిందికి వస్తుంది. ఒకవేళ ప్రతి వస్తువులోనూ ఇలా లగ్జరీకి అలవాటు పడితే.. ఒక మెట్టు దిగడంలాంటిదే మినిమలిజం.." అంటున్నారు హైదరాబాద్‌కు చెందిన కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ చల్లా గీత. అంటే - తక్కువ వస్తువులతోనే ఎక్కువ సంతోషంతో జీవించడం.

మరేం చేయాలి?

పరుగులకు బ్రేకులు వేయండి. మిమ్మల్ని మీరు అర్థం చేసుకోండి. నేనేంటి? జీవితం ఎటు వెళుతోంది? ప్రశ్నలు వేసుకోవాలి. పరిమితికి మించి వస్తువుల్ని కొనుక్కోవడం.. సుఖాల వెంట పరిగెత్తడం.. ఆదాయాన్ని మించి ఖర్చు చేయడం..వంటివి విశ్లేషించుకోవాలి. ఆ జోరుకు బ్రేక్ పడితే.. వ్యవహారం మారిపోతుంది. ఎంత వరకు పరిగెత్తగలిగితే అంతే పరిగెత్తాలి. తిరిగి తిరిగి వచ్చే కోరికలకు ఎక్కడో ఒక చోట గుడ్‌బై చెప్పాలి అంటుంది మినిమలిజం. అయితే షాపింగ్ మనస్తత్వాన్ని మాత్రం నియంత్రించుకోలేం? అనకండి. ఒక వస్తువు కనిపిస్తూనే... ఎలాగైనా కొనితీరాల్సిందే అనిపిస్తుంది. ఆ సమయంలో 'ఇప్పుడు కాదు.. మళ్లీ కొంటా'నని వాయిదా వేయండి. దీన్నే ఇంపల్స్ డిలే టెక్నిక్ అంటారు. ఇక్కడి నుంచే మీకు.. ఎక్కడ తగ్గాలో తెలుస్తుంది. ఆ రోజు నుంచి మినిమలిస్టులైపోతారు! ఇక.. అక్కడి నుంచి అన్నీ హ్యాపీడేసే!



మినిమలిజం ఇప్పుడు యువతకే కాదు. కుటుంబాలకు, పర్యావరణానికీ అత్యవసరం. నేను షూటింగ్‌లో మేకప్ వేసుకునేప్పుడు ఒక చిన్న టిష్యూ పేపర్ వాడాలన్నా ఆలోచిస్తాను. ఐదారుకు మించి వాడను. చెట్లతోనే ఆ పేపర్లు తయారుచేస్తారన్న స్పృహ నాకుంది. నీళ్ల బాటిళ్లు కూడా కొనను. ఇంటి నుంచే నీళ్ల సీసా పట్టుకెళతాను. ప్లాస్టిక్ బాటిల్ పడేస్తే మట్టిలో కలిసిపోదు. కాలుష్యానికి కారణం అవుతుంది. ఫోన్లు, ట్యాబ్‌లు, కంప్యూటర్లు కూడా అంతే! ఒక్కో ఇంట్లో పదేసి ఉంటాయి. అందులో సగం కూడా వాడం. నేనిప్పటికీ శ్యామ్‌సంగ్ నార్మల్ స్మార్ట్ ఫోన్‌నే వాడుతున్నా. నా ఫ్రెండ్స్ అందరూ 'ఒరే నువ్వు హీరోవురా. ముందు ఆ ఫోన్ మార్చు' అంటూ ఆటపట్టిస్తుంటారు. మార్కెట్‌లోకి రోజుకొక కొత్త వెర్షన్ మొబైల్‌ఫోన్ వస్తుంది. ఈ రోజు కొన్న కొత్త ఫోను.. రేపు పాతదైపోతుంది. కొత్త వస్తువుల మోజులో నేనెప్పుడూ పరిగెత్తను. బూట్లు కూడా బాగా అరిగిపోయే వరకు వాడుతుంటా. ఇక, నా పాత బట్టలను ఇంట్లో ఉంచను. ఎప్పటికప్పుడు పేద పిల్లలకు ఇచ్చేస్తుంటా.

– నిఖిల్, యువ నటుడు



మీరు అడగొచ్చు.. 'ఏది కొనాలి? ఏది వద్దు? తెల్చుకోవడం ఎలా?' అని. తికమక పడక్కర్లేదు. మీకు మీరే తేల్చుకోవడం క్షణాల్లో పని. ఏదైనా కొంటున్నప్పుడు 'ఆ వస్తువు లేకపోతే బతకలేమా?'ని ఒక ప్రశ్న వేసుకోండి. 'అమ్మో బతకలేం' అనే జవాబు వస్తే.. తప్పక కొనండి. 'ఏం ఫర్లేదు. బేషుగ్గా బతకొచ్చు' అనుకుంటే కొనొద్దు. ఆన్‌లైన్ షాపింగ్‌లో, మాల్‌లో కొనేముందు ఇదే ప్రశ్న వేసుకోవాలి. ఆ తరువాతే కొనాలి. దీనినే కాగ్నెటివ్ డ్రిల్లింగ్ టెక్నిక్ అంటారు. ఆలోచనల్ని డ్రిల్లింగ్ చేస్తూ పోతే.. ఏదో ఒక చోట కనువిప్పు కలగక తప్పదు. విష్‌లిస్టుకూ కోత వేయొచ్చు. అప్పుడు మీరే మిగతా వాళ్ల కళ్లు తెరిపించే మినిమలిస్ట్ అవుతారు.

– చల్లా గీత, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్



అవసరమున్నా లేకపోయినా.. కొనేస్తూపోతే డిమాండ్ పెరుగుతుంది. ధరలు ఆకాశాన్ని అంటుతాయి. అది వ్యక్తికీ, సమాజానికీ భారమే! ఫ్యామిలీ బడ్జెట్‌పైనా ప్రభావం పడుతుంది. అవసరం లేని వస్తువులను కొనకపోవడం కూడా సామాజిక సేవ కిందికే వస్తుంది. తక్కువ వస్తువులతోనే ఆనందంగా బతికేతత్వాన్ని అలవర్చుకోవాలి. ఈ మధ్య సంస్థలు వ్యయభారాన్ని తగ్గించుకుంటున్నాయి. యువత కూడా సాధారణ జీవనశైలికి అలవాటుపడాలి. ఏటికేడు వస్తువుల జాబితా తగ్గిపోవాలి. అవసరానికి మించి కొనడం ఎప్పుడూ ఆనందాన్ని ఇవ్వదు. మీరు అంతకు మునుపు కొనుగోలు చేసిన వస్తువు వల్ల ఇప్పుడు సంతోషంగా లేరు కదా! ఆ అనుభవమే మీకిప్పుడు జీవనసత్యం కావాలి.

– డా.నిరంజన్‌రెడ్డి, క్లినికల్ సైకాలజిస్ట్

మనసులో మాట

అల్లుకున్న ప్రేమ రాలిపోయింది

తొలి పెళ్లిచూపుల్లోనే నచ్చింది తను. అమ్మకు చెప్పేశాను... ఇంకేం సంబంధాలు చూడొద్దని! అమ్మ ఎక్కడ వద్దంటుందోనని. తన నంబర్ తీసుకొని ఫోన్ చేశాను. 'మీరంటే ఇష్టం. ఐ లవ్ యూ' అని చెప్పాను. అలా ఎందుకు చెప్పానో ఇప్పటికీ అర్థం కాదు. 'మా ఇంట్లో వాళ్లతో మాట్లాడండి' అంది తను. 'ముందు మీరు చెప్పండి.. మీకు నేను నచ్చానా?' అన్నాను. నవ్వింది. మనసు ఉప్పొంగిపోయింది. ఇంకేం ఆలస్యం చేయలేదు. పెళ్లి ఏర్పాట్లు చేసేశాను. ఎవరికి ఎవరు జంటో పైవాడు నిర్ణయిస్తాడంటారు కదా! అందుకే పై వాడికి మనసుపూర్తిగా థ్యాంక్స్ చెప్పుకొన్నాను. 2014 మార్చి 28న మా పెళ్లైంది. ఊటికి హనీమూన్‌కు వెళ్లాం. రోజులు క్షణాల్లా కరిగిపోయాయి. తనకు నాకు ఉద్యోగాలు వేరు.. శాఖలు వేరు... అయితే ఒకే ఆవరణ. మూడు నెలలు మూడురోజుల్లా గడిచిపోయాయి. సంసార సాగరంలో మా దాంపత్య నావపై వరద కురవడం మొదలైంది. అమ్మకు తనకూ అభిప్రాయభేదాలు మొదలయ్యాయి. ఆఫీసు నుంచి ఆలస్యంగా వస్తోందని, నెల జీతం మొత్తం తన పుట్టింటికి పంపుతోందని అమ్మ ఆరోపణ. తనను చీటికీ, మాటికీ అనుమానిస్తోందని, అవమానిస్తోందని తన వాదన. పెద్దామె కదా! సర్దుకొమ్మని చెప్పాను. తను రాజీ పడలేదు. అమ్మను నేను ఏమీ అనలేకపోయాను. తను పుట్టింటికి వెళ్లిపోయింది. ఎంతో బాధేసింది. వెళ్లి బతిమాలాను. రాలేదు. ఈ లోపు వాళ్ల అమ్మ, అక్క, బావ అందరూ తనకి లేనిపోనివి చెప్పారు. కారణం చెప్పకుండానే నన్ను అసహ్యించుకోవడం మొదలు పెట్టింది. ఎందుకో తెలియదు. నేను తనని ఎంతగా ప్రేమించానో తను తెలుసుకోలేదనిపించింది. ఎంతగా ఆరాధిస్తున్నానో గుర్తించలేకపోయింది. అందుకే అలా మాట్లాడుతోందని అనుకున్నాను. నా స్నేహితుడి ద్వారా చెప్పి పంపాను. తన స్నేహితురాళ్లతో చెప్పించాను. తను పట్టించుకోలేదు. ఒక రోజు ఉన్నట్టుండి నన్ను, మా అమ్మని పోలీసుస్టేషన్‌కు పిలిచారు. వెళ్లాం. అప్పుడర్థమైంది. తను మా మీద కేసు పెట్టిందని. గుండె పగిలిపోయింది. తనంటే నాకిష్టమని తనను పంపించమని పోలీసుస్టేషన్లో చెప్పాను. తనేమో మీ



అమ్మ ఉంటే రానంది. నేను దానికి ఒప్పుకోలేదు. మా అమ్మ నన్ను ఎంతో ప్రేమగా పెంచింది. నాన్న చనిపోతే కష్టపడి చదివించింది. 'నేను అమ్మను వదలలేను' అన్నాను. 'అయితే నన్ను వదిలేయ్' అంది. మనసు కకావికలమైంది. తన మనసు పందిరి మీద అల్లుకున్న నా ప్రేమ మల్లె తీగ నిలువునా రాలిపోయింది. అంతే స్టేషన్ నుంచి అమ్మను తీసుకొని బయటికి వచ్చేశాను. తర్వాత ఎన్నో సార్లు పెద్దలతో చెప్పించాను. స్నేహితులతో రాయబారం పంపాను. ఫోన్ చేశాను. తొలుత ఫోన్‌లోనైనా మాట్లాడింది. తర్వాత ఫోన్ ఎత్తడం మానేసింది. తనలో మార్పు లేదు. నాకు ఊపిరి ఆడటం లేదు.

ఎందుకు సుశీల ఇలా చేస్తున్నావ్? నా వల్ల నీకు ఏమైనా ఇబ్బంది ఉంటే చెప్పు. అంతేగాని నన్ను ఇలా బాధ పెట్టకు. నేను నీ కోసం ఇప్పటికీ ఎదురుచూస్తూనే ఉన్నాను. అమ్మ ఉంటే నీకేంటి కష్టం? నా మాతృమూర్తిని వదిలిపెట్టమని చెప్పడం నీకు న్యాయం కాదు? నిన్ను ఎవరో నానుంచి దూరం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఒక్కసారి ఆలోచించు..! మనం దంపతులయ్యాక గడిపిన మూడు నెలలు ఒక్కసారి గుర్తు తెచ్చుకో...! నా ప్రేమను అర్థం చేసుకో...! రా మన కలల ఇంటికి రా... నీ కోసం నా మనసుతో కట్టిన తోరణం స్వాగతం పలుకుతుంది.

....నీ జగదీష్, నెల్లూరు

సిక్కోలు చిత్రం

లక్ష్యానికి తపన తోడైతే విజయం మన చేతుల్లోనే ఉంటుందని నిరూపించాడో యువకుడు. మారుమూల గ్రామంలో పుట్టి... అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాడు శ్రీకాకుళం జిల్లా కుర్రాడు. భారతదేశానికి సంబంధించిన లఘుచిత్రం విదేశాలలో ప్రదర్శనకు ఎంపిక కావడమే అరుదుగా భావించే పరిస్థితుల్లో అతను తీసిన చిత్రం ఏకంగా 48 అంతర్జాతీయ అవార్డులను గెలుచుకుంది. ఇప్పటివరకు 150 దేశాలలో ప్రదర్శనకు నోచుకుంది. కథ, కథనం, దర్శకత్వం, సంగీతం, ఆర్ట్స్ తదితర అన్ని విభాగాల్లో ఉత్తమ లఘుచిత్రంగా ఎంపికై ఖండాంతర ఖ్యాతి సొంతం చేసుకున్న 'లివింగ్ ఐడిల్' దర్శకుడి గురించి ఇదంతా... ఇంతకీ ఎవరా యువ దర్శకుడు?



ఒక్క 'షార్ట్'లో 48 కొట్టాడు..

సినిమా తీసేందుకు ముందుగా ఓ సన్నాహం జరుగుతుంది. సినిమా ఎలా ఉండబోతోందన్న విషయాన్ని ఊహా చిత్రాల ద్వారా చూస్తారు. సమగ్ర అంశాలను దీని ద్వారా ముందే తయారు చేసుకొంటారు. దీన్నే ప్రీ విజువలైజేషన్ అంటారు. దీనివల్ల సినిమా నిర్మాణ వ్యయం బాగా తగ్గుతుంది. ఇందులో ప్రవీణుడు పి.ఎం. వెంకటరమణ. ఇతని ప్రతిభను గుర్తించి బ్యాండిట్ క్వీన్ లాంటి చిత్రాలు తీసిన శేఖర్‌కపూర్ తన బృందంలో సభ్యునిగా నియమించుకున్నారు. ఆయన వద్ద పది ప్రముఖ బాలీవుడ్ చిత్రాలతోపాటు ఐదు హాలీవుడ్ చిత్రాలకు ప్రీ విజులైజేషన్ పని నిర్వహించిన రమణను ప్రముఖ దర్శకుడు రాజమౌళి ఈగ, రాజన్న చిత్రాలకు పని చేసే అవకాశం ఇచ్చారు. నాగార్జున ఢమరుకం చిత్రానికి సంబంధించిన ప్రీ విజులైజేషన్‌తో పాటు కళా రంగంలోనూ పాలుపంచుకున్నాడు.

ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ

ప్రతిఒక్కరూ ఏదోఒక అంశంలో ప్రతిభ కలిగి ఉంటారు. దాన్ని గుర్తించి సాధన చేస్తే విజయం సాధించొచ్చు. యువత, విద్యార్థులు యాంత్రిక విధానాలతో సాగిపోకుండా భిన్నంగా ఆలోచిస్తే విజయాలు సాధ్యమవుతాయి. నా చిత్రం 48 అవార్డులు సాధించుకోవడం ఆనందంగా ఉంది. సొంత దేశం మద్దతు లేకపోవడంతోనే ఆస్కార్‌కు నామినేషన్ పొందలేకపోయిందనే బాధ ఉంది. గాంధీతత్వంపై తీసే రెండో చిత్రంలో ఇంతకంటే అత్యాధునిక సాంకేతికత ఉండేలా ప్రయత్నిస్తున్నాను. – పి.ఎం.వెంకటరమణ

ఆరు నెలల పరిశోధన.. రెండు రోజుల చిత్రీకరణ

కోల్‌కతా సామాన్యుల జీవన విధానంపై ఆరు నెలలు పరిశోధన చేసి, ముందస్తు ప్రణాళికతో చిత్రాలు గీసుకొని రెండ్రోజుల్లో లివింగ్ ఐడిల్‌ను చిత్రీకరించారు రమణ. తరువాత నాలుగు నెలల పాటు పోస్టుప్రొడక్షన్ పనుల ద్వారా అత్యద్భుత సాంకేతిక అంశాలను జోడించి హాలీవుడ్ ప్రముఖులను అబ్బురపర్చారు. ఒకరోజు చిత్రీకరణకు గాను రూ.4 లక్షల వరకు వ్యయమవుతున్న నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికతో ఆరు రోజుల చిత్రీకరణను రెండ్రోజుల్లో పూర్తి చేయగలిగారు. శిల్పకారుడు, దేవుడు, స్త్రీమూర్తి అనే మూడు భిన్నమైన పార్శ్వాలతో ఆకట్టుకున్నారు. ఆంగ్లం, హిందీతోపాటు తెలుగులో చిత్రాన్ని విడుదల చేసి మన్ననలు పొందారు. రెండో చిత్రంగా గాంధేయవాదంపై తీసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.



బారువ గ్రామం నుంచి అంతర్జాతీయ స్థాయికి

శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం మారుమూల తీరప్రాంత గ్రామం బారువకు చెందిన పి.ఎం.వెంకటరమణకు చిన్నప్పటి నుంచి చిత్రలేఖనం పట్ల ప్రత్యేక ఆసక్తి. తండ్రి పి.ఎం.సూర్యనారాయణ డ్రాయింగ్ టీచర్ కావడంతో పిల్లలను చిత్రలేఖనం వైపు ప్రోత్సహిస్తూ వచ్చారు. తల్లి పి.ఎం.కస్తూరితోపాటు ఇద్దరు సోదరుల సహకారంతో చిత్ర పరిశ్రమవైపు వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఫైనార్ట్స్ చేశారు. జికా (జెడ్.ఐ.సి.ఎ.) ఇన్‌స్టిట్యూషన్‌లో శిక్షణ పొందుతూనే చిత్రలేఖనం, ఇతర మార్గాల ద్వారా ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసుకున్నాడు. తనతోపాటు చదువుకున్న స్నేహితులంతా ఇంజినీరింగ్, వైద్యం రంగాల వైపు పరుగులు తీయగా రమణ భిన్నంగా ఆలోచించి అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు.

–బత్తుల కామేశ్వరరావు
న్యూస్‌టుడే, సోంపేట, శ్రీకాకుళం జిల్లా

దేశానికే ఆదర్శంగా తెలంగాణ

ఈనాడు - హైదరాబాద్

ఆవిర్భవించిన అనతి కాలంలోనే ఆటంకాలు, సవాళ్లను అధిగమించి తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, బంగారు తెలంగాణ ఆశయ సాధన దిశగా అడుగులు వేస్తోందని రాష్ట్ర గవర్నర్ నరసింహన్ అన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేరుస్తూ అన్ని రంగాల్లో అద్భుత ప్రగతిని సాధిస్తూ అసమాన వేగంతో రాష్ట్రం ముందుకు దూసుకెళ్లడం తనకు గర్వంగా ఉందన్నారు. జాతీయ సగటు కంటే మిన్నగా 18 శాతం వృద్ధి రేటుతో తెలంగాణ దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 'అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ సమస్యను పరిష్కరించడం తెలంగాణ ప్రభుత్వ సమర్థత, చిత్తశుద్ధి, అంకితభావానికి నిదర్శనం. 2014లో 6,574 మెగావాట్లుగా ఉన్న విద్యుదుత్పత్తి ఇప్పుడు 14,845 మెగావాట్లకు చేరింది. త్వరలోనే 28 వేల మెగావాట్ల లక్ష్యాన్ని సాధించి మిగులు విద్యుత్ రాష్ట్రంగా మారనుంది. ఈ ఏడాది జనవరి 01 నుంచి అన్నదాతల కోసం నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. రూ.1.50 లక్షల కోట్లతో కాళేశ్వరం, పాలమూరు, సీతారామ ప్రాజెక్టులను నిర్మిస్తున్నాం. వీటి కోసం బడ్జెట్‌లో ఏటా రూ.25 వేల కోట్లను కేటాయిస్తున్నాం. ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలోని కోటి ఎకరాలకు గోదావరి, కృష్ణా జలాలు అందుతాయి. మిషన్ కాకతీయ ద్వారా 46 వేల చెరువులను పునరుద్ధరిస్తున్నాం.

సంక్షేమానికి రూ. 40 వేల కోట్లు: సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం ఏటా రూ.40 వేల కోట్లను వెచ్చిస్తోంది. ఆసరా కింద 38 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నాం. ఒక్కొక్కరికి నెలకు ఆరు కిలోల చొప్పున చౌకబియ్యం పంపిణీ చేస్తున్నాం. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ, బీసీ, ఈబీసీ ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థికసాయం అందిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి 2.65 లక్షల రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతాయి. ఆశా కార్యకర్తలు, వీఆర్ఏ, హోంగార్డులు, ఐకేపీ ఉద్యోగుల వేతనాలు పెంచాం. రైతులకు ఇప్పటికే రూ.17 వేల కోట్ల రుణాలను మాఫీ చేశాం. పంట పెట్టుబడి కోసం ఎకరానికి రూ.8 వేల చొప్పున సాయం అందించనున్నాం. 2018-19 ఆర్థిక సంవత్సరం నుంచి వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నాం. రైతు సమన్వయ సమితులు, వ్యవసాయాధికారుల నియామకాల ద్వారా రైతులకు మరింత మేలు జరుగుతుంది. నాణ్యమైన విత్తనాలను సరఫరా చేస్తున్నాం. పండిన ధాన్యం నిల్వ కోసం గోదాములను నిర్మించాం. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ రక్షిత నీటిని ఇవ్వనున్నాం. అవినీతి రహితంగా భూరికార్డుల ప్రక్షాళన చేశాం. త్వరలోనే రైతులకు కొత్త పాసుపుస్తకాలనందిస్తాం.

గ్రామీణ ఆర్థికవ్యవస్థకు చేయూత: ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోంది. యాదవులు, కురుమలకు 1.5 కోట్ల గొర్రెలను అందించే ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. చేపల పెంపకం ద్వారా మత్స్యకారులకు ఉపాధినందించాం. వరంగల్‌లో నిర్మిస్తున్న జౌళి పార్కుతో చేనేత కార్మికులకు చేయూతనిస్తాం. రజకులకు వాషింగ్ మెషిన్లు, నాయీబ్రాహ్మణులకు అధునాతన సెలూన్లను ఏర్పాటు చేస్తున్నాం. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యలో భాగంగా ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 542 కొత్త గురుకులాలను ఏర్పాటు చేశాం. వీటిలో ఒక్కో విద్యార్థిపై రూ.1.25 లక్షలను వెచ్చిస్తున్నాం. ప్రభుత్వ ఆసుపత్రులను జాతీయ స్థాయి ప్రమాణాలతో నవీకరిస్తున్నాం. 102, 104, 108 వాహనాల ద్వారా వేగంగా సేవలందిస్తున్నాం. గర్భిణులు, బాలింతల కోసం కేసీఆర్ కిట్లను ఇస్తున్నాం. గడిచిన మూడేళ్లలో జాతీయ రహదారుల విస్తీర్ణాన్ని 3,174 కిలోమీటర్ల నుంచి 5,701 కిలోమీటర్లకు పెంచుకున్నాం. పర్యావరణ పరిరక్షణ కోసం తెలంగాణ హరితహారం పేరుతో కోట్ల సంఖ్యలో మొక్కలు నాటాం. పరిపాలనను ప్రజల ముంగిటకు తెచ్చేందుకు కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు, పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేశాం.

టీఎస్ఐపాస్ ద్వారా రెండు లక్షల మందికి ఉపాధి: పారిశ్రామిక రంగంలోనూ తెలంగాణ ముందంజలో ఉంది. టీఎస్ఐపాస్ ద్వారా 3,070 పరిశ్రమలకు అనుమతిలిచ్చాం. వీటి ద్వారా రూ. 1,18,000 లక్షల కోట్ల పెట్టుబడులు, రెండు లక్షల మందికి ఉపాధి లభించింది. ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ 12 శాతం వృద్ధిని సాధించింది. ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ లాంటి ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీని విస్తరిస్తున్నాం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాంతిభద్రతలను పూర్తిస్థాయిలో పరిరక్షిస్తున్నాం. సమీకృత అభివృద్ధి, మానవతా విలువల పరిరక్షణ, బలహీనవర్గాలకు అండగా నిలవడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తోంది' అని గవర్నర్ పేర్కొన్నారు.



సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పిస్తున్న గవర్నర్ నరసింహన్. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు



హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో జాతీయ జెండాకు వందనం సమర్పిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రగతిభవన్‌లో సీఎం జెండా వందనం

ఈనాడు, హైదరాబాద్: తన అధికారిక నివాసమైన ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. ఈ కార్యక్రమంలో ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ శేరిసుభాష్ రెడ్డి, మిషన్ భగీరథ ఉపాధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, తెరాస ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎం కార్యాలయ అధికారులు నవీన్‌చంద్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సీఎం కేసీఆర్ పరేడ్ మైదాన సమీపంలోని సైనిక్ స్మారక్ వద్ద అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. వారి సేవలను కొనియాడుతూ అక్కడి రిజిస్టర్‌లో సందేశం రాశారు.

శాసనసభలో, మండలిలో...

శాసనసభ ప్రాంగణంలో సభాపతి మధుసూదనాచారి, మండలిలో ఛైర్మన్ స్వామిగౌడ్ పతాకావిష్కరణ చేశారు. ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి, మండలి ఉపాధ్యక్షుడు నేతి విద్యాసాగర్, శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

తెలంగాణభవన్‌లో...

తెరాస రాష్ట్ర కార్యాలయమైన తెలంగాణభవన్‌లో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి జెండా ఎగురవేశారు. ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ, పార్టీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ ఆప్ ఎమ్మెల్యేల తరహాలో తెరాస ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రేవంత్ రాజీనామా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు.



టీఎస్ ఐపాస్‌లో దరఖాస్తులను ఒకే రోజు పరిష్కరించడం, 2017లో అత్యధిక దరఖాస్తుల పరిష్కారానికిగాను శుక్రవారం పరేడ్ మైదానంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాన్ని అందుకుంటున్న తెలంగాణ కర్మాగారాల శాఖ సంచాలకుడు పీఎం చంద్రమోహన్.

310 పోస్టులతో ప్రకటనలు

- ఈ నెలాఖరున జారీచేస్తాం
- ఉద్యోగాలభర్తీలో వేగం పెంచాం
- టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి

ఈనాడు, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా 423 పోస్టులతో ఉద్యోగ ప్రకటనలు జారీ చేశామని, ఈ నెలాఖరున మరో 310 పోస్టులతో ఉద్యోగ ప్రకటనలు జారీ చేయనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి తెలిపారు. శుక్రవారమిక్కడ కమిషన్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కమిషన్‌లో తక్కువ సంఖ్యలో సిబ్బంది ఉన్నప్పటికీ అధికారులు, ఉద్యోగుల అంకితభావం, మెరుగైన పనితీరుతో ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో వేగం పెంచామన్నారు. యూపీఎస్సీ కన్నా తక్కువ సమయంలో పరీక్షలు నిర్వహిస్తూ నియామక ప్రక్రియ పూర్తిచేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ కార్యదర్శి వాణిప్రసాద్, సభ్యులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సరికొత్త ఆవిష్కరణలతో రాష్ట్రం ముందంజ

తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అశోక్‌కుమార్

ఈనాడు, దిల్లీ: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అశోక్‌కుమార్ అన్నారు. 69వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారమిక్కడ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతన సంస్కరణలు, సరికొత్త ఆవిష్కరణలతో రాష్ట్రం ముందుంజలో పయనిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అదనపు రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి, సహాయ కమిషనర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా గణతంత్రవేడుకలు

- గవర్నర్ పతాకావిష్కరణ
- ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరు

ఈనాడు, హైదరాబాద్: సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో శుక్రవారం గణతంత్ర వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. గవర్నర్ నరసింహన్ జాతీయ జెండాను ఎగురవేసి త్రివిధ దళాలు, పోలీసు బలగాల గౌరవవందనం స్వీకరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ఉపముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్‌అలీ, శాసనసభాపతి మధుసూదనాచారి, మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, అధికార పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సలహాదారులు, సీఎస్ ఎస్పీసింగ్, డీజీపీ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఉత్సవాల్లో పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. జమ్ము కశ్మీర్, మహారాష్ట్ర బెటాలియన్లూ పాల్గొన్నాయి. బ్రాస్‌బ్యాండ్‌తో పాటు డోగ్రా రెజిమెంట్, గూర్ఖా రైఫిల్స్ పైపు బ్రాండ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అగ్నిమాపక శాఖ త్రివర్ణ బెలూన్లను ఎగురవేసింది. కవాతులలో సీనియర్ల విభాగంలో జమ్ముకశ్మీర్ బ్రిగేడ్ ప్రథమ స్థానంలో, డోగ్రా రెజిమెంట్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. జూనియర్ల విభాగంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు ప్రథమ స్థానం, ఎన్‌సీసీ బాలికలు రెండో స్థానం పొందారు.

అధికారులకు పురస్కారాలు: పౌరసేవలు, టీఎస్ఐపాస్ అమలులో ప్రతిభ చూపిన అధికారులకు ఈ సందర్భంగా గవర్నర్ పురస్కారాలను అందచేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్, కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ శశాంక్, ఐపీఎస్‌లు రాజేశ్‌కుమార్, స్వాతిలక్రా, ఐఎఫ్ఎస్ అధికారులు ఆర్.శోభ, స్వర్గం శ్రీనివాస్ వీటిని స్వీకరించారు. టీఎస్ఐపాస్‌లో సమర్థంగా పనిచేసినందుకు టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, సీఈ ఎ.జి రమణప్రసాద్, ఒకేరోజు దస్త్రాన్ని పరిష్కరించినందుకు టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, రాష్ట్ర కర్మాగారాల సంచాలకులు పీఎం చంద్రమోహన్, 2017లో అత్యధిక దరఖాస్తులను పరిష్కరించినందుకు కర్మాగారాల సంచాలకులు పీఎం చంద్రమోహన్, రాష్ట్ర కాలుష్యనియంత్రణ మండలి సభ్యకార్యదర్శి సత్యనారాయణరెడ్డి, 23 శాఖల సమన్వయంతో టీఎస్ ఐపాస్ పోర్టల్‌ను సమర్థంగా నిర్వహిస్తున్నందుకు పరిశ్రమల శాఖ సంయుక్త సంచాలకుడు సంగా సురేశ్, సహాయ సంచాలకుడు కె. చంద్రశేఖర్‌బాబుకు గవర్నర్ పురస్కారాలిచ్చారు.

సీఎంను కలిసేందుకు నేతల యత్నం: పరేడ్ మైదానంలో సీఎంను కలిసేందుకు పార్టీ నేతలు యత్నించగా, పోలీసులు వారిని నిరోధించారు. ఒక నాయకుడు పోలీసులను తప్పించుకొని వచ్చి సీఎంకు వినతిపత్రమిచ్చారు. ఎమ్మెల్యే కొండా సురేఖ తన మనవరాలిని కేసీఆర్ వద్దకు తీసుకురాగా.. చిన్నారిని పక్కనే కూర్చోబెట్టుకొని ముఖ్యమంత్రి కొద్దిసేపు మాట్లాడారు. సీఎంతో తన మనవరాలి చిత్రాన్ని సురేఖ స్వయంగా తీశారు. వేదిక వద్దకు రాగానే సీఎం దూరంగా ఉన్న ఎంపీలు జితేందర్‌రెడ్డి, కేశవరావు, మంత్రి నాయిని, సభాపతి మధుసూదనాచారిని తన వద్దకు పిలిపించుకొని పలు అంశాలపై మాట్లాడారు.

ఇనుపజాలిని తొలగించిన ఎంపీ జితేందర్ రెడ్డి: పరేడ్ మైదానంలో మీడియా గ్యాలరీలో పోలీసులు ఇనుప జాలిని ఏర్పాటు చేశారు. దీనిపై మీడియా ప్రతినిధులు నిరసన తెలుపుతూ ఎంపీ జితేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన పోలీసులపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ జాలిని స్వయంగా తొలగించారు.



సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో గణతంత్ర వేడుకలకు హాజరైన ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో ఎంపీ జితేందర్‌రెడ్డి, శాసనసభాపతి మధుసూదనాచారి, ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ప్రభుత్వ సలహాదారు వివేక్ తదితరులు



పరేడ్ మైదానంలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

నిరసన వ్యక్తం చేస్తే జైళ్లలో పెడుతున్నారు

గణతంత్ర వేడుకల్లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు భావ ప్రకటన స్వేచ్ఛ పూర్తిగా లేకుండా పోయిందని, నిరసన వ్యక్తం చేస్తే కేసులు పెట్టి జైళ్లలో వేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, తెలంగాణ ఐకాస నాయకులు సహా ప్రజల పక్షాన పోరాటాలు చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిని జైళ్లలో పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో మానవహక్కుల ఉల్లంఘన సాగుతోందన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం గణతంత్రదినోత్సవం సందర్భంగా ఉత్తమ్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఎల్పీ నాయకుడు జానారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లుభట్టి విక్రమార్క, మండలిలో విపక్షనేత షబ్బీర్‌అలీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ పేరుతో ఉన్న ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును మార్చేసి కాళేశ్వరం ఎత్తిపోతల పేరుతో రూ.వేలకోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు.

సామాన్యులకు ఉపయోగపడని ప్రభుత్వం

ఎన్టీఆర్ భవన్‌లోని ఉత్సవాల్లో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు రమణ

ఈనాడు, హైదరాబాద్: కేసీఆర్ ప్రభుత్వ పాలన సామాన్యులకు ఉపయోగపడేలా లేదని, రాష్ట్ర అప్పులు రోజురోజుకు పెరుగుతున్నాయని తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ ఆరోపించారు. శుక్రవారం ఎన్టీఆర్‌భవన్‌లో రమణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాడుతుంటే అక్రమ కేసులతో జైళ్లో పెడుతున్నారన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ తాను చెప్పిందే రాజ్యాంగమన్న తీరుగా కేసీఆర్ పాలన ఉందన్నారు. పార్టీ నేతలు పెద్దిరెడ్డి, అరవిందకుమార్ గౌడ్, రామావత్ లక్ష్మణ్ నాయక్, నన్నూరి నర్సిరెడ్డి మాట్లాడారు.

రాజ్‌భవన్‌లో గవర్నర్ తేనీటి విందు

- సీఎం కేసీఆర్ సహా ప్రముఖుల హాజరు
- కాంగ్రెస్ ఎంపీలు సుబ్బరామిరెడ్డి, ఆనంద్‌భాస్కర్, మాజీ మంత్రి దానం రాక
- విపక్షనేత జానారెడ్డి, ఉత్తమ్ తదితర నేతలు దూరం

ఈనాడు, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గవర్నర్ నరసింహన్ శుక్రవారం రాత్రి తేనీటి విందు ఇచ్చారు. దీనికి ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు. ఏపీ మాజీ ముఖ్యమంత్రులు రోశయ్య, నాదెండ్ల భాస్కరరావు, రెండు రాష్ట్రాల ఉపముఖ్యమంత్రులు కేఈ కృష్ణమూర్తి, కడియం శ్రీహరి, మహమూద్‌అలీ, శాసనసభాపతులు కోడెల శివప్రసాద్, మధుసూదనాచారి, తెలంగాణ మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, ఏపీ మంత్రులు పత్తిపాటి పుల్లారావు, కామినేని శ్రీనివాస్, తెలంగాణ మంత్రులు హరీశ్‌రావు, నాయిని నర్సింహారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఇంద్రకరణ్‌రెడ్డి, పోచారం, తుమ్మల, జూపల్లి, ప్రభుత్వ సలహాదారు వివేక్, కేంద్రమాజీ మంత్రి దత్తాత్రేయ, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్, తెరాస ఎంపీలు వినోద్, డి.శ్రీనివాస్, లక్ష్మీకాంతరావు, సుమన్, మల్లారెడ్డి, భాజపా శాసనసభాపక్ష నేత కిషన్‌రెడ్డి, వైకాపా నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, సీఎస్ ఎస్పీసింగ్, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తేనీటి విందును బహిష్కరిస్తున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, షబ్బీర్‌అలీ తదితరులు రాలేదు. ఆ పార్టీ ఎంపీలు రాపోలు ఆనంద్‌భాస్కర్, సుబ్బరామిరెడ్డి, మాజీమంత్రి దానం హాజరయ్యారు. విందు బహిష్కరణపై తమకు సమాచారం లేదని ఆనంద్‌భాస్కర్ ఈ సందర్భంగా విలేకరులతో చెప్పారు. 2గంటలపాటు జరిగిన విందుకు హాజరైన వారిని గవర్నర్ దంపతులు పేరుపేరునా పలకరించారు. సీఎం కేసీఆర్ అందరికీ అభివాదాలు చేశారు. ఈ సందర్భగా సంగీత కచేరిని నిర్వహించారు.



రాజ్‌భవన్‌లో జరిగిన తేనీటి విందులో గవర్నర్ నరసింహన్ దంపతులతో ముఖ్యమంత్రి కేసీఆర్, ఉపముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, శాసనమండలి ఛైర్మన్‌స్వామిగౌడ్, ఏపీ శాసనసభాపతి కోడెల శివప్రసాదరావు, వైకాపా ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

కలెక్టర్ ప్రసంగం 'నవ్వులపాలు'

ఈనాడు, వరంగల్: ఆమె ఒక ఐఏఎస్ అధికారి.. సాక్షాత్తు జిల్లా పరిపాలనాధికారి. గణతంత్ర వేడుకల్లో జెండా వందనం చేశాక ఆమె చేసే ప్రసంగం జిల్లా అభివృద్ధి ప్రణాళికకు అద్దం పట్టాలి.. ఇంతవరకు సాధించిన ప్రగతి గణాంకాల పట్టం కట్టాలి. ఇదంతా ఎంతో హుందాగా.. అందంగా సాగాల్సిన కార్యక్రమం. కాని వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ఆమ్రపాలి గణతంత్ర వేడుకల సందర్భంగా చేసిన ప్రసంగం మాత్రం అలా కాకుండా 'నవ్వులపాలైంది'.. జిల్లాల్లో చర్చనీయాంశమైంది.. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. కారణం ఆమె తన ప్రసంగం మధ్యలో అదేపనిగా అకారణంగా.. నవ్వడం.. గణాంకాల దగ్గర తడబడడం.. మధ్యలో 'ఇట్స్ ఫన్నీ' అని వ్యాఖ్యానించడమే. హన్మకొండ పోలీసు పరేడ్ మైదానంలో ఆమ్రపాలి జాతీయ పతాకాన్ని ఎగరవేసిన అనంతరం తెలుగులో రాసిన ప్రసంగ పాఠాన్ని చదువుతూ పలుమార్లు తడబడ్డారు. మధ్యమధ్యలో అసందర్భంగా నవ్వారు. మరుగుదొడ్ల నిర్మాణంలో ప్రగతి గురించి ప్రస్తావన వచ్చినపుడు ఏకంగా వెనక్కి తిరిగి నవ్వుకుంటూ తనలోతాను 'ఇట్స్ ఫన్నీ' అని వ్యాఖ్యానించడం.. అదంతా మైకుల ద్వారా ప్రసారం కావడంతోపాటు ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడం విశేషం.



ప్రసంగం మధ్యలో వెనక్కి తిరిగి నవ్వుతున్న వరంగల్ అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలి

సీఎం లేకుండానే ఏపీలో వేడుకలు

- అబుదబీలో ప్రతికూల వాతావరణంతో విమానం ఆలస్యం
- దావోస్ నుంచి రాలేకపోయిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో గణతంత్ర వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకాలేకపోయారు. షెడ్యూల్ ప్రకారం దావోస్ పర్యటన నుంచి ఉదయమే ఆయన విజయవాడకు చేరుకోవాలి. వాతావరణం అనుకూలించక విమానాలు ఆలస్యం కావడంతో ఆయన అనుకున్న సమయానికి రాలేకపోయారు. షెడ్యూల్ ప్రకారం దావోస్ నుంచి అబుదబీకి చేరుకున్న చంద్రబాబు అక్కడ విమానమెక్కి శుక్రవారం ఉదయం 6.45 గంటలకు హైదరాబాద్‌కు, అక్కడి నుంచి విజయవాడకు రావాల్సి ఉంది. అబుదబీలో వాతావరణం సరిగా లేకపోవడంతో ప్రయాణం ఆలస్యమైంది. చివరకు శుక్రవారం ఉదయం అబుదబీలో బయల్దేరి మధ్యాహ్నం 1.20 గంటలకు దిల్లీకి చేరుకున్నారు. అక్కడ కూడా ప్రతికూల వాతావరణం ఉంది. పైగా గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో ఫ్లైయింగ్ జోన్‌పై పలు ఆంక్షల నేపథ్యంలో అక్కడ 30-40 నిమిషాలు ఆలస్యమైంది. దిల్లీలో మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరి విజయవాడ విమానాశ్రయానికి చేరుకున్నారు. దీంతో సీఎం లేకుండానే గణతంత్ర వేడుకలు జరిగాయి. చంద్రబాబు దిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే విమానాశ్రయ సిబ్బంది అమర్‌ప్రీత్ కౌర్ ఆయన చొక్కాకు జాతీయ జెండాతో కూడిన రిపబ్లిక్ డే బ్యాడ్జిని తగిలించారు.



దావోస్ పర్యటన నుంచి శుక్రవారం దిల్లీకి చేరుకున్న సీఎం చంద్రబాబు చొక్కాకు జాతీయ పతాకాన్ని అలంకరిస్తున్న విమానాశ్రయ మహిళా సిబ్బంది అమర్‌ప్రీత్‌కౌర్

పద్మ పురస్కారాల్లో సమతుల్యత పాటించాలి

- ప్రధానికి తెరాస ఎంపీ వినోద్ లేఖ
- తెలంగాణకు ఒక్క పురస్కారం రాకపోవడంపై అసంతృప్తి

ఈనాడు, హైదరాబాద్: పద్మపురస్కారాల్లో దేశంలో అన్ని రాష్ట్రాలు, ప్రాంతాలకు అవకాశం కల్పించేలా సమతుల్యత పాటించాలని తెరాస ఎంపీ వినోద్‌కుమార్ ప్రధానమంత్రి నరేంద్రమోదీని కోరారు. తెలంగాణకు ఒక్క పురస్కారం కూడా దక్కకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. 'దేశంలో ప్రతి ఒక్కరు ప్రతిష్ఠాత్మకంగా భావించే పద్మ పురస్కారాల కోసం తెలంగాణ ప్రభుత్వం పలు పేర్లను ప్రతిపాదించింది. పద్మ పురస్కారాల మార్గదర్శకాల మేరకు వీరు అన్ని విధాలా అర్హులు. కానీ, పద్మ అవార్డుల ఎంపిక కమిటీ ఇందులో ఒక్కరినీ కూడా పరిగణనలోనికి తీసుకోకపోవడం బాధించింది. ఇతర రాష్ట్రాల నుంచి ఇదే కేటగిరిలో ఎంపికలు జరిగాయి. పురస్కారాల ఎంపికలో పారదర్శకత లోపించింది. ప్రధాని దీనిపై స్పందించాలి' అని వినోద్ తమ లేఖలో కోరారు.

ఒకటో తేదీన నాన్న జీతం తీసుకుని ఇంటికి వస్తాడంటే చాలు.. పిల్లలు తమ కోరికల చిట్టాతో సిద్ధంగా ఉంటారు. నాకది కావాలి.. నాకిది కావాలి అని మారాం చేస్తారు. ఇంటి బడ్జెట్‌ను దృష్టిలో పెట్టుకుంటూనే.. పిల్లల కోరికలను పెద్ద మనసుతో తీరుస్తుంటారు పెద్దలు.

ఫిబ్రవరి 1 వస్తోంది. ఇది దేశానికే జీతం వచ్చే రోజు. అదే బడ్జెట్ రోజు. ఇంటిలో నాన్నలాగా దేశ బడ్జెట్ బాధ్యతలను నిర్వర్తించే ఆర్థిక మంత్రికి సామాన్యులు, ఉద్యోగులు, వ్యాపారులే కాదు.. విభిన్న రంగాల ప్రతినిధులు తమకేం కావాలో కోరికల చిట్టాలు నివేదిస్తున్నారు. లాభాల ఆనందంలో మునగాలన్నా.. ఆదాయంతో ఆర్థిక వృద్ధిని పైకి తీసుకెళ్లాలన్నా జైట్లీ ప్రకటించే తాయిలాలే ముఖ్యం. అవి ప్రకటించడానికి ముందు ఆయా రంగాలు ఏం కావాలనుకుంటున్నాయో చూద్దాం.

తెర వెనుక..

బడ్జెట్ కసరత్తు వెనక ఉన్న కీలక వ్యక్తులు వీరే..

హస్ముఖ్ అధియా
(ఆర్థిక కార్యదర్శి, ఆదాయ విభాగ కార్యదర్శి)

ఆర్థిక శాఖలో అత్యంత అనుభవశాలి. ఈయన చాలా బడ్జెట్‌లలో పాలుపంచుకున్నారు. అయితే ఈసారి ఈ కీలక బృందానికి నేతృత్వం వహిస్తున్నారు. 1981 బ్యాచ్ గుజరాత్ క్యాడర్ అధికారి ఈయన. జీఎస్‌టీ అమలులో కీలక పాత్ర కూడా పోషించారు. అదే సమయంలో పెద్ద నోట్ల రద్దు అనంతరం తీసుకోవాల్సిన చర్యలు, పన్నుల చెల్లింపులను సులభతరం చేసే అంశాలు తదితరాలన్నీ ఈయన చేతుల మీదుగానే నడిచాయి. ఇక ప్రస్తుత బడ్జెట్ విషయంలోనూ ముఖ్య భూమికను పోషించనున్నారు.

అరవింద్ సుబ్రమణియన్
(ముఖ్య ఆర్థిక సలహాదారు)

బడ్జెట్‌కు ముందు వెలువడే ఆర్థిక సర్వే(29న)పై ఈయన ముద్ర స్పష్టంగా ఉండబోతోంది. బడ్జెట్‌ను ప్రభావితం చేసే ఆలోచనలు, చర్చలు, అంచనాలు ఇందులో ఉంటాయి. ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి ఈయన ఎలాంటి ఆలోచనలు అందిస్తారో చూడాలి.

సుభాష్ చంద్ర గార్గ్
(ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి)

ప్రపంచబ్యాంక్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఈయనకుంది. వృద్ధి ఎలా పుంజుకునేలా చేయాలి, ప్రైవేటు పెట్టుబడులకు ఎలా ఊతమివ్వాలి, ఉద్యోగాలను ఎలా సృష్టించాలి.. అన్న విషయాలపై దృష్టి సారించనున్నారు. అది కూడా ద్రవ్య లోటు విషయంలో వెనక్కి తగ్గకుండా చేయాల్సిన బాధ్యతలే.

అజయ్ నారాయణ్ ఝా
(వ్యయాల విభాగం కార్యదర్శి)

1982 బ్యాచ్ మణిపూర్ క్యాడర్ ఐఏఎస్ అధికారి ఈయన. బడ్జెట్‌లో వ్యయాలను ఎలా అదుపులో ఉంచుకోవాలన్న విషయాలపై ఈయన సమన్వయం చేస్తారు. ఆర్థిక కమిషన్‌కు కార్యదర్శిగానూ నారాయణ్ సేవలు అందిస్తున్నారు.

నీరజ్ కుమార్ గుప్తా
(పెట్టుబడులు, ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగం కార్యదర్శి)

1981 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన నీరజ్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో ప్రభుత్వం తొలిసారిగా పెట్టుబడుల లక్ష్యాన్ని అధిగమించింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సైతం ఇప్పటికే పలు వ్యూహాత్మక విక్రయాలకు అనుమతులు కూడా పొందారు. ఈ నేపథ్యంలో నిధుల సమీకరణ విషయంలో ప్రభుత్వం మరింత పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించవచ్చు. దిగ్గజ ప్రభుత్వ రంగ సంస్థల్లో మెజారిటీ వాటాను అట్టే పెట్టి ఉంచుకోవాల్సిన తరుణంలో నిధుల సమీకరణ విషయంలో వినూత్న ఆలోచనలను తీసుకువచ్చే అవకాశం ఉంది.

రాజీవ్ కుమార్
(ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి)

బడ్జెట్‌కు ముందే ఆర్థిక సేవలు అంటే బ్యాంకింగ్ రంగం కోసం భారీ స్థాయి ప్రకటన చేసింది. రూ.2.11 లక్షల కోట్ల మూలధనాన్ని బ్యాంకుల్లోకి చొప్పించనున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో ఇందుకు అనుగుణంగా చర్యలు ఉండొచ్చు. వీటి వెనక 1984 ఐఏఎస్ బ్యాచ్ అధికారి అయిన రాజీవ్ కృషి ఉండే అవకాశం ఉంది. బీమా, పింఛను రంగాల్లోకి మరింత మందిని తీసుకువచ్చే దిశగా కూడా రాజీవ్ దృష్టి సారించే అవకాశం లేకపోలేదు.



ఈనాడు బిజినెస్





మేమూ.. మా కోరికలూ

బడ్జెట్‌పై ఆకాంక్షలు మీ ఫొటోతో సహా మాకు పంపండి
businessdesk@eenadu.net,
eenadubusinessdesk@gmail.com

సెల్ ఫోన్ తయారీ పరిశ్రమ

కస్టమ్స్ పెంచండి



దేశీయంగా సెల్‌ఫోన్ల అమ్మకాలు రూ.లక్షన్నర కోట్ల స్థాయిలో జరుగుతున్నాయి. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, దేశీయ తయారీ పెంచేందుకు తీసుకున్న చర్యల వల్ల యాపిల్ సహా దేశ, విదేశీ సంస్థలన్నీ ఇక్కడే సెల్‌ఫోన్లను బిగింప (అసెంబ్లింగ్) చేయిస్తున్నాయి. వస్తు, సేవలపన్ను (జీఎస్‌టీ) అమల్లోకి వచ్చాక, దేశీయ తయారీకి, దిగుమతులపై పన్ను (10 శాతం)కు తేడా లేకుండా పోయింది. పరిశ్రమ విజ్ఞప్తి మేరకు, దిగుమతులపై సుంకాన్ని 15 శాతానికి పెంచారు. తయారీ దేశీయంగా మరింత పెరిగేలా, చౌక ఉత్పత్తులు విపణిని ముంచెత్తకుండా, ఎగుమతులు కూడా ఇక్కడ నుంచే జరిగేలా 2018-19 బడ్జెట్ ప్రతిపాదనలుండాలని యాపిల్, శామ్‌సంగ్ సహా దేశీయ సంస్థలు కూడా కోరుతున్నాయి. తయారీ సంస్థలకు ప్రాతినిధ్యం వహించే ఇండియన్ సెల్యులార్ అసోసియేషన్ వీటిని ప్రభుత్వానికి నివేదించింది. ఈ ప్రకారం..

ఆకాంక్షలివీ

- పూర్తిస్థాయి సెల్‌ఫోన్లను దిగుమతి చేసుకుంటే, కస్టమ్స్ 20 శాతానికి పెంచాలి. దేశీయ సంస్థలను కాపాడేందుకు, దిగుమతి నిరోధక సుంకం కూడా విధించాలి.
- విడిభాగాలు కూడా ఇక్కడే తయారయ్యేలా ప్రోత్సహించేందుకు ఛార్జర్లు, స్పీకర్లు, బ్యాటరీ, యూఎస్‌బీ కేబుల్, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్, కెమేరా, ఎల్‌సీడీ తెరల దిగుమతిపై సుంకం అధికం చేయాలి.
- దేశీయ తయారీ సంస్థలకు 10 ఏళ్ల పన్ను విరామం కల్పించాలి.

ప్రస్తుతం దేశీయంగా..

యాపిల్, శామ్‌సంగ్, ఎల్‌జీ, వివో, ఒపో, ఎంఐ, వన్‌ప్లస్ వంటి బహుళజాతి దిగ్గజాలతో పాటు దేశీయ సంస్థలైన మైక్రోమ్యాక్స్, సెల్‌కాన్ వంటివి ఫాక్స్‌కాన్ వంటి భాగస్వాములతో కలిసి, సొంత యూనిట్ల ద్వారా సెల్‌ఫోన్లు రూపొందిస్తున్నాయి. వీటికి అవసరమైన కొన్ని విడిభాగాలు అందించేందుకు 107 యూనిట్లు దేశీయంగా ఏర్పాటయ్యాయి.

- 2016తో పోలిస్తే 2017లో సెల్‌ఫోన్ దిగుమతులు 60 శాతం తగ్గాయి. దేశీయంగా 22.50 కోట్ల సెల్‌ఫోన్లు రూపొందాయి. 2016తో పోలిస్తే వీటి విలువ 47 శాతం పెరిగింది.
- 2019కు దేశీయంగా 50 కోట్ల సెల్‌ఫోన్లు తయారీ కావచ్చు. వీటి విలువ రూ.3.50 లక్షల కోట్లకు చేరుతుంది. ఇందులో రూ.లక్ష కోట్ల విలువైన 12 కోట్ల సెల్‌ఫోన్లు ఎగుమతి చేసే వీలుంది.
- 2017లో దేశం నుంచి ఎగుమతి అయిన సెల్‌ఫోన్ల విలువ రూ.6,000 కోట్లు.

ఐటీ మినహాయింపు పెంచాలి

pwc

- అన్ని దేశీయ కంపెనీలకు 25% ఏకరీతిన పన్ను ఉండాలి
- వ్యక్తిగత ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలి
- కనీస ప్రత్యామ్నాయ పన్ను 10 శాతానికి తగ్గించాలి లేదంటే పూర్తిగా తొలగించాలి
- సెక్షన్ 80సీ కింద ఇస్తున్న మినహాయింపు పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.1.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచాలి
- దేశీయంగా జరిగే విలీనాలు, విభజనలకు పన్ను మినహాయింపు ఇవ్వాలి

- పీడబ్ల్యూసీ (ప్రైస్ వాటర్‌హౌస్ కూపర్స్)

ఎఫ్ఎంసీజీ రంగం

ఆహార తయారీకి ప్రోత్సాహమివ్వాలి

వ్యవసాయ దిగుబడులు పాడవ్వకుండా చూడటంతో పాటు వాటికి అదనపు విలువ జతచేరేందుకు, ఆహార తయారీ (ఫుడ్ ప్రాసెసింగ్) పరిశ్రమల ఏర్పాటయ్యేలా ప్రోత్సాహకాలను ఎఫ్ఎంసీజీ (వేగంగా విక్రయమయ్యే వినియోగ ఉత్పత్తుల) కంపెనీలు ఆశిస్తున్నాయి. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని ప్రభుత్వం ఆశిస్తున్నందున, ఇది తప్పనిసరి అని పేర్కొంటున్నాయి. ఇదే సమయంలో వ్యక్తిగత వినియోగం పెరిగేలా చూడాలి. త్వరగా పడయ్యే టమోటా, మామిడి వంటి పండ్లను ధర లేనపుడు రైతులు పారవేస్తుంటారు. సాస్, పండ్లరసాల వంటి పరిశ్రమలు ఏర్పాటైతే, వృథా తగ్గడంతో పాటు భారీగా ఉద్యోగాల కల్పన సాకారమవుతుంది.

ఆకాంక్షలివీ

- గోదాములు, శీతల గిడ్డంగుల వంటి మౌలిక వసతులకు ప్రోత్సాహకాలివ్వాలి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పెరిగేలా చూడాలి.
- పౌల్ట్రీ, పాడి వంటి వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రత్యక్ష, పరోక్ష పన్నులు తగ్గించాలి.
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) రంగాల పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాలుండాలి. తక్కువ ఇంధనంతో, పర్యావరణ హితంగా మనగలిగేలా చర్యలు అవసరం.

ఇదీ లాభం

- గ్రామీణ వేతనాలు పెరగడం, కొత్త ఉద్యోగాలు రావడం వల్ల గృహాలు సహా అన్ని రంగాలకు గిరాకీ లభిస్తుంది.
- వ్యక్తిగత ఆదాయపు పన్ను శ్లాబులు తగ్గిస్తే, ఖర్చు పెట్టేందుకు అవకాశం ఏర్పడి, ఆర్థిక వ్యవస్థలోకి మరిన్ని నిధులు వస్తాయి.

కార్పొరేట్ పన్ను తగ్గించాలి

EY

- కార్పొరేట్ పన్ను రేటును 25 శాతానికి తగ్గించాలి
- వ్యక్తిగత ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.3.5 లక్షలకు పెంచాలి
- సెక్షన్ 80సీ కింద ఇస్తున్న పరిమితిని రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచాలి
- దీర్ఘకాల పెట్టుబడులపై పన్ను మినహాయింపును ఏడాది నుంచి రెండేళ్లకు పెంచాలేగానీ ఎలాంటి పన్ను విధించకూడదు.
- డివిడెండ్ పంపిణీ పన్ను పూర్తిగా రద్దు చేయాలి
- ఓ క్రమ పద్ధతిలో వారసత్వ పన్ను 5% ప్రవేశపెట్టాలి

- ఎర్నెస్ట్ అండ్ యంగ్

మ్యాట్ రద్దు చేయాలి

KPMG Deloitte.

- సంస్థలపై కనీస ప్రత్యామ్నాయ పన్ను తగ్గించడం లేదా రద్దు చేయాలి
- పరిమిత బాధ్యత భాగస్వామ్యాల్లో విలీనం, విభజనల్ని తటస్థ ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకొనేలా సవరణ చేయాలి
- మొండి బకాయిల సర్దుబాటుకు వీలుగా కనీస ప్రత్యామ్నాయ పన్నుల్లో మార్పులు చేయాలి
- ఈక్విటీల్లో పెట్టుబడులపై వచ్చే లాభాల నుంచి సెక్యూరిటీల లావాదేవీ పన్ను, డివిడెండ్ ఆదాయం నుంచి కనీస ప్రత్యామ్నాయ పన్ను చెల్లించేలా మార్పులు చేయాలి

-కేపీఎంజీ ఇండియా; డెలాయిట్ ఇండియా

చమురు రంగం



మౌలిక హోదా ఇవ్వండి

అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు 70 డాలర్ల(ఒక్కో బారెల్)కు చేరువలో ఉన్నాయి. భారత్ తన చమురు అవసరాల్లో 80 శాతాన్ని దిగుమతుల ద్వారానే పొందుతోంది. ఈ నేపథ్యంలో ద్రవ్యలోటును అదుపులో ఉంచేలా కేంద్ర బడ్జెట్ 2018-19లో చర్యలు తీసుకోవడం ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి కత్తిమీద సామే. 2018లో దిగుమతుల బిల్లు రూ.5 లక్షల కోట్లకు చేరుకుంటుందన్న అంచనాలున్న నేపథ్యంలో బడ్జెట్లో చమురు రంగానికి అవసరమైన సంస్కరణలు చేపట్టాలని ఈ రంగం విజ్ఞప్తి చేస్తోంది.

ఈ రంగం ఏం కోరుకుంటోందంటే..

- చమురు తవ్వక, ఉత్పత్తి రంగానికి మౌలిక హోదా ఇవ్వాలి.
- స్థానికంగా తయారు చేసే ముడి చమురుపై పన్నులను తగ్గించడం ద్వారా దేశీయ ఉత్పత్తికి ప్రోత్సాహం ఇవ్వాలి.
- సహజ వాయువును కూడా వస్తువులు, సేవల పన్ను(జీఎస్‌టీ) విధానంలో కలపాలి. తద్వారా పర్యావరణ హిత ఇంధన వినియోగం పెంచేలా చేయొచ్చు.
- దేశీయ ఉత్పత్తిపై సెస్సును 20 శాతం నుంచి 8 శాతానికి తగ్గించాలి.
- దేశీయ ముడి చమురుకు, దిగుమతులకు మధ్య ధరల అంతరాన్ని తగ్గించాల్సిన అవసరం ఉంది. ఇందు కోసం స్థానికంగా తయారు చేసే ఉత్పత్తులపై కేంద్ర విక్రయ పన్నును 2 శాతం వరకు తగ్గించాలి. దేశీయ ఇంధన భద్రతకు కూడా ఇది దోహదం చేస్తుంది.

బడ్జెట్లూ.. బిలియనీర్లూ..

సంపన్నులపై బడ్జెట్ ప్రభావం బాగానే ఉంటుంది. బడ్జెట్ చర్యలు ఈ బిలియనీర్లు నిర్వహించే వ్యాపారాలపై నేరుగా ప్రభావం చూపిస్తాయి. ఆయా విధానాల్లో మార్పు, కార్పొరేట్ పన్నుల్లో మార్పు, ఇతరత్రా బడ్జెట్ నిర్ణయాల వల్ల కంపెనీల పనితీరులో, ఆదాయ పద్దుల్లో కచ్చితంగా హెచ్చుతగ్గులు చోటు చేసుకుంటాయి. కొంత మంది వాటిని అనుకూలంగా మార్చుకుని మెట్టుమీద మెట్టు పైకి వెళుతుంటారు. అందుకు ఉదాహరణ.. ముకేశ్ అంబానీ, దమానీలే. ముకేశ్ సంపద రెండు బడ్జెట్ల అనంతరం.. అంటే రెండేళ్లలోనే రెట్టింపు కావడం గమనార్హం. ఆయన సంపద 22.7 బిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 43.3 బిలియన్ డాలర్లకు పెరిగింది. ముకేశ్‌తో పాటు అగ్రగామి 16 మంది సంపన్నులు కూడా రాణించారు. గత ఏడాది అనూహ్య స్థాయిలో సంపద పెంచుకున్న వ్యక్తి రాధాకిషన్ దమానీ (అవెన్యూ మార్ట్). ప్రస్తుతం 10 బిలియన్ డాలర్ల సంపదతో భారత కుబేరుల్లో 12వ స్థానంలో ఉన్నారు.



ముకేశ్ ప్రేమ్‌జీ హిందుజా లక్ష్మీ మిత్తల్ పల్లోంజీ

గత రెండు బడ్జెట్‌ల అనంతరం.. ప్రస్తుత బడ్జెట్‌కు ముందు సంపద(బి. డాలర్లలో)

	10.04.16	10.04.17	26.01.18
ముకేశ్ అంబానీ	22.7	38.0	43.3
అజీం ప్రేమ్‌జీ	16.9	19.0	20.2
హిందుజా కుటుంబం	15.2	18.4	19.8
లక్ష్మీ మిత్తల్	12.5	16.5	20.4
పల్లోంజీ మిస్త్రీ	13.9	16.0	18.9
గోద్రేజ్ కుటుంబం	12.9	14.2	----
శివ్ నాడార్	11.4	13.6	15.3
కుమార్ బిర్లా	8.8	12.6	12.7
దిలీప్ సంఘ్వీ	16.9	12.1	----
గౌతమ్ అదానీ	6.3	11	----
ఉదయ్ కోటక్	8.3	10.5	11.2
రాధాకిషన్ దమానీ	-----	9.3	10.0
సైరస్ పూనావాలా	8.6	8.9	9.4
సునీల్ మిత్తల్, కుటుంబం	6.3	8.3	9.4
బజాజ్ కుటుంబం	5.7	8.0	----
సావిత్రి జిందాల్	5.3	7.5	8.9



గోద్రేజ్ శివ్ నాడార్ కుమార్ బిర్లా దిలీప్ సంఘ్వీ గౌతమ్

ఛాంపియన్

“ఇలాంటి పిచ్‌పై భారత బ్యాట్స్‌మెన్ 240కి పైగా పరుగులు చేసినందుకు వారిని అభినందించాలి. ఇది కష్టమైన పిచ్. అందులో సందేహం లేదు. అనూహ్య బౌన్స్ ప్రమాదకరమే. ఐతే వెంటనే మ్యాచ్ రద్దు చేయాల్సిన అవసరమైతే లేదన్నది నా అభిప్రాయం. ఏ నిర్ణయమైనా ఇంకో సెషన్ ఆట చూశాక తీసుకోవాలి”

– సునీల్ గావస్కర్



చికిత్స తీసుకుంటున్న ఎల్గర్



శుభ్‌మన్ (86)

కాస్కో పాక్..

- సెమీస్‌లో యువ భారత్
- క్వార్టర్స్‌లో బంగ్లాపై ఘనవిజయం
- అండర్-19 ప్రపంచకప్

క్వీన్స్‌టౌన్: క్రికెట్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో పోరాడి ఎంత కాలమైందో..! అభిమానులకు అసలైన వినోదాన్ని అందించే ఈ మ్యాచ్‌కు ముహూర్తం ఖరారైంది. కాకపోతే సీనియర్ జట్ల మధ్య కాదు..! అండర్-19 ప్రపంచకప్‌లో ఎదురులేని యువ భారత్ సెమీస్‌లో ప్రవేశించింది. ఫైనల్లో చోటు కోసం పాకిస్థాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. శుక్రవారం ఏకపక్షంగా సాగిన క్వార్టర్‌ఫైనల్లో పృథ్వీ సేన బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది.

కుర్రాళ్లు సమష్టిగా రాణించడంతో భారత్ 131 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. శుభ్‌మన్ గిల్ (86; 94 బంతుల్లో 9×4), అభిషేక్ శర్మ (50; 49 బంతుల్లో 6×4) రాణించడంతో మొదట 265 (49.2 ఓవర్లలో ఆలౌట్) పరుగులు చేసిన భారత్.. పేసర్లు నాగరకోటి (3/18), శివమ్ మావి (2/27) విజృంభించడంతో బంగ్లాను 134 పరుగులకే కుప్పకూల్చింది.

పరీక్షకు నిలిచి..: లీగ్ దశలో మూడు మ్యాచ్‌ల్లో అలవోకగా పరుగులు బాదే భారత బ్యాట్స్‌మెన్‌కు బంగ్లా బౌలర్ల నుంచి సవాల్ ఎదురైంది. పరిస్థితులను సద్వినియోగం చేసుకున్న ఆ జట్టు భారత బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బందిపెట్టింది. ఐతే సంయమనంతో బ్యాటింగ్ చేసిన భారత కుర్రాళ్లు జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించారు. జట్టుకు శుభారంభాన్ని అందించి పృథ్వీ షా (40) నిష్క్రమించగా.. శుభ్‌మన్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. హార్విక్ (34)తో కలిసి మూడో వికెట్‌కు 74 పరుగులు జోడించిన శుభ్‌మన్.. సెంచరీకి చేరువగా వచ్చి ఔటయ్యాడు. అభిషేక్ శర్మ లోయర్‌ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌తో కలిసి విలువైన పరుగులు జోడించాడు. 50వ ఓవర్ రెండో బంతికి ఇన్నింగ్స్ ముగిసింది. టోర్నీలో భారత్ ఆలౌట్ కావడం ఇదే తొలిసారి. ఛేదనలో ఆరంభం నుంచి బంగ్లాకు కష్టాలు తప్పలేదు. పేసర్లు నాగరకోటి, శివమ్ మావి క్రమం తప్పకుండా వికెట్లు పడగొడుతూ బంగ్లాపై ఒత్తిడి పెంచారు. 85కే 5 వికెట్లు కోల్పోయిన ఆ జట్టు.. స్పిన్నర్లు అభిషేక్ (2/11), అనుకుల్ (1/14) కూడా విజృంభించడంతో 134కే ఆలౌటైంది. సెమీస్‌లో ఆసియా నుంచి మూడు జట్లు బరిలో నిలిచాయి. సోమవారం తొలి సెమీస్‌లో ఆస్ట్రేలియాతో అఫ్గానిస్థాన్‌ను ఢీకొననుండగా.. మంగళవారం రెండో సెమీస్‌లో భారత్, పాకిస్థాన్ తలపడతాయి.

సంక్షిప్త స్కోర్లు: భారత్ అండర్–19: 265 (పృథ్వీ షా 40, శుభ్‌మన్ గిల్ 86, హార్విక్ 34, అభిషేక్ శర్మ 50; ఖాజి ఒనిక్ 3/48, నయీం హసన్ 2/36, సైఫ్ హసన్ 2/41)

బంగ్లా అండర్–19: 134 (పినక్ ఘోష్ 43, నయీం 12, సైఫ్ హసన్ 12, రొబియుల్ హక్ 14; నాగరకోటి 3/18, శివమ్ 2/27, అభిషేక్ 2/11)



అంపైర్లతో భారత ఆటగాళ్ల మంతనాలు

విజయం ఊరిస్తోంది.. కానీ!

- ప్రమాదకరంగా పిచ్.. ముందే ముగిసిన ఆట
- మ్యాచ్ కొనసాగడంపై సందేహాలు

దక్షిణాఫ్రికా లక్ష్యం 241.. ప్రస్తుతం 17/1 • ఆశలు నిలిపిన రహానె, భువి, షమి

దక్షిణాఫ్రికా పర్యటనలో ఎట్టకేలకు భారత్ ప్రత్యర్థిపై స్పష్టమైన పైచేయి సాధించింది. విజయావకాశాలు సృష్టించుకుంది. ప్రత్యర్థి ముందు కష్టసాధ్యమైన లక్ష్యాన్ని నిలిపింది. సఫారీ జట్టు అప్పుడే తొలి దెబ్బ కూడా తింది. పరిస్థితి కోహ్లీసేనకు అనుకూలంగా కనిపిస్తోంది. బౌలర్లు తొలి ఇన్నింగ్స్ జోరును కొనసాగిస్తే.. చివరి టెస్టు భారత్‌దే కావచ్చు! ఐతే భారత్ విజయానికి దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ కంటే ముందు పిచ్ అడ్డుపడేలా ఉంది. ఈ మ్యాచ్ ఆరంభం నుంచి అనూహ్యంగా స్పందిస్తున్న పిచ్.. మూడో రోజు ప్రమాదకరంగా మారింది. అనూహ్య బౌన్స్ బ్యాట్స్‌మెన్‌ను ఉక్కిరి బిక్కిరి చేసింది. అయితే రోజంతా ఈ ప్రమాదకర పిచ్‌ను ఎదుర్కొనే భారత బ్యాట్స్‌మెన్ విలువైన పరుగులు చేశారు. కానీ సాయంత్రానికి దక్షిణాఫ్రికా ఆడుతున్నపుడే పిచ్ తీవ్రత మ్యాచ్ రిఫరీకి అర్థమైంది. దీంతో ఆట అరగంట ముందే ముగిసిపోయింది. మ్యాచ్ సజావుగా సాగితే విజయం భారత్‌దే కావచ్చు. కానీ అసలు ఆట కొనసాగుతుందా అన్నదే సందేహం!

జొహానెస్‌బర్గ్

భారత్, దక్షిణాఫ్రికా మధ్య నామమాత్రమైన చివరి టెస్టు మూడో రోజుకే ముగింపు దశకు వచ్చేసింది. ఇంకో రెండు సెషన్లలో ఫలితం తేలిపోవచ్చు. పరిస్థితి భారత్‌కే అనుకూలంగా ఉంది. బ్యాట్స్‌మెన్‌కు ప్రతి బంతీ సవాలు విసురుతున్న మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ముందు 241 పరుగుల ప్రమాదకర లక్ష్యం నిలిచింది. మూడో రోజు ఆట ఆఖరుకు ఆ జట్టు 17/1తో నిలిచింది. ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే షమి.. ఓపెనర్ మార్‌క్రమ్ (4) వికెట్‌ను పడగొట్టి భారత్‌కు శుభారంభాన్నందించాడు. ఎల్గర్ (11), ఆమ్లా (2) క్రీజులో ఉన్నారు. బుమ్రా షార్ట్ పిచ్ బంతి ఎల్గర్ హెల్మెట్‌కు ప్రమాదకర రీతిలో తాకడంతో మ్యాచ్ నిర్ణీత సమయం కన్నా అర గంట ముందే ఆగిపోయింది. అంతకుముందు భారత్ 247 పరుగుల వద్ద రెండో ఇన్నింగ్స్ ముగించింది. రహానె (48; 68 బంతుల్లో 6×4), కోహ్లి (41; 79 బంతుల్లో 6×4) కీలక ఇన్నింగ్స్ ఆడారు. బౌలర్లు భువనేశ్వర్ (33; 76 బంతుల్లో 2×4), షమి (27; 28 బంతుల్లో 1×4, 2×6) కూడా విలువైన పరుగులు సాధించారు. ఇలాంటి పిచ్‌పై ఫామ్‌లో ఉన్న భారత ఫాస్ట్‌బౌలర్లను ఎదుర్కొని లక్ష్యాన్ని ఛేదించడం దక్షిణాఫ్రికాకు అంత తేలికైతే కాదు.

పతనం ఖాయమనుకుంటే..: మూడో రోజు క్రీజులో పట్టుదలతో నిలబడి.. పరుగులు చేసిన భారత బ్యాట్స్‌మెన్ అందరికీ హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. దక్షిణాఫ్రికా ఫాస్ట్‌బౌలర్లను జొహానెస్‌బర్గ్‌లో మామూలుగా ఎదుర్కోవడమే కష్టం. అలాంటిది పిచ్ ప్రమాదకర రీతిలో స్పందిస్తూ.. బంతి బంతికీ పరీక్ష పెట్టినపుడు వారిని ఎదుర్కోవడం ఎంత కష్టమో చెప్పేదేముంది..? ఉదయం 49/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్‌కు.. ఆరంభంలోనే గట్టి ఎదురు దెబ్బలు తగిలాయి. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ రాహుల్ (16) అదే స్కోరుపై ఔటైపోయాడు. తొలి ఇన్నింగ్స్‌లో మొండి పట్టుదలతో గోడలా నిలబడ్డ పుజారా ఒక్క పరుగుకే వెనుదిరిగాడు. స్కోరు 57/3. తొలి రెండు టెస్టుల్లో లాగే రెండో ఇన్నింగ్స్‌లో భారత్ మరోసారి కుప్పకూలబోతోందన్న అంచనాకు వచ్చేశారంతా. కానీ ఆ స్థితి నుంచి భారత్ ఊహించని స్కోరే చేసింది. ఈ ఘనత ఐదుగురిది.

రహానె.. ఇన్నింగ్స్‌కు ఇరుసులా!: ఆట ఆరంభమైన కాసేపటికే రెండు కీలక వికెట్లు కోల్పోయిన భారత్‌ను మళ్లీ పోటీలో నిలబెట్టింది విజయ్, కోహ్లీలే. విజయ్ చేసింది 25 పరుగులే. కానీ అతను 127 బంతులెదుర్కొన్నాడు. గాయాలు తగిలినా అతను వెరవలేదు. ఇన్నింగ్స్‌కు స్థిరత్వం వచ్చే వరకు అతను క్రీజులో నిలిచాడు. మరోవైపు కోహ్లి కూడా దెబ్బలు తింటూనే.. కొన్ని చక్కటి షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును కదిలించాడు. దీంతో స్కోరు 100కు చేరుకుంది. ఈ దశలో విజయ్‌ను రబాడ (3/69) బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత కోహ్లికి రహానె జత కలిశాడు. తొలి రెండు టెస్టుల్లో తనకు తుది జట్టులో చోటివ్వడం తప్పని రుజువు చేస్తూ రహానె గొప్ప ఇన్నింగ్స్ ఆడాడు. అతను చేసిందీ 48 పరుగులే. కానీ మ్యాచ్ పరిస్థితుల దృష్ట్యా అది సెంచరీని మించిన ఇన్నింగ్స్! రహానె కూడా కుదురుకోవడం, కోహ్లి జోరు పెంచడంతో భారత్ ఓ దశలో 134/4తో మెరుగైన స్థితికి చేరుకుంది. ఈ దశలో రబాడ భారత్‌ను మళ్లీ గట్టి దెబ్బ తీశాడు. ఒక చక్కటి బంతితో కోహ్లిని బౌల్డ్ చేసిన అతను.. పాండ్య (4)ను కళ్లు చెదిరే రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ చేర్చాడు. దీంతో 148/6తో మళ్లీ ప్రమాదంలో పడింది.

గెలుపాశలు వారి వల్లే..: కోహ్లి, రహానె ఎంత బాగా ఆడినా.. భారత్‌కు గెలుపు అవకాశాలు కల్పించే స్కోరు అందించిన ఘనత భువి, షమిలదే. ముందు రహానెతో కలిసి భారత్ స్కోరును 200 దాటించాడు భువి. ఆపై షమి అతడికి తోడయ్యాడు. మిగతా బ్యాట్స్‌మెన్‌లా డిఫెన్స్ ఆడే ప్రయత్నం చేయలేదు షమి. రావడం రావడమే షాట్లకు దిగాడు. అతను రెండు భారీ సిక్సర్లు బాదాడు. ఈ మ్యాచ్‌లో సిక్సర్ కొట్టిన తొలి ఆటగాడు అతనే కావడం విశేషం. షమి దూకుడుతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. జట్టు స్కోరు 238 పరుగుల వద్ద అతను ఎనిమిదో వికెట్ రూపంలో వెనుదిరిగాడు. ఇంకో 9 పరుగులకే ఇన్నింగ్స్ ముగిసింది.

భారత్ తొలి ఇన్నింగ్స్: 187

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 194

భారత్ రెండో ఇన్నింగ్స్: విజయ్ (బి) రబాడ 25; పార్థివ్ (సి) మార్‌క్రమ్ (బి) ఫిలాండర్ 16; రాహుల్ (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 16; పుజారా (సి) డుప్లెసిస్ (బి) మోర్కెల్ 1; కోహ్లి (బి) రబాడ 41; రహానె (సి) డికాక్ (బి) మోర్కెల్ 48; పాండ్య (సి) అండ్ (బి) రబాడ 4; భువనేశ్వర్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 33; షమి (సి) డివిలియర్స్ (బి) ఎంగిడి 27; ఇషాంత్ నాటౌట్ 7; బుమ్రా (సి) రబాడ (బి) ఫిలాండర్ 0; ఎక్స్‌ట్రాలు 29 **మొత్తం:** (80.1 ఓవర్లలో ఆలౌట్) **247**

వికెట్ల పతనం: 1-17, 2-51, 3-57, 4-100, 5-134, 6-148, 7-203, 8-238, 9-240

బౌలింగ్: ఫిలాండర్ 21.1-5-61-3; రబాడ 23-5-69-3; మోర్నీ మోర్కెల్ 21-6-47-3; ఎంగిడి 12-2-38-1; ఫెలుక్వాయో 3-0-15-0

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) పార్థివ్ (బి) షమి 4; ఎల్గర్ బ్యాటింగ్ 11; ఆమ్లా బ్యాటింగ్ 2; ఎక్స్‌ట్రాలు 0 **మొత్తం:** (8.3 ఓవర్లలో వికెట్ నష్టానికి) **17**

వికెట్ల పతనం: 1-5

బౌలింగ్: భువనేశ్వర్ 4-0-8-0; షమి 4-1-7-1; బుమ్రా 0.3-0-2-0



రహానె (48)

పిచ్ ప్రమాదకరమేం కాదు

“పిచ్ ప్రమాదకరంగా ఏం లేదు. బౌన్స్ సహజంగానే ఉంది. మేం బ్యాటింగ్ చేస్తున్నప్పుడు కొన్ని బంతులు అనూహ్యంగా బౌన్స్ అయ్యాయి. ఓసారి బంతి మోచేతికి తాకింది. ఆటను కొనసాగించాలనుకుంటున్నామని అంపైర్లకు అప్పుడు స్పష్టం చేశాం. అయినా రెండు జట్లు ఒకే పిచ్‌పై ఆడుతున్నాయి కదా! పిచ్‌ను ప్రమాదకరం అనడం సరికాదు. ఎల్గర్ హెల్మెట్‌కు తాకిన బంతి కాస్త ఎక్కువ బౌన్స్ అయ్యింది. ఈ మ్యాచ్‌లో మేం గెలవాలనుకుంటున్నాం”

– రహానె

ఏమవునో...!

మూడో టెస్టు తొలి రోజు ఆట అవ్వగానే మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ ఇలాంటి పిచ్‌పై టెస్టు మ్యాచా అంటూ విమర్శలు గుప్పించడం తెలిసిందే. తొలి రోజు చాలాసేపు క్రీజులో నిలిచిన పుజారా సైతం పిచ్ ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని ప్రస్తావించాడు. అయినా ఆట అలాగే కొనసాగింది. మూడో రోజు పిచ్ మరింత ప్రమాదకరంగా తయారైంది. కొన్నిసార్లు బంతి అనూహ్యంగా పైకి ఎగిస్తే.. కొన్నిసార్లు అసలు పైకే లేవలేదు. మురళీ విజయ్ ఒకటికి మూడుసార్లు ఈ అనూహ్య బౌన్స్‌తో ఇబ్బంది పడ్డాడు. ఒకసారి అతడి తొడను బలంగా తాకింది. రబాడ బంతి కోహ్లి వేలికి గట్టిగా తాకడంతో అతడికి చికిత్స కూడా అవసరమైంది. రహానె, భువనేశ్వర్ సైతం ఇలాంటి బంతులతో ఇబ్బంది పడ్డవాళ్లే. రెండు మూడుసార్లు అంపైర్లు అంపైర్లు పిచ్ పరిస్థితిపై చర్చించారు. మధ్యలో మైదాన సిబ్బంది పిచ్‌ను సరిదిద్దే ప్రయత్నం కూడా చేశారు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ మూడో ఓవర్లో భువనేశ్వర్ బంతి బౌన్స్ అయి ఎల్గర్‌కు తాకింది. అయినా ఆట కొనసాగించారు. ఐతే తర్వాత బుమ్రా బంతి అందుకున్నాడు. అతడి షార్ట్ పిచ్ బంతి బౌన్స్ అయి దక్షిణాఫ్రికా ఓపెనర్ ఎల్గర్ హెల్మెట్‌కు తాకి ఇబ్బంది పడటంతో ఆట ఆగిపోయింది. మ్యాచ్ రిఫరీ మైదానంలోకి వచ్చేశాడు. అంపైర్లతో, భారత కెప్టెన్ కోహ్లితో చర్చలు జరిపాడు. కాసేపటి తర్వాత ఇరు జట్ల ఆటగాళ్లు మైదానాన్ని వీడారు. ఆటను అక్కడితో ఆపేశారు. ఈ పరిణామం మ్యాచ్ కొనసాగడంపై సందేహాలు రేకెత్తించింది. భారత జట్టు మాత్రం మ్యాచ్‌ను కొనసాగించడానికే పూర్తి సుముఖంగా ఉంది. విజయం సాధించేందుకు వచ్చిన మంచి అవకాశాన్ని భారత్ వదులుకోవాలని అనుకోవట్లేదు. తాము ఆడినపుడు కూడా పిచ్ ఇంతే ప్రమాదకరంగా ఉందని.. అప్పుడు ఆటను కొనసాగించి, ఇప్పుడు ఆపేయడం సరికాదన్నది భారత్ అభిప్రాయం. నిజానికి బుమ్రా బంతి మామూలుగానే బౌన్స్ అయిందని.. దానికి పిచ్‌తో ఏ సంబంధం లేదని భారత జట్టు వాదిస్తోంది. మరి నాలుగో రోజు పిచ్ ఎలా స్పందిస్తుంది.. అంపైర్లు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరం.

నాలుగో రోజు యథాప్రకారమే..

చివరి టెస్టు నాలుగో రోజు ఆట ఎప్పట్లాగే నిర్ణీత సమయానికే ఆరంభం కానుంది. ఈ విషయంలో ఐసీసీ స్పష్టత ఇచ్చింది. మూడో రోజు ఆట అనంతరం ఇరు జట్ల కెప్టెన్లతో మ్యాచ్ రిఫరీ సమావేశమయ్యాడు. మ్యాచ్‌ను కొనసాగించడానికే ఇరువురూ అంగీకరించడంతో నాలుగో రోజు యథాప్రకారం ఆట ఆరంభించాలని నిర్ణయించారు. ఐసీసీ నిబంధనల ప్రకారం పిచ్ ప్రమాదకరంగా ఉన్నపుడు రిఫరీతో సంప్రదించి అంపైర్లు ఆటను ఆపేయొచ్చు. ఐతే ఇరు జట్ల కెప్టెన్ల అంగీకారం ఉంటే ఆటను కొనసాగించవచ్చు.

పదకొండోసారి..

ఐపీఎల్ వేలం ఆరంభం నేడే • బరిలో 578 ఆటగాళ్లు



ఉదయం 9 నుంచి వేలం ప్రత్యక్షప్రసారం స్టార్ స్పోర్ట్స్-1లో

ఆశ్చర్యకర ఫలితాలుంటాయి.. ఉత్కంఠభరిత సన్నివేశాలుంటాయి..! వ్యూహాలు అసలు పనిచేయకపోవచ్చు.. ప్రణాళిక ప్రకారం పరిస్థితులు సాగకపోవచ్చు..! ఓ ఆసక్తికర మ్యాచ్‌లో ఏమేం చూడొచ్చో అన్నీ దర్శనమిస్తాయి! ప్రపంచంలో మేటి టీ20 లీగ్ ఐపీఎల్ ట్రోఫీని సొంతం చేసుకోగల అత్యుత్తమ జట్టును తయారుచేసుకునేందుకు ఎనిమిది ఫ్రాంఛైజీలు నువ్వానేనా అన్నట్టుగా పోరాడే వేలం ఆరంభం శనివారమే. పదేళ్ల తర్వాత పెద్ద ఎత్తున జరగనున్న వేలం ఇది. రెండు రోజుల పాటు సాగే ఈ ప్రక్రియలో తొలిరోజు ఎలాంటి ఆశ్చర్యకర ఫలితాలు వెలువడుతాయో చూడాలి..!


578: ఈ ఏడాది వేలానికి రానున్న ఆటగాళ్ల సంఖ్య. ఇందులో 244 మంది అంతర్జాతీయ ఆటగాళ్లున్నారు (భారత్ నుంచి 62). 332 మంది దేశవాళీ ఆటగాళ్లు, అసోసియేట్ దేశాల నుంచి ఇద్దరున్నారు.

మళ్లీ పంజాబ్‌కే టైటిల్

దిల్లీ: ప్రొ రెజ్లింగ్ లీగ్‌ను మరోసారి పంజాబ్ రాయల్స్ సొంతం చేసుకుంది. శుక్రవారం జరిగిన ఫైనల్లో పంజాబ్ 6-3తో హరియాణా హామర్స్‌ను చిత్తు చేసింది. రెండో సీజన్‌లోనూ పంజాబే విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే.

ఫెదరర్ ఏడోసారి

ఫైనల్లో ప్రవేశం • సెమీస్‌లో గాయంతో వైదొలిగిన చంగ్



మెల్‌బోర్న్: ఫెదరర్ మళ్లీ వచ్చేశాడు.. గతేడాది ఆస్ట్రేలియన్ ఓపెన్లో విజేతగా నిలిచి పూర్వ వైభవాన్ని సంతరించుకున్న రోజర్.. మరోసారి ఇదే వేదికలో టైటిల్ పోరుకు సిద్ధమయ్యాడు. దక్షిణ కొరియా యువ సంచలనం హ్యుయాన్ చంగ్ గాయం కారణంగా సెమీస్ నుంచి తప్పుకోవడంతో డిఫెండింగ్ ఛాంపియన్ రోజర్.. పెద్దగా కష్టపడకుండానే ఫైనల్ చేరాడు. ఈ టోర్నీలో తుది పోరుకు అర్హత సాధించడం స్విస్ మాస్టర్‌కు ఇది ఏడోసారి. ఆదివారమే మారిన్ సిలిచ్ (క్రొయేషియా)తో టైటిల్ సమరం. శుక్రవారం పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో రోజర్ 6-1, 5-2తో చంగ్‌పై ఆధిక్యంలో ఉన్న సమయంలో ప్రత్యర్థి గాయంతో పోటీ నుంచి తప్పుకున్నాడు. “ఈ టోర్నీలో చంగ్ అద్భుతంగా ఆడాడు. చివరి వరకు అతను పోరాడేతత్వం ఎంతో నచ్చింది. ఈ దశకు రావడంతోనే చంగ్ తానో గొప్ప ఆటగాడని నిరూపించుకున్నాడు. ఛాంపియన్ అయ్యే అన్ని లక్షణాలు అతనిలో ఉన్నాయి. అతను త్వరలోనే టాప్-10 ఆటగాడు అవుతాడు” అని ఫెదరర్ అన్నాడు.

బబోస్ జంటకు టైటిల్

రోహన్ బోపన్నతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌లో ఫైనల్ చేరిన హంగేరి అమ్మాయి బబోస్.. మహిళల డబుల్స్‌లో మ్లదనోవిచ్ (ఫ్రాన్స్)తో కలిసి టైటిల్ కొట్టింది. ఫైనల్లో ఐదోసీడ్ బబోస్-మ్లదనోవిచ్ 6-4, 6-3తో రెండో సీడ్ మకరోవా-వెస్నినా (రష్యా)ను వరుస సెట్లలో ఓడించారు.





ఫైనల్లో బోపన్న జోడీ

మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న జోడీ ఫైనల్లో ప్రవేశించింది. సెమీఫైనల్లో ఐదో సీడ్ బోపన్న-తిమియా బబోస్ (హంగేరి) 7-5, 5-7 (10-6)తో మార్టినెజ్ సాంఛెస్ (స్పెయిన్)-డిమోలినర్ (బ్రెజిల్)ను ఓడించారు. టైటిల్ సమరంలో బోపన్న జోడీ.. దబ్రౌస్కీ (కెనడా)-పవిచ్ (క్రొయేషియా)తో తలపడనుంది. ఇప్పుడు ప్రత్యర్థిగా ఉన్న దబ్రౌస్కీతో కలిసే 2017 ఫ్రెంచ్ ఓపెన్లో బోపన్న మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ కొట్టాడు. కెరీర్‌లో అతనికదే తొలి టైటిల్.

అక్రమాలకు అక్షరాభ్యాసం!

దేశంలోనే రెండో జ్ఞాన సరస్వతి ఆలయంగా భాసిల్లుతున్న బాసర పుణ్య క్షేత్రంలో అడుగడుగునా నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. భూముల్ని కాపాడుకోవడంపై పట్టింపు కరవైంది. రోజువారీ ఆలయ నిర్వహణపైనా ఆరోపణలు, విమర్శలు వ్యక్తమవుతున్నా, పట్టించుకునే వారు కరవయ్యారు. అధికారుల నిర్లక్ష్యం ప్రస్ఫుటమవుతోంది. వివరాలివీ..

ఈనాడు – హైదరాబాద్

● బాసర అమ్మవారి మాన్యాలు.. హారతి! ● ఆక్రమణలు, విక్రయాలతో మాయం ● దర్జాగా కట్టడాలు.. ఆపై అద్దెకు..
● గుడికి దక్కని భూముల పరిహారం ● గోదావరి తీరంపైనా కన్ను ● ఆలయ ఆదాయానికీ అక్రమార్కుల గండి
● వాడిన టికెట్లే మళ్లీ జారీ.. ● ప్రసాదాల్లోనూ నాణ్యత కరవు ● జ్ఞానసరస్వతి చెంత కొంతమందిదే ఇష్టారాజ్యం!


బాసర అమ్మవారి గర్భాలయం

విఠలేశ్వరస్వామి మందిరం పేరిట ఉన్న భూముల్లో కొన్నింటిని ఇప్పటికే తెగనమ్మేశారు. మరికొన్ని బేరసారాల్లో ఉన్నాయి. వీటిలో ప్రైవేటు వ్యాపారమూ నిర్వహిస్తున్నారు. అమ్మవారి భక్తుల కోసం ప్రభుత్వం ఇక్కడ స్నానఘట్టాలు ఏర్పాటు చేయగా.. ప్రైవేటు వ్యక్తులు దుకాణాలు తెరిచారు. తేనీరు, అల్పాహారం, భోజనం, పూలు, కొబ్బరికాయలు, పసుపు-కుంకుమ విక్రయాల పేరిట దుకాణాలు, షెడ్లు వెలిశాయి. ఈ భూములను ఆక్రమించిన వ్యక్తి తన మనుషులతో అద్దెలు వసూలు చేస్తూ దందా చేస్తుండటం కళ్లకు కడుతోంది.

దుకాణానికి రూ.7 లక్షలు

విఠలేశ్వరస్వామి భూముల్లో ప్రైవేటు వ్యక్తులు పక్కా ప్రణాళికతో దుకాణ సముదాయాలు నిర్మించారు. బాసర అమ్మవారి ఆలయ సంపదైన ఈ భూముల్లో పెత్తనమంతా ప్రైవేట్ వారిదే. ఒక్కో దుకాణానికి ఏటా రూ.7 లక్షలు, హోటళ్లకు రూ.13 లక్షలు వరకు అద్దెలు వసూలు చేస్తున్నట్లు అక్కడి దుకాణదారులే చెబుతున్నారు. ఏటా దాదాపు రూ.కోటిన్నర దాకా ఆదాయం ప్రైవేటు వ్యక్తుల పరమవుతోందని స్థానికులు చెబుతున్నారు.


గోదావరి తీరాన ప్రైవేటు వ్యక్తులు ప్రతిష్ఠించిన సరస్వతి అమ్మవారి విగ్రహం

ప్రత్యేక కట్టడాలతో ఆ ప్రాంతంలో ఆధిపత్యం చెలాయించడం ప్రమాదకర పరిణామమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నది లోపలి భాగం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం, నదీ జలాల్లో వ్యాపారం నిర్వహించడంపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది నది ఒడ్డున భారీ సరస్వతి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, దుకాణ సముదాయాల పక్కనే ప్రైవేటుగా పూజలకు తెరతీయడం గమనార్హం.

ఆలయ ఆదాయమిలా..

సంవత్సరం	ఆదాయం (రూ.కోట్లలో)
2012-13	19.17
2013-14	20.14
2014-15	14.55
2015-16	17.71
2016-17	16.42

భూములన్నీ మాయం

బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారికి సంబంధించిన భూములు అనేక చోట్ల ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ముథోల్, బాసర, గుండేగావ్, సిరాల, బెల్తరోడా, కామెల్, బాలపూర్(మహారాష్ట్ర), బోల్‌సా ప్రాంతాల్లో కలిపి దాదాపు 84.56 ఎకరాలకుపైగా సాగు భూములు ఉన్నాయి. 1966లో ప్రభుత్వం దేవాదాయశాఖ పరిధిలోకి సరస్వతి ఆలయాన్ని తీసుకొచ్చింది. అప్పటి వరకు ఆలయంలో వంతుల వారీగా పూజలు నిర్వర్తించే పూజారుల జీవనభృతికి కేటాయించిన (సర్వీస్ ఇనాం) భూములను మాత్రం ప్రభుత్వం వెనక్కి తీసుకోలేదు. పైగా పూజారులకు వంశపారంపర్య పూజాదులకు హక్కులు కల్పించారు. దీని ప్రకారం ఆలయ భూములను కౌలుకు ఇస్తే ఆ మొత్తం అమ్మవారి ఖజానాకే చేరాలి. ఇప్పటి వరకు ఆ భూముల కౌలు పైసా చేరలేదు. భూముల నిర్వహణ సక్రమంగా లేకపోవడమే దీనికి కారణంగా కనిపిస్తోంది. బెల్తరోడా, బోల్‌సా గ్రామాల పరిధిలో ఉన్న అమ్మవారి భూములను స్థానిక పెద్దలు సాగు చేసుకుంటున్నారని ఆ గ్రామాల ప్రజలు 'ఈనాడు'కు వివరించారు.

కళ్లు మూసుకుంటున్న అధికారులు

అమ్మవారి భూముల నుంచి రావాల్సిన ఆదాయం హరించుకుపోతున్నా అడ్డుకునే వారు కనిపించడం లేదు. ఒకపక్క భూముల్ని కబ్జా చేయడం, విక్రయాలు చేపట్టడం, దుకాణాలను నిర్మించి అద్దెల దందాకు పాల్పడుతున్నా ఏ ఒక్క అధికారీ అడ్డుకోలేకపోతున్నారు. పూర్వీకులు దేవాలయాలకు ఇనాంగా ఇచ్చిన భూముల్ని కాపాడుకోలేని దుస్థితి దేవాదాయ శాఖలో కనిపిస్తోంది. అమ్మవారి ఆలయ భూముల నుంచి ఏటా రావాల్సిన కౌలుకు లెక్కలు ఉండటం లేదు. 2017లో అమ్మవారి సర్వీస్ ఇనాం భూములను కొన్నింటిని వేలం వేయగా రూ.3 లక్షలు రాగా, మిగతా భూములకు వేలం నిర్వహించాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

ఆలయ భూములివే..

మండలం	గ్రామం	సర్వే సంఖ్య	విస్తీర్ణం (ఎకరాల్లో)
బాసర	బాసర	431	8–22
బాసర	బాసర	432	5–27
బాసర	బాసర	447/2	8–04
భైంసా	గుండేగావ్	60	11–28
భైంసా	సిరాల	45	6–22
తానూర్	బోల్‌సా	131/1	13.18
తానూర్	బేల్తరోడు	110	16.15
బాలాపూర్ (మహారాష్ట్ర)		171	16.20

హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం

బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారికి చెందిన భూములు, ఇతర అంశాల్లో చోటుచేసుకుంటున్న అక్రమాలపై బాసరకు చెందిన సంజీవ్‌రావు అనే వ్యక్తి ఉమ్మడి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం సైతం దాఖలు చేశారు. 9.12.2016వ తేదీన డబ్ల్యూ.పి(పి.ఎల్) నం. 194 ఆఫ్ 2016తో దాఖలైంది.


ఇనాం భూముల్లో నిర్మించిన దుకాణాలు

కట్టడాలకు అనుమతులేవీ

దేవాదాయ శాఖకు చెందిన భూముల్లో నిర్మాణాలకు తావులేదు. భూముల్లో సాగు చేసుకుని జీవించే హక్కే కాస్తుదారులకు ఉంటుంది. అందుకు భిన్నంగా విఠలేశ్వరస్వామి పేరిట ఉన్న భూముల్లో దుకాణాలు, హోటళ్లు నిర్మించి అద్దెలు దండుకుంటున్నారు. ఆలయ అధికారులు ఈ దుకాణాలకు టెండర్లు నిర్వహించే ప్రయత్నాలు చేసినా అనేక సాకులు చూపి కొందరు అడ్డుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.

గోదావరిని చెరబట్టేందుకు


బాసరలోని ఓ ప్రైవేటు రిసార్ట్స్ ఎదురుగా గోదావరిలో కొంత భూభాగం తమదేనంటూ కొంతమంది ప్రచారం చేసుకుంటున్నారు. పుష్కరాల సందర్భంగా ప్రభుత్వం గోదావరి నదిలో ఘాట్లు నిర్మించి, ఒడ్డున రెండు వరసల రహదారి కూడా నిర్మించడంతో ఈ ప్రాంతానికి ప్రత్యేకత వచ్చింది. ఘాట్లు ఉన్న చోట ప్రత్యేక పూజలు, హారతుల పేరిట బాసరలోని వైదిక పాఠశాల విద్యార్థులు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం నిర్వహిస్తున్న గంగా హారతి అందరినీ ఆకట్టుకుంటోంది. అయితే, అది తమ భూమిలోనే చేపడుతున్నారని కొందరు చేస్తున్న ప్రచారం తాజాగా చర్చకు దారితీస్తోంది. క్రమంగా గోదావరి లోపలి భాగంపై హక్కులు సంపాదించే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.


ప్రైవేట్ బోటింగ్

గోదావరి తీరంలో నిబంధనలకు విరుద్ధంగా కొంత మంది ప్రైవేట్ బోటింగ్‌ను ఏర్పాటు చేశారు. ప్రైవేటు వ్యక్తులు బోటింగ్ కోసం పార్కును ఏర్పాటు చేయడం,


అమ్మవారికి దక్కని భూ పరిహారం..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తానూరు మండలంలోని బేల్తరోడు గ్రామంలో సర్వే సంఖ్య 110లో అమ్మవారి ఇనాం భూమి 16.15 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఎన్నో ఏళ్లుగా కొంతమంది సాగు చేసుకుంటున్నారు. ఈ విస్తీర్ణంలో 2002లో ఎస్సారెస్పీ ప్రాజెక్టు కింద ముంపులో పోతున్న 3.22 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ఈ భూమి పరిహారానికి సంబంధించిన అవార్డు దస్త్రాల్లో ఉన్న వివరాలకు విరుద్ధంగా వేరే వారికి కేటాయించారు. భూ దస్త్రాల ప్రకారం 1975 పహాణీలో పట్టాదారు/ఖాతాదారు గడిలో సరస్వతీదేవి పేరు ఉంది. 2000-2001 పహాణీలో ఆ గడిలో విఠాబాయి పేరును పేర్కొన్నారు. అదే 2002 పహాణీలో ఆ గడిలో తిరిగి జ్ఞానసరస్వతి మందిరం పేరుతో పాటు విఠాబాయి పేరును రాశారు. పహాణీలో దిద్దుబాట్లు, ఒక ఏడాది ఒకపేరు ఉంటే మరోసారి పేర్లు మారాయి. ఇదంతా ఓ వ్యూహం ప్రకారం ప్రభుత్వ సొమ్మును కాజేయడానికి చేసిన ప్రయత్నమనేది స్పష్టమవుతోంది. చివరికి పరిహారాన్ని శరత్ పాఠక్, రాజారాం పేర్లతో ప్రకటించారు. అమ్మవారి భూములకు సంబంధించిన పరిహారం ఆలయ ఖజానాకు చేరకుండా పహాణీలో ఇష్టారీతిన పేర్లు రాసి పంపిణీ చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై ఆలయ ఇన్‌ఛార్జి ఈవో సోమయ్యను వివరణ కోరగా దేవస్థానం భూములకు సంబంధించి ఏ పరిహారమైనా ఖజానాకు రావాల్సిందేనన్నారు. దీనిపై దృష్టిసారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


2000 సంవత్సరంలో జారీ చేసిన పహాణీలో ఒకరి పేరు ఉన్న దృశ్యం


2002 పహాణీలో విఠాబాయి పేరుతో పాటు మరికొన్ని రాసిన దృశ్యం

స్వాధీనం చేసుకోని అధికారులు..


438 సర్వే నంబర్ భూమికి సంబంధించిన ఓఆర్‌సీ పత్రాలు

ప్రస్తుత నిర్మల్ జిల్లా బాసర మండలంలోని సర్వే సంఖ్య 438లో 18.19 ఎకరాల భూమి ఉంది. ఇది విఠలేశ్వరస్వామి మందిరానికి చెందిన భూమి. రెవెన్యూ రికార్డుల్లో కూడా స్వామివారి పేరుతోనే భూమి ఉండగా సాగులో ఇతరులు ఉన్నారు. ఈ భూములు కేవలం సాగుకు మాత్రమే వినియోగించాల్సి ఉంది. ఇనాం భూమి అయినప్పటికీ రిజిస్ట్రేషన్ చేసే ప్రయత్నాలు కూడా జరిగాయి. దీనిపక్కనే భూమి ఉన్న కొందరు కబ్జాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ భూమికి 08.10.2004లో అప్పటి నిర్మల్ రెవెన్యూ కోర్టు ఓఆర్‌సీ (స్వాధీన ధ్రువీకరణ పత్రం) జారీ చేసింది. ఈ భూమి దేవాదాయ శాఖకు(కేస్ నం.డి/3475/04) చెందుతుందని రెవెన్యూ కోర్టు స్పష్టంగా పేర్కొంది. అయినప్పటికీ అధికారులు స్వాధీనం చేసుకోవడం లేదు. బహిరంగ మార్కెట్‌లో దీని ధర దాదాపు రూ.30 కోట్ల వరకు ఉంటుంది. ప్రకృతి సిద్ధమైన వాతావరణం, నదీ ప్రవాహంతో వెలకట్టలేని విలువైన ఈ భూముల్లో పక్కా కట్టడాలు కూడా నిర్మించారు.

ఆలయంలోనూ అక్రమాలే..

అక్షరాభ్యాసాలు.. లడ్డూలు.. సామగ్రి.. అన్నింటికీ అక్రమాల చీడ..

అక్షరాభ్యాసాన్నీ సొమ్ము చేసుకుంటున్న వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. అక్షరాభ్యాసానికి ఇచ్చే ఒక్కో టిక్కెట్‌ను నాలుగైదుసార్లు పునర్ వినియోగిస్తూ, ఆ సొమ్మును జేబులో వేసుకోవడం పరిపాటిగా మారింది. లడ్డు, ప్రసాదం తయారీలో వినియోగించే సరకుల్లోనూ లాలూచీ పడి నాణ్యతలేని వాటితో సరిపెడుతున్నారు. ఆలయ అంతర్గత సామగ్రి, కొనుగోళ్ల బిల్లులు, తాత్కాలిక ఉద్యోగుల నియామకాల్లోనూ అందినకాడికి దండుకుంటున్నారు. ఆలయం నీడలో చేరిన కొందరు తమ అక్రమ వ్యవహారాలతో ఖజానాకు కన్నమేస్తూ రూ.కోట్లు దండుకుంటున్న తీరు చర్చనీయాంశంగా మారింది.


అంతా వారి కనుసన్నల్లోనే

ఆలయంలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఓ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇది అందరికీ తెలిసిన విషయమే. ఆయనకు ధర్మకర్తల మండలికి చెందిన కీలక వ్యక్తి అండగా నిలుస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ధర్మకర్తల్లో ఒకరు, ఆ కీలక వ్యక్తి, ఆ అధికారి మధ్య ఉన్న ఆర్థిక బంధమేనని ప్రచారంలో ఉంది. తాత్కాలిక ఉద్యోగుల నియామకాలు, అంతర్గత కొనుగోళ్లలో చోటుచేసుకుంటున్న అనేక రకాల అక్రమాలకు ఇక్కడే బీజం పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎంత ఆదాయం వస్తున్నా ఆలయ అభివృద్ధి మాత్రం అడుగు కూడా ముందుకు పడటం లేదన్న వాదన వినిపిస్తోంది. కొందరు తాత్కాలిక ఉద్యోగుల నియామకాల్లో నిబంధనలకు నీళ్లు వదిలిన తీరుపై విమర్శలు వస్తున్నాయి. ఆ ముగ్గురి కనుసన్నల్లోనే ఆలయంలో ప్రతి పనీ జరుగుతుండటంతో అంతా నాసిరకంగా మారింది.


పర్యవేక్షణ కరవైన సీసీ కెమెరాల నియంత్రణ కేంద్రం

భద్రత గాలికి

బాసరలో ఐఐఐటీ ఉండటంతో దేశవ్యాప్తంగా ఇక్కడి వచ్చే వారు ఆలయ దర్శనానికి వస్తున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక నుంచీ భక్తులు భారీగా వస్తున్నారు. ఆలయ ప్రాశస్త్యం దృష్ట్యా భద్రతను కట్టుదిట్టం చేయాల్సి ఉండగా, కేవలం 29 మంది హోంగార్డులతో సరిపెడుతున్నారు. గర్భగుడి, ఆలయ పరిసరాల్లో 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా పర్యవేక్షకుడు ఒక్కరే ఉన్నారు. దృశ్యాలను నమోదు చేయడానికి మాత్రమే పరిమితమవుతుండటంతో నిరంతర నిఘా కల్లగా మారింది.


ఆలయం లోపల, బయట తాగునీరు రాని కొళాయిలు

తాగునీరూ కరవే

ఆలయ పరిసరాల్లోకి ప్రవేశించాక భక్తులు దాహం తీర్చుకోవడం గగనంగా మారింది. తాగునీటి కోసం క్యూ మార్గాల నుంచి బయటికి వచ్చే అవకాశం లేదు. ఆలయంలో వెలుపల, గర్భగుడి సమీపంలో ఏర్పాటు చేసిన తాగునీటి నల్లాలు పని చేయడం లేదు.

నిత్యాన్నదానం.. కొందరికే

నిత్యం భక్తులు వేల సంఖ్యలో ఆలయాన్ని సందర్శిస్తుండగా.. నిత్యాన్నదానం మాత్రం 300 మందికి మాత్రమే వడ్డిస్తున్నారు. సంఖ్య పెరుగుతున్నా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. నిత్యం ఎంతోమంది అన్నప్రసాదం దొరక్క వెనుదిరగాల్సి వస్తోంది.

నివాస గదులకూ అవస్థలే

రద్దీకి తగినట్లుగా గదులు సరిపడా లేకపోవడంతో పర్వదినాల్లో వచ్చే భక్తులు నాలుగైదు రెట్లు ఎక్కువ అద్దెలు చెల్లించాల్సి వస్తోంది. తితిదే సత్రంలో నీళ్లు రాకుండా, మరుగుదొడ్లు పాడై దాదాపు 25 గదులు పనికి రాకుండా మారాయి. రద్దీ వేళల్లో ప్రైవేటు లాడ్జీలు రూ.300గా ఉండే అద్దెను అమాంతం పెంచేస్తున్నాయి. పలువురు భక్తులు ఆలయ పరిసరాల్లో ఆరు బయటే నిద్రించాల్సి వస్తోంది.


చెమ్మ, పెచ్చులూడిన గదుల్లో లడ్డూల నిల్వ

పరిశుభ్రతకు చెల్లుచీటి

లడ్డూల తయారీ ప్రక్రియలోనూ కనీస ప్రమాణాలు పాటించడం లేదు. తయారు చేసిన లడ్డూలను గోనెసంచులు, పాలిథిన్ బస్తాలపై ఆరబెడుతున్నారు. చెమ్మపట్టిన గోడలకు లడ్డూలు తాకుతుండగా.. అపరిశుభ్ర వాతావరణంలో నిల్వ చేస్తున్నారు. ప్రసాదం పంపిణీకి ఒకరోజు ముందే సిద్ధం చేస్తున్న లడ్డూల నాణ్యత తీసికట్టుగా మారింది. దీంతోపాటు లడ్డూపాకం, పులిహోర తయారు చేస్తున్న భవనం పైకప్పు పెచ్చులూడిపోతోంది. 1966లో తితిదే నిర్మించిన భవనంలో కనీస ప్రమాణాలు, సౌకర్యాలు లేని చోట ప్రసాదాలు తయారు చేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


పుచ్చులతో జీడి పప్పులు


నాణ్యత లేని ఎండు ద్రాక్ష

ప్రసాదాల్లో నాసిరకం సరకులు

ఆలయ పోటులో నిత్యం పది వేల వరకు లడ్డూల్ని తయారు చేస్తుండగా, ఇందులో వాడే జీడిపప్పు, ఎండుద్రాక్షల్లో నాణ్యతను వెదుక్కోవాల్సిందే. పులిహోరలో వాడే వేరుసెనగ గింజల్ని నాసిరకమైన, నల్లబారిన వాటినే వినియోగిస్తున్నారు. లడ్డూలు నాణ్యంగా ఉండటం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. తక్కువ నాణ్యతతో కూడిన రెండోరకం సరకుల్ని వాడటం వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తుతోందని మాజీ ట్రస్టు సభ్యులు కూడా ఆరోపిస్తున్నారు.

పట్టించుకోవడం లేదు



అమ్మవారి పేరున వాస్తవానికి 150 ఎకరాలదాకా భూమి ఉంది. దానిపై వస్తున్న కౌలునంతా ఓ వ్యక్తి తినేస్తున్నారు. కొంత భూమిలో ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి దుకాణాలు కట్టారు. ఇరవై దుకాణాలను అద్దెకు ఇస్తూ ఏటా రూ.కోట్లు అక్రమంగా ఆర్జిస్తున్నారు. ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. తాత్కాలిక సిబ్బంది నియామకాల్లోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయి. లడ్డూ తయారీలో నాణ్యతలేని సామగ్రి వాడుతున్నారు. అక్షరాభ్యాసం టిక్కెట్లలో గోల్‌మాల్ చేస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు లేరు.

– మాధవరావు, ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు

లెక్కల్లో చూపడం లేదు..



బాసర ఆలయాన్ని దేవాదాయ శాఖ పూర్తిగా స్వాధీనం చేసుకోవాలి. ఇక్కడ ఆదాయం భారీగా వస్తున్నా లెక్కల్లో చూపడం లేదు. కొందరు ఆలయ హక్కులు తమ చేతుల్లో ఉంచుకునేందుకు చేస్తున్న కుట్ర ఇది. ఈ విషయాన్ని ఆధారాలతో ఉన్నతాధికారులు, మంత్రుల దృష్టికి తీసుకొచ్చినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. కొందరు సిబ్బంది, పెద్దలు కలిసి ఆలయంలోని ప్రతి విభాగంలోనూ అక్రమాలకు పాల్పడుతున్నారు. భూములు కబ్జాచేసి విక్రయిస్తున్నా ఎవరికీ పట్టింపులేదు. దీనిపై బాసర ప్రజల తరఫున పోరాటం చేస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బాసరను అక్రమార్కుల నుంచి కాపాడి అభివృద్ధి చేయాలి.

– వినయ్, స్థానికుడు, బాసర

చర్యలు తీసుకుంటాం

ఆలయంలో కొన్ని రకాల సమస్యలు ఉన్న మాట వాస్తవమే. లడ్డూల్ని నాణ్యంగానే తయారు చేయిస్తున్నాం. పోటు భవన నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశాం. ఆలయ భూములను ప్రైవేటు వ్యక్తులు చేతుల్లోకి తీసుకుంటే అది చట్ట విరుద్ధమే. భూ పరిహారం తీసుకున్నా, దానిపై క్రిమినల్ చర్యలు చేపడతాం. ఆలయ భూముల ఆక్రమణలు అడ్డుకునేందుకు ప్రణాళిక తయారు చేస్తాం. అమ్మవారి ప్రాశస్త్యం, ఆలయ ప్రభను కాపాడేందుకు శాయాశక్తులా కృషి చేస్తాను.

– సోమయ్య, ఇన్‌ఛార్జి కార్యనిర్వాహక అధికారి

చంద్రుడిపై స్థావరం ఏర్పాటులో చైనా ముందడుగు


★ కృత్రిమ ప్రయోగశాలలో 200 రోజులు గడిపిన నలుగురు

శోధన

బీజింగ్: చంద్రుడిపై వాతావరణ పరిస్థితులను పోలిన ప్రత్యేకమైన ప్రయోగశాలలో నలుగురు ఔత్సాహికులు 200 రోజులు విజయవంతంగా గడిపారు. బీజింగ్‌లోని బీహంగ్ విశ్వవిద్యాలయం ఆవరణలో నెలకొల్పిన 'చంద్ర భవంతి' అనే ప్రయోగశాలలో 160 చదరపు మీటర్ల క్యాబిన్‌లో ఈ విద్యార్థులు జీవించారు. బయటి నుంచి ఎలాంటి వనరులు అందజేయకున్నా వారి వ్యర్థాలతో కిణ్వప్రక్రియలో తయారుచేసిన జీవ ఎరువులతో కూరగాయలు, పంటలు పండించుకుని బతకడం విశేషం. 2014లో మొదటిసారిగా ఇద్దరు పురుషులు, ఇద్దరు స్త్రీలు 60 రోజులపాటు ప్రయోగశాలలో గడిపారు. వారు బయటికి వచ్చేసిన తరువాత ప్రవేశించిన మరో నలుగురు విద్యార్థులు తాజాగా 200 రోజులు పూర్తి చేసుకున్నారు. వారు బయటికి వస్తే మొదటగా 60 రోజులు ఉండి వచ్చినవారు మరో 105 రోజులపాటు నివసించడానికి వెళ్లనున్నారు. చంద్ర భవంతిలో రెండు పొలాలతో పాటు 42 చదరపు మీటర్ల చొప్పున నలుగురు పడుకోవడానికి పెద్ద నాళికలు, అందరికీ ఉపయోగపడే ఉమ్మడిగది, స్నానాల గది, వ్యర్థాల కోసం మరో గది, జంతువులను పెంచుకోవడానికి అనువుగా మరొకటి ఉన్నాయి. 2022 నాటికి ఇతర గ్రహాలపై నివసించడానికి అనువుగా ఒక్క స్థావరాన్నైనా నెలకొల్పాలనే ఉద్దేశంతో చైనాప్రభుత్వం ప్రయోగాల కోసం వేలకోట్ల రూపాయల వ్యయం చేస్తోంది.

ఒక్క మందుతో రెండు వ్యాధులకు చెక్

★ హెపటైటిస్-సీ, జికా వైరస్ వ్యాధిగ్రస్తులకు శుభవార్త



లాస్‌ఏంజెలెస్: 'హెపటైటిస్-సీ'ను నయం చేయడానికి వాడుతున్న మందు, జికా వైరస్ సంక్రమించినవారికీ ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. జికా వైరస్ సంక్రమించిన నాడీకణాలకు ఎలాంటి హాని కలగకుండా చేయడానికి ఈ మందు ఉపయోగపడిందని తేలింది. కొత్తగా వ్యాధిసంక్రమణను సైతం నిరోధించగలిగిందని గమనించారు. ఇప్పటివరకు జికావైరస్‌ను అడ్డుకోవడానికి టీకా కనుగొనడానికే ఎక్కువగా ప్రయోగాలు జరుగుతున్నాయని అమెరికాలోని కాలిఫోర్నియా-శాన్‌డియాగో విశ్వవిద్యాలయానికి చెందిన అలిస్సాన్ మ్యూట్రి పేర్కొన్నారు. దీని వ్యాప్తిని అరికట్టడానికి అనుసరించాల్సిన వ్యూహాలపైనా దృష్టి పెట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. హెపటైటిస్-సీ వ్యాధిగ్రస్తుల చికిత్సకు వాడుతున్న 'సొఫొస్‌బువిర్'పై జరిపిన పరిశోధన పూర్తి వివరాలు 'సైంటిఫిక్ రిపోర్ట్స్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.


కుడి ఎడమైతే అర్థాలే వేరులే!

★ మనసులోని భావాలను బట్టే హత్తుకునే వైఖరి



బెర్లిన్: ఎదుటి వ్యక్తిని ఎడమవైపు నుంచి కౌగిలించుకోవాలా లేక కుడివైపు నుంచి హత్తుకోవాలా? అనేది మనలోని భావాలపై ఆధారపడి ఉంటుందని తాజా అధ్యయనంలో తేలింది. ప్రేమ, ఆప్యాయతలను వ్యక్తం చేయడానికి సానుకూల, తటస్థ సందర్భాల్లో ఇతరులను హత్తుకోవడం సర్వసాధారణం. మానసికంగా తీవ్ర భావోద్వేగానికి గురైనప్పుడు, సానుకూల దృక్పథంతో ఎడమవైపు హత్తుకుంటామని తేలింది. తటస్థ వైఖరి ఉన్నప్పుడు, ఏదో మొక్కుబడిగా తప్పదు అని భావించినప్పుడు కుడివైపున చేతులు పెనవేస్తామని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆ సందర్భాల్లో ఏ చేయి(కుడి లేదా ఎడమ) పైన ఉండాలనేది కూడా వ్యక్తుల చేతివాటం, ముందుకు ఏ కాలు ఉందనే విషయాలపై ఆధారపడి ఉంటుంది. జర్మనీలోని రుహర్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు సుమారు మూడు వేల మందిపై చేసిన పరిశోధన వివరాలు 'సైకలాజికల్ రీసెర్చి' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

కొలెస్ట్రాల్ అధికంగా ఉండే ఆహారంతో పెద్దపేగుకు క్యాన్సర్ ముప్పు



లాస్ ఏంజిలెస్: అధికంగా కొలెస్ట్రాల్ ఉండే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల.. పెద్ద పేగు క్యాన్సర్ ముప్పు పెరుగుతుందట. అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకులు.. ఎలుకలపై జరిపిన ప్రయోగపూర్వక అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచే ఆహారాన్ని ఎలుకలకు ఇవ్వగా.. వాటి పేగుల్లోని మూల కణాల విభజన వేగం బాగా పెరిగిందని పరిశోధకులు పేర్కొన్నారు. ఫలితంగా సాధరణం కన్నా వంద రెట్లు ఎక్కువ వేగంతో కణితులు ఏర్పడ్డాయని తెలిపారు. కొలెస్ట్రాల్‌కు, పెద్ద పేగు క్యాన్సర్‌కు సంబంధమున్నట్లు గతంలోనే వెల్లడైనప్పటికీ.. దీని వెనుకున్న తతంగం గురించిన వివరాలు ఈ అధ్యయనంతోనే వెలుగుచూశాయని వారు చెప్పారు.

కబ్జా ఆస్తులు.. బాధితులకు దక్కేదెలా!



- నయీం ఆక్రమిత ఆస్తుల స్వాధీనం, పంపకంపై కొత్త ఆటంకాలు
- పెద్ద సంఖ్యలో దస్త్రాలు.. విశ్లేషణే భారం
- చట్టపరంగానూ ఇబ్బందులే
- తలలు పట్టుకుంటున్న అధికారులు

కరడుగట్టిన నేరగాడు నయీం కేసుల దర్యాప్తులో కొత్త ఆటంకాలు ఎదురవుతున్నాయి. నయీం ఆక్రమించుకున్న ఆస్తులను చట్టబద్ధంగా స్వాధీనం చేసుకోవడం, వాటిని బాధితులకు తిరిగిచ్చే విషయంలో సాంకేతికంగా ఇబ్బందులొస్తున్నాయి. దర్యాప్తులో భాగంగా స్వాధీనం చేసుకున్న పత్రాలు వేల సంఖ్యలో ఉండటంతో వాటిని చదివి, విశ్లేషించడం భారంగా మారింది. నయీం ఆక్రమిత ఆస్తులకు సంబంధించి రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి స్వాధీనం చేసుకున్న పత్రాల్లో చాలావరకు బాధితులే స్వయంగా తమ ఆస్తిని రాసిచ్చినట్లు ఉంది. వీటిని మళ్లీ వారికెలా అప్పగించాలన్న దానిపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఈనాడు - హైదరాబాద్

దాదాపు పదేళ్లు సాగిన నయీం నేర ప్రస్థానంలో వందల మంది బాధితులుగా మిగిలారు. వెయ్యి ఎకరాల భూమి, లక్షకుపైగా చదరపు అడుగుల ఇళ్ల స్థలాల్ని నయీం చెరబట్టినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. నయీం అరాచకాలకు భయపడి అతను బతికి ఉన్నప్పుడు బాధితులు నోరు మెదపలేదు. కానీ అతను హతమైన తర్వాత పోలీసుల వద్దకు బారులుతీరారు. దాదాపు 35 హత్యల్లో ప్రమేయం ఉందని భావిస్తున్న నయీం పోలీసు కాల్పుల్లో హతమైనా.. అతను కబ్జా చేసిన ఆస్తుల్ని చట్టపరమైన మార్గంలో బాధితులకు తిరిగి ఇప్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై పడింది. నయీం, అతని అనుచరులపై రాష్ట్రవ్యాప్తంగా 240కి పైగా కేసులు నమోదయ్యాయి. హత్యలు, హత్యాయత్నాలు, బెదిరింపుల వంటి కేసులను పక్కనపెడితే భూకబ్జాలపైనే దర్యాప్తు అధికారులు ఐదువేలకుపైగా రిజిస్ట్రేషన్ పత్రాలు సేకరించారు. ప్రస్తుతం ఇవన్నీ న్యాయస్థానం అధీనంలో ఉన్నాయి. ఓ వ్యక్తి తన ఆస్తిని నయీం కబ్జా చేసినట్లు ఫిర్యాదు చేస్తే సంబంధిత పత్రాల్ని ఆసాంతం చదవాల్సి ఉంది. సదరు బాధితుడ్ని నయీం బెదిరించినట్లు పోలీసులు ఆధారాలతో నిరూపించాలి. కబ్జాకు సంబంధించిన ప్రతి కేసులోనూ ఇదే విధానాన్ని అనుసరించాలి. ఈ క్రమంలో దర్యాప్తు అధికారులు వందల సంఖ్యలో పత్రాల్ని చదవాల్సి ఉంటుంది. రోజువారీ విధులు నిర్వర్తిస్తూనే ఈ పని పూర్తి చేయాల్సి ఉండటంతో ఎన్ని రోజులు పడుతుందనేది చెప్పలేకపోతున్నారు.

మరోవైపు.. తమ ఆస్తి నయీం కబ్జా చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నా, దాదాపు అన్ని కేసుల్లోనూ వారే స్వయంగా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫొటో దిగి, వేలిముద్రలు వేసి ఆస్తి రాసిచ్చారు. భయపడి రాసిచ్చినా, డబ్బు తీసుకొని ఇచ్చినా అంతా వారి అంగీకారంతోనే జరిగి ఉంటుంది. ఈ నేపథ్యంలో సదరు ఆస్తిని తిరిగి బాధితులకు ఎలా ఇవ్వాలనేది ప్రశ్నగా మిగిలింది. నయీం అరాచకాలకు భయపడి బాధితులు రాసిచ్చినట్లు అభియోగ పత్రంలో పేర్కొంటే.. నయీం ఆ స్థాయిలో పెట్రేగిపోతుంటే మీరేం చేశారని కోర్టు పోలీసులనే ప్రశ్నించే అవకాశం ఉంది. దీంతో నయీం కేసులు దర్యాప్తు జరుపుతున్న సిట్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఆస్తుల్ని బాధితులకు అప్పగించడం తర్వాత సంగతి ముందు వాటిని స్వాధీనం చేసుకునే విషయం ఆలోచించాలని, ఆ దిశగా ప్రయత్నిస్తున్నట్లు ఒక అధికారి వెల్లడించారు. ప్రస్తుతం కోర్టులో ఉన్న పత్రాలను తీసుకొచ్చి విశ్లేషిస్తే తప్ప స్పష్టత రాదని పేర్కొన్నారు.

పురుషులకు ఉచిత గ్యాస్ సిలిండర్!

మహిళలేని నిరుపేద కుటుంబాలకు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన వర్తింపు యోచన

ఈనాడు, దిల్లీ: నిరుపేద కుటుంబాల్లోని మహిళలకు గ్యాస్ కనెక్షన్‌తో పాటు ఒక సిలిండర్‌ను ఉచితంగా అందించే ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన(పీఎంయువై)ను పురుషులకూ వర్తింపజేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 3.31 కోట్ల నిరుపేద (బీపీఎల్) కుటుంబాల్లోని మహిళలు ఈ పథకం ద్వారా లబ్ధిపొందారు. ఈ పథకంలో కుటుంబంలోని మహిళ మాత్రమే అర్హురాలిగా గుర్తించినందున వారి పేరుతోనే గ్యాస్ కనెక్షన్, సిలిండర్ అందజేశారు. అయితే, మహిళ లేని లేదా మహిళ అనారోగ్యంగా ఉన్న నిరుపేద కుటుంబంలో పురుషుడి పేరుతో గ్యాస్ కనెక్షన్ మంజూరుచేయాలని ప్రభుత్వం యోచిస్తోందని ఓ అధికారి వెల్లడించారు. ఇలాంటి కుటుంబాల సంఖ్య గణనీయంగానే ఉందనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో నిరుపేద కుటుంబంలోని పురుషులకు గ్యాస్ కనెక్షన్, సిలిండర్ అందజేసేందుకు వీలుగా సామాజిక-ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ) జాబితాలో వారి పేర్లను చమురు మంత్రిత్వ శాఖ చేర్చనుంది. సామాజిక-ఆర్థిక కుల గణనలో పేరు ఉన్న వారే పీఎంయూవైకి అర్హులవుతారు. అలాగే ఈ పథకానికి ప్రస్తుతం కేటాయించిన రూ. 4800 కోట్ల నిధులను రూ.8వేల కోట్లకు పెంచాలని కేంద్ర కేబినెట్‌ను కోరనుంది.

అమ్మ భాషదే తీయదనం

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ
- తెనాలిలో తెలుగు సాహితీ మహోత్సవాలు ప్రారంభం



తెనాలి, న్యూస్‌టుడే: అమ్మ ప్రేమ, అమ్మ భాషలోని తీయదనం మాటలకు అందనిదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న తెలుగు సాహిత్య మహోత్సవం ప్రారంభ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తేటతెలుగు భాషకు, అక్షరానికి ప్రతి ఒక్కరం ప్రణమిల్లుదామని పిలుపునిచ్చారు. తెలుగు ప్రాచీన భాషగానే కాకుండా, నిరంతర గంగాప్రవాహంలా మార్పు వైపు ప్రవహిస్తున్నదని అన్నారు. తెలుగు ప్రజలపై ఆంగ్లభాష, పాశ్చాత్య సంస్కృతుల ప్రభావం ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సభలు పెట్టి ప్రణాళికలు ప్రకటించి హడావుడి చేయడం కాకుండా నిర్దుష్ట ప్రణాళికతో భాషను బతికించుకోడానికి ప్రభుత్వం ముందుకురావాలని సూచించారు. పరిపాలన, న్యాయపాలనలో తెలుగు భాషను అమలు చేసేందుకు నిఘంటువులు, పదకోశాలు, యంత్ర సామగ్రిని అందుబాటులోకి తేవాలన్నారు. తెలుగువారంతా మాతృభాషలోనే మాట్లాడుకోవాలని, వారి బిడ్డలకు తెలుగులోనే విద్యాబోధన జరగాలని ఆకాంక్షించారు. తెలుగులో మాట్లాడుకునేందుకు బిడియపడే స్వభావాన్ని విడిచిపెట్టాలని పిలుపునిచ్చారు. 'తెలుగు పొలాలకు జలములొసంగి, తెలుగు జాతికి వెలుగునిచ్చిన కృష్ణవేణి తల్లీ నీకు నా నమస్సుమాంజలులు' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన తెనాలి సాహితీ, కళా వైభవాన్ని ప్రస్తావించారు. ఏపీ శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. అరసం సభల ప్రారంభానికి వేదికగా నిలిచిన తెనాలిలో తెలుగుభాషా వికాస సభలు నిర్వహించడం స్ఫూర్తినిస్తాయన్నారు. స్వభాషాభిమానం లేని ఏజాతి ముందుకు సాగలేదని, మనుగడ సాగించలేదని పేర్కొన్నారు. సభకు తెనాలి శాసనసభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి అధ్యక్షుడు జస్టిస్ గ్రంధి భవానీప్రసాద్, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, సినీ గేయరచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డి.విజయభాస్కర్, సాహితీవేత్త కొలకలూరి ఇనాక్ తదితరులు పాల్గొన్నారు.

రానున్నది ఆ'కర్షక' బడ్జెట్!

- వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం లభించే అవకాశం

ఈనాడు, దిల్లీ: మరో అయిదేళ్లలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలని భావిస్తున్న మోదీ ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో అందుకుతగ్గ విధానాలను ప్రకటించే అవకాశం ఉంది. రైతుల సంక్షేమంతో పాటు, ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 2010-11 బడ్జెట్‌తో పోల్చితే వ్యవసాయరంగానికి కేటాయిస్తున్న నిధుల్లో 114 శాతం పెరుగుదల కనిపిస్తున్నా, రైతుల ఆదాయం మాత్రం పెరగలేదు. దాంతో పంట రుణాలు, మద్దతు ధరలపై దృష్టి కేంద్రీకరించి, ప్రోత్సాహకాలు ఇచ్చే అవకాశం ఉంది. కౌలు రైతులకు కూడా బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకోనుంది. కౌలు రైతులకు రుణాల విషయమై ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు చట్టాలు చేసినా, అవి సక్రమంగా అమలు కాకపోవడంతో నమూనా చట్టాన్ని రూపొందించనుంది. దీని ప్రకారం వడ్డీలో కొంత భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సి ఉంటుంది. అసలు భూమి లేని కౌలు దార్లకు కూడా బ్యాంకు రుణాలు లభించేలా చర్యలు తీసుకోనుంది. ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరలు అమలుకాకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఒక్క 2017 ఖరీఫ్‌లోనే మద్దతు ధర లభించక దేశవ్యాప్యంగా రైతులు రూ.36,000 కోట్లు నష్టపోయినట్టు ఓ అంచనా. మార్కెట్ ధర.. మద్దతు ధర కన్నా తక్కువగా ఉంటే రైతులకు నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వం ఓ పథకాన్ని తీసుకురానుంది. సాగునీటి కల్పనపైనా దృష్టి సారించి ప్రయివేటు రంగం సహకారంతో సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహించడంపైనా విధానాన్ని ప్రకటించనుంది. వ్యవసాయ రంగం 2016-17లో 4.9% ప్రగతిని సాధించగా, 2017-18లో కేవలం 2.1% మాత్రమే కానుండడాన్ని పరిగణనలోకి తీసుకోనుంది.

ఎన్డీయే పాలనలో వ్యవసాయరంగానికి కేటాయింపులు (రూ.కోట్లలో)

బడ్జెట్	వ్యవసాయ శాఖ	వ్యవసాయ పరిశోధన	పశుసంవర్ధకం	మొత్తం
2014-15	19,255	4,840	1,822	25,917
2015-16	15,296	5,386	1,410	22,092
2016-17	39,840	6,238	1,994	48,072
2017-18	41,855	6,800	2,371	51,026

'ఫేస్‌బుక్' పెళ్ళిళ్లు నిలవడం కష్టం

ఓ విడాకుల కేసులో న్యాయమూర్తి అభిప్రాయం

అహ్మదాబాద్: 'ఫేస్‌బుక్' మూలంగా నిశ్చయమైన వివాహాలు విచ్ఛిన్నమైపోతాయని పేర్కొంటూ.... గుజరాత్ హైకోర్టు ఓ దంపతులకు విడాకులు తీసుకోవలసిందిగా సూచించింది. జస్టిస్. జెబీ. పార్దివాలా ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్‌కోట్‌కు చెందిన ఫాన్సీ షా అనే యువతి తన భర్త జయదీప్ షా, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ దాఖలు చేసిన కేసులో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. పెళ్లయిన రెండునెలలకే వారి వైవాహిక జీవితంలో తీవ్రస్థాయి పొరపొచ్చాలు తలెత్తిన విషయాన్ని కోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఉభయ పక్షాలూ ఓ అంగీకారానికి రావడానికి ఏ మాత్రం సుముఖంగా లేని విషయాన్ని న్యాయమూర్తి తెలిపారు. "ఫేస్‌బుక్‌ల ద్వారా నిర్ణయమౌతున్న ఆధునిక వివాహాల్లో ఇది కూడా ఒకటి. కాబట్టి ఈ పెళ్లి విఫలం అవకతప్పదు' అన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఫాన్సీ, జయదీప్‌లిద్దరికీ 2011లో ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైంది. ఆ తర్వాత రెండు కుటుంబాల పెద్దల అంగీకారంతో వీళ్లిద్దరూ 2015లో వివాహం చేసుకున్నారు. పెళ్లయిన రెండు నెలలైనా అవకుండానే భర్త జయదీప్, అత్తమామలు తదితరులు తనను వేధిస్తున్నారంటూ ఫాన్సీ కేసు వేసింది.

స్వేచ్ఛా వాణిజ్యానికే నా మద్దతు

- అయితే అది న్యాయంగా ఉండాలి
- దావోస్‌లో ట్రంప్ వ్యాఖ్య

దావోస్: తాను ఎల్లప్పుడూ స్వేచ్ఛా వాణిజ్యానికి మద్దతిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. అయితే అది న్యాయబద్ధంగా, ఇచ్చిపుచ్చుకొనే ధోరణిలో ఉండాలని స్పష్టం చేశారు. శుక్రవారం ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆయన మాట్లాడుతూ వ్యాపారవేత్తలను అమెరికాకు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. "అమెరికా ప్రజల ప్రయోజనాలు కాపాడడం కోసం నేను ఇక్కడికి వచ్చాను. మెరుగైన ప్రపంచం నిర్మాణానికి అమెరికన్ల మద్దతు ప్రకటించడానికీ వచ్చాను. వ్యాపారం చేసుకోవడానికి అమెరికా మళ్లీ తలుపులు తెరుస్తోందన్న సందేశం ఇవ్వడానికి వచ్చాను. మీ వ్యాపారాలు, ఉద్యోగాలు, పెట్టుబడులను తీసుకురావడానికి ఇదే మంచి సమయం. ప్రతిఫలం ఇచ్చే వాతావరణాన్ని సృష్టిస్తున్నాం. అధ్యక్షునిగా 'తొలుత అమెరికా' అన్న సిద్ధాంతాన్ని నమ్ముతాను. అందరు ప్రపంచనేతలు కూడా తమ దేశాల గురించి ఇలాగే ఆలోచించాలి. 'తొలుత అమెరికా' అంటే దాని అర్థం 'అమెరికా ఒక్కటే' అన్నది కాదు. మేం స్వేచ్ఛా వాణిజ్యానికి మద్దతిస్తాం. అయితే అది న్యాయంగా, ఉభయులకు ప్రయోజనం కలిగించేలా ఉండాలి. నేనెప్పుడూ నా దేశం, కార్మికులు, కంపెనీల ప్రయోజనాలను కాపాడుతాను. భారంగా మారిన పాత నిబంధనలను తొలగించి కొత్తవి తీసుకొస్తున్నాం. మధ్యతరగతి వారికి మేలు చేసేలా పన్నులు తగ్గిస్తున్నాం. ఇంధన ఉత్పాదనపై విధించుకున్న స్వీయ ఆంక్షలను తొలగించాం. ఇంధన భద్రత కలిగించి అందరికీ అందుబాటులోకి తీసుకొస్తాం. ఇంధనం సరఫరా చేసే ఒక దేశానికి మిగిలిన దేశాలు బందీలుగా ఉండకూడద'ని వివరించారు.

వ్యాపారవేత్తగా మీడియాను ఇష్టపడ్డా

వ్యాపారవేత్తగా మీడియాను ఇష్టపడ్డానని ట్రంప్ చెప్పారు. రాజకీయాల్లోకి వచ్చిన తరువాతే దాని పక్షపాతబుద్ధి తెలిసిందని అన్నారు. (ఈ వ్యాఖ్యకు నిరసనగా పలువురు పాత్రికేయులు, ప్రేక్షకులు నినాదాలు చేశారు.)

ఉగ్రవాదాన్ని ఉమ్మడిగా ఎదుర్కోవాలి

అఫ్గానిస్థాన్ మరోసారి ఉగ్రవాదులకు స్వర్గంగా మారనీయబోమని చెప్పారు. ఉగ్రవాదాన్ని ఉమ్మడిగా ఎదుర్కోవాలని కోరారు. ఇందుకు భాగస్వామ్య దేశాలు ఆర్థికంగా సహకరించాలని అన్నారు.

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో నిర్ణయాత్మక పాత్ర పోషించాలి

భారత్‌ను కోరిన ఆసియాన్ నేతలు

దిల్లీ: వ్యూహాత్మకంగా ముఖ్యమైన ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ నిర్ణయాత్మక పాత్ర పోషించాలని ఆసియాన్ దేశాలు కోరుకుంటున్నాయి. ఈ విషయాన్ని పది మంది ఆసియాన్ నేతలు భారత్‌కు తెలియజేశారు. దక్షిణ చైనా సముద్రం వివాదంలో చైనా, పలు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ ముఖ్య పాత్ర పోషించాలన్న ఆసియాన్ దేశాల ఆకాంక్ష ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఇండో-పసిఫిక్ అంటే హిందూమహా సముద్రం, పసిఫిక్ మహాసముద్ర ప్రాంతాలు. దక్షిణ చైనా సముద్రం కూడా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఉంది. ఈ ప్రాంతంలో భారత్ సానుకూల పాత్ర పోషిస్తున్నందుకు ఆసియాన్ నేతలు అభినందించారని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి ప్రీతి శరణ్ చెప్పారు.

ప్రధాని ద్వైపాక్షిక భేటీలు

ప్రధాని మోదీ మలేషియా ప్రధాని నజీబ్ రజాక్, ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడో, లావోస్ ప్రధాని థాంగ్లౌన్ సిసౌలిత్‌తో శుక్రవారం ద్వైపాక్షిక చర్చలు జరిపారు.


ఛాంపియన్స్

ఆసీస్‌కు తొలి గెలుపు

నాలుగో వన్డేలో ఇంగ్లాండ్ ఓటమి

అడిలైడ్: ఇంగ్లాండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో ఎట్టకేలకు ఆస్ట్రేలియా బోణీ కొట్టింది. వరుసగా మూడు వన్డేల్లో ఓడి సిరీస్ చేజార్చుకున్న ఆ జట్టు.. నాలుగో వన్డేలో 3 వికెట్ల తేడాతో నెగ్గింది. 197 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ 37 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. స్పిన్నర్ అదిల్ రషీద్ (3/49)తో పాటు మిగతా ఇంగ్లాండ్ బౌలర్లూ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఆసీస్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయినప్పటికీ.. ఓపెనర్ టిమ్ హెడ్ (96; 107 బంతుల్లో 15×4) చక్కటి ఇన్నింగ్స్‌తో జట్టును విజయం వైపు నడిపించాడు. అంతకుముందు ఇంగ్లాండ్ 196 పరుగులు చేయడమూ గొప్పే. కమిన్స్ (4/24), హేజిల్‌వుడ్ (3/39)ల ధాటికి ఒక దశలో ఆ జట్టు 8 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఐతే కెప్టెన్ మోర్గాన్ (33), మొయిన్ అలీ (33) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దగా.. కుర్రాన్ (35)తో కలిసి క్రిస్ వోక్స్ (78; 82 బంతుల్లో 4×4, 5×6) ఇంగ్లాండ్‌కు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. చివరి వన్డే పెర్త్‌లో ఆదివారం జరుగుతుంది.

విషీ విజయం



విజ్క్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్లో భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ వరుసగా రెండో విజయాన్ని సాధించాడు. శుక్రవారం పదకొండో రౌండ్లో విషీ.. హౌ ఇఫాన్ (చైనా)ను ఓడించాడు. ఈ విజయంతో ఆనంద్.. 7 పాయింట్లతో ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచాడు. కార్ల్‌సన్, అనీష్ గిరి చెరో 7.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఈ టోర్నీలో మరో రెండు రౌండ్లు మిగిలున్నాయి.



ఈసీసీ కప్ సీనియర్స్ ట్రోఫీతో హైదరాబాద్ హీరోస్



జూనియర్స్ ట్రోఫీతో నార్త్ ఆంధ్ర నింజాస్

ఛాంప్స్ హైదరాబాద్, నార్త్ ఆంధ్ర

స్ప్రైట్ ఈసీసీ కప్- 2017

ఈనాడు, హైదరాబాద్: నారాయణ విద్యా సంస్థల సహకారంతో జరుగుతున్న స్ప్రైట్ ఈనాడు ఛాంపియన్ క్రికెట్ (ఈసీసీ) కప్- 2017లో హైదరాబాద్ హీరోస్, నార్త్ ఆంధ్ర నింజాస్ ఛాంపియన్లుగా నిలిచాయి. అద్వితీయమైన బ్యాటింగ్.. అద్భుతమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్న హైదరాబాద్, నార్త్ ఆంధ్ర జట్లు 11వ ఈసీసీ కప్‌ను కైవసం చేసుకున్నాయి. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగిన సీనియర్స్ ఫైనల్లో హైదరాబాద్ 26 పరుగుల ఆధిక్యంతో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై విజయం సాధించింది. జూనియర్స్ ఫైనల్లో నార్త్ ఆంధ్ర నింజాస్ 49 పరుగుల ఆధిక్యంతో రాయలసీమ రాకర్స్‌పై గెలుపొందింది. తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ నవీన్ మిత్తల్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రోఫీలు అందజేశారు. కోకకోలా ఇండియా ఏరియా మేనేజర్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) అభినవ్ వోహ్రా, నారాయణ విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్, ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అమరావతి, ఆంధ్రప్రదేశ్) అడ్మిషన్స్ డైరెక్టర్ రూపేశ్, హీరో మోటో కార్ప్ ఏరియా మేనేజర్ రవి కార్తీక్.. రీజినల్ మేనేజర్ కమల్ కరమ్‌చందన్, ఎండ్యూర మాస్ రీజినల్ మేనేజర్ (సౌత్) జి.వి.సంజయ్, బజాజ్ ఎలక్ట్రానిక్స్ యజమాని కరణ్ బజాజ్, ఈనాడు జీఎం (అడ్వర్టయిజ్‌మెంట్) కె. శ్రీనివాస్, ఈనాడు మేనేజర్ రమ, ఈవెంట్స్ సీనియర్ మేనేజర్ సాధన గౌరవ అతిథులుగా హాజరై క్రికెటర్లకు అవార్డులు.. రివార్డులు అందజేశారు.

దిల్లీ గెలిచింది

సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీ సొంతం

కోల్‌కతా: జాతీయ టీ20 లీగ్‌ను దిల్లీ కైవసం చేసుకుంది. బ్యాట్స్‌మన్, బౌలర్లు సమష్టిగా రాణించడంతో సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీ ఫైనల్లో దిల్లీ 41 పరుగుల తేడాతో రాజస్థాన్‌ను చిత్తు చేసింది. ఉన్ముక్త్ చంద్ (53; 49 బంతుల్లో 4×4, 2×6), గంభీర్ (27), ధ్రువ్ (21) రాణించడంతో మొదట 153 (6 వికెట్లకు) పరుగులు చేసిన దిల్లీ.. రాజస్థాన్‌ను 112 (19.1 ఓవర్లు) పరుగులకు ఆలౌట్ చేసింది. ప్రదీప్ సాంగ్వన్, కుల్వంత్ కేజ్రోలియా, పవన్ నేగి తలో రెండు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. రాజస్థాన్ జట్టులో ఆదిత్య (52) మినహా అంతా విఫలమయ్యారు.

సింధుకు సైనా చెక్

ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్



జకార్తా: భారత అగ్రశ్రేణి షట్లర్ల మధ్య పోరు మరోసారి ఆసక్తి రేకెత్తించింది. పూసర్ల వెంకట సింధుపై సైనా నెహ్వాల్ మళ్లీ పైచేయి సాధించింది. తన కంటే మెరుగైన ఫామ్‌లో ఉన్న సింధును కొన్ని నెలల కిందటే ఇండియా ఓపెన్‌లో ఓడించి ఆశ్చర్యపరిచిన సైనా.. వరుసగా ఆమెతో తలపడ్డ రెండో మ్యాచ్‌లోనూ విజేతగా నిలిచింది. శుక్రవారం ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో 12వ సీడ్ సైనా 21-13, 21-19తో మూడో సీడ్ సింధును ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లింది. గాయం నుంచి కోలుకుని ఇటీవలే కోర్టులో అడుగుపెట్టిన సైనా.. ఈ మ్యాచ్‌లో ఆత్మవిశ్వాసంతో ఆడుతూ సింధుపై పైచేయి సాధించింది. సింధుతో మూడు మ్యాచ్‌ల్లో తలపడితే రెండుసార్లు సైనాదే గెలుపు. సెమీస్‌లో ఆమె.. నాలుగో సీడ్ రచనోక్ (థాయిలాండ్)ను ఢీకొంటుంది. రచనోక్‌పై సైనాకు 8-5తో మెరుగైన రికార్డుంది. మరోవైపు పురుషుల డబుల్స్‌లో రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ కూడా సెమీస్ చేరింది. ఈ జంట గంటకు పైగా హోరాహోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్లో 23-21, 15-21, 21-19తో పీటర్సన్-పీలర్ (డెన్మార్క్) ద్వయంపై విజయం సాధించింది.



'భరతమాతకు మహాహారతి' కార్యక్రమంలో అలరించిన ప్రదర్శన

భరతమాతకు 'మహా హారతి'

ఆకట్టుకున్న 1500 మంది చిన్నారుల ప్రదర్శన

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: భరతమాతకు మహాహారతి అంటూ 1,500 మంది చిన్నారులు భరతమాత వేషధారణలో చేతిలో జాతీయ జెండాలతో శుక్రవారం రాత్రి నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఒకే వేదికపై అంతమంది ఆశీనులు కావడం విశేషంగా పరిగణించి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌గా గుర్తించినట్లు ఆ సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. భరత మాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీపీఠం పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద మాట్లాడుతూ భారతీయుడనే భావనలోనే ఆనందం ఉందన్నారు. ద్విసహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ, ఫౌండేషన్ ఛైర్మన్ కిషన్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయ, భాజపా జాతీయ కార్యదర్శి మురళీధరరావు, ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ఎన్.వి.వి.ఎస్. ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే బద్దం బాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రరావు, సినీ నటి లక్ష్మి మంచు, ఫౌండేషన్ వైస్‌ఛైర్మన్లు డాక్టర్ రమేశ్, జి.పాండురంగారావు పాల్గొన్నారు. నృత్య గురువులు మంజుల రామస్వామి శిష్య బృందం నిర్వహించిన కృష్ణలీలా తరంగిణి, పద్మజరెడ్డి బృందం నమస్తే ఇండియా మకుటంతో ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య రూపకాలు రక్తికట్టించాయి.



'భరతమాతకు మహాహారతి' కార్యక్రమానికి హాజరైన భాజపా నేతలు మురళీధర్‌రావు, బండారు దత్తాత్రేయ, ప్రభాకర్, కిషన్‌రెడ్డి

వేములఘాట్ ప్రజల సమస్యలను పరిష్కరించండి

ముఖ్యమంత్రికి చాడ లేఖ

ఈనాడు, హైదరాబాద్: మల్లన్నసాగర్ రిజర్వాయరు సామర్థ్యాన్ని 5 టీఎంసీలకు కుదించగలిగితే గ్రామాల ముంపు తగ్గుతుందని, ఈ కోర్కెతో వేములఘాట్ గ్రామస్థులు 600 రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం స్పందించి రిజర్వాయర్ సామర్థ్యం పెంపుపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి, వేములఘాట్ ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీఎం కేసీఆర్‌కు చాడ లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టిన మల్లన్నసాగర్ నిర్మాణాన్ని విశ్రాంత ఇంజినీర్ల సంఘం కూడా తప్పుపట్టిందన్నారు.

ప్రజాహిత వ్యాజ్యంగా పాల కల్తీపై కథనం

పాల కల్తీపై డిసెంబరులో నల్గొండకు చెందిన కె.నర్సింహారావు అనే వ్యక్తి రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. యూరియా, హైడ్రోజన్ పెరాక్సైడ్, తదితర హానికర రసాయనాల్ని పాలల్లో కలుపుతున్నట్లు ఓ పత్రికలో కథనం ప్రచురితమైందంటూ నర్సింహారావు లేఖ రాశారు. అలాంటి పాలవల్ల పిల్లలు, పెద్దలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారన్నారు. దీనిపై పశుసంవర్ధకశాఖ ముఖ్య కార్యదర్శి, తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ, రాష్ట్ర ఆహార లేబొరేటరి చీఫ్ పబ్లిక్ అనలిస్ట్‌ను వ్యాజ్యంలో ప్రతివాదులుగా హైకోర్టు చేర్చింది.

జెండావందనం సన్నాహాల్లో విషాదం

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

కోహెడ, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా కోహెడ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు శుక్రవారం జెండా వందనం కోసం కాపలాదారు(సెక్యూరిటీ గార్డు) గొట్టె చంద్రయ్య(40) ఇనుప గొట్టాన్ని చేతులతో పట్టుకొని నిలబెట్టేందుకు యత్నించగా గొట్టం పక్కనే ఉన్న విద్యుత్తు తీగలకు తగిలింది. దీంతో అతనికి విద్యుదాఘాతం తాకింది. ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చంద్రయ్యది కోహెడ మండలంలోని బస్వాపూర్ పంచాయతీ పరిధి ఆరెపల్లి గ్రామం. పరిహారం కోసం కుటుంబసభ్యులు, దళిత నాయకులు, అఖిలపక్ష నేతలు మృతదేహంతో ఆందోళన చేశారు. ప్రభుత్వం తరఫున రూ.5 లక్షలు, ట్రాన్స్‌కో నుంచి రూ.5 లక్షలు ఇచ్చేందుకు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ వచ్చి హామీ ఇవ్వడంతో శవపరీక్షకు తరలించారు.



చంద్రయ్య (పాతచిత్రం)

మెట్రో రెండో దశకు కదలిక

- హైదరాబాద్ వచ్చిన దిల్లీ మెట్రో ఇంజినీరింగ్ నిపుణులు
- గిరాకీ ఉన్న మార్గాలపై క్షేత్రస్థాయి పరిశీలన
- నిపుణులతో మేధో మథనం

ఈనాడు - హైదరాబాద్

మెట్రో రైలు రెండో దశకు కదలిక వచ్చింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించేందుకు దిల్లీ మెట్రోరైలు కార్పొరేషన్(డీఎంఆర్‌సీ) కసరత్తు మొదలెట్టింది. హైదరాబాద్ వచ్చిన డీఎంఆర్‌సీ నిపుణులు, ఇంజినీర్లు నగరంలో మెట్రో విస్తరణకు అవకాశాలున్న ప్రాంతాలను పరిశీలించడంతో ఈ క్రతువులో కీలక అడుగుపడినట్లయింది. రెండో దశ విస్తరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సీఎం కేసీఆర్ సూచించిన నేపథ్యంలో ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారీ బాధ్యతను డీఎంఆర్‌సీకి అప్పగించారు. గతంలోనే ఆ సంస్థ అధికారులు ఒకసారి ఇక్కడికొచ్చి ప్రాథమిక పరిశీలించినా తర్వాత మిన్నకుండిపోయారు. నాలుగు రోజుల క్రితం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ దీనిపై సమీక్షించడంతోపాటు.. త్వరగా డీపీఆర్ సిద్ధం చేయాలంటూ మెట్రోరైలు ఎండీని ఆదేశించడంతో అధికారులు రంగంలోకి దిగారు. హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డితో కలిసి డీఎంఆర్‌సీ సంచాలకుడు ఎస్‌డీ శర్మ, నిపుణులు గురువారం శంషాబాద్ విమానాశ్రయం, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కొన్ని ప్రత్యామ్నాయ మార్గాలనూ పరిశీలించారు. శుక్రవారం బేగంపేటలోని మెట్రోరైలు కార్యాలయంలో మేధో మథన సమావేశం నిర్వహించారు. మొదటి దశతో పోలిస్తే రెండో దశను ఆర్థికంగా లాభసాటిగా చేపట్టడం మరింత సవాల్‌తో కూడుకున్నదని, వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని నివేదిక సిద్ధం చేయాలని మెట్రోరైలు ఎండీ డీఎంఆర్‌సీకి సూచించారు.

ప్రాజెక్టు నివేదికలో పరిగణనలోకి తీసుకునే అంశాలు

- అత్యధిక మంది ప్రయాణించే మార్గాల ఎంపిక
- మెట్రో మొదటి దశతో, రైలు, ఎంఎంటీఎస్, బస్టాండ్లు, విమానాశ్రయంతో అనుసంధానం
- డిపోలు, స్టేషన్లు, విద్యుత్తు ఉపకేంద్రాలకు ప్రభుత్వ స్థలాల లభ్యత
- ఎంతమంది ప్రయాణిస్తారనే అంచనా సర్వే
- ట్రాఫిక్, రవాణా సర్వేలు
- గూగుల్ పటాల ద్వారా ప్రత్యామ్నాయ కారిడార్ల సూచన
- పర్యావరణం, సామాజిక ప్రభావంపై అధ్యయనాలు
- ఎలక్ట్రికల్, సిగ్నలింగ్, మెట్రోరైళ్లు, ట్రాక్‌కు సంబంధించి సాంకేతిక ఎంపిక
- నిర్మాణ, నిర్వహణ వ్యయాలపై అంచనా, భద్రతా అంశాలు
- ప్రాజెక్టు వ్యయాన్ని తగ్గించి, ఆదాయం పెంచుకునే విధంగా వినూత్న ఆలోచనలు
- ప్రయాణ ఛార్జీలపై అధ్యయనం
- నిధులు సమకూర్చుకునేందుకు వేర్వేరు మార్గాల అన్వేషణ



బేగంపేటలోని మెట్రోరైలు భవన్‌లో రెండోదశపై దిల్లీ మెట్రోరైలు కార్పొరేషన్ అధికారులతో చర్చిస్తున్న హైదరాబాద్ మెట్రో అధికారులు

భళిభళీ.. పన్నుల రాబడి

ఈనాడు - హైదరాబాద్

పన్నుల రాబడిలో తెలంగాణ రాష్ట్రం పురోగమిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో పన్ను రాబడిలో డిసెంబర్ నాటికి 63 శాతం లక్ష్యాన్ని చేరుకుంది. ఇది గత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో పోల్చితే 15.7 శాతం అధికం. పన్నుల ద్వారా 2016 డిసెంబరు నాటికి రూ.43,440 కోట్లు రాగా 2017 డిసెంబరు నాటికి రూ.50,272 కోట్లు వచ్చింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో అమ్మకం పన్ను, జీఎస్టీ, స్టాంపులు- రిజిస్ట్రేషన్ల రాబడి, కేంద్రం నుంచి పన్నుల వాటా, ఎక్సైజ్ డ్యూటీ, రవాణా సహా అన్ని రకాల పన్నుల రాబడిని రూ.79,624 కోట్లుగా అంచనా వేశారు. డిసెంబరు నాటికి రూ.50,272 కోట్లు వచ్చింది. అయితే గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా రావాల్సిన నిధులు ఇప్పటి వరకూ 25 శాతం కూడా దాటలేదు. రాష్ట్ర ప్రభుత్వం రుణాల ద్వారా సమకూర్చుకోవాలని నిర్దేశించుకున్న లక్ష్యంలో దాదాపు 90 శాతం పూర్తయింది. ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలల్లో ముగియనున్న నేపథ్యంలో బడ్జెట్ కసరత్తులో రాష్ట్ర ఆర్థిక శాఖ తాజాగా ఆదాయ, వ్యయాల విశ్లేషణ చేసింది. డిసెంబరు నెలాఖరుకు రెవెన్యూ రాబడుల లక్ష్యంలో 52 శాతం సాధించింది

రాష్ట్ర రాబడులు అంచనా- డిసెంబరుకు రాబడులు (రూ.కోట్లలో)

అంశం	అంచనా	డిసెంబరుకు రాబడి	లక్ష్యంలో శాతం
పన్ను రాబడి	79,624	50,272	63
పన్నేతర ఆదాయం	6,601	3,081	46
గ్రాంట్ఇన్ఎయిడ్	26,857	5,860	21
రుణాలు	26,096	23,084	88

డిసెంబరులో రిజిస్ట్రేషన్ల జోరు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ రాబడి లక్ష్యం రూ.3,000 కోట్లు అంచనా వేయగా డిసెంబరు నాటికే రూ.2,939 కోట్లు వచ్చింది. డిసెంబరు నెలలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ఏడాదిలోనే అత్యధికంగా రూ.492 కోట్లు ఆదాయం సమకూరింది.

- ఈ ఏడాది గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా రూ.26,857 కోట్లు వస్తుందని అంచనా వేయగా డిసెంబరు వరకూ రూ.5,860 కోట్లు (21%) మాత్రమే సమకూరింది.
- ఎక్సైజ్ డ్యూటీ ద్వారా రాబడి రూ.9,000 కోట్లు అంచనా వేయగా ఇప్పటికే రూ.6,904 కోట్లు సమకూరింది. ఇది రాబడి లక్ష్యంలో 76 శాతం.
- వడ్డీల చెల్లింపునకు రూ.11,138 కోట్లకు గాను డిసెంబరు నాటికి రూ.7,191 కోట్లు చెల్లించారు.

నెలవారీ పన్ను రాబడి

నెల	రాబడి (రూ.కోట్లలో)
ఏప్రిల్	5,397
మే	5,660
జూన్	5,501
జులై	5,874
ఆగస్టు	4,758
సెప్టెంబర్	4,343
అక్టోబర్	6,953
నవంబరు	6,175
డిసెంబరు	4,506

పరుష పదజాలానికి కొలమానమేంటి: కోదండరాం

ఈనాడు, హైదరాబాద్: న్యాయస్థానం ప్రమేయం లేకుండా రాజ్యాంగ నిబంధనలను మార్చాలని తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు వ్యాఖ్యలు చేసినా అరెస్టు చేసే కుట్ర జరుగుతోందని తెఐకాస ఛైర్మన్ ఆచార్య కోదండరాం అన్నారు. పరుష పదజాలమంటే కొలమానమేమిటో చెప్పాలని ప్రశ్నించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెఐకాస కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని రాజ్యాంగం చెప్పిందన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజునే రాజకీయ దురుద్దేశంతో ప్రభుత్వం చట్ట సవరణలు తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. మంద కృష్ణ మాదిగ, ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, అద్దంకి దయాకర్‌లపై రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగానే కేసులు నమోదు చేశారని ఆరోపించారు. ఫిబ్రవరిలో పార్టీపై నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారు.

అదనపు పీపీలుగా ఇద్దరు నియామకం

తెలంగాణ సర్కారు తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు న్యాయవాదులు జువ్వాడి శ్రీదేవి, ఎ.ఎస్.జయరాజ్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు(ఏపీపీ)గా నియమితులయ్యారు. వీరు మూడేళ్లపాటు ఆ పోస్టులో ఉంటారని తెలంగాణ న్యాయశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

ముమ్మాటికీ రాజకీయ హత్యే

- బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసును సీబీఐకి అప్పగించాలి
- పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్, సీఎల్పీ నేత జానా డిమాండ్

ఈనాడు నల్గొండ: నల్గొండ పురపాలిక ఛైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి భర్త శ్రీనివాస్‌ది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని.. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరగాలంటే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అధికార పార్టీ ఎమ్మెల్యే వేముల వీరేశం, స్థానిక డీఎస్పీ సుధాకర్ అండతోనే హత్య జరిగిందని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శాసనసభ, మండలిలో ప్రతిపక్ష నేతలు జానారెడ్డి, షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ ఎంపీ హన్మంతరావు తదితరులు నల్గొండలోని బొడ్డుపల్లి శ్రీనివాస్ స్వగృహంలో ఆయన కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. లక్ష్మి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం విలేకరులతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమకు ప్రాణహాని ఉందని, గన్‌మెన్ సౌకర్యం కల్పించాలని శ్రీనివాస్ దంపతులు ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదన్నారు. రాజకీయ కక్షలతో హత్య చేయడం దారుణమన్నారు. నల్గొండ జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యే క్రిమినల్ చర్యలకు పాల్పడినా కేసీఆర్ చర్యలు తీసుకోకపోవడమంటే హత్యా రాజకీయాలను ప్రోత్సహించడమేనన్నారు. హత్య కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న వారు ఎమ్మెల్యే వీరేశంతో దిగిన చిత్రాలను మీడియాకు విడుదల చేశారు. జానారెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస్ చరవాణి కాల్ డేటాను విశ్లేషిస్తే సమగ్ర ఆధారాలు లభిస్తాయని తెలిపారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్లుగా ప్రశాంతంగా ఉన్న నల్గొండను ఇప్పుడు కొందరు ఉద్రిక్తంగా తయారుచేస్తున్నారని ఆరోపించారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలన్నారు. వి.హన్మంతరావు మాట్లాడుతూ ఆడబిడ్డ బతుకుకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వమే హత్యలను ప్రేరేపిస్తుండటం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యేలు బూడిద భిక్షమయ్యగౌడ్, చిరుమర్తి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



బొడ్డుపల్లి లక్ష్మిని పరామర్శిస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి, కోమటిరెడ్డి, చిత్రంలో వీహెచ్, షబ్బీర్‌అలీ తదితరులు

నటుడు 'నాని'కి తప్పిన ముప్పు

- వేకువన అదుపుతప్పి విద్యుత్తు దీప స్తంభాన్ని ఢీకొన్న కారు
- ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో సురక్షితం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: సినీ నటుడు నానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. జూబ్లీహిల్స్‌లో శుక్రవారం తెల్లవారుజామున కారు ప్రమాదానికి గురవగా.. ఆయన సురక్షితంగా బయటపడ్డారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. సినిమా షూటింగ్ పూర్తి చేసుకున్న నాని.. తన కారులో శుక్రవారం వేకువజామున 4.30 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 45 మీదుగా గచ్చిబౌలి వైపు వెళ్తున్నారు. ఫ్రోస్ట్ పబ్ సమీపంలో వాహనం అదుపుతప్పి విభాగినిపైకెక్కి విద్యుత్తు దీప స్తంభాన్ని ఢీకొంది. ఢీకొన్న వేగానికి స్తంభం పెద్దశబ్దం చేస్తూ నేలకొరిగింది. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. అందులోని ఎయిర్‌బ్యాగ్ తెరుచుకోవడంతో డ్రైవర్‌తోపాటు.. పక్కనే కూర్చొన్న నాని సురక్షితంగా బయటపడ్డారు. నాని మరో కారులో అక్కడ్నుంచి వెళ్లిపోగా.. కొద్ది సేపటికే అక్కడికి చేరుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు స్తంభం తొలగింపు సహా రక్షణ చర్యలు చేపట్టారు. డ్రైవర్ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. శ్వాస విశ్లేషణ పరీక్షలు నిర్వహించి.. మద్యం తాగలేదని తేల్చారు. 'నిద్ర రావడం వల్ల ప్రమాదం జరిగిందని డ్రైవర్ చెప్పాడని, సీటుబెల్టు పెట్టుకోవడం వల్లే ప్రాణ హాని జరగలేదని' పోలీసులు పేర్కొన్నారు.

తొలుత తండ్రి అనుకుని..: ప్రమాదానికి గురైన కారులో నాని తండ్రి రాంబాబు ఉన్నట్లు తొలుత డ్రైవర్ పోలీసులకు వివరించాడు. పోలీసులు రాంబాబుకు ఫోన్ చేసి ఆరా తీయగా 'కారులో ఉన్నది తన కొడుకేనని, ప్రమాదంలో ఎలాంటి గాయాలు కాలేదని' ఆయన వివరించారు. ప్రమాదంపై నాని ట్విట్టర్‌లో స్పందించారు. 'కృష్ణార్జున యుద్ధం' సినిమా చిత్రీకరణ నుంచి తిరిగొస్తుండగా ప్రమాదం జరిగిందని, స్వల్పంగా గాయాలయ్యాయని చెప్పారు. వారం రోజుల్లో తిరిగి చిత్రీకరణకు హాజరవుతానన్నారు.





రహదారి విభాగిని ఎక్కి స్తంభాన్ని ఢీకొన్న కారు. ధ్వంసమైన ముందుభాగం

కొత్త ఆలోచనలకు కేంద్రం నిధులు

సర్కారు బడులకు రూ. 69.74 కోట్లు మంజూరు
తెలంగాణకు రూ. 4.34 కోట్లు
ఆంధ్రకు రూ. 6.18 కోట్లకు ఆమోదం

ఈనాడు, హైదరాబాద్: విశ్వవిద్యాలయాల స్థాయిలోనే కాదు సర్కారు పాఠశాలల్లోనూ విద్యార్థులకు సమాచార, సాంకేతికతను పరిచయం చేస్తూ నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నవకల్పన ప్రణాళికకు పచ్చజెండా ఊపింది. నవకల్పన నిధి పేరిట ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకూ నిధులివ్వనుంది. తాజాగా ఈ ఆర్థిక సంవత్సరానికి దేశవ్యాప్తంగా రూ.69.74 కోట్లు మంజూరు చేసింది. తెలంగాణలోని విద్యార్థుల్లో చదివే అలవాటును పెంచేలా పాఠశాలల్లో గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు ఇచ్చేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. నవకల్పన నిధి కింద నిధులు ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపించాలని ఆయా రాష్ట్రాల పాఠశాల విద్యాశాఖలను కోరింది. వర్చువల్ తరగతి గదులు, డిజిటల్ తరగతులు, డిజిటల్ గ్రంథాలయాలు, టింకరింగ్ ప్రయోగశాలలు, సౌర విద్యుత్తుపై అవగాహన తదితర వినూత్న ప్రతిపాదనలు అందాయి. మొత్తం రూ.823.33 కోట్లకు ప్రతిపాదనలు అందగా అందులో రూ.69.74 కోట్లకు రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) అధికారులు ఆమోదం తెలిపారు. తెలంగాణకు రూ.4.34 కోట్లు మంజూరయ్యాయి. ఏపీకి రూ.6.18 కోట్లకు ఆమోదం దక్కింది.

చదివే అలవాటు పెంచే లక్ష్యం: తెలంగాణ విద్యాశాఖ రూ.97.11 కోట్ల విలువైన రెండు ప్రతిపాదనలు పంపింది. 445 పాఠశాలల్లో డిజిటల్ ప్రయోగశాలలు, గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతిపాదించింది. ఒక్కో డిజిటల్ ప్రయోగశాలకు రూ.8.63 లక్షలు చొప్పున రూ.38.40 కోట్లు, ఒక్కో గ్రంథాలయానికి రూ.10.90 లక్షలు చొప్పున మొత్తం రూ.48.71 కోట్లు అవసరమని కోరింది. కేంద్రం మాత్రం ఒక్కో పాఠశాలలో రూ.4.34 లక్షలతో 100 పాఠశాలల్లో గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. ఒక్కో బడిలో రూ.2 లక్షలు మౌలిక వసతుల కల్పనకు, మిగతా రూ.2.34 లక్షలు పుస్తకాల కొనుగోలుకు అందనున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి ఆ నిధులు రానున్నాయని ఆర్ఎంఎస్ఏ సంచాలకుడు సత్యనారాయణరెడ్డి తెలిపారు.

యువత సేద్యం చేస్తే అధిక నిధులు!

- రాష్ట్రంలో వ్యవసాయం చేస్తున్న వారి శాతమెంత
- గత మూడేళ్లలో సేద్యానికి వ్యయం చేసిన నిధులెన్ని
- తెలంగాణ వ్యవసాయశాఖను వివరాలు అడిగిన కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: యువతరం వ్యవసాయంలో అధికంగా వస్తుంటే నిధుల కేటాయింపులు పెంచుతాం.. ఇది రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం పెట్టిన తాజా షరతు. వ్యవసాయాభివృద్ధికి గత మూడేళ్లలో ఎంత వ్యయం చేశారనే వాస్తవ గణాంకాల ఆధారంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిధులిస్తామని కేంద్రం తెలంగాణ వ్యవసాయశాఖకు రాసిన లేఖలో తెలిపింది. యువతరంలో ఎంతశాతం సేద్యం చేస్తున్నారనే వివరాలను చెప్పాలంది. 'రాష్ట్రీయ కృషి వికాస్ యోజన' (ఆర్కేవీవై) పథకం కింద రాష్ట్రాల మధ్య నిధుల కేటాయింపులకు గత మూడేళ్ల ఖర్చుల వివరాలు తక్షణం పంపాలని కోరింది. 'ఆర్కేవీవై-వ్యవసాయం, దాని అనుబంధ రంగాల పునరుజ్జీవానికి చేపడుతున్న పనులకు ప్రోత్సాహక విధానం' (ఆర్కేవీవై-ర్యాఫ్టార్) అనే పేరుతో కొత్త పథకాన్ని ఏప్రిల్ నుంచి అమల్లోకి తెస్తున్నట్లు తెలిపింది. ఆర్కేవీవైనే ఇలా మారుస్తున్నామంది. ఆరురకాల అంశాలను ప్రామాణికంగా తీసుకుని రాష్ట్రాల మధ్య నిధులను పంచుతామంది.

రాష్ట్రానికి మేలు ఎలా అంటే!

గత మూడేళ్లలో వ్యవసాయాభివృద్ధికి ఖర్చు చేసిన నిధుల అంశంలో కొన్ని అంశాలను కేంద్రం ప్రాతిపదికగా తీసుకుంటామంది. ఉదాహరణకు ఒకేసారి రుణమాఫీ, వడ్డీ మాఫీ చేయడం వంటివి. ఈ విషయంలో మూడేళ్లలో రూ.16 వేల కోట్లను తెలంగాణ వ్యవసాయశాఖ ఖర్చుచేసింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి, బిందు సేద్యానికిచ్చే లెక్కలను ఇందులో తీసుకుంటామంది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తున్నందున ఏటా రూ.4 వేల కోట్ల వరకూ రాష్ట్రప్రభుత్వం రాయితీగా ఇస్తోంది. బిందుసేద్యానికి నాబార్డు నుంచి రూ.1000 కోట్ల రుణం తీసుకుంది. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు అధికంగా ఇస్తోంది. పాలు సేకరణకు లీటరుకు రూ.4 ప్రోత్సాహకం, కొత్తగా రూ.1000 కోట్లతో గోదాములు నిర్మించడం, చెరువులు, కుంటలు మరమ్మతులకు మిషన్ కాకతీయ కింద భారీగా వ్యయం కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందని వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి 'ఈనాడు'కు చెప్పారు. వీటికి రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నందున తెలంగాణకు అనుకూలంగా ఆర్కేవీవై-ర్యాఫ్టార్ నిబంధనలున్నట్లు వివరించారు.

ఆరు అంశాలకు నిధులు ఇలా..

- వర్షాధార సాగు భూముల శాతం-దీనికి 15 శాతం నిధులు.
- తెలంగాణలో సన్న, చిన్నకారు రైతులు - దీనికి 20 శాతం.
- గత మూడేళ్లలో వ్యవసాయం, పశుసంవర్ధకం.. అనుబంధ రంగాల్లో సగటున నిధుల వ్యయం తీరు-30 శాతం.
- మూడేళ్లలో వ్యవసాయం, అనుబంధ రంగాల్లో రాష్ట్ర స్థూల సగటు విలువ పెరుగుదల- 20 శాతం.
- రాష్ట్ర యువతలో వ్యవసాయం చేస్తున్న వారి శాతం దేశం మొత్తంతో పోల్చి లెక్క చెబితే దానికి-5 శాతం
- శాస్త్రవేత్తలు ఏర్పాటుచేసే పంటల ప్రదర్శన క్షేత్రాల్లో వచ్చిన గరిష్ఠస్థాయి ఉత్పాదకతతో పోల్చి రాష్ట్ర సగటు ఉత్పాదకత ఎంత ఉందో చూసి -10 శాతం నిధులు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ
ఐదుగురి మృత్యువాత

నల్లజర్ల, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి ఎర్రకాలువ సమీపంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న విషాద సంఘటనలో ఐదుగురు మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. రాజమహేంద్రవరం నుంచి ఏలూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు అనంతపల్లి ఎర్రకాలువ వంతెన దాటగా సిమెంటు లోడు లారీ అపసవ్య దిశగా వచ్చి ఢీకొంది. బస్సు ఎడమ భాగం సగం నుంచి లారీ దూసుకుపోవడంతో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లా తుని నుంచి వచ్చి నిడదవోలులో హోటల్ నడుపుతున్న కాపుశెట్టి నాగేశ్వరరావు భార్య జ్యోతి (37), కుమార్తె అఖిల సత్య (12), కుమారుడు శివసాయి (14), అత్త గేలం లక్ష్మి(50), ఒడిశాకు చెందిన పల్లా సావిత్రమ్మ (60) మృతి చెందారు.

'ఆయుర్వేద' డీలర్‌షిప్ పేరిట కుచ్చుటోపీ

ఒకే వ్యక్తి నుంచి రూ.40 లక్షలు దండుకున్న వైనం
మరింత మంది బాధితులు

ఈనాడు, హైదరాబాద్: అంతర్జాలం ద్వారా అమాయకులపై ఆశల వల విసురుతున్న సైబర్ నేరగాళ్లు.. అందిన కాడికి దోచుకుంటున్నారు. ఓ ప్రముఖ సంస్థ ఆయుర్వేద ఉత్పత్తుల డీలర్‌షిప్ అంటూ తాజాగా ఓ వ్యక్తి నుంచి రూ.40 లక్షలు దండుకున్నారు. పరువు పోతుందనే ఉద్దేశంతో ఇంకా అనేక మంది బాధితులు నోరు మెదపడంలేదని.. వారు కూడా ఫిర్యాదు చేస్తే ఈ దోపిడీ విలువ రూ.కోట్లలోకి చేరుకోవచ్చని అంచనా. దీనికి సంబంధించి ఇప్పటికే అందిన ఫిర్యాదులు పరిశీలిస్తున్న సీఐడీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టనున్నారు. దేశంలోని ప్రముఖ ఆయుర్వేద ఉత్పత్తుల సంస్థల్లో ఒకటైన సంస్థ పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్ తెరిచారు. ఆ సంస్థ డీలర్‌షిప్ ఇస్తామని చెబుతూ ఒకే వ్యక్తి నుంచి విడతల వారీగా రూ.40 లక్షలు వసూలు చేశారు. ఎంత డబ్బు చెల్లించినా సరకు రాకపోవడంతో కంగారుపడ్డ బాధితుడు అసలు సంస్థ ప్రధాన కార్యాలయానికి వెళ్లి విచారించాడు. అయితే, తమ వెబ్‌సైట్లో అటువంటి ప్రకటనేదీ ఇవ్వలేదని వారు తేల్చి చెప్పడంతో బాధితుడి కళ్లు బైర్లు కమ్మాయి. తనవద్ద ఉన్న ఆధారాలన్నింటినీ తీసుకొని అతడు సీఐడీ అధికారులను సంప్రదించాడు.

అప్రమత్తంగా ఉండాలి..

ప్రస్తుతం వ్యాపార అవకాశాలపై సామాన్యుల్లోనూ ఆసక్తి పెరిగిపోతున్న సంగతి తెలిసిందే. దీన్ని ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. ప్రాచుర్యం పొందిన సంస్థల పేర్లతో అచ్చం అలానే ఉండేలా సొంతంగా వెబ్‌సైట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. 'మాతో భాగస్వాములు కండి, రూ.లక్షల్లో ఆర్జించండి' అంటూ ఊరించే ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఈ వెబ్‌సైట్లు అచ్చం అసలు సంస్థ మాదిరిగానే ఉంటాయి. దీంతో అమాయకులు ఈ ప్రకటనల వలలో పడుతున్నారు. ప్రతి రూపాయి పెట్టుబడికి రూ.పది లాభం ఆర్జించవచ్చని కాకి లెక్కలేసి మరీ చెబుతుండటంతో ఆసక్తి పెరుగుతోంది. ఒకవేళ ఎప్పుడైనా డీలర్‌షిప్ వద్దనుకుంటే డిపాజిట్ సొమ్ము నయాపైసలతోసహా తిరిగి చెల్లిస్తామని భరోసా ఇస్తుండటంతో అమాయకులు వారి వలలో పడుతున్నారు. ఇలాంటి కేసులు ఈ మధ్యకాలంలో పెరుగుతున్నాయని.. అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00